సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 81

గురువారం 12-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



ఆస్ట్రేలియా 212 ఆలౌట్

డబ్ల్యూటీసీ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా 43/4... తొలిరోజు 14 వికెట్లు -14లో



'ఆధార్' ఉంటేనే తత్కాల్

జూలై 1 నుంచి అమలు... రైల్వే శాఖ వెల్లడి -6లో



దురహంకారంతో తప్పలు చేశాడు

'దురహంకారంతో సిద్ధూ క్షమించలేనంతగా తప్పలు చేశాడు.అతడిని చంపడం మినహా మాకు మరో మార్గం లేదు' అని గోల్డీ అన్నాడు.

- వివరాలు 6లో▶



సివిల్స్ ప్రిలిమినరీ ఫలితాలు

యూపీఎస్సీ నిర్వహించిన సివిల్స్ సర్వీసెస్–2025 ప్రిలిమినరీ పరీక్షల ఫలితాలను అధికారులు వెల్లడించారు.


- వివరాలు 6లో▶



చైనాతో డీల్: ట్రంప్

అమెరికా, చైనా దేశాల మధ్య వర్తక ఒప్పందం ఖరారైనట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.

- వివరాలు 6లో▶



లూటీ.. విధ్వంసం.. కర్ఫ్యూ

లాస్ ఏంజెలెస్‌లో కొందరు దుండగులు యాపిల్ ఐఫోన్ స్టోర్‌సహా పలు దుకాణాలపై దాడులు చేసి లూటీలు చేశారు.

- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

మంగళూరు పోర్ట్ టు సికింద్రాబాద్



మంగళూరు పోర్ట్‌ను సికింద్రాబాద్‌తో అనుసంధానించే ముఖ్యమైన బళ్లారి–చిక్జాజూర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపింది. 185 కిలోమీటర్ల పొడవుతో చేపట్టే దీని అంచనా వ్యయం రూ.3,342 కోట్లు.

- వివరాలు 16లో▶

సింగర్ మంగ్లీపై కేసు



అనుమతి లేకుండా పార్టీ నిర్వహించడంతోపాటు మద్యం, డీజే వినియోగించారనే అభియోగాలపై సింగర్ మంగ్లీతోపాటు మరో ముగ్గురిపై చేవెళ్ల పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. మంగ్లీ జన్మదిన వేడుకల్లో సినీ నటులతోపాటు 50 మంది పాల్గొన్నారు.

- వివరాలు 16లో▶

దాటవేత ధోరణిలో సమాధానం



ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావును సిట్ అధికారులు మరోసారి ప్రశ్నించారు. ఈ కేసులో ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న ప్రణీత్‌రావుతో కలిపి ఆయనను విచారించారు.

- వివరాలు 16లో▶

ఇరిగేషన్ ఈఈ అక్రమాస్తులు రూ.200 కోట్లకుపైనే!



నీటిపారుదల శాఖలో ఈఈగా పనిచేస్తున్న నూనె శ్రీధర్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించి అరెస్టు చేశారు. మార్కెట్‌లో వీటి విలువ రూ.200 కోట్లకుపైనే ఉంటుందని అంచనా.

- వివరాలు 2లో▶

ఇదండీ సంగతి



ఒక్క లాడెన్‌కే కాదు! ప్రపంచంలో ఉన్న ప్రతి టెర్రరిస్టుకు ఇక్కడ మాత్రమే సేఫ్!

కేబినెట్ ఆమోదంతోనే..

కాళేశ్వరం నిర్మాణంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు మాజీ సీఎం కేసీఆర్ స్పష్టీకరణ

- సాంకేతిక అంశాలపై ఇంజనీర్లు, నిపుణులు నిర్ణయాలు తీసుకున్నారు
- 152 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహట్టి బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర అంగీకరించలేదు
- అక్కడ నీటి లభ్యత సైతం లేదని సీడబ్ల్యూసీ తేల్చింది
- తుమ్మిడిహట్టికి బదులుగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు నిర్మించాలని వ్యాప్కోస్ సూచించింది.... ఈ నేపథ్యంలోనే 'ప్రాణహిత–చేవెళ్ల' రీఇంజనీరింగ్ చేపట్టాం
- బరాజ్‌ల లొకేషన్ల ఎంపిక, వాటిలో నీటి నిల్వలపై ఇంజనీర్లే నిర్ణయం తీసుకున్నారని వెల్లడి
- కేసీఆర్ విజ్ఞప్తి మేరకు ఇన్‌కెమెరా క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించిన కమిషన్



బుధవారం హైదరాబాద్‌లో బీఆర్‌కే భవన్ వద్ద అభివాదం చేస్తున్న మాజీ సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: 'కాళేశ్వరం ఎత్తిపోతల పథకం భారీ ప్రాజెక్టు. దీనికి సంబంధించిన నిర్ణయాలన్నీ రాష్ట్ర మంత్రివర్గ ఆమోదంతోనే తీసుకున్నాం. సాంకేతికపరమైన అంశాలపై ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు నిర్ణయాలు తీసుకున్నారు. కాళేశ్వరం కట్టాలని తొలుత రాజకీయ నిర్ణయం మేమే (ప్రభుత్వం) తీసుకున్నాం. తుమ్మిడిహట్టికి బదులుగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లు నిర్మించాలని అంతర్జాతీయ ఖ్యాతి గడించిన కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ సూచించింది..' అని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్.. బుధవారం బీఆర్‌కేఆర్ భవన్‌లోని కార్యాలయంలో నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో ఆయన 115వ సాక్షిగా పాల్గొన్నారు. కమిషన్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

తుమ్మిడిహట్టి వద్ద సాధ్యం కాకపోవడం వల్లే..

కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బరాజ్‌ల నిర్మాణంపై నిర్ణయం ఎవరిది అని కమిషన్ ప్రశ్నించగా, కేసీఆర్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. 'ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు కింద తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణాన్ని నాటి మహారాష్ట్ర సీఎం పృథ్వీరాజ్ చవాన్ తీవ్రంగా వ్యతిరేకించారు. తర్వాత బీజేపీ అధికారంలోకి వచ్చాక సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌ను నేను స్వయంగా కలిసి 152 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మాణానికి సహకరించాలని కోరితే ససేమిరా అన్నారు. 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తే సహకరిస్తామన్నారు. ప్రాణహిత–చేవెళ్ల కింద 160 టీఎంసీలను తరలించాల్సి ఉండగా, తుమ్మిడిహట్టి వద్ద అంత నీటి లభ్యత లేదని కేంద్ర జల సంఘం లేఖ రాసింది. ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణం సాధ్యం కాకపోవడం వల్లే ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు రీఇంజనీరింగ్ చేపట్టాం. ప్రత్యామ్నాయాలపై వ్యాప్కోస్ ఆధ్వర్యంలో లైడార్ సర్వే చేయించగా.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద మూడు బరాజ్‌లు నిర్మించాలని సిఫారసు చేసింది. బొగ్గు గనులు ఉండడంతో మేడిగడ్డ నుంచి ఎల్లంపల్లికి నేరుగా నీళ్లను తరలించడం సాధ్యం కాదని తేలింది. అందుకే మూడు బరాజ్‌లు నిర్మించి ఎల్లంపల్లికి నీళ్లను ఎత్తిపోయాలనే నిర్ణయం జరిగింది. మేడిగడ్డ వద్ద 230 టీఎంసీల జలాల లభ్యత ఉందని వ్యాప్కోస్ తేల్చింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన అన్ని రకాల అనుమతులను కేంద్రం నుంచి తీసుకున్నాం. బరాజ్‌ల నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గ ఆమోదం ఉంది. మంత్రివర్గ ఆమోదంతోనే

మిగతా 2వ పేజీలో ▶

ప్రభుత్వ స్కూళ్లలో ప్రీ ప్రైమరీ



ఈ ఏడాది నుంచే అందుబాటులోకి..

- తొలిదశలో 210 పాఠశాలల్లో ఏర్పాటు
- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు పాఠశాలల మాదిరిగానే ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనూ పూర్వ ప్రాథమిక (ప్రీ ప్రైమరీ) విద్య అందుబాటులోకి రానుంది. ఈ విద్యా సంవత్సరం నుంచే తొలిదశ కింద 210 స్కూళ్లలో దీనికి సంబంధించిన తరగతులు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. హనుమకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సిద్దిపేట, వరంగల్ జిల్లాల్లో ఈ ప్రీ ప్రైమరీ విద్యను అందుబాటులోకి తెస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. జిల్లా అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఒకటవ తరగతిలో చేరే ముందు, అందుకు సన్నద్ధతగా ఈ పూర్వ ప్రాథమిక విద్య దోహదపడుతుంది. ఆటలు, పాటలు, కథల రూపంలో విద్యాబోధన ఉంటుంది. ప్రైవేటు పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ పేరిట ప్రీ ప్రైమరీ విద్య రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుంది. అయితే ప్రభుత్వ స్కూళ్లలో ఏడాది పాటే ఇందుకు సంబంధించిన తరగతులు ఉంటాయని అధికార వర్గాల సమాచారం.

బడి గంట మోగింది

- నేటి నుంచి స్కూళ్లు ప్రారంభం
- పుస్తకాలు.. యూనిఫామ్‌లు సిద్ధమంటున్న అధికారులు
- అనేక చోట్ల మౌలిక వసతుల సమస్య
- ప్రభుత్వ బడుల్లో టీచర్ల సర్దుబాటు
- స్కూల్ స్థాయి నుంచే ఏఐ పాఠాలు

3లో



పత్తి కొనుగోళ్ల నుంచి సీసీఐ దూరం!

- రాష్ట్రంలో ప్రత్యామ్నాయ ధరల మద్దతు విధానం అమలుకు కేంద్రం నిర్ణయం
- ఆదిలాబాద్ జిల్లాలో ప్రయోగాత్మకంగా ఈ ఏడాది నుంచే ప్రారంభం... పీడీపీఎస్ విధానంలో రైతు బహిరంగ మార్కెట్‌లో పంట అమ్ముకోవాల్సిందే
- పథకం అమలుపై అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పత్తిని మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్న కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)ని ఆ బాధ్యతల నుంచి తప్పించే ప్రయత్నానికి కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సీసీఐకి కాకుండా బహిరంగ మార్కెట్‌లో రైతులు పత్తిని అమ్ముకుంటే... ఆ పంటకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కన్నా తక్కువ ధర లభిస్తే, ఆ వ్యత్యాసం మొత్తాన్ని కేంద్రప్రభుత్వం చెల్లించేలా ధర వ్యత్యాస చెల్లింపు పథకం (ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ స్కీం – పీడీపీఎస్)ను రాష్ట్రంలో ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. పదేళ్ల క్రితమే మధ్యప్రదేశ్‌లో 'భవంతర్ భుగ్‌తాన్ యోజన'పేరిట 8 పంటలపై ఈ పథకం అమలుకు ప్రయత్నించి విఫలమైన కేంద్రం.. ఇప్పుడు తెలంగాణపై దానినే ప్రయోగిస్తోంది. పత్తి అత్యధికంగా పండించే ఆదిలాబాద్ జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో ప్రయోగాత్మకంగా పీడీపీఎస్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఏడాది నుంచి ఈ విధానం అమలుపై సూచనలు చేస్తున్న కేంద్రం.. నీతి ఆయోగ్ ద్వారా

మిగతా 12వ పేజీలో ▶

సామాజిక న్యాయంతో కేబినెట్ కూర్పు

ఢిల్లీలో కేవలం కర్ణాటకలో కులగణనపై మాత్రమే చర్చించాం

డిప్యూటీ సీఎం, పీసీసీ చీఫ్ లేకుండా శాఖలపై చర్చ ఎలా ఉంటుంది?



- మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తెలంగాణ అభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే ప్రధాన అడ్డంకి అన్న సీఎం
- తాను ఉన్నంతకాలం కాంగ్రెస్‌లోకి కేసీఆర్ కుటుంబాన్ని రానివ్వనని వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: 'కర్ణాటకలో చేపట్టే కులగణన అంశంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో చర్చించేందుకే ఢిల్లీకి వచ్చా. రాష్ట్రంలో మంత్రులకు శాఖల కేటాయింపుపై పెద్దగా చర్చ జరగలేదు. డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షుడు లేకుండా శాఖల కేటాయింపుపై ఎలా చర్చిస్తాం? తెలంగాణ చేసింది కేవలం కులగణన సర్వే మాత్రమే కాదు. సామాజిక, ఆర్థిక, ఉద్యోగ, రాజకీయ, ఉపాధి, విద్య అంశాల సర్వే. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి వ్యక్తిగత డేటా పూర్తిగా మా వద్ద ఉంది. 97 శాతం మంది సర్వేలో పాల్గొన్నారు. సర్వే చేయడంతో ఆగిపోకుండా ఆ మేరకు సామాజిక న్యాయంతో రాష్ట్ర కేబినెట్ కూర్పు చేశాం. చరిత్రలోనే తొలిసారి

మిగతా 12వ పేజీలో ▶

కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు

వివేక్, లక్ష్మణ్, శ్రీహరిలకు మంత్రిత్వ శాఖలు ఇచ్చిన సీఎం రేవంత్

- వివేక్‌కు కార్మిక, గనుల శాఖలు... అడ్లూరి లక్ష్మణ్‌కు సంక్షేమ శాఖల బాధ్యతలు
- వాకిటి శ్రీహరికి పశుసంవర్ధకం, క్రీడలు, యువజన సర్వీసులు
- ఉత్తర్వులు విడుదల చేసిన సాధారణ పరిపాలన శాఖ

12లో

వానలకు అనుకూలంగా వాతావరణం

ప్రస్తుతం రాష్ట్రంలో చురుకుగా రుతుపవనాల కదలికలు

- పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం
- 3 రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం



సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాలు క్రమంగా ఊపందుకునే సూచనలు కన్పిస్తున్నాయి. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వేసవి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి చల్లదనం సంతరించుకుంటోంది. ఈ క్రమంలో ప్రస్తుతం రుతుపవనాల కదలికలు ఆశాజనకంగా ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వాస్తవానికి రుతుపవనాలు వచ్చినప్పటికీ గత పది రోజులుగా మందగించడంతో వానల జాడ లేకుండా పోయింది. అక్కడక్కడా అడపాదడపా తేలికపాటి వర్షాలు నమోదైనప్పటికీ..వాతావరణంలో నెలకొన్న మార్పులతో అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత తీవ్ర ఉక్కిరిబిక్కిరికి గురిచేశాయి. కానీ ప్రస్తుతం పరిస్థితి మారుతోంది. రుతుపవనాల కదలికలు చురుగ్గా మారుతుండటంతో పాటు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీంతో రానున్న

మిగతా 5వ పేజీలో ▶

పాతికేళ్లకు వృద్ధ భారతం!

2050 నాటికి దేశంలో వృద్ధుల జనాభా 20 శాతానికి మించే చాన్స్

- 60 ఏళ్లకు పైబడిన వారి సంఖ్య 14.9 కోట్ల నుంచి 34.7 కోట్లకు చేరుకుంటుందని అంచనా
- ఆరోగ్య, ఆర్థిక, సామాజిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం
- 'ఇండియాస్ ఏజింగ్ సొసైటీ: ద ల్యాండ్‌స్కేప్ టుడే' నివేదిక వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం 'యువ భారత్'గా ఉన్న ఇండియా కాస్తా మరో పాతికేళ్లలో వృద్ధ సమాజంగా మారుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. 2050 నాటికి దేశ జనాభాలో 60 ఏళ్లకు పైబడిన వృద్ధుల శాతం 20కి మించి అంటే దాదాపు 35 కోట్లకు చేరుకుంటుందని అంచనా. 2023 నాటికి 60 ఏళ్లకు పైబడిన ప్రజల సంఖ్య 14.9 కోట్లుగా నమోదు కాగా ఇది మొత్తం జనాభాలో సుమారు 10.7 శాతానికి సమానం. అయితే 2050 నాటికి ఈ సంఖ్య

మిగతా 5వ పేజీలో ▶

సాగుకు శాపం.. బాబుదే ఈ పాపం



ప్రకాశం జిల్లా పొదిలిలో వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న రైతులు, అశేష జనసందోహంలో ఓ భాగం

- వివరాలు 12లో

క్లుప్తంగా...

ఓపెన్ కోర్టు విచారణకు ఎందుకు ఒప్పుకోలేదు?

కేసీఆర్‌కు కాంగ్రెస్ ఎంపీ చామల ప్రశ్న



సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరం కమిషన్ ముందు అందరూ ఓపెన్ కోర్టు విచారణకు హాజరైతే.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం ఎందుకు ఒప్పుకోలేదు? అని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. కేసీఆర్ ఎందుకు వన్ టు వన్ విచారణ అడిగారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తన తండ్రి కమిషన్ ముందు హాజరు కావడాన్ని కేటీఆర్ జీర్ణించుకోలేక ప్రభుత్వం కుట్ర అంటూ ఆరోపించడాన్ని తప్పుబట్టారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కట్టించిన కాళేశ్వరం కూలిపోయిందని, కాంగ్రెస్ హయాంలో కట్టిన నిజాంసాగర్, కడియం ప్రాజెక్ట్, లోయర్ మానేరు, సింగూర్ డ్యాం ఎక్కడా కూలిపోలేదని గుర్తు చేశారు. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టు చైనాలో కట్టి ఉంటే అవార్డు వచ్చేదని కేటీఆర్ అంటున్నారని, చైనాలో ఇలాంటి ప్రాజెక్టు కేసీఆర్ కట్టిఉంటే ఆయనను ఉరి తీసేవారని చెప్పారు.

కేటీఆర్ భాష వింటే వీధిరౌడీలు కూడా సిగ్గుపడతారు

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అచ్చోసిన ఆంబోతులా రంకెలు వేస్తూ పరుష పదజాలంతో మాట్లాడుతున్నారని, ఆయన భాష వింటే వీధిరౌడీలు కూడా సిగ్గుపడతారని చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వ్యాఖ్యానించారు. కేటీఆర్ భాష విని ప్రజలు అసహ్యించుకుంటున్నారని ఆయన చెప్పారు. బుధవారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేసీఆర్ తప్పు చేశాడు కాబట్టే కాళేశ్వరం కమిషన్ ఆయనను విచారణకు పిలిచిందని, అవినీతి బయటపడుతుందనే ఆ పార్టీ నేతలు గగ్గోలు పెడుతున్నారని అన్నారు. నిజంగా కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే రాష్ట్రంలో ఒక్క బీఆర్ఎస్ నేత కూడా రోడ్లపైకి రాలేడని అన్నారు. కేసీఆర్ వెంట్రుక కూడా పీకలేరని అహంకారంతో కేటీఆర్ మాట్లాడుతున్నారని, వెంట్రుక కాదని, తెలంగాణ ప్రజలు మీకు గుండు కొట్టించి ఫామ్‌హౌస్‌కు పంపారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు ముసుగులో గుద్దులాట ఆపి, ఆ రెండు పార్టీలు కలిసిపోతే మంచిదని ఎమ్మెల్యే సత్యం సూచించారు.





కమిషన్ ఎదుట హాజరయ్యేందుకు బీఆర్‌కే భవన్‌కు వచ్చిన మాజీ సీఎం కేసీఆర్. భారీ సంఖ్యలో గుమికూడిన బీఆర్ఎస్ కార్యకర్తలు

కేబినెట్ ఆమోదంతోనే..

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని నిర్ణయాలు జరిగాయి..' అని కేసీఆర్ చెప్పారు.

ఆ నిర్ణయాలన్నీ ఇంజనీర్లవే...

బరాజ్‌ల లొకేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందా? అని కమిషన్ ప్రశ్నించగా.. ఇంజనీర్లు, సాంకేతిక బృందం తీసుకుందని కేసీఆర్ బదులిచ్చారు. 'కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో 4 వేల మంది ఇంజనీర్లు పాల్గొన్నారు. బరాజ్‌ల నుంచి పంప్‌హౌస్‌ల ద్వారా నీళ్లను ఎత్తిపోసేందుకు అవసరమైన స్థాయిల్లో నిల్వలను కొనసాగించే అంశంపై ఇంజనీర్లే నిర్ణయం తీసుకున్నారు. సాంకేతిక అంశాల్లో నిర్ణయాలన్నీ ఇంజనీర్లే తీసుకున్నారు. మంత్రివర్గ ఆమోదంతో కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్) ఏర్పాటుకు అనుమతిచ్చాం. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కొరత ఉండడంతో రుణాల సమీకరణ కోసం దీనిని ఏర్పాటు చేశాం. ప్రాజెక్టుకు ఆదాయం సమకూరే వరకు రుణాల తిరిగి చెల్లింపు బాధ్యత ప్రభుత్వానిదే..' అని మాజీ సీఎం చెప్పారు.

బరాజ్‌ల నిర్వహణకు రూ.280 కోట్ల నిధులిచ్చాం..కానీ

మేడిగడ్డ బరాజ్ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సీపేజీ ఏర్పడడం వెనక నిర్వహణ, పర్యవేక్షణ లోపాలు సైతం ఉన్నట్టు వచ్చిన ఆరోపణలపై కేసీఆర్ స్పందించారు. బరాజ్‌ల నిర్వహణ, పర్యవేక్షణ కోసం రూ.280 కోట్లను కేటాయిస్తూ 2020లో తమ ప్రభుత్వం జారీ చేసిన జీవో 45 ప్రతిని కమిషన్‌కు అందజేశారు. నిధులు మంజూరు చేసినా ఇంజనీర్లు వాడుకోలేదని కేసీఆర్ చెప్పినట్టు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో నాణ్యత పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఓ క్వాలిటీ కంట్రోల్ డివిజన్‌నే ఏర్పాటు చేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన ఆరోపణలను తిప్పికొడుతూ రూపొందించిన ఓ పుస్తకాన్ని కూడా కమిషన్‌కు కేసీఆర్ అందజేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు ఇటీవల విలేకరుల సమావేశంలో ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌నే పుస్తక రూపంలోకి మార్చి కమిషన్‌కు ఇచ్చారు.



బీఆర్‌కే భవన్‌లోకి వెళుతున్న జస్టిస్ పీసీ ఘోష్

సిబ్బందిని, మీడియాను బయటకు పంపించి..

క్రాస్ ఎగ్జామినేషన్‌లో భాగంగా ఇప్పటివరకు హాజరైన ఇతర సాక్షులందరినీ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తమ కార్యాలయ అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధుల సమక్షంలో బహిరంగంగానే ప్రశ్నించింది. అయితే అనారోగ్య సమస్యల కారణంగా బహిరంగ విచారణలో పాల్గొనలేనని, తనను ప్రశ్నించేటప్పుడు ఎవరినీ అనుమతించరాదని కేసీఆర్ చేసిన విజ్ఞప్తిపై కమిషన్ సానుకూలంగా స్పందించింది. కోర్టు హాలు నుంచి అందరినీ బయటకు పంపించి 'ఇన్ కెమెరా' విధానంలో (కేవలం కేసీఆర్, కమిషన్ కార్యదర్శి మాత్రమే ఉన్నప్పుడు) క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది. జస్టిస్ ఘోష్ అడిగే ప్రశ్నలు, కేసీఆర్ ఇచ్చే సమాధానాలను కంప్యూటర్‌పై టైప్ చేసేందుకు కమిషన్ కార్యదర్శిని అనుమతించారు.

18 ప్రశ్నలు...50 నిమిషాలు

మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన విచారణ సుమారు 50 నిమిషాల పాటు సాగి 12.50 గంటలకు ముగిసింది. కేసీఆర్‌కు కమిషన్ 18 ప్రశ్నలు వేసినట్టు తెలిసింది. కేసీఆర్‌ను కమిషన్ కార్యాలయానికి తోడ్కొని వచ్చిన వారిలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్ తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రాస్ ఎగ్జామినేషన్

కాళేశ్వరం బరాజ్‌ల నిర్మాణంపై విచారణలో భాగంగా జస్టిస్ ఘోష్ కమిషన్ చేపట్టిన క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. మేడిగడ్డ బరాజ్ 2023లో కుంగిపోగా.. అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో సైతం లోపాలు బయటపడ్డాయి. దీనిపై విచారణ కోసం 2024 మార్చి 14న సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్‌తో రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. దీంతో ఇరిగేషన్ ఇంజనీర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు, ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లు, మాజీ మంత్రులకు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది. కమిషన్ గడువు వచ్చే నెలాఖరుతో ముగియనుండగా, ఆ లోగానే నివేదిక సమర్పించే అవకాశం ఉంది.

కేసీఆర్ అంటే తెలంగాణ చరిత్ర.. రేవంత్ ఓ చిల్లర సీఎం

వంద జన్మలెత్తినా కేసీఆర్ గొప్పతనం చిల్లర వ్యక్తులకు అర్థం కాదు: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: చావు నోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ అంటే.. తెలంగాణ చరిత్ర అని, ఆయన్ను విచారణ పేరిట పిలిచి నీటిపారుదల గురించి మాట్లాడటం హనుమంతుడి ముందు కుప్పి గంతులు వేసినట్టేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఒక చిల్లర సీఎం అని, ప్రభుత్వాన్ని నడపడం కూడా చేతకావడం లేదన్నారు. మంత్రులకు శాఖలు కేటాయించే అధికారం కూడా లేని సీఎం ఢిల్లీకి వెళ్లి నిర్ణయించాల్సిన దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. బీఆర్‌కే భవన్ వద్ద కేటీఆర్ బుధవారం మీడియాతో మాట్లాడారు. 'రేవంత్ లాంటి చిల్లర వ్యక్తికి వంద జన్మలెత్తినా కేసీఆర్ గొప్పతనం అర్థం కాదు. నాలుగేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించినందుకు కేసీఆర్‌కు నోటీసులు ఇస్తారా. ఎన్నికల హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాళేశ్వరం పేరిట కుట్రలు చేస్తున్నారు. తెలంగాణను సాధించి సస్యశ్యామలం చేసిన నాయకుడిగా కేసీఆర్ పేరు సువర్ణ అక్షరాలతో చరిత్రలో నిలిచిపోతుంది. కాళేశ్వరంపై చిల్లర రాజకీయాలు ముగిసిన తర్వాత రేవంత్‌తోపాటు కాంగ్రెస్‌ను ప్రజాక్షేత్రంలో బట్టలిప్పి నిల్చోబెట్టేలా మా పార్టీ కార్యాచరణ ఉంటుంది' అని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం విచారణ కమిషన్ ఏర్పాటు వెనుక రాజకీయ కక్ష సాధింపు ఉందని, కూల్చివేతలు మినహా రేవంత్ సర్కారుకు ప్రాజెక్టులు కట్టడం తెలియదన్నారు. విధ్వంసకరమైన ఆలోచనలు, రాజకీయ కక్ష సాధింపు మినహా రేవంత్‌కు ఏదీ చేతకాదన్నారు. రేవంత్ జేజమ్మను ఇక్కడి నుంచి కరకట్టకు కేసీఆర్ తరిమేశాడని కేటీఆర్ అన్నారు. కేసీఆర్ బలం, జీవన దృక్కోణాన్ని అర్థం చేసుకునేందుకు జోకర్ కాంగ్రెస్ నేతలకు జీవిత కాలం కూడా సరిపోదన్నారు.

దొంగ మాటలు చెప్పి దోచుకున్నారు

రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు, తదితరులు

ములుగు రూరల్: రాష్ట్రాన్ని కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో దొంగ మాటలు చెప్పి గత పాలకులు దోచుకున్నారని రెవెన్యూ, హౌసింగ్ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ములుగు జిల్లాలో బుధవారం పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి సీతక్కతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరుపత్రాలు అందించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ధనిక రాష్ట్రాన్ని రూ.8.19 లక్షల కోట్లు అప్పుల పాలు చేశారన్నారు. అయినప్పటికీ గత ప్రభుత్వం అందించిన పథకాలను అమలు చేయడంతోపాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ప్రాజెక్టు కూలిపోయిందని పొంగులేటి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలతో దర్యాప్తు చేసి రిటైర్డ్ జడ్జిని నియమించి విచారణ చేపట్టామన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులందరినీ విచారణ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. కాళేశ్వరం రూపశిల్పిగా చెప్పుకుంటున్న మహానుభావుడు కూడా కమిషన్ విచారణకు హాజరుకావాల్సి వచ్చిందని పొంగులేటి పేర్కొన్నారు. కమిషన్ రిపోర్టు ఆధారంగా ప్రజా ప్రభుత్వం ఎంతటి వారినైనా చట్టరీత్యా శిక్షిస్తుందన్నారు. సమావేశంలో ఎంపీ బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కమిషన్‌ను ఈటల తప్పుదోవ పట్టించారు

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు మంత్రి తుమ్మల లేఖ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు మాజీ మంత్రి ఈటల రాజేందర్‌పై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. కమిషన్‌ను ఈటల తప్పుదోవ పట్టించారని ఆరోపించారు. ఈ మేరకు ఆయన కమిషన్‌కు లేఖ రాశారు. ఇటీవల కమిషన్ నిర్వహించిన విచారణకు హాజరైన ఈటల రాజేందర్, తుమ్మల నాగేశ్వరరావు పేరును ప్రస్తావించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైనింగ్‌పై అధ్యయనం కోసం అప్పటి సీఎం కేసీఆర్.. హరీశ్‌రావు చైర్మన్‌గా కేబినెట్ సబ్‌కమిటీ వేశారని, అందులో తనతోపాటు, మంత్రి తుమ్మలను కూడా నియమించారని ఈటల కమిషన్‌కు వివరించారు. సబ్ కమిటీ నిర్ణయం మేరకు ప్రాజెక్టును రీడిజైన్ చేశారని ఈటల వెల్లడించగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని ఖండించారు. కేబినెట్ సబ్‌కమిటీని అన్ని ప్రాజెక్టుల రీడిజైన్, సమస్యల అధ్యయనం కోసం ఏర్పాటు చేశారని, కేవలం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించింది కాదని తెలిపారు. మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుకు ముందే మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మాణానికి అనుమతిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిందని వెల్లడించారు. ఈ అంశాలను వివరిస్తూ ఆయన తాజాగా కమిషన్‌కు లేఖ రాశారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎర్రవల్లి టు బీఆర్‌కే భవన్

'కాళేశ్వరం' విచారణకు పార్టీ నేతలతో కలిసి హాజరైన కేసీఆర్

- విచారణ తర్వాత ఎమ్మెల్యే పల్లాకు పరామర్శ
- ఉదయాన్నే ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్‌తో కవిత దంపతుల భేటీ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ ఎదుట బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హాజరయ్యారు. బుధవారం ఉదయం నుంచి ఎర్రవల్లి నివాసానికి పెద్దఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు చేరుకున్నారు. ఉదయం 9.45కు ఎర్రవల్లి నివాసం నుంచి బయలుదేరి 11 గంటలకు కమిషన్ విచారణ జరిగే బీఆర్‌కే భవన్‌కు కేసీఆర్ చేరుకున్నారు. కాళేశ్వరం కమిషన్‌కు ముందస్తు ఇచ్చిన సమాచారం మేరకు కేసీఆర్‌తోపాటు తొమ్మిది మందిని పోలీసులు కమిషన్ కార్యాలయంలోకి అనుమతించారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్, మహమూద్ అలీ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ సంతోశ్‌కుమార్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కమిషన్ కార్యాలయంలోకి వెళ్లినవారిలో ఉన్నారు. 50 నిమిషాల పాటు పీసీ ఘోష్‌తో జరిగిన ముఖాముఖి విచారణలో కమిషన్ లేవనెత్తిన పలు ప్రశ్నలకు కేసీఆర్ సమాధానాలు ఇచ్చినట్టు సమాచారం. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కమిషన్ విచారణ కార్యాలయం నుంచి కేసీఆర్ బయటకు వచ్చారు. అక్కడి నుంచి నేరుగా యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శించారు. ఆ తర్వాత కేసీఆర్ నందినగర్ నివాసానికి వెళ్లారు. అక్కడే భోజనం చేసిన అనంతరం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఎర్రవల్లి నివాసానికి కేసీఆర్ బయలుదేరి వెళ్లారు.

బీఆర్‌కే భవన్ వద్ద సందడి

కేసీఆర్ వస్తున్న నేపథ్యంలో బీఆర్‌కే భవన్ వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సందడి మొదలైంది. పెద్దఎత్తున పార్టీ నేతలు తరలిరావడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బీఆర్‌కే భవన్‌లోకి కొందరు కార్యకర్తలు చొచ్చుకు వెళ్లేందుకు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డు కున్నారు. ఆకుపచ్చ కండువాలతో వచ్చిన నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు బీఆర్‌కే భవన్ పరిసరాల్లో బైఠాయించి కేసీఆర్ అనుకూల నినాదాలు చేశారు. ప్రభుత్వం కుట్ర పూరితంగా కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసిందని ప్లకార్డులు ప్రదర్శించారు. వేలాదిగా పార్టీ కేడర్ తరలిరావడంతో సచివాలయ పరిసరాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు కేటీఆర్

కేసీఆర్ విచారణకు హాజరవుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉదయం 10.30కు బీఆర్‌కే భవన్‌కు సమీపంలో ఉన్న ఆదర్శ్‌నగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు చేరుకున్నారు. మాజీమంత్రి తలసాని నివాసంలో పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఆ తర్వాత బీఆర్‌కే భవన్ సమీపంలోకి చేరుకున్నారు. విచారణ పూర్తయ్యేంత వరకు రోడ్డు పక్కనే కేటీఆర్ వేచి ఉన్నారు. జాతీయ మీడియాతో మాట్లాడుతూ కుట్ర పూరితంగా కేసీఆర్‌కు విచారణ కమిషన్ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం నోటీసులు జారీ చేయించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డి కాలుకు గాయాలు



పల్లా రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శిస్తున్న కేసీఆర్. చిత్రంలో ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావు, సంతోష్, రవిచంద్ర తదితరులు

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు రెండు రోజులుగా ఎర్రవల్లి నివాసంలోనే బస చేశారు. బుధవారం ఉదయం కేసీఆర్‌తో కలిసి కమిషన్ విచారణకు హాజరయ్యేందుకు సిద్ధమవుతూ ఎర్రవల్లి నివాసంలోని స్నానాల గదిలో పల్లా జారిపడటంతో కుడికాలు తుంటి ఎముక మూడు చోట్ల ఫ్రాక్చరైంది. కుడి మోచేతికి కూడా స్వల్పగాయమైంది. వెంటనే హరీశ్‌రావు.. తన వ్యక్తిగత సిబ్బంది సాయంతో పల్లాను అంబులెన్సులో సోమాజిగూడ యశోద ఆస్పత్రికి తరలించారు. ఎనిమిది వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు వెల్లడించారు. తాను గతంలో జారిపడిన విషయాన్ని గుర్తు చేస్తూ త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే పల్లాకు కేసీఆర్ ధైర్యం చెప్పారు.

ఎర్రవల్లి నివాసానికి కవిత దంపతులు



ఎర్రవల్లిలోని నివాసంలో కేసీఆర్‌తో ఎమ్మెల్సీ కవిత తదితరులు

ఎల్కతుర్తి రజతోత్సవ సభపై కేసీఆర్‌ను ఉద్దేశిస్తూ ఎమ్మెల్సీ కవిత లేఖ రాయడం, తదనంతర ప్రకటనలు, ఘటనల నేపథ్యంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. బుధవారం ఉదయం 8 గంటలకు తన భర్త అనిల్‌తో కలిసి ఎర్రవల్లికి చేరుకొని గంటకు పైగా కేసీఆర్‌తో భేటీ అయినట్టు సమాచారం.

దురుద్దేశంతోనే కమిషన్ వేశారు: సింగిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: గతంలో ప్రధాని ప్రారంభించిన ప్రాజెక్టులు కూలిపోయినా కమిషన్లు వేయలేదని, కాళేశ్వరం పిల్లర్లు కూలితే మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతో కమిషన్ వేసిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రజల అవసరాలు తీర్చేందుకే మాజీ సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని, ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకోకుండా కేసీఆర్‌ను బద్నాం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని ధ్వజమెత్తారు. ఆరంభం నుంచే కాంగ్రెస్ దీనిపై విషం చిమ్ముతూ వచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లు లేని స్థలంలో కాంగ్రెస్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులు చేపట్టిందని, అదేవిధంగా ఎలాంటి అనుమతులు లేకుండా ప్రాజెక్టు నిర్మించాలని చూశారని ఆరోపించారు. కాంగ్రెస్ ఏ ప్రాజెక్టు కట్టినా 30 ఏళ్లు పట్టిందని, అదే అత్యంత వేగంగా కాళేశ్వరం ప్రాజెక్టును బీఆర్ఎస్ పూర్తి చేసిందని నిరంజన్ తెలిపారు.

గృహ రుణం రూ.1.34 కోట్లు చెల్లించాల్సిందే

- కీలక తీర్పు ఇచ్చిన రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్
- జిల్లా వినియోగదారుల కమిషన్ ఇచ్చిన తీర్పును సమర్థించిన కమిషన్

సాక్షి, హైదరాబాద్: గృహరుణం తీసుకునే సమయంలో గృహ రుణ బీమా పాలసీ తీసుకున్న వ్యక్తి మరణించినప్పుడు, ఆ గృహ రుణాన్ని పాలసీ సంస్థనే చెల్లించాలని రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే...హైదరాబాద్‌లోని నల్లకుంటకు చెందిన కక్షిదారు సుజాత భర్త దివంగత సుద్దుల దొడ్డన్నగౌడ్ పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుంచి రూ.1,39,29,439 గృహ రుణం తీసుకున్నాడు. దీనికి అనుబంధంగా టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ నుంచి రూ.1,34,00,000 కవరేజీతో గృహరుణ బీమా పాలసీ 2026 వరకు తీసుకున్నాడు. అయితే 2021లో దొడ్డన్నగౌడ్ వైరల్ న్యుమోనియాతో చనిపోయాడు. నిబంధనల ప్రకారం.. పాలసీదారుడు మరణిస్తే గృహ రుణాన్ని బీమా కంపెనీ చెల్లించాలి. దీనిపై ఆయన భార్య సుజాత బీమా కంపెనీకి క్లెయిమ్ సమర్పించగా, అనారోగ్యంతో చనిపోయాడని, ఇది పాలసీ పరిధిలోకి రాదని క్లెయిమ్‌ను తిరస్కరించింది. దీనిపై సుజాత హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్–1ను ఆశ్రయించారు. రుణం చెల్లించడంతోపాటు, సుజాతకు రూ.లక్ష పరిహారం, రూ. 25,000 ఖర్చుల కింద చెల్లించమని ఆదేశించింది. దీనిని సవాల్ చేస్తూ బీమా కంపెనీ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ వద్ద అప్పీల్ దాఖలు చేసింది. తక్కువ పరిహారం ఇచ్చారని సుజాత కూడా అప్పీల్ దాఖలు చేసింది. టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కంపెనీ అప్పీల్‌ను కమిషన్ కొట్టివేసింది, జిల్లా కమిషన్ ఆదేశాలను ధృవీకరించింది. 'టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ 30 రోజులలోపు దివంగత పాలసీదారుడు, ఆయన భార్య సుజాత పేరు మీద ఉన్న అవుట్‌స్టాండింగ్ లోన్ అకౌంట్‌ను క్లియర్ చేయాలి. లోన్ క్లియర్ అయిన తర్వాత, పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఆస్తి పత్రాలను విడుదల చేయాలని తీర్పు చెప్పింది.

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై కదలిక

కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీలకు చేరిన ప్రాజెక్టు ఫీజిబిలిటీ రిపోర్టు

సాక్షి, హైదరాబాద్: గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకి సంబంధించి ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును ఏపీ ప్రభుత్వం ఇటీవల కేంద్ర జలశక్తి, కేంద్ర ఆర్థిక శాఖలకి సమర్పించింది. తాజాగా ఆ రిపోర్టును కేంద్ర జలశక్తి శాఖ.. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డులతో పాటు పోలవరం ప్రాజెక్టు అథారిటీ పరిశీలన కోసం పంపింది. రిపోర్టును అధ్యయనం చేసి అభిప్రాయాలను తెలపాలని సూచించింది. రూ.80 వేల కోట్లతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకి ఆర్థిక సాయం చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఈ నివేదికను గత నెల 23న కేంద్రానికి సమర్పించింది. ఇటీవల కేంద్ర ఆర్థికశాఖకు కూడా ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. మరోవైపు ఈ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని, ఎలాంటి అనుమతులు, ఆర్థిక సహాయం చేయరాదని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

అక్రమాస్తులు రూ.200 కోట్లకుపైనే!

మరో కాళేశ్వరం ఇంజనీర్‌పై ఏసీబీ పంజా

- బుధవారం రోజంతా 13 చోట్ల ఏసీబీ బృందాల సోదాలు
- హైదరాబాద్, కరీంనగర్, బెంగళూరు, వరంగల్‌లో అక్రమాస్తుల గుర్తింపు
- నూనె శ్రీధర్ అరెస్టు.. జ్యుడీషియల్ కస్టడీకి తరలింపు



కరీంనగర్‌లోని మంకమ్మతోటలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/ మలక్‌పేట: అవినీతి నిరోధక విభాగం (ఏసీబీ) అధికారులు మరో భారీ అవినీతి తిమింగలాన్ని పట్టేశారు. నీటిపారుదల శాఖ ఎస్సారెస్పీ క్యాంప్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా పని చేస్తున్న నూనె శ్రీధర్ ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించి బుధవారం అరెస్టు చేశారు. కరీంనగర్‌లోని శ్రీధర్, ఆయన బంధువుల ఇళ్లలో, హైదరాబాద్‌లో బుధవారం వేకువజామున 5 గంటల నుంచి ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించి, ఆయన రూ.200 కోట్లకుపైనే అక్రమాస్తులు కూడబెట్టినట్టు గుర్తించారు. శ్రీధర్ గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు 6, 7, 8 ప్యాకేజీల పనులను పర్యవేక్షించారు. ఆయన ఇరిగేషన్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు కూడా.

వందలకోట్ల విలువైన స్థిరాస్తులు

శ్రీధర్‌ను కరీంనగర్ మంకమ్మతోటలోని ఆయన నివాసంలో బుధవారం ఉదయం అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు.. హైదరాబాద్‌కు తరలించి ప్రశ్నించారు. మంకమ్మతోట భాగ్యనగర్‌లోని ఆయన ఇల్లు, ఆర్టీసీ వర్క్‌షాపు సమీపంలోని భార్గవి ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్, అలుగునూరులోని ఓ హోటల్, చొప్పదండి ఎస్సారెస్పీ కార్యాలయాలు, హైదరాబాద్, బెంగళూరుతో పాటు 13 చోట్ల సోదాలు నిర్వహించి పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్‌లో వీటి విలువ రూ.200 కోట్లకుపైనే ఉంటుందని అంచనా. హైదరాబాద్‌లోని మలక్‌పేట పల్టాన్‌లో శ్రీధర్ నివాసంలో ఉదయం నుంచి ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ నేతృత్వంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో హైదరాబాద్‌లో ఓ భవనం, తెల్లాపూర్‌లో విల్లా, షేక్‌పేట్‌లో ఒక ఫ్లాట్, కరీంనగర్‌లో 3 ఫ్లాట్లు, ఓ భవనం, అమీర్‌పేట్‌లోని వాణిజ్య స్థలం, వరంగల్‌లో ఓ భవనం, 16 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌లో 19 చోట్ల ఇళ్ల స్థలాలు, రెండు కార్లు, బంగారు ఆభరణాలు, బ్యాంక్ డిపాజిట్లు గుర్తించినట్లు ఏసీబీ అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయని, నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. బ్యాంకు లాకర్లు కూడా తెరవాల్సి ఉందని చెప్పారు. కాగా, శ్రీధర్ పనిచేస్తున్న డివిజన్‌లో పనిచేసే మరికొందరు ఇంజనీర్లు భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఇటీవల ఏసీబీకి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో కొందరు అధికారులపై దృష్టి పెట్టినట్టు సమాచారం. కొంతకాలంగా వీరి ఇళ్లలో జరిగిన వివాహ, ఇతర వేడుకలకు భారీగా వెచ్చించడాన్ని కూడా ఏసీబీ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా...

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పూర్తి

- పదిరోజుల్లో ఫలితాల వెల్లడికి సన్నాహాలు

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారంతో పూర్తయ్యాయి. ఇటీవల సాధారణ పరీక్షల్లో తప్పిన 4,363 మంది ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 3,021 మంది పరీక్షలు రాశారు. హాజరు శాతం 69.24గా ఉన్నట్టు అధికారులు తెలిపారు. పరీక్ష ఫలితాలను పది రోజుల్లో వెల్లడిస్తామని తెలిపారు.

డిగ్రీ సిలబస్‌పై స్పష్టత ఇవ్వండి

- వర్సిటీలకు ఉన్నత విద్యామండలి సూచన.. 20లోగా ముసాయిదా సిలబస్‌కు గడువు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ సిలబస్‌పై రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు స్పష్టత ఇవ్వాలని ఉన్నత విద్యా మండలి సూచించింది. ఈ ఏడాది (2025–26) నుంచి.. మొదటి ఏడాది డిగ్రీ సిలబస్‌లో మార్పులు తేవాలని మండలి నిర్ణయించింది. ఇరవై శాతం మేర ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చేర్చాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన బోధన ప్రణాళికను రూపొందించాలని యూనివర్సిటీలకు సూచించింది. దీనిపై పలు దఫాలుగా యూనివర్సిటీల ఉప కులపతులతో చర్చ జరిగింది. ప్రతీ యూనివర్సిటీ కోర్సుల వారీగా పాఠ్యాంశాలను రూపొందించాల్సి ఉంటుంది. ఈ బాధ్యతను ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అప్పగించారు. వీటిని ఉపకులపతులు పరిశీలించి మండలికి సమర్పించాల్సి ఉంటుంది. ముసాయిదా సిలబస్ ప్రతిని ఈ నెల 20వ తేదీలోగా ఇవ్వాలని ఉన్నత విద్యామండలి బుధవారం ఉప కులపతులను కోరింది.

గురుకుల డిగ్రీ ప్రవేశాలకు రెండో విడత సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: బీసీ గురుకుల డిగ్రీ కాలేజీల్లో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి సంవత్సరం కోర్సుల్లో ప్రవేశాలకు అర్హత సాధించిన అభ్యర్థుల రెండో విడత జాబితాను విడుదల చేసినట్లు సొసైటీ కార్యదర్శి సైదులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థుల జాబితా బీసీ గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. ఈ జాబితా విద్యార్థుల ఇంటర్మీడియెట్ మెరిట్, సీటు లభ్యత (సీటు మ్యాట్రిక్స్), వారు ఇచ్చిన ప్రాధాన్యాల ఆధారంగా తయారు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తమ సీటు కేటాయింపు స్థితిని అధికారిక వెబ్‌సైట్ https://tgrdccet.cgg.gov.in/TGRDCWEB/ లేదా https://mjptbcwreis.telangana.gov.in ద్వారా తెలుసుకోవచ్చన్నారు. సీటు పొందిన విద్యార్థులు 12/06/2025 నుంచి 17/06/2025 లోగా తమకు కేటాయించిన కళాశాలకు వెళ్లి అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించి అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా తమకు కేటాయించిన కాలేజీలో రిపోర్ట్ చేయకపోతే సీటు రద్దు అవుతుందన్నారు. మరింత సమాచారం కోసం 040–23328266 ఫోన్ నంబర్‌లో లేదా mjptbcwreis14@gmail.comకు మెయిల్ పంపించాలని సూచించారు.

సీఎస్‌తో ఉద్యోగ జేఏసీ నేతల భేటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు బుధవారం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కలిశారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తంచేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం సహా ప్రత్యేకంగా అధికారుల కమిటీని ఏర్పాటు చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎస్‌ను కలిసిన వారిలో టీజీఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, టీజీవో ప్రధాన కార్యదర్శి ఏనుగు సత్యనారాయణ తదితరులున్నారు.

శ్రీనిధిలో క్లౌడ్ ఈఆర్పీ కోర్సు

బేగంపేట్ (హైదరాబాద్): దక్షిణ భారత దేశంలోనే తొలిసారిగా క్లౌడ్ ఈఆర్పీ ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ (బీటెక్) కోర్సులను ప్రారంభించనున్నట్లు శ్రీనిధి యూనివర్సిటీ అధ్యక్షుడు అభిజిత్‌రావు తెలిపారు. శాప్, సీడ్ ఇన్ఫోటెక్‌తో కలిసి ప్రారంభించిన కోర్సు వివరాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. క్లౌడ్ ఈఆర్పీ కోర్సులో చేరే విద్యార్థులకు సీఎస్ఈ డిగ్రీతో పాటు.. శాప్‌కు సంబంధించిన నాలుగు సర్టిఫికేషన్లు లభిస్తాయని వివరించారు. నాలుగు సంవత్సరాల కోర్సు అనంతరం ప్రతి ఒక్కరికీ ఉద్యోగావకాశాలుంటాయని స్పష్టం చేశారు. అన్ని వర్గాల విద్యార్థులకు కోర్సులను అందుబాటులోకి తీసుకురావడం కోసం.. ఉపకార వేతనాలతో కూడిన అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. శ్రీనిధి యూనివర్సిటీ ద్వారా.. ప్రస్తుత సంవత్సరం కేవలం 60 సీట్లతో ప్రారంభిస్తున్నామన్నారు. వచ్చే విద్యా సంవత్సరం 120.. ఆపై సంవత్సరం 180 సీట్లతో క్లౌడ్ ఈఆర్పీ కోర్సులను కొనసాగిస్తామని చెప్పారు. సమావేశంలో డాక్టర్ గణేష్ నటరాజన్, రిచర్డ్ కింగ్, ఫిలిప్ సామ్యుయేల్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఒకే ఒక్క చాన్స్ ఇవ్వండి

కల్లూరురూరల్: నిష్ణాతులైన ఉపాధ్యాయులు, యూనిఫాం, పుస్తకాలు, పౌష్టికాహారం అందుతున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ కోరారు. ఒక్క ఏడాదికి చేర్పించి ఆశించిన ఫలితం రాకపోతే తిరిగి ప్రైవేట్ పాఠశాలలో చేర్పించొచ్చని తెలిపారు. కల్లూరు మండలం ఓబుల్‌రావు బంజరతోపాటు లక్ష్మాతండా, పాయపూర్, లక్ష్మీపురం, రామకృష్ణాపురం, చిన్నకోరుకొండి, కల్లూరు వడ్డెర కాలనీ పాఠశాలల్లో విద్యార్థులు లేరనే కారణంతో గతేడాది మూసివేశారు. ఇది తెలిసి కలెక్టర్ ఈ ఏడాది బడిబాట ద్వారా పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని సూచించగా ఓబుల్‌రావు బంజర పాఠశాలలో పలువురు ప్రవేశాలు పొందారు. దీంతో ఈ పాఠశాలను కలెక్టర్ బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ప్రారంభించారు. లక్ష్మీపురం, పాయపూర్ పాఠశాలలను అధికారులు ప్రారంభించగా మూడు పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు రూ.10 లక్షల చెక్కు కలెక్టర్ అందజేశారు.



తరగతులు శుభ్రం చేస్తుంటే..

కమలాపూర్: విద్యాసంస్థలు గురువారం నుంచి తెరుచుకోనున్న నేపథ్యంలో హనుమకొండ జిల్లా కమలాపూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో కొండచిలువ కనిపించడం కలకలం రేపింది. పాఠశాలలు పునఃప్రారంభాన్ని పురస్కరించుకుని సిబ్బంది బుధవారం తరగతి గదులు, హాస్టల్ గదులు శుభ్రం చేస్తున్న తరుణంలో ఓ బాత్రూంలో భారీ కొండచిలువ కనిపించింది. దీంతో సిబ్బంది భయభ్రాంతులకు గురై కేజీబీవీ ఎస్వోతోపాటు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎఫ్ఆర్‌ఓ శిరీష, డిప్యూటీ ఆర్‌ఓ ప్రిసిల్ల ఆదేశాల మేరకు అటవీ శాఖ బీట్ ఆఫీసర్ అశోక్ తదితర సిబ్బంది కేజీబీవీకి చేరుకుని 8 అడుగుల భారీ కొండ చిలువను పట్టుకుని తీసుకెళ్లి అటవీ ప్రాంతంలో వదిలేశారు.



ఫస్ట్ డే.. ఎగ్ బిర్యానీ

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ ఘుమఘుమలాడింది. వేసవి సెలవులు ముగియగా, బుధవారం అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకున్నాయి. చిన్నారులను ఆకర్షించేందుకు ప్రారంభం రోజున మధ్యాహ్న భోజనంలో ఎగ్ బిర్యానీ వడ్డించారు. అమ్మమాట–అంగన్‌వాడీ బాట అంటూ.. బ్యానర్లు పట్టుకుని, ర్యాలీలు నిర్వహించి కేంద్రాల తాళాలను తెరిచి చిన్నారులను ఆహ్వానించారు. ఇకపై ప్రతీరోజు ఒకేరకమైన మెనూ కాకుండా, వేర్వేరు రకాల ఆహార పదార్థాలను వండి వడ్డించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ క్రమంలో మంచి పోషకాలున్న ఆహారాన్ని అందించడానికి మెనూ రూపకల్పనకోసం అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. మంచి ఆహారం అందించడం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో అడ్మిషన్లు, హాజరుశాతం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. బుధవారం సీతక్క ములుగు జిల్లా కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు.

బడి గంట మోగింది

నేటి నుంచి స్కూళ్లు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: కొత్త విద్యా సంవత్సరం మొదలవుతోంది. వేసవి సెలవుల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా గురువారం బడులు తెరుచుకోనున్నాయి. పల్లె, పట్నం తేడా లేకుండా అన్ని చోట్లా హడావుడి కనిపిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు బడులను అలంకరిస్తున్నారు. స్టేషనరీ, యూనిఫామ్ షాపులు, షూస్ అమ్మే దుకాణాలు కిక్కిరిసిపోతున్నాయి. ఆటోలు, బస్సులు విద్యార్థుల కోసం సిద్ధమవుతున్నాయి. అధికారుల్లోనూ హడావుడి మొదలైంది. వసతి గృహాలకు వెళ్లే విద్యార్థులు పెట్టేబేడాతో సన్నద్ధమవుతున్నారు. టీచర్లు తమ స్కూళ్లలో రిజిస్టర్లు, మౌలిక వసతులపై దృష్టి పెట్టారు. ఉన్నతాధికారులు వాట్సాప్ మెసేజీలతో ప్రభుత్వ టీచర్లను అప్రమత్తం చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 41,354 స్కూళ్లలో సందడి వాతావరణం కనిపించబోతోంది. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు కలిపి మొత్తం 62 లక్షల మంది విద్యార్థులు బడులకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. మరో పక్క వారం రోజుల్లో ప్రభుత్వ టీచర్ల సర్దుబాటు చేపడతామని అధికారులు అంటున్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి టీచర్లు ఉండేలా చేస్తామంటున్నారు. తక్కువ విద్యార్థులున్న చోట ఎక్కువ మంది టీచర్లు ఉంటే, వారిని టీచర్లు తక్కువగా ఉండి, విద్యార్థులు ఎక్కువగా ఉన్న స్కూళ్లకు పంపుతారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 3 వేల మందికిపైగా టీచర్లను సర్దుబాటు చేయాలని భావిస్తున్నారు.

సర్కారీ స్కూళ్ల సన్నాహాలు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను నడిపించాలన్నది విద్యాశాఖ లక్ష్యం. ఏడాదిగా దీనిపై కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా సాంకేతిక విద్యను కూడా అందించాలని నిర్ణయించారు. బోధనలో నాణ్యతా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు 60 వేల మంది టీచర్లకు శిక్షణ ఇచ్చారు. సరికొత్త బోధన మెళకువలను రిసోర్స్ పర్సన్స్ ద్వారా అందించామని విద్యాశాఖ ధీమాగా ఉంది. విద్యార్థులను ఆకట్టుకునే బోధన ప్రణాళికనూ రూపొందించామని చెబుతోంది. ఇప్పటికే విద్యా సంవత్సరం కేలండర్‌ను పాఠశాల విద్య డైరెక్టరేట్ వెల్లడించింది. ప్రతీ రోజు విద్యార్థులకు యోగా నేర్పించాలని సూచించింది. ఆటలు, పాటలు, సాంస్కృతిక హంగులు స్కూళ్లలో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసింది. పాఠశాలల్లో చిన్న చిన్న రిపేర్లు వేసవిలోనే పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు. అయితే కొన్ని చోట్ల మౌలిక వసతుల లోపం ఉందని జిల్లా విద్యాశాఖాధికారులు చెపుతున్నారు. స్కూళ్లు మొదలయ్యాక ఈ అంశంపై దృష్టి పెడతామని అంటున్నారు. ఇప్పటికే స్కూళ్లకు పుస్తకాలు, యూనిఫామ్‌లు చేరాయని, మొదటి రోజే వాటిని విద్యార్థులకు అందిస్తామని ఉన్నతాధికారులు తెలిపారు. కాగా, కొత్తగా చేరే విద్యార్థులకు కొంత ఆలస్యమయ్యే అవకాశముందని తెలిపారు. మరో పక్క ఈ నెలాఖరు వరకు బడిబాట నిర్వహిస్తారు. ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులు చేరేలా ఆకర్షిస్తారు.

ఏఐ పాఠాలు.. కంప్యూటర్ ల్యాబ్‌లు

పాఠశాల విద్యాస్థాయి నుంచే విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన కల్పించాలని అధికారులు నిర్ణయించారు. దీనికోసం 3,412 స్కూళ్లను ఎంపిక చేశారు. పలు సంస్థలతో విద్యాశాఖ అవగాహన ఒప్పందం కూడా చేసుకుంది. డిజిటల్ విద్యకు ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించారు. 604 మండలాల్లో కంప్యూటర్ ల్యాబొరేటరీలు ఏర్పాటు చేసినట్టు అధికారులు స్పష్టం చేశారు. డిజిటల్ విద్య, ఏఐ పాఠాలపై ఉపాధ్యాయులకు కూడా శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. వీటిపై గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధుల ద్వారా ప్రచారం కల్పించాలని, విద్యార్థులను ఆకర్షించాలని ప్రభుత్వం డీఈవోలకు సూచించింది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో బోధనలో నాణ్యతా ప్రమాణాలపై జాతీయ సర్వే సంస్థలు కొన్నేళ్లుగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక లెర్నింగ్ క్లాసులు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ప్రాథమిక విద్య స్థాయిలో తక్కువ ప్రమాణాలున్న వారిని గుర్తించి, శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ప్రభుత్వ–ప్రైవేటు స్కూళ్లు.. వాటిల్లో విద్యార్థుల సంఖ్య (2024-25 డేటా ప్రకారం)

యాజమాన్యం	బడులు		విద్యార్థులు	
	ప్రభుత్వ	ప్రైవేటు	ప్రభుత్వ	ప్రైవేటు
ప్రాథమిక పాఠశాలలు	20,000	547	7,39,433	63,283
ప్రాథమికోన్నత పాఠశాలలు	3,348	4,390	2,06,923	5,96,349
ఉన్నత పాఠశాలలు	6,789	6,280	15,67,079	30,42,182
మొత్తం	30,137	11,217	25,13,435	37,01,814

ప్రపంచ నైపుణ్య కేంద్రంగా తెలంగాణ

- సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో 10 వేల మందికి శిక్షణ
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి
- బ్రిటన్ సెమీ కండక్టర్ల సంస్థ ఆర్మ్ హోల్డింగ్ ప్రతినిధులతో భేటీ
- యువతకు శిక్షణ ఇచ్చేందుకు స్ప్రింగ్ సెమీ కండక్టర్స్ అంగీకారం



ఆర్మ్ హోల్డింగ్స్ ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్‌గా తెలంగాణను అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్న యూకేకు చెందిన సెమీ కండక్టర్ దిగ్గజ సంస్థ ఆర్మ్ హోల్డింగ్స్ ప్రతినిధులతో మంత్రి బుధవారం సచివాలయంలో భేటీ అయ్యారు. పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అనుకూలతలు, పారిశ్రామికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను వారికి వివరించారు. ఆర్మ్ హోల్డింగ్స్ సంస్థ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపించడం తమ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని, పరిశ్రమల ఏర్పాటులో అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పరిశ్రమలకు అవసరమైన రెడీమేడ్ మానవ వనరులను అందించే బాధ్యతను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ప్రభుత్వం తీసుకుందని వెల్లడించారు. 'సెమీ కండక్టర్ల డిజైనింగ్, తయారీలో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా తెలంగాణ యువతను తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. 10 వేల మంది యువత శిక్షణనిచ్చే బాధ్యతను తీసుకోవాలని ఈ సమావేశంలో పాల్గొన్న స్ప్రింగ్ సెమీ కండక్టర్స్ సీఈవో కెన్ కూను కోరారు.

అత్యాధునిక శిక్షణ ఇస్తాం: తెలంగాణను స్కిల్ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని కెన్ కూ ప్రశంసించారు. అందుకు తమ వంతుగా ఇక్కడి యువతను సెమీ కండక్టర్ల తయారీ, డిజైనింగ్‌లో అత్యుత్తమ శిక్షణ ఇచ్చేలా కరిక్యులమ్‌ను రూపొందిస్తామని తెలిపారు. విద్యా సంస్థల సహకారంతో ఆరు నెలలు ఇక్కడే శిక్షణ ఇచ్చి.. మిగిలిన కాలం తైవాన్, దక్షిణ కొరియా, జపాన్ తదితర దేశాల్లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. టీ కన్సల్ట్ సహకారంతో 2030 నాటికి 10 వేల మంది యువతకు శిక్షణ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీ కన్సల్ట్ చైర్మన్ సందీప్‌కుమార్ మక్తాల, వరల్డ్ తెలుగు ఐటీ కౌన్సిల్ మలేసియా విభాగం ప్రెసిడెంట్ మారుతి, మహేశ్ నటరాజ్, వాకిటి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలపై బీఆర్ఎస్ కుట్రలు: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటును అడ్డుకుంటూ, యువతకు ఉపాధి దొరకకుండా కుట్రలు చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించి, ప్రైవేటు రంగంలో లక్షన్నర ఉద్యోగాలు కల్పించామని బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పెట్టుబడులన్నీ కార్యరూపం దాలిస్తే తమకు రాజకీయ భవిష్యత్తు ఉండదని బీఆర్ఎస్ పార్టీ ఆందోళన చెందుతోందని ఎద్దేవా చేశారు. అరాచకం సృష్టించాలని చూస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.

సింగరేణి కార్మికులకు రూ. 1.25 కోట్ల ప్రమాద బీమా

పంజాబ్ నేషనల్ బ్యాంకుతో ఒప్పందం చరిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించిన సింగరేణి సీఎండీ



సాక్షి, హైదరాబాద్: సింగరేణి కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే... వారికి ప్రమాద బీమా కింద రూ.1.25 కోట్ల మేరకు లభించనున్నాయి. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం పంజాబ్ నేషనల్ బ్యాంకుతో బుధవారం ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచనల మేరకు ఈ ఒప్పందం చేసుకున్నట్లు సింగరేణి సీఎండీ బలరామ్ చెప్పారు. ఇదో చరిత్రాత్మక ఘట్టం అని అన్నారు. ఇప్పటికే అమలవుతున్న పథకాల వల్ల కార్మికుల కుటుంబాలకు గట్టి ఆర్థిక భరోసా లభించిందని తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ వారు కూడా మిగిలిన బ్యాంకులన్నింటికన్నా ఎక్కువగా రూ.కోటి 25 లక్షల బీమా పథకాన్ని అమలు చేయడానికి ముందుకు రావడం, సాధారణ మరణం సంభవించిన వారికి రూ.10 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్‌ను కూడా బ్యాంక్ అమలు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ ద్వారా సింగరేణి పౌర గుసేవల ఉద్యోగుల కోసం 40 లక్షల రూపాయల ప్రమాద బీమా ఒప్పందాన్ని కూడా అమలు చేస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ సీఈవో అండ్ ఎండీ అశోక్‌చంద్ర మాట్లాడుతూ సింగరేణి సంస్థతో తాము కుదుర్చుకున్న ఈ ఒప్పందం ఇతరులకు కూడా ఆదర్శప్రాయమన్నారు.

ఏకీకృత నిబంధనలతో పదోన్నతి

కేంద్ర విద్యామంత్రికి ఎమ్మెల్సీ కొమరయ్య విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ నిబంధనలను రూపొందించి, పదోన్నతులు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వానికి సూచించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కోరారు. ఈ మేరకు ఆయన మంత్రికి బుధవారం వినతిపత్రం సమర్పించారు. డీఎస్సీ 2003లో నియమించిన టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలని, కొత్త జిల్లాలకు జవహర్ నవోదయ పాఠశాలలను మంజూరు చేయాలని కోరారు.



నిద్ర, మృత్యువులారా, రండి! మీరు దేన్నీ వాగ్దానం చేయరు.
అయినా అన్నింటినీ మీలోకి తీసుకుంటారు.
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి

గురువారం, 12 జూన్ 2025

మస్క్ 'కాల్పుల విరమణ'!

అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచార సభల్లో డోనాల్డ్ ట్రంప్ వెనుకనో, పక్కనో అంతెత్తు గెంతుతూ... ఆయన అధ్యక్షుడయ్యాక తరచుగా వైట్ హౌస్‌కు సంతాన సమేతంగా వస్తూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన ఎలాన్ మస్క్ నాలుగు రోజులపాటు ట్రంప్‌తో బహిరంగ యుద్ధానికి దిగి, ఇంతలోనే బుధవారం నాడు దానికి శుభం కార్డు వేసి అందరినీ ఆశ్చర్యపరిచారు. తరచు ఒకటిగానే కనబడే రాజ్యశక్తి, ధనశక్తి నిజంగా కొట్లాటకు దిగితే చివరాఖరికి రాజ్యశక్తిదే పైచేయి అవుతుందని ఈ స్వల్పకాల ఉపాఖ్యానం నిరూపించింది. అధికారంలోకొచ్చినప్పటి నుంచీ ట్రంప్‌కు దాదాపు ప్రతిపక్షం లేదు. ఆయన పాలనపై ఓ కన్నేసి ఉంచాల్సిన అమెరికన్ కాంగ్రెస్ నిరాసక్తంగా ఉంది. వలస విధానం అంశంలో కోర్టులు కాదంటున్నా పంతం నెగ్గించుకుంటున్నారు. ఒకటి రెండు మినహా మిగిలిన విశ్వవిద్యాలయాలు ఆయనకు తలొంచాయి. మీడియా సరేసరి. పర్యవసానంగా ఆయన తలచుకున్నదే ధర్మం, ఆయన అమలుచేసేదే న్యాయం! మన పురాణాల్లో వైరభక్తి అనేది ఒకటుంది. శాపవశాత్తూ శ్రీమహావిష్ణువుకు దూరం కావాల్సివచ్చిన ద్వారపాలకులు జయవిజయులు... సత్వర శాపవిమోచనకు ఆయనతో మూడు జన్మల్లో వైరానికి దిగి, ఆయన చేతుల్లోనే హతమారి తిరిగి చేరువవుతారు. ట్రంప్–మస్క్ వైరం నిండా నెల్లాళ్లయినా కొనసాగలేదు.

ట్రంప్–మస్క్‌ల బంధం ఏడాది క్రితం వరకూ ఎవరూ ఊహించలేదు. మస్క్ తన దారిన తాను 'ఇన్నొవేషన్ గురు' అనిపించుకుంటూ ప్రయోగాలు చేశారు. భవిష్యత్తంతా ఎలక్ట్రిక్ కార్లదే అని నమ్మి ఖరీదైన టెస్లా కారును ఆవిష్కరించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆయన ట్విటర్‌ను కొన్నాడు. ఈ భూమికి భవిష్యత్తు లేదని, అంగారకుడిపై ఆవాసాలు నిర్మించుకోవటమే ప్రత్యామ్నాయమని అందరి చెవుల్లో హోరెత్తుతూ నిజమేనని భ్రమింపజేస్తున్నాడు. ఈలోగా హైపర్‌లూప్ రైళ్ల ఆలోచనను వదిలారు. ఇంతలో డెమాక్రటిక్ పార్టీ పెద్దలతో, ముఖ్యంగా మొన్న అధ్యక్ష ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కమలా హ్యారిస్‌తో తేడా వచ్చింది. తాను భారీగా విరాళాలిచ్చినా తన కొత్త సాంకేతికతలను నిర్లక్ష్యం చేశారని అలిగాడు. అంతే... ఉదారవాదానికి స్వస్తిపలికి నిరుడు మితవాది ట్రంప్‌కు చేరువయ్యాడు. ఆయన ప్రచార సభలకైన వ్యయంలో అత్యధిక వాటా మస్క్‌దే. దాదాపు 30 కోట్ల డాలర్ల విరాళం ఇవ్వటమే కాదు... వచ్చే ఏడాది నవంబర్‌లో 435 స్థానాలుండే ప్రతినిధుల సభకు జరగబోయే ఎన్నికలకు 10 కోట్ల డాలర్లు ఇవ్వటానికి వాగ్దానం చేశాడు.

ట్రంప్–మస్క్‌ల మైత్రి ఉభయతారకమైనది. ట్రంప్‌కు సొంతంగా ఉన్న సామాజిక మాధ్యమం ట్రూత్, మస్క్ నేతృత్వంలోని ఎక్స్ ఒక్కటై అమెరికా ప్రజానీకాన్ని తమ దారికి మళ్లించుకోవటంలో కృతకృత్యులయ్యారు. డెమాక్రటిక్ పార్టీ ప్రచార లోపాలు కూడా తోడవటంతో అవలీలగా ట్రంప్ విజయం సాధించారు. అధికారంలోకొచ్చాక ప్రభుత్వోద్యోగులను సాగనంపే డోజ్‌లో కీలకపాత్ర పోషించాలని మస్క్ ఉబలాటపడినా అది కాస్తా వివేక్ రామస్వామికి పోయింది. 'ఉరితీతలు కాదు... ఊచకోతలే' అంటూ భారీయెత్తున సిబ్బందిని కత్తిరిస్తానని చెప్పిన మస్క్‌కు అది నిరాశ కలిగించినా, త్వరలోనే వివేక్ నిష్క్రమించేలా చేయగలిగారు. తనకు సన్నిహితుడైన జేర్డ్ ఐజాక్‌మాన్‌కు అంతరిక్ష సంస్థ నాసా బాధ్యతలు అప్పగించాలన్నది మస్క్ ఆకాంక్ష. అదే జరిగితే సొంత సంస్థ స్పేస్ ఎక్స్‌కు నాసాను తాకట్టుపెడతాడన్న భయం ట్రంప్‌కు లోలోన ఉంది. ఈ సంగతి అర్థమైన నాటినుంచీ మస్క్ రగిలిపోయారు. పర్యవసానంగా ట్రంప్ అత్యద్భుతమని ప్రకటించిన పన్ను కోతల బిల్లును ఆయన తప్పుబట్టారు. ఒకపక్క తాను ప్రభుత్వ సిబ్బందిని సాగనంపి ఖజానా కళకళల్లాడేలా చేస్తుంటే, ప్రభుత్వ రుణభారాన్ని మరో 3 లక్షల కోట్ల డాలర్లకు పెంచే పన్నుల తగ్గింపేమిటన్నది మస్క్ ప్రశ్న. తన కాంట్రాక్టు ముగిశాక మొదటగా ఆయన దీన్నే ఎత్తుకున్నారు. తనతో ఇన్నాళ్లూ కలిసిమెలిసి తిరిగి, మొదటినుంచీ ఈ బిల్లుపై అవగాహన ఉన్న మస్క్ ఇలా విమర్శించే సరికి ట్రంప్ ఆగ్రహం పట్టలేకపోయారు.

ఆ తర్వాత జరిగిందంతా బహిరంగ యుద్ధం! వచ్చేసారి ఎన్నికల్లో డెమాక్రాట్లకు ఆర్థిక సాయం అందిస్తానన్న బెదిరింపు మొదలుకొని బాలలపై లైంగిక నేరాలకు పాల్పడిన జెఫ్రీ ఎపిస్టిన్‌తో ట్రంప్‌కు గల సంబంధాలు బయటపెడతాననేవరకూ మస్క్ మాటలు జారారు. ప్రతిగా స్పేస్ ఎక్స్ కాంట్రాక్టులు రద్దుచేస్తానని, ఇవ్వబోయే కాంట్రాక్టులు జెఫ్ బెజోస్ నేతృత్వంలోని బ్లూ ఆరిజన్‌కూ, బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ ఉమ్మడి భాగస్వామ్య సంస్థ యునైటెడ్ లాంచ్ అలయెన్స్‌కూ కట్టబెడతానని ట్రంప్ బెదిరించారు. డెమాక్రాట్లకు విరాళమిస్తే పర్యవసానాలెలా ఉంటాయో చూపిస్తానని హెచ్చరించారు. తీరిగ్గా లెక్కలేసుకున్నాక ఈ కయ్యం వల్ల కలిసొచ్చేదేమీ లేదని మస్క్ గ్రహించినట్టున్నారు. 'కాల్పుల విరమణ' ప్రకటించటంతోపాటు 'సారీ' చెప్పారు.

ఏడాది నుంచి అవిభక్త కవలల్లా ఎక్కడికెళ్లినా జంటగా పోతూ, మస్క్‌ను 'సహ అధ్యక్షుడు' అని అందరూ వేళాకోళం చేసేలా వ్యవహరించిన వీరిద్దరూ మునుపటి మాదిరే మళ్లీ సన్నిహితులవుతారా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. హృదయం అద్దం లాంటిది, పగిలితే అతకదంటారు. కనుక చెలిమి చిగురించినా మునుపటి స్థాయిలో ఉండకపోవచ్చు. కానీ ఈ ఉపాఖ్యానంలో ప్రపంచ ప్రజానీకం నేర్చుకోవాల్సిన గుణపాఠం ఒకటుంది. వ్యక్తులైనా, పార్టీలైనా పరస్పరం లాభదాయకం, పంపకాలు బాగుంటాయనుకుంటే కూటములు కడతారు తప్ప, తమను ఉద్ధరించటం కోసం కాదని వారు గ్రహించాలి.

ఈ అశక్తతలు దేనికి చిహ్నం?

విశ్లేషణ



టంకశాల అశోక్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నుంచి వరుసగా కనిపిస్తున్న అశక్తతలు దేనికి చిహ్నం? ఆయన జనవరి 20న పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఈ 140 రోజులలో ప్రకటించిన విధానాలను, తీసుకున్న చర్యలను, వాటి పర్యవసానాలను పరిశీలించినప్పుడు, వాటిలో దాదాపు అన్నింటా తన అశక్తతలే కనిపిస్తాయి. మరొక మాటలో వైఫల్యాలు. అయితే ఆ అశక్తతలు, వైఫల్యాలు వ్యక్తిగతంగా ట్రంప్‌కు పరిమితమైనవా, లేక అమెరికా మహా సామ్రాజ్యమే క్రమంగా బలహీనపడుతున్న స్థితికి సంకేతాలా అన్నది ఆలోచించవలసిన విషయం. ఒకవేళ ట్రంప్‌కు పరిమితమైన స్థితి అయితే ఇంకా మిగిలిన మూడున్నర సంవత్సరాల కాలంలో ఆయన అందుకు సవరణలు చేసుకోగల అవకాశం ఉంటుంది. అవి ఆ వ్యవస్థకే మౌలిక బలహీనతలు అయ్యే పక్షంలో సవరణలు తన కాలంలో సాధ్యపడకపోగా, ఆ తర్వాత రాగల అధ్యక్షులకు కూడా అతి పెద్ద పరీక్షలు ఎదురవుతాయి.

తగిన భావజాలం ఏది?

విధానాలు, చర్యలలో అంతర్గతం, విదేశీయం అని రెండు ఉంటాయి. ఎప్పుడైనా విదేశాంగ విధానాలు అంతర్గత ప్రయోజనాల కోసమేనన్నది తెలిసిందే. ఆ విధంగా చూసినపుడు ట్రంప్ విధానాలకు ఆధారమైనవి 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' (మాగా), 'అమెరికా ఫస్ట్' నినాదాలు. వీటిలో ప్రతిఫలించే ఆలోచన అమెరికా తన ఒకప్పటి గొప్పతనాన్ని కోల్పోయిందని! అందుకు బాధ్యత డెమోక్రాట్ల పరిపాలన అని! అమెరికా విధానాల వల్ల అమెరికన్ ధనిక వర్గాలు, ఇతర దేశాలు విపరీతంగా లాభపడుతుండగా సామాన్యులు నష్టపోతూ అమెరికా వెనుకబడుతున్నదనీ; సామాన్యులు, అలాగే తమ దేశం బాగుపడే విధానాల వల్లనే తిరిగి 'అమెరికా ఫస్ట్' కాగలదన్నది ఆయన తర్కం.

ఇది యథాతథంగా సహేతుకమైన, ఆహ్వానించదగిన తర్కంగానే కనిపిస్తుంది. కానీ మొదటి నుంచి డెమోక్రాట్లతో పాటు రిపబ్లికన్లు కూడా అనుసరిస్తూ వచ్చిన పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద విధానాలను, వాటి ఆధారంగా నిర్మితమైన వ్యవస్థను రద్దు చేయటం కాకున్నా ఒక మేర సవరించాలన్నా మామూలు విషయం కాదు. రద్దు చేయాలన్నది ట్రంప్ ఆలోచన ఎంతమాత్రం కాదు. అంతర్గతంగా, విదేశీయంగా కొన్ని మార్పులు చేయాలని మాత్రం అనుకున్నట్లు ఆయన మాటలు, చేతలు సూచించాయి. ఆ కొద్దిపాటి మార్పులకైనా తగిన ఫిలసాఫికల్ ఫ్రేమ్ వర్క్ ఉండాలి. కానీ ట్రంప్ ప్రధానంగా ఉద్వేగాల వ్యక్తి. ఉద్వేగతలకు లోటు ఉండదు, చంచలత ఉంటుంది.

అమెరికా మహా సామ్రాజ్యపు శక్తి ఆర్థికంగా, రాజకీయంగా బలహీనపడటం ఈ 21వ శతాబ్దపు ఆరంభం నుంచే నెమ్మదిగా మొదలై, 2008 నాటి ఆర్థిక సంక్షోభంతో వేగం అందుకున్నది. అమెరికా 'గ్రేట్‌నెస్' పోవటమని ట్రంప్ అన్నదానికి ఆరంభాలు అప్పటి దశాబ్దం నుంచే కనిపిస్తాయి. అమెరికా బలాలు నాలుగింటిలో ఆర్థికం, రాజకీయం రెండు గాక, సైనికం, శాస్త్ర – సాంకేతికం మరొక రెండు. ఈ చివరి రెండింటిలో అమెరికా శక్తి ఆర్థిక, రాజకీయాలవలె తగ్గలేదు గానీ, ఆ రెండు రంగాలలో ఇతరుల నుంచి



పోటీలు పెరగసాగాయి. అనగా అమెరికాకు అవి పరోక్ష బలహీనతలన్నమాట.

దెబ్బకొట్టిన నిర్ణయాలు

ట్రంప్ తమ దేశాన్ని మళ్లీ 'గొప్పది' చేయదలచుకుంటే, ఈ నాలుగు బలహీనతలను ఆపటం ఏ విధంగాననే సమగ్రమైన ప్రణాళిక ఉండాలి. ఒకవేళ ఉన్నా కొన్ని మౌలికమైన ప్రశ్నలు ఎదురవుతాయి. వాటిలో మొదటిది–చరిత్రలో ఏ సామ్రాజ్యాలూ శాశ్వతంగా నిలవనపుడు అమెరికా అందుకు భిన్నం కాగలదా అన్నది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు, పార్టీలకు, ప్రభుత్వాలకు స్వీయ ప్రయోజనాల స్పృహలు పెరుగుతూ, ఎవరి దారులు వారు వెతుక్కుంటూ, వాటిలో కొన్ని గణనీయంగా అభివృద్ధి చెందుతూ, అమెరికా, యూరప్‌ల పట్ల గత విధేయతలు బలహీనపడుతూ, బహుళ ధ్రువ ప్రపంచం క్రమంగా ఆవిష్కారమవుతున్నపుడు, అమెరికాకు గానీ, అమెరికన్ కూటమికి గానీ ఒకప్పటి 'గొప్పతనం' తిరిగి ఎట్లా సాధ్యమన్నది మరొక ప్రశ్న. అంతెందుకు, ట్రంప్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో తాము అధికారానికి వచ్చిన కొత్తలోనే, 'ఏకధ్రువ ప్రపంచమన్నది గతించిన విషయ'మన్నారు.

ఈ విధమైన బలహీనతలు అర్థమవుతూ, అదే సమయంలో అమెరికాను కనీసం ఉన్న స్థాయిలో నిలబెట్టాలని, అట్లాగే అక్కడి సామాన్య ప్రజలకు మేలు చేసే విధంగా రూపొందించాలని కొత్త అధ్యక్షుడు భావించితే, అందులో ప్రశంసించదగినదే తప్ప కొట్టివేయవలసింది ఉండదు. ఆ విధంగా ఆయన ఒక వాస్తవవాది అనుకోవాలి. అందుకు తగిన ఆచరణ ఏమిటన్నది అసలు ప్రశ్న.

దిగుమతి సుంకాలను అన్ని దేశాలపై పెంచితే ఆదాయం భారీగా పెరిగి వాణిజ్య లోటు, ద్రవ్యలోటు, అప్పులు తగ్గుతాయనీ, ఆ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చుననీ భావించారు. అందుకు తోడుగా అనేక రూపాలలో వ్యయ నియంత్రణ చేయబూనారు. ఉద్యోగాల కోత, విదేశీ సహాయాల ఆపివేత వంటివి అందులో ఉన్నాయి. వీటన్నింటిలో ముఖ్యమైన సుంకాల హెచ్చింపు వెంటనే గందరగోళంలో పడింది. ఉద్యోగాల కోత తీవ్రమైన వ్యతిరేకతను తెచ్చిపెట్టింది. స్టాక్ మార్కెట్లు వరుసగా దెబ్బతినగా,

- అశక్తతలు, వైఫల్యాలు వ్యక్తిగతంగా ట్రంప్‌కు పరిమితమైనవా, లేక అమెరికా మహాసామ్రాజ్యమే క్రమంగా బలహీనపడుతున్న స్థితికి సంకేతాలా అన్నది ఆలోచించవలసిన విషయం.
- ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపి వేసేందుకు నిజంగానే ప్రయత్నించినా అది ఆగకపోగా తీవ్రమవుతున్నది. దానితో ట్రంప్ చేతులెత్తేశారు.
- అమెరికా, యూరప్‌ల పట్ల గత విధేయతలు బలహీనపడుతూ, బహుళ ధ్రువ ప్రపంచం క్రమంగా ఆవిష్కారమవుతున్నపుడు, అమెరికాకు ఒకప్పటి 'గొప్పతనం' తిరిగి ఎట్లా సాధ్యమన్నది మరొక ప్రశ్న.

బాండ్ల మార్కెట్ ఎదురుతిరిగి, డాలర్ విలువ పడిపోవటం మొదలైంది. అమెరికా ప్రజలకు, పరిశ్రమలకు అవసరమైన వాటిపై ఇతర దేశాలు ఎదురు సుంకాలు విధించటంతో ధరలు పెరగసాగాయి. ఈ పరిణామాలతో జంకిన ప్రభుత్వం సుంకాల వాయిదాలు, తగ్గింపులు, చర్చల మార్గానికి మళ్లింది. ఇదే ఇప్పటికీ కొనసాగుతున్నది. ఉద్యోగాల కోత, అక్రమ వలసదారులను భయపెట్టి వేలకు వేలుగా పంపివేయటం వల్ల ఉత్పత్తి, సర్వీస్ రంగాలు దెబ్బతినటం వెంటనే కనిపించింది. అది గ్రహించి యజమానులకు కొన్ని వెసులుబాట్లు ఇవ్వబూనినా ఉపయోగం లేకపోయింది.

ఉక్రెయిన్ వైఫల్యం

ఆ విధంగా కొన్ని వారాలు గడిచేసరికి ఆ గందరగోళం స్వదేశంలో, విదేశాలలో కూడా అందరికీ అర్థమై ట్రంప్ పట్ల గౌరవం, భయం తగ్గాయి. పరిపాలనా వ్యవహారణలు అస్తవ్యస్తంగా మారటంతో సన్నిహిత సలహాదారులను తొలగించటం కూడా మొదలైంది. ఎలాన్ మస్క్ ఉదంతం తాజా ఉదాహరణ. రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ పేరు కొత్తగా వినవస్తున్నది. యూనివర్సిటీలు, విద్యాశాఖ, పరిశోధనా సంస్థలు, ఆరోగ్య రంగాలను వేధిస్తూ అమెరికాను తిరిగి గొప్పదిగా ఎట్లా చేయగలరన్నది ఎవరికీ అంతుబట్టడం లేదు.

ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపి వేసేందుకు నిజంగానే ప్రయత్నించినా అది ఆగకపోగా తీవ్రమవుతున్నది. దానితో ఆయన చేతులెత్తేశారు. గాజా పట్ల గందరగోళం. నెతన్యాహూ తనను ఏ విషయంలోనూ లెక్క చేయటం లేదు. ఉక్రెయిన్, యూరప్ తమ దారి తాము చూసుకుంటున్నాయి. ఇరాన్ లొంగి రావటం లేదు. సిరియా, లెబనాన్‌పై దాడుల నిలిపివేతకు నెతన్యాహూ అంగీకరించటం లేదు. చైనాతో పాటు 'బ్రిక్స్' దేశాలు ట్రంప్ ఎంత భయపెట్టినా తమ కూటమిని మరింతగా విస్తరిస్తూ, డాలర్‌కు బదులు తమ స్థానిక కరెన్సీలలో చెల్లింపులను పెంచుతూనే ఉన్నాయి. మౌలిక స్థాయిలో, విస్తృత స్థాయిలో ఈ అమెరికన్ సామ్రాజ్యవాద బలహీనతలు ట్రంప్ ధోరణి వల్ల మరింత పెరుగుతున్నాయి. తన అశక్తతలు ఈ మౌలిక స్థితికి చిహ్నాలవుతున్నాయి.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

చైనా బలం



చైనా మొదటిసారి పసిఫిక్‌లోకి రెండు ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్లను పంపింది. తన స్వీయ జలాలను దాటి జపాన్ అవతలి దాకా యుద్ధనౌకలను పంపడం ద్వారా చైనా నౌకాదళం తన సముద్ర, వాయు శక్తిని ప్రదర్శిస్తోంది. ఇండో–పసిఫిక్‌లో ఇది నూతన సాధారణ స్థితి.
– వెలీనా త్చకరోవా, జియో పొలిటికల్ స్ట్రాటెజిస్ట్

మనకో న్యాయమా?



న్యూయార్క్‌లోని యూదుల కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకున్నాడన్న ఆరోపణల మీద కెనడాలోని ఒక పాకిస్తానీ జాతీయుడిని అమెరికాకు అప్పగించారు. మరి 1993 ముంబయి దాడుల్లో పాత్ర ఉండి, పాక్‌లో స్వేచ్ఛగా సంచరిస్తున్న దావూద్ ఇబ్రహీంను ఇండియాకు అప్పగించాలని యూఎస్ ఎప్పుడు ఒత్తిడి చేస్తుంది?
– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఏదీ ఆత్మనిర్భరత?



అరుదైన భూ ఖనిజ నిల్వలు అత్యధికంగా (69 లక్షల టన్నులు) ఉన్న దేశాల్లో ఇండియా మూడో స్థానంలో ఉందని యూఎస్ జియొలాజికల్ సర్వే చెబుతోంది. వీటిని వెలికితీయడం నిజమైన ఆత్మనిర్భరత అయ్యేది. కానీ చైనా తన నిల్వల సరఫరాను నియంత్రించేవరకూ ఈ పదకొండేళ్లుగా మోదీ కేవలం స్లోగన్లు ఇస్తున్నారు.
– ఎం.కె. వేణు, సంపాదకుడు

సగం వడ్డీలకే...



పాకిస్తాన్ తన రక్షణ బడ్జెట్‌ను 20 శాతం పెంచి 9 బిలియన్ డాలర్లు చేసింది. తన 62 బిలియన్ డాలర్ల బడ్జెట్‌లో సుమారు 47 శాతం వడ్డీలకే పోతుంది. చైనా దాని అతి పెద్ద రుణదాత.
– యూసుఫ్ ఉంఝావాలా, వ్యాఖ్యాత

మీతో పోలికా?



62 బిలియన్ డాలర్ల పాకిస్తాన్ బడ్జెట్‌లో 46.9 శాతం వడ్డీలకే పోతుంది. మరోవైపు ఇండియా బడ్జెట్ 600 బిలియన్ డాలర్లు. పాక్‌కన్నా పదింతలు. అయినా వాళ్లు మనతో వాళ్లను పోల్చుకుంటారు!
– మనీష్ తివారీ, ఎంపీ; కేంద్ర మాజీ మంత్రి

ఇన్ బాక్స్

జాబ్ క్యాలెండర్ ఇంకెప్పుడు?

ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. నీళ్లు, నిధుల కోసం నాయకులు కొట్లాడితే... కొలువులే కొలమానంగా కొట్లాడింది విద్యార్థులే. తెలంగాణ వస్తే కోరుకున్న కొలువు వస్తదనీ, గొప్పగా బతుకుతామనీ విద్యార్థులు తమ జీవితాలను లెక్క చేయకుండా, ప్రాణాలను సైతం పణంగా పెట్టారు. ఆ త్యాగాల పునాదులపై స్వరాష్ట్రం పురుడుపోసుకున్నది. కానీ ఈ పదేండ్లలో సొంత రాష్ట్రంలో నిరుద్యోగులు సంతోషంగా ఉన్నారా? అంటే కాదనే చెప్పాలి?

'స్వరాష్ట్రం వస్తే ప్రతి ఇంటికీ ఉద్యోగం' అన్నవారే ప్రభుత్వాన్ని నడుపుతున్నప్పుడు... ఆశగా నిరుద్యోగులు ఎదురు చూశారు. కానీ వారి ఉద్యోగం కల కల్ల అయ్యింది. ఉద్యమం సందర్భంగా జేఏసీ చెప్పిన 2.5 లక్షల ఉద్యోగాలూ, రెండేండ్ల కిందట బిశ్వాల్ కమిటీ తేల్చిన 2 లక్షల ఉద్యోగాలూ ఏమైపోయాయో? కళ్ళ ముందు చూస్తుండగానే సొంత రాష్ట్రంలో ఒక తరం విద్యార్థుల బంగారు భవిష్యత్తు నాశనమైపోయింది.



రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పదే పదే ఇది నిరుద్యోగుల ప్రభుత్వం అనీ, నిరుద్యోగుల పోరాట ఫలితంగానే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందనీ చెప్పడంతో ఇగ కాంగ్రెస్ ప్రభుత్వంలో కొలువుల పండగే అని అనుకున్నాం. కానీ అస్సలు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఉద్యోగాలు ఇస్తుందో ఇవ్వదో అనే అయోమయంతో తీవ్ర మనోవేదనకు గురి అవుతున్నారు నిరుద్యోగులు. గత ప్రభుత్వాన్ని కూల్చింది నిరుద్యోగులే అన్న సంగతి సీఎం గుర్తించాలి. ఆ మధ్య జరిగిన కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలో నిరుద్యోగులు తమ నిర్ణయం ఏంటో చెప్పేశారు.

'సంవత్సరం తిరిగేలోగా 2 లక్షల ఉద్యోగాలు, ప్రతి ఏటా జాబ్ క్యాలెండరు – ఇది నా గ్యారంటీ' అని స్వయంగా రాహుల్ గాంధీ నిరుద్యోగుల అడ్డా అశోక్ నగర్ వచ్చి స్పష్టంగా హామీ ఇచ్చారు. కానీ 'ప్రజా ప్రభుత్వం' అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా కేవలం 6 వేల ఉద్యోగాలు ఇచ్చింది. కానీ 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకుంటోంది.

ఇది సరికాదు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే ప్రకటించాలి. అలాగే నిరుద్యోగ భృతి రూ. 4,000 ఇవ్వాలి. ప్రతి నియోజకవర్గంలో అంబేద్కర్ నాలెడ్జి సెంటర్ ఏర్పాటు చేయాలి. నిరుద్యోగమే లేని తెలంగాణ కోసం ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి. ప్రతి మండలంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వాలి. ప్రైవేటు ఉద్యోగాలలోనూ 95% ఉద్యోగాలు తెలంగాణ బిడ్డలకు దక్కినప్పుడే అమరవీరులు కన్న కలలు సాకారం అవుతాయి.

– శ్రవణ్ కుమార్, నిరుద్యోగి

బాధ్యత నుంచి తప్పించుకోవడానికే...

టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్) కార్యక్రమం కోసం విస్తృత ప్రచారం జరుగుతోంది. 'పీ4' ద్వారా ఆర్థికంగా స్థిరంగా ఉన్న వారిని 'మార్గదర్శులు'గానూ, వీరు దత్తత తీసుకునే పేద కుటుంబాలను 'బంగారు కుటుంబాలు' గానూ పేర్కొన్నారు. ఈ మార్గదర్శులు తమ ఖర్చుతో బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారి సామాజిక, ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించి నూరు శాతం పేదరిక నిర్మూలన (జీరో పావర్టీ) సాధించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యం. కానీ దీని వెనక దాగి ఉన్న నిజం వింటే ప్రభుత్వ పెద్దల దుర్బుద్ధి ఇట్టే తేటతెల్లమవుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో 1.48 కోట్ల తెల్ల రేషన్ కార్డుదారులు ఉన్నారు. పీ4 ప్రాజెక్టు కింద కేవలం 19.15 లక్షల కుటుంబాలను మాత్రమే 'పేదలు'గా గుర్తించారు. అంటే 87 శాతం మంది అల్పాదాయ వర్గం (బీపీఎల్) పరిధిలోని కుటుంబాలు ఈ దీని పరిధిలోకి రాలేదన్నమాట. నమోదైన వారిలో సైతం మార్గదర్శకులు దత్తత తీసుకున్న బంగారు కుటుంబాలు కేవలం 62,970. అంటే మొత్తం పేదల్లో కేవలం ఒక శాతం కన్నా తక్కువే. వీరికి అండగా నిలిచేందుకు గుర్తించిన మార్గదర్శుల సంఖ్య కేవలం 5325 మంది ఉన్నారు. ఈ సంఖ్యలు చూస్తే... 'పీ4' ద్వారా పేదల్లో ఎంత శాతం మందికి మేలు చేకూరుతుందో, వారి జీవన ప్రమాణాలు ఏ స్థాయిలో మెరుగుపడతాయో చెప్పొచ్చు.



కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) ద్వారా కంపెనీలు, సంస్థలు ఏటా నిర్వహించే దాతృత్వ కార్యకలాపాలను ఇక నుండి పీ4లో మార్గదర్శుల ఖాతాలో చూపించబోతున్నారు. వాస్తవానికి, కంపెనీల చట్టం 2013 ప్రకారం కంపెనీల స్థాయిని బట్టి తమ లాభాల్లో 2 శాతం సీఎస్ఆర్ కార్యకలాపాల కోసం ఉపయోగించుకోవాలి. ముఖ్యంగా ఆరోగ్యం, విద్య, పర్యావరణం, నైపుణ్య అభివృద్ధి వంటి రంగాల్లో పేదల అభ్యున్నతి కోసం ఖర్చు చేయాలి. ఇలా ఏటా వేల కోట్లు కంపెనీలు ఖర్చు చేస్తున్నాయి. ఇప్పుడు అదే పనిని పీ4 కింద చేర్చి ఆ క్రెడిట్ తమ ఖాతాలో వేసుకోవాలన్నది ప్రభుత్వ ఆలోచన. సాధారణంగా పేదల ఆరోగ్యం, విద్య, వైద్యం, నైపుణ్య అభివృద్ధి, ఇతర సంక్షేమ అవసరాలు చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ఈ బాధ్యత నుంచి తప్పించుకుంటూ పీ4 పేరిట కార్పొరేట్ సంస్థలు, వ్యక్తులకు దీన్ని ప్రభుత్వం అప్పగించాలని చూడడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. పేదలకు ఆర్థిక చేయూత నిచ్చే సంక్షేమ కార్యక్రమాలకు మంగళం పాడే కుట్రలో భాగమే ఇదని చెప్పొచ్చు.

ఈ పీ4 కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం – పేదలకు ధనవంతులు సహాయం చేయటం! కానీ చంద్రబాబు నాయుడు అమలు చేసిన ప్రైవేటీకరణ విధానాల ఫలితంగా ప్రయోజనం పొందిన పెట్టుబడిదారులను 'మార్గదర్శులు' అని పిలవడం సరికాదు. సూపర్–6 వాగ్దానాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి ప్రభుత్వ పెద్దలు పీ4ను తెరపైకి తెచ్చినట్లుంది. వైఎస్సార్ వంటి మహానేతలు ప్రారంభించిన ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో పాటు ఇటీవల వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన 'నవరత్నాలు' ప్రజల అవసరాలను నేరుగా తీరుస్తూ సంక్షేమాన్ని వారి కళ్ల ముందు నిలిపాయి. కానీ నేటి ప్రభుత్వానికి సంక్షేమ స్పృహ కనిపించడం లేదనే అభిప్రాయం ప్రజల్లో బలంగా వినిపిస్తోంది. ఏదైనా పథకాన్ని ప్రభుత్వ భాగస్వామ్యంతో నడిపితే సత్ఫలితాలుంటాయి. అది జరగనప్పుడు రాష్ట్రాభివృద్ధి తిరోగమిస్తుంది. పీ4 అనేది ప్రభుత్వ భాగస్వామ్యంతో నడిచే కార్యక్రమం కానే కాదనేది గమనార్హం.

ఇటువంటి కార్యక్రమాల అమలును స్వతంత్ర ట్రస్ట్‌ల ద్వారా, పారదర్శక ఆడిటింగ్‌తో, ప్రభుత్వ భాగస్వామ్యంతో పర్యవేక్షిస్తేనే విశ్వసనీయత పెరుగు తుంది. లేదంటే, ఇది కూడా ఓ 'సూపర్–6' నినాదంలాగా మిగిలి పోతుంది. పేదల ఆత్మాభిమానాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెట్టడం దీనిలో కనిపిస్తోంది. తాము సహాయం చేస్తున్నాం కాబట్టి ఎన్నికల సమయంలో తాము చెప్పిన రాజకీయ పక్షాలకే ఓటువేయాలని కార్పొరేట్ సంస్థలు పేదలపై ఒత్తిడి తేవచ్చు. అదే జరిగితే ప్రజాస్వామ్యం మంట గలిసిపోతుంది. కార్పొరేట్లు ఎవరిని తలచుకుంటే వారినే అధికారంలో కూర్చోబెట్టగలుగుతారు. ఎటూ ఈ కార్యక్రమాన్ని తామే ప్రవేశపెట్టాం కనుక పేదప్రజలను తమ ఓటుబ్యాంకుగా కార్పొరేట్లు మారుస్తారని ప్రస్తుత ప్రభుత్వాధినేత ఆలోచన. ఇదే పీ4 వెనుక ఉన్న అసలు రహస్యం!

– తలకోల రాహుల్ రెడ్డి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎనలిస్ట్

విలువ చేతలకే!

మాట్లాడే మాటలకు దీటుగా చేతలలో కార్యాన్ని సాధించే వ్యక్తికి విలువ ఉంటుంది. సాధించవలసిన కార్యాన్ని గురించి వ్యర్థ ప్రలాపాలు పలికే వ్యక్తిని ఉత్తర కుమారుడి కింద జమకట్టి హేళనగా మాట్లాడుకోవడం జరుగుతుంది. పన్నెండేండ్ల అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం నియమం పూర్తయిపోయి, విరాటరాజు కుమార్తె అయిన ఉత్తరను అర్జునుడి కుమారుడైన అభిమన్యుడికి ఇచ్చి వివాహం జరిపించిన అనంతరం, పాండవులు తమకు న్యాయంగా దక్కవలసిన రాజ్యభాగం తమకు తిరిగి అప్పగించాలని కోరుతూ, ద్రుపదుడి సలహాపై, మొదట ఒక విప్రుడిని రాయబారిగా దుర్యోధనుడి వద్దకు పంపారు. దుర్యోధనుడి కొలువులో ఆ రాయబారి మాటలకు కర్ణుడు మధ్యలో కల్పించుకుని ఇచ్చిన సమాధానంలో అనవసరమైన బీరాలు పోగా, కర్ణుడి ఆ వ్యర్థ ప్రలాపాలను గట్టిగా నిరసిస్తూ, ఆ మాటలు వాస్తవానికి ఎంత దూరంగా ఉన్నాయో అర్థమయ్యేలా చెప్పాడు భీష్ముడు ఆంధ్ర మహాభారతంలో.

జ్యోతిర్మయం

చం. చిక్కని పోటుమానిసి విసీ! వినువారలు నవ్వ నేమిగా
నెక్కుడు మాటలాడెద? వహీన పరాక్రమశాలి యర్జునుం
డొక్కడ యార్వురన్ మనల నుగ్రరణంబున గెల్చె నిన్న; నే
డిక్కడ బల్కులన్ గెలిచె దీ వతనిన్ మనరాజు కొల్వునన్.

తెలుగులో ఇప్పటికీ సామాన్య జనుల మాటలలో వినబడే కొన్ని జాతీయాలు ఆంధ్ర మహాభారతం రచనా కాలం నుంచీ ప్రయుక్తమౌతూ వస్తున్నాయని చెప్పేందుకు ఉదాహరణలుగా నిలిచే పద్యాలలో ఇది ఒకటి. 'ఓయబ్బ, మహా పోటుగాడివి లేవోయ్!' అని హేళనగా ఇప్పటికీ జనసామాన్యంలో వినపడే మాటలను భీష్ముడి నోటి వెంట వెలువడినవిగా చూపించాడు తిక్కన పై పద్యం ఆరంభంలోనే 'చిక్కని పోటుమానిసి విసీ!' అనే మాటల ద్వారా. 'వినేవాళ్ళు నవ్వేట్లుగా ఏమి మాట్లాడుతున్నావు? అసమాన పరాక్రమశాలియైన అర్జునుడు ఒక్కడే నిన్న ఉత్తర గోగ్రహణం సందర్భంలో జరిగిన భీకరమైన యుద్ధంలో, నన్ను, ద్రోణుడిని, కృపాచార్యుడిని, నిన్ను, అశ్వత్థామను, దుర్యోధనుడిని... మనలను ఆరుగురినీ ఊపిరాడకుండా చేసి గెలిచాడు. ఆ భంగపాటు ఇంకా మరపునకు రాలేదు. మనసులోంచి తొలిగిపోలేదు. ఇంతలోనే నీవు ఇక్కడ మన రాజు కొలువులో సుఖంగా కూర్చుని నీ మాటలతో అర్జునుడిని గెలుస్తున్నావు!' అని కర్ణుడిని ఎగతాళి చేశాడు భీష్ముడు. చేతలలో కనిపించని మాటల శౌర్యం హేళన పాలవుతుంది.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.1.33 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** మూల రా.9.39 వరకు, తదుపరి పూర్వాషాఢ, **వర్జ్యం:** రా.7.57 నుండి 9.39 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.51 నుండి 10.43 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** ప.2.41 నుండి 4.22 వరకు; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.30.

టీజీఏఎన్‌బీ-'మా' సహకారంతో 'ఆపరేషన్ సంకల్ప్'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను డ్రగ్స్‌రహిత రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సహకారంతో 'ఆపరేషన్ సంకల్ప్' అధికారికంగా ప్రారంభించారు. ఇది తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్, సివిల్ ఫోర్స్ ట్రస్ట్ భాగస్వామ్యంతో చేపట్టిన వినూత్న కార్యక్రమమని టీజీఏఎన్‌బీ తెలిపింది. టీజీఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ మాదాల రవి, టీజీఏఎన్‌బీ ఎస్పీ పి.సీతారామ, డిపార్ట్‌మెంట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్ డైరెక్టర్ శైలజ తదితరులు హాజరయ్యారు. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించే తమ లక్ష్యం దిశగా ఇది ఒక శక్తివంతమైన అడుగు అని వారు పేర్కొన్నారు.

25న పోలవరంపై ప్రధాని 'ప్రగతి' సమావేశం

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన సమస్యలపై ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఈ నెల 25న ప్రత్యేకంగా ప్రగతి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణతోపాటు సంబంధిత రాష్ట్రాలకు తాజాగా కేంద్రం సమాచారాన్ని అందించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి నీటిని నిల్వ చేసేందుకు ఏపీ సర్కారుకు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. అయితే పోలవరం ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం మేరకు నీళ్లను నిల్వ చేస్తే తమ రాష్ట్రాల్లో ఏర్పడనున్న ముంపు సమస్యను పరిష్కరించాలని, భూసేకరణతో పాటు పరిహారం చెల్లించాలని, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని తెలంగాణతో సహా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలతో ప్రధాని మోదీ గత నెల 28న ఈ ప్రాజెక్టుపై ప్రగతి సమావేశం నిర్వహించాల్సి ఉండగా, అప్పట్లో వాయిదా పడింది. తాజాగా ఈ నెల 25న నిర్వహించనున్నట్టు కేంద్రం తెలిపింది.

పాతికేళ్లకు వృద్ధ భారతం!

▶ మొదటి పేజీ తరువాయి

రెట్టింపునకు మించి 34.7 కోట్లకు (జనాభాలో 20.8 శాతం) చేరుకుంటుందని అంచనా. ఇది దేశ ఆరోగ్య, ఆర్థిక, సామాజిక వ్యవస్థలపై తీవ్రమైన ప్రభావం చూపుతుందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఇప్పటికే దేశంలో ఆర్థిక అభద్రత, కుటుంబపరమైన సహాయ సహకార వ్యవస్థ క్షీణత, వైద్య, ఆరోగ్య సేవల విషయంలో అసమానతల పెరుగుదల లాంటి తదితర కారణాల వల్ల వృద్ధుల సంఖ్య పెరుగుదల అనేది ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక అంశాలను ప్రభావితం చేస్తుండటం చర్చనీయాంశంగా ఉంది. భారత్ క్రమంగా వృద్ధ సమాజంగా మారనున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోతే ఇది ఒక సంక్షోభంగా పరిణమించవచ్చుననే హెచ్చరికలు కూడా ఈ సందర్భంగా వినిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన 'ఇండియాస్ ఏజింగ్ సొసైటీ: ద ల్యాండ్ స్కేప్ టుడే'- గివ్ గ్రాంట్స్ ఇండియా' నివేదిక'లో ఇందుకు సంబంధించిన అనేక అంశాలు వెల్లడయ్యాయి. ఇండియా ఏజింగ్ రిపోర్ట్ 2023 (యూఎన్ఎఫ్‌పీఏ ఇండియా, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సంయుక్త పరిశీలన), కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ, నీతి ఆయోగ్ పరిశోధనల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు.

29 శాతం మందికే పెన్షన్


పెన్షన్ అందని వృద్ధుల బతుకు భారంగా మారుతోంది. ప్రస్తుతం దేశంలోని వృద్ధులలో 29% మందికే పెన్షన్ (వివిధ రూపాల్లో) లభిస్తోంది. దాదాపు 40% మంది వృద్ధులు అత్యల్ప ఆదాయ వర్గ కుటుంబాలకు చెందినవారు. వారి జీవితం.. భద్రమైన ఆదాయం, కుటుంబ మద్దతు తగ్గిపోతున్న ఈ కాలంలో మరింత కష్టతరంగా మారుతోంది. వృద్ధులపై జరిగే దౌర్జన్యాలలో 71% కేసులు మహిళలకు సంబంధించి ఉంటున్నాయి. దేశంలోని సగానికి పైగా వృద్ధులు మొబైల్ ఫోన్లు లేదా ఇంటర్నెట్ ఉపయోగించలేరు. ఇది వారిని సమాజం నుంచి పూర్తిగా వేరుచేస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,000కు పైగా మాత్రమే వృద్ధుల వసతి గృహాలున్నాయి.

దెబ్బతీస్తున్న దీర్ఘకాలిక వ్యాధులు...

ప్రస్తుతం వృద్ధులలో..50% మందికి అధిక రక్తపోటు, 43% మందికి మధుమేహం (డయాబెటిస్) 33% మందికి అస్తమా వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. ఇవన్నీ నిత్యం వైద్య పర్యవేక్షణ అవసరమయ్యే పరిస్థితులు. కానీ దేశవ్యాప్తంగా తక్కువ సంఖ్యలో మాత్రమే గెరియాట్రిక్ వైద్య నిపుణులున్నారు. పౌర ఆరోగ్య బీమా పథకం ద్వారా 25% వృద్ధులకు మాత్రమే బీమా లభిస్తోంది.

వృద్ధులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు

అటల్ వయో అభ్యుదయ యోజన, జాతీయ వృద్ధుల ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం, రాష్ట్రీయ వయోశ్రీ పథకం. అయితే వీటిపై ప్రజల్లో అవగాహన లోపం, ఇవి సరిగా అమలు కాకపోవడం, గ్రామీణ ప్రాంతాలకు చేరిక తక్కువగా ఉండటం వంటి సమస్యలు ఉన్నాయి.



ఏం చేయాలి?

పెన్షన్ వ్యవస్థను విస్తరించాలి. అసంఘటిత రంగం వృద్ధులకు కూడా చేరుకునేలా చూడాలి. అత్యాధునిక వృద్ధుల నివాస గృహాలు స్థాపించాలి. సహాయ జీవన, ఆరోగ్య ఆధారిత సేవలు అందేలా జాగ్రత్తలు తీసుకోవాలి. జీరో టాలరెన్స్ పథకం – వృద్ధులపై దౌర్జన్యాలపై కఠినచర్యలు. డిజిటల్ సహిత వృద్ధులు – డిజిటల్ సాంకేతికతపై శిక్షణ. వృద్ధ మహిళల ప్రత్యేక పథకాలకు, ఆర్థిక స్వయం సాధన, భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి.

'నారాయణపేట్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయండి'

సాక్షి, న్యూఢిల్లీ: నారాయణ పేట్‌లో సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ డీకే అరుణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీలో రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్‌ను ఆమె కలిసి వినతి పత్రం అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసమర్థత వల్ల సైనిక్ స్కూల్ ఏర్పాటు ప్రక్రియ నిలిచిపోయిందని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ విషయంలో చొరవ చూపించాలని కోరారు.

వానలకు అనుకూలంగా వాతావరణం

▶ మొదటి పేజీ తరువాయి

మూడు రోజులు రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. వికారాబాద్, కామారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, ఇతర జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

మాటూర్‌లో 4.93 సెం.మీ. వర్షం

బుధవారం రాష్ట్రంలో సగటున 7.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ సీజన్‌లో 11 రోజుల్లో 3.37 సెంటీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. బుధవారం సాయంత్రానికి 2.35 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా నల్లగొండ జిల్లా మాటూర్‌లో 4.93 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లిలో 4.35, నల్లగొండ జిల్లా ముదిగొండలో 3.38, పడమటిపల్లెలో 3.10, తిమ్మాపూర్‌లో 3 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

భారీగా తగ్గిన ఉష్ణోగ్రతలు

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు భారీగా తగ్గాయి. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా సాధారణం కంటే 5 డిగ్రీల సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. ప్రధాన నగరాల్లో ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 33.8 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 20 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రానున్న మూడు రోజులు కూడా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది

- ఆర్.కృష్ణయ్యది మోసపూరిత వైఖరి
- కాంగ్రెస్ బీసీ నేతలు ఈరవత్రి అనిల్, చరణ్‌కౌశిక్, వేణుయాదవ్, వరలక్ష్మి

సాక్షి, హైదరాబాద్:బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఊరుకునేది లేదని ఆ పార్టీ బీసీ నేతలు హెచ్చరించారు. కాంగ్రెస్‌ను విమర్శించడం మానుకోవాలని ఆర్.కృష్ణయ్యకు హితవు చెప్పారు. బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై ప్రత్యేక జీవో విడుదల చేయకపోతే గాంధీభవన్‌ను ముట్టడిస్తామని బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ బీసీ నేతలు ఈరవత్రి అనిల్, చరణ్ కౌశిక్, వేణుయాదవ్, మచ్చ వరలక్ష్మిలు మండిపడ్డారు. బుధవారం గాంధీభవన్‌లో ఈ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ చిత్తశుద్ధితో బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. కానీ ఈ విషయంలో ఆర్.కృష్ణయ్యది మోసపూరిత వైఖరి అని, బీజేపీలో ఉండి ఆయన బీసీలను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక జీవో విడుదల చేయాలని ఆర్.కృష్ణయ్య మాట్లాడుతున్నారని, ఆ జీవోను కోర్టు కొట్టి వేస్తే, బీజేపీ ఎంపీగా ఉన్న ఆర్.కృష్ణయ్య బీసీల రిజర్వేషన్ల గురించి కేంద్రంతో మాట్లాడి 9వ షెడ్యూల్‌లో పెట్టిస్తారా? అని సవాల్ చేశారు. 40 ఏళ్ల నుంచి ఉద్యమాలు చేస్తున్న ఆర్.కృష్ణయ్య బీసీల రిజర్వేషన్లను ఎందుకు సాధించలేదని ప్రశ్నించారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకే కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించిందని, ఈ విషయాన్ని కృష్ణయ్య ఒప్పుకోవాలని వారు డిమాండ్ చేశారు.

తొలగించిన కులాలపై ముగిసిన విచారణ

- ప్రభుత్వానికి త్వరలో బీసీ కమిషన్ నివేదిక

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీసీ జాబితా నుంచి గతంలో తొలగించిన కులాల చేర్పునకు సంబంధించి బీసీ కమిషన్ బహిరంగ విచారణ బుధవారంతో ముగిసింది. మూడురోజుల పాటు జరిగిన ఈ విచారణలో మొత్తం 133 గ్రూపులతో కమిషన్ మాట్లాడింది. బుధవారం జరిగిన విచారణలో 64 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాశ్, రంగు బాలలక్ష్మి, ఇతర అధికారులు ఈ విచారణలో వచ్చిన వినతులు, సలహాలు, సూచనలు స్వీకరించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత తెలంగాణ రాష్ట్ర బీసీ కుల జాబితానుంచి 26 కులాలు తొలగించారు. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్‌లోని కులాలు కావడం, తెలంగాణలో ఆయా కులాలు స్థానికంగా లేకపోవడంతో అప్పట్లో వాటిని తొలగించారు. అయితే ఈ కులాలను తిరిగి బీసీ జాబితాలో చేర్చాలని కమిషన్‌కు వినతులు రావడంతో ఈ విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో బీసీ కమిషన్ త్వరలో ఈ అంశంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.



మంగళవారం అర్ధరాత్రి వేళ లాస్ ఏంజెలెస్‌లో యాపిల్ స్టోర్‌ను దోచుకుంటున్న దుండగులు



వస్తువులన్నీ చోరీ కావడంతో ఉదయానికి బోసిపోయి కన్పిస్తున్న యాపిల్ స్టోర్

లూటీ.. విధ్వంసం.. కర్ఫ్యూ

‘అక్రమ వలసదారుల అరెస్ట్’పర్వంలో విధ్వంసకాండ

- యాపిల్ స్టోర్‌సహా డౌన్‌టౌన్‌లో పలు దుకాణాల లూటీ
- ఉద్రిక్తంగా మారిన లాస్ ఏంజెలెస్ ఆందోళనలు
- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు కర్ఫ్యూ విధింపు
- నగరాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మారుస్తానని ట్రంప్ బెదిరింపు
- విద్వేషాగ్నిని ట్రంప్ ఎగదోస్తున్నారన్న కాలిఫోర్నియా గవర్నర్ గవిన్

లాస్ ఏంజెలెస్: అమెరికాలోని లాస్ ఏంజెలెస్ నగరంలో సరైన పత్రాలులేని వలసదారుల అరెస్ట్‌లతో మొదలైన ఆందోళనలు మరింత తీవ్రరూపం దాల్చాయి. మంగళవారం రాత్రి ఆందోళనకారులు వేల సంఖ్యలో పాల్గొని తమ ఉద్యమాన్ని మరింత ఉధృతంచేశారు. అయితే దీనిని అదునుగా చూసుకుని కొందరు దుండగులు ముసుగులు ధరించి లాస్‌ఏంజెలెస్ డౌన్‌టౌన్‌లో లూటీలకు తెరలేపారు. యాపిల్ ఐఫోన్ స్టోర్‌సహా పలు దుకాణాలపై దాడులు చేసి లూటీలు చేశారు. విలువైన వస్తువులను అందినకాడిని దోచుకెళ్లారు. ఉద్యమంవేళ యథేచ్ఛగా లూటీలు, విధ్వంసం జరగడంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. దుకాణ సముదాయాల నుంచి పారిపోతున్న ముసుగు ధరించిన దుండగులను అరెస్ట్‌చేశారు. పలువురు ఆందోళనకారులను సైతం అరెస్ట్ చేసినట్లు వార్తలొచ్చాయి. దుకాణాలను యువకులు లూటీలు చేస్తున్న వీడియోలు ఇప్పుడు సామాజికమాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గత నాలుగు రోజుల్లో మొత్తంగా 23 పెద్ద వ్యాపార సముదాయాలు లూటీకి గురయ్యాయని లాస్ ఏంజెలెస్ నగర మహిళా మేయర్ కరెన్ బాస్ చెప్పారు.

నగరంలో తాత్కాలిక కర్ఫ్యూ

స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 8 గంటల నుంచి ఉదయం 6 గంటలదాకా పాక్షిక కర్ఫ్యూను విధిస్తున్నట్లు మేయర్ కరెన్ ప్రకటించారు. ప్రతిరోజూ ఇదే సమయానికి కర్ఫ్యూను అమలుచేయనున్నారు. ఇలా కొద్దిరోజులపాటు పాక్షిక కర్ఫ్యూ అమల్లో ఉండనుంది. లూటీలు, విధ్వంసానికి పాల్పడిన వారిని గుర్తిస్తూ పోలీసులు అరెస్ట్‌లపర్వాన్ని మొదలెట్టారు. అడ్డొచ్చిన వారిపైకి రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించారు. డౌన్‌టౌన్ జిల్లాలోని ఆర్ట్స్ డిస్ట్రిక్ట్, చైనా టౌన్, స్కిడ్ రో, ఫ్యాషన్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లో కర్ఫ్యూను అమలుచేశారు. కర్ఫ్యూ మొదలయ్యాక కనీసం 200 మందిని పోలీసులు అరెస్ట్‌చేశారని మేయర్ ప్రకటించారు. లాస్‌ఏంజెలెస్ 2,300 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించగా అత్యధిక లూటీలు, విధ్వంసం జరిగిన 2.5 చదరపు కిలోమీటర్ల పరిధిలోనే రాత్రి కర్ఫ్యూను అమలుచేస్తామని నగర పోలీస్ చీఫ్ జిమ్ మెక్‌డోనెల్ చెప్పారు. నగరంలో మరింత ఉద్రిక్తంగా మారడానికి ట్రంప్ ‘నేషనల్ గార్డ్’ తరలింపు’ నిర్ణయమే కారణమని కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ ఆరోపించారు. సైనికఛత్రంలోకి నగరాన్ని ఇరికించి సమస్యను జటిలంచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ట్రంప్ స్పందించారు. ‘‘ఆందోళనకారులు జంతువుల్లా ప్రవర్తిస్తున్నారు. దేశానికి శత్రువుల్లా తయారయ్యారు. అల్లరిమూకల అరాచకత్వం ఇక ఎంతమాత్రం సాగనివ్వను. అవసరమైతే తిరుగుబాటు అణచివేత చట్టం,1807ను తీసుకొచ్చి యావత్ సైన్యాన్ని రాష్ట్రంలోకి దింపుతా. లాస్ ఏంజెలెస్‌లో ఇలాగే అల్లర్లు, ఆందోళనలు కొనసాగితే సిటీని రాష్ట్ర పాలన పరిధి నుంచి తప్పించి కేంద్రప్రభుత్వ అధీనంలోకి తీసుకొస్తా’’ అని శ్వేతసౌధంలో ట్రంప్ హెచ్చరించారు.

కోర్టులో గవర్నర్‌కు చుక్కెదురు

న్యూయార్క్ గవర్నర్ అనుమతిలేకుండా అసా ధారణ అధికారాలతో లాస్ ఏంజెలెస్‌లోకి నేషనల్ గార్డ్, మెరైన్‌లను పంపుతూ ట్రంప్ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం నిలుపుదలచేయాలన్న న్యూయార్క్ అటార్నీ అభ్యర్థనను జడ్జి తిరస్కరించారు. ఈ అంశాన్ని గురువారం మరోసారి పరిశీలిస్తామని శాన్ ఫ్రాన్సిస్కో జిల్లా కోర్టు జడ్జి చార్లెస్ బ్రేయర్ చెప్పారు. మరోవైపు భద్రతా బలగాల మోహరింపు ముమ్ముందు మరింత ఎక్కువగా ఉంటుందని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ చెప్పారు. ఇప్పటికే నేషనల్‌గార్డ్, మెరైన్‌లను రప్పించినందుకు ఏకంగా రూ.1,146 కోట్లు ఖర్చయిందని ఆయన వెల్లడించారు. అక్రమవలసదారుల కోసం గాలింపు, అరెస్ట్ విధుల్లో ఉన్న ఫెడరల్ ఏజెంట్లు, ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ అధికారుల రక్షణ, కేంద్రప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను మాత్రమే నేషనల్ గార్డ్‌లకు అప్పగించడంతో వాళ్లు ఆందోళనకారులను అరెస్ట్‌చేయట్లేదు. అరెస్ట్‌చేసే అధికారం వీళ్లకు లేదు. దీంతో నిరసనకారులు రెచ్చిపోతున్నారు. ఈ సందర్భంగానే ముసుగు ధరించిన ఆగంతకులు లూటీలు చేయగలిగారు.

టిక్‌టాక్ స్టార్‌పై బహిష్కరణ వేటు

16.24 కోట్ల మంది టిక్‌టాక్ ఫాలోవర్లు ఉన్న ప్రఖ్యాత ఇన్‌ఫ్లుయెన్సర్ ఖబీ లేమ్‌ను సైతం అమెరికాలో ఇమిగ్రేషన్ అధికారులు దేశం నుంచి వెళ్లగొట్టారు. వీసా గడువు ముగిశాక సైతం అమెరికా ఉంటున్నందుకు ఆయనపై బహిష్కరణ వేటు వేశారు. దీంతో ఆయనే స్వయంగా అమెరికాను వీడారని వార్తలొచ్చాయి. సెనెగల్- ఇటాలియన్ మూలాలున్న ఇతను చేసే టిక్‌టాక్ వీడియోలకు ప్రపంచవ్యాప్తంగా విపరీతమైన క్రేజ్ ఉంది. ఇతను యూనిసెఫ్ గుడ్‌విల్ అంబాసిడర్‌గా ఉన్నారు. మరోవైపు టెక్సాస్ రాష్ట్రంలోనూ నేషనల్ గార్డ్‌లను రప్పించామని ఆ రాష్ట్ర గవర్నర్ గ్రెగ్ అబ్బాట్ చెప్పారు.



లాస్ ఏంజెలెస్ సిటీ హాల్ ముందు భద్రతా దళాల పహారా

ఇతర నగరాల్లో ఆందోళనలు

కర్ఫ్యూతో లాస్ ఏంజెలెస్‌లో ఉద్రిక్తత రాత్రివేళ కాస్తంత తగ్గుముఖం పట్టినా ఇతర నగరాల్లో మాత్రం ఉధృతంగా కొనసాగుతోంది. శాన్ ఫ్రాన్సిస్కో మొదలు సియాటిల్, న్యూయార్క్, షికాగో, డెన్వర్, శాంటా అనా, ఆస్టిన్, డాలస్, బోస్టన్, వాషింగ్టన్ డీసీదాకా చాలా ప్రధాన నగరాల్లో వందలాది మంది ఆందోళనకారులు రోడ్లపైకి చేరి ప్రభుత్వ వ్యతిరేక నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. నిరసనకారులను నిలువరించేందుకు పోలీసులు తక్కువ ప్రాణహాని ఉండే ఉపకరణాలనే వాడుతున్నారు. భాష్పవాయు గోళాలు, పెప్పర్ స్ప్రే, టేజర్, లాఠీలు, జల ఫిరంగులు, చెవులు చిల్లులు పడే శబ్దాలు వెదజల్లే పరికరాలు, రబ్బర్‌బుల్లెట్లు బీన్–బ్యాంగ్ రౌండ్లను ప్రయోగిస్తున్నారు.

జననాల తగ్గుదల వరమా.. శాపమా?

భారత్‌లో కనీస రేటు కంటే తక్కువ • ఇలాగే కొనసాగితే తగ్గనున్న జనాభా

ప్రపంచంలో మరే దేశానికి లేనంతటి యువశక్తి భారత్ సొంతం. మొత్తం జనాభాలోనూ చైనాను అధిగమించి ప్రపంచంలో అగ్రస్థానంలో నిలిచాం. అయితే ప్రపంచవ్యాప్త ట్రెండుకు అనుగుణంగా భారత్‌లో కూడా జననాల రేటు భారీగా తగ్గుముఖం పడుతూ వస్తోంది. జనాభా పెరుగుదల స్థిరంగా కొనసాగాలంటే జననాల (టీఎఫ్ఆర్–టోటల్ ఫెర్టిలిటీ) రేటు కనీసం 2.1 ఉండాలి. అంటే ప్రతి మహిళ కనీసం ఇద్దరిని కనాలన్నమాట. దీన్ని భర్తీ రేటుగా పిలుస్తారు. కానీ భారత్‌లో టీఎఫ్ఆర్ ఏకంగా 1.9కి పడిపోయిందని ‘సంతాన సంక్షోభం’ పేరిట ఐక్యరాజ్యసమితి జనాభా కార్యకలాపాల నిధి (యూఎన్ఎఫ్‌పీఏ) విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. దాంతో జననాల రేటు తగ్గుదల ప్రభావం మన దేశంపై అంతిమంగా ఎలా ఉండనుందన్న చర్చ జోరందుకుంది.

భారత్‌లో జననాల రేటు (ప్రతి మహిళకు)

1950	6.18
1970	5
1980	4.6
2021	1.91
2025	1.9
2100	1.04

(అంచనా)
(ఆధారం: జీబీడీ-2021 నివేదిక)

ఇదీ పరిస్థితి!

1.9 టీఎఫ్ఆర్ కారణంగా భారత్‌లో జనాభా పెరుగుదల నానాటికీ తగ్గి 40 ఏళ్లకు ఆగిపోతుందని యూఎన్ఎఫ్‌పీఏ అంచనా వేసింది. అప్పటికి దేశ జనాభా 170 కోట్లకు చేరి అక్కడి నుంచి తగ్గుముఖం పడుతుందని పేర్కొంది. కానీ భారత్‌లో టీఎఫ్ఆర్ శరవేగంగా 1.29కు పడిపోతుందని గతేడాది లాన్సెట్ జరిగిన అధ్యయనం శాస్త్రీయంగా అంచనా వేసింది. అదే జరిగితే దేశ జనాభాలో తగ్గుదల 40 ఏళ్లకంటే చాలా ముందే మొదలయ్యే వీలుంది. 1950ల్లో ఒక్కో భారత మహిళ సగటున ఏకంగా ఆరుగురిని కనేది! 1980ల నాటికి అది 4.6కు తగ్గింది. అక్కడినుంచి ఇద్దరు పిల్లలు చాలనే పరిస్థితికి రావడానికి కేంద్ర ప్రభుత్వం ఎంతగానో శ్రమించాల్సి వచ్చింది. చిన్న కుటుంబాలు పరిపాటిగా మారిపోయాయి. మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం పెరిగిన కొద్దీ వారు కనే పిల్లల సంఖ్య మరింతగా తగ్గుతూ వస్తోంది. ఎక్కువమందిని కని కెరీర్‌ను పణంగా పెట్టేందుకు వారు ఇష్టపడటం లేదు. పిల్లల పెంపకంలో వారికి భర్త మద్దతు లేకపోవడమూ దీనికి కారణమే.

ఆందోళన అక్కర్లేదు!



జననాల రేటు (టీఎఫ్ఆర్) తగ్గితే జనాభాపరంగా చాలా మార్పులు చోటుచేసుకుంటాయి. ముఖ్యంగా యువ శ్రామిక శక్తి క్రమంగా తగ్గిపోతుంది. వృద్ధుల సంఖ్య పెరిగిపోతుంది. ‘‘2050 నాటికి భారత జనాభాలో వృద్ధుల సంఖ్య ఐదో వంతుకు చేరుతుంది. చైనాది ప్రస్తుతం ఇదే పరిస్థితి. ఒకే సంతానం నిబంధనను దశాబ్దాలుగా కఠినంగా అమలు చేయడమే అందుకు కారణం’’ అని జనాభా నిపుణులు చెబుతున్నారు. ‘‘జనాభా పెరుగుదలను బాగా తగ్గించిన దక్షిణాది రాష్ట్రాలన్నీ దాని పర్యవసానాలను ఇప్పటికే అనుభవిస్తున్నాయి. మొత్తం 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో టీఎఫ్ఆర్ ఇప్పటికే 2.1 కంటే చాలా తక్కువకు పడిపోయింది. బిహార్ (3), మేఘాలయ (2.9), ఉత్తరప్రదేశ్ (2.7) వంటివి మాత్రమే ఇందుకు మినహాయింపు’’ అని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పాపులేషన్ సైన్సెస్ డెమోగ్రఫీ ప్రొఫెసర్ శ్రీనివాస్ గోలి వివరించారు. ‘‘అంతమాత్రాన టీఎఫ్ఆర్ తగ్గుదలను చూసి ఇప్పటికిప్పుడు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. దీనివల్ల కార్మిక శక్తి భారీగా తగ్గుతుందన్నది అపోహ మాత్రమే. నైపుణ్యాలను పెంపొందించుకోవడం, ప్రాంతాల మధ్య వలసలను మరింతగా ప్రోత్సహించడం ద్వారా సమస్యను సులువుగా అధిగమించవచ్చు’’ అని అభిప్రాయపడ్డారు. అయితే వృద్ధుల సంఖ్య పెరుగుదల ఒక్కటే ముమ్ముందు భారత్‌కు సమస్యగా మారే ఆస్కారముందని ఆయన అంచనా వేశారు. ‘‘వయోపరమైన అంతరం నానాటికీ పెరిగిపోయి చివరికి పెద్దవాళ్ల ఆలనాపాలనా చూసే వారసుల సంఖ్య తగ్గిపోతుంది. ఆ పరిస్థితుల్లో వృద్ధుల సంరక్షణకు అవసరమైన వసతులు, ప్రభుత్వపరమైన సౌకర్యాలు మన దగ్గర బాగా తక్కువే’’ అని గుర్తు చేశారు. 60–75 ఏళ్ల వయసు వారికి ఇప్పటిమాదిరిగా తగిన ఉపాధి అవకాశాలు కూడా ముమ్ముందు సవాలుగానే మారవచ్చని అహ్మదాబాద్‌లోని ఎల్‌జే వర్సిటీ ప్రొఫెసర్ అమితాబ్ కుందు అభిప్రాయపడ్డారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

చైనాతో డీల్: ట్రంప్

- చైనాపై యూఎస్ సుంకాలు 55 శాతం
- అమెరికాపై 10 శాతానికి డ్రాగన్ ఓకే
- అరుదైన ఖనిజాల సరఫరాకు లైన్‌క్లియర్
- చైనా విద్యార్థులకు అమెరికా స్వాగతం

బీజింగ్/వాషింగ్టన్: అమెరికా, చైనా నడుమ రెండు నెలల వాణిజ్య యుద్ధానికి ఇక తెరపడ్డట్టే. ఇరుదేశాల మధ్య వర్తక ఒప్పందం ఖరారైనట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ‘‘లండన్‌లో రెండు రోజుల సంప్రదింపుల అనంతరం ఈ పరిణామం చోటుచేసుకుంది. ఇక నేను, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తుది ఆమోదముద్ర వేయడమే తరువాయి’’ అని ఆయన వెల్లడించారు. ఈ మేరకు ట్రూత్‌సోషల్‌లో ట్రంప్ పోస్ట్ చేశారు. ఇకపై చైనా దిగుమతులపై అమెరికా 55 శాతం సుంకాలు విధిస్తుంది. అమెరికా ఉత్పత్తులపై చైనా 10 శాతం టారిఫ్‌లు వసూలు చేస్తుంది’’ అని వివరించారు. విభేదాలు ముదిరిన నేపథ్యంలో అమెరికాకు మ్యాగ్నెట్లు మొదలుకుని 17 రకాల అరుదైన ఖనిజాలు తదితరాల ఎగుమతులపై నిషేధాన్ని కూడా చైనా ఎత్తేయనుందని తెలిపారు. ‘‘బదులుగా చైనాకు కూడా గత ఒప్పందాల మేరకు అన్ని విషయాల్లోనూ తలుపులు తెరుస్తాం. చైనా విద్యార్థులను అమెరికా కాలేజీలు, యూనివర్సిటీలు, ఇతర విద్యా సంస్థల్లోకి ఎప్పట్లాగే సాదరంగా ఆహ్వానిస్తాం’’ అని ప్రకటించారు. ‘‘ప్రస్తుతం అమెరికా, చైనా మధ్య సంబంధాలు అద్భుతంగా ఉన్నాయి. ఇరుదేశాలకూ లాభదాయక రీతిలో ఒప్పందం కుదిరింది’’ అంటూ హర్షం వెలిబుచ్చారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచనాల ప్రకారం ప్రపంచంలో అందుబాటులో ఉన్న మొత్తం అరుదైన ఖనిజ నిల్వల్లో 61 శాతం, ఉత్పత్తిలో ఏకంగా 91 శాతం వాటా చైనాదే.



దురహంకారంతో తప్పులు చేశాడు

- సిద్ధూ మూసేవాలాను అందుకే చంపాం
- పంజాబ్ గ్యాంగ్‌స్టర్ గోల్డీ వెల్లడి

వాషింగ్టన్: మూడు సంవత్సరాల క్రితం పంజాబ్‌కు చెందిన యువ పాప్‌సింగర్ సిద్ధూ మూసేవాలాపైకి తూటాల వర్షం కురిపించి చంపేసిన గ్యాంగ్‌స్టర్ గోల్డీ బ్రార్ ఆచూకీ ఇంతవరకు తెలీదు. కానీ బీబీసీ వార్తాసంస్థ ఎట్టకేలకు తాజాగా అతడిని ఇంటర్వ్యూ చేసింది. మూసేవాలాను అంతమొందించడానికి గల కారణాలను రాబట్టింది. దీనిపై గోల్డీబ్రార్ సూటిగా, సుదీర్ఘంగ మాట్లాడారు. ‘‘ దురహంకారంతో సిద్ధూ క్షమించలేనంతగా కొన్ని తప్పులు చేశాడు. ఇక అతడిని చంపడం మినహా మాకు మరో మార్గం కనిపించలేదు. చేసిన తప్పులకు శిక్ష అనుభవించాల్సిందే. అది అతడైనాసరే మేమైనాసరే’’ అని గోల్డీ అన్నాడు. కెనడాలో ఉంటూ గోల్డీబ్రార్ ఈ హత్యకు పథకరచన చేసినట్లు తెలుస్తోంది. పంజాబ్‌కు చెందిన కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్, గోల్డీ కలిసి ఎన్నో నేరాలు చేశారు. ప్రస్తుతం బిష్ణోయ్ జైలులో ఉన్నాడు. ‘‘సిద్ధూ మ్యూజిక్ అంటే బిష్ణోయ్‌కు ఇష్టం. 2018 ఏడాది తొలినాళ్లలో సిద్ధూ కెనడాలో ఇంజనీరింగ్ చదవడానికి వచ్చి మ్యూజిక్‌పై మమకారంతో మంచి పాప్‌సింగర్‌గా ఎదిగాడు. అప్పుడే సిద్ధూకు బిష్ణోయ్‌తో పరియం ఏర్పడింది. రోజూ గుడ్ మార్నింగ్, గుడ్‌నైట్ మెసేజ్‌లు బిష్ణోయ్‌కు సిద్ధూ చేసేవాడు. సిద్ధూ భారత్‌కు వచ్చిన తర్వాతే భేదాభిప్రాయాలు మొదలయ్యాయి’’ అని అన్నాడు.

కబడ్డీతో మొదలై...

‘‘మా సొంత రాష్ట్రంలో ప్రఖ్యాత కబడ్డీ ఆటల పోటీలకు సిద్ధూ ఆర్థికసాయం చేశాడు. వాస్తవానికి ఆ పోటీలను బిష్ణోయ్ బద్ధశత్రువులైన బామ్‌బిహా గ్యాంగ్ నిర్వహించింది. మా శత్రువులకు చెందిన గ్రామం నుంచి బామ్‌బిహా గ్యాంగ్‌కు చెందిన ఆటగాళ్లు వచ్చి ఆనాడు పోటీల్లో పాల్గొన్నారు. శత్రువులు నిర్వహించిన పోటీలకు సిద్ధూ స్పాన్సర్‌గా ఉండటం బిష్ణోయ్, అతని గ్యాంగ్‌కు అస్సలు నచ్చలేదు. అయితే బిష్ణోయ్ గ్యాంగ్‌లో సభ్యుడైన విక్కీ మిధుఖేరా అనే వ్యక్తి తర్వాత బిష్ణోయ్, సిద్ధూల మధ్య సయోధ్య కుదిర్చాడు. అయితే ఈ విక్కీని 2021 ఆగస్ట్‌లో మొహాలీ సిటీలో కొందరు కాల్చిచంపారు. విక్కీని చంపింది తామేనని బామ్‌బిహా గ్యాంగ్ ప్రకటించుకుంది.



గోల్డీ బ్రార్ సిద్ధూ మూసేవాలా

సిద్ధూ స్నేహితుడు, అతని ఒకప్పటి మేనేజర్ శగన్‌ప్రీత్ సింగ్ పేరును విక్కీ హత్య కేసు చార్జ్‌షీటులో పోలీసులు ప్రస్తావించారు. దీంతో విక్కీ హత్య వెనుక సిద్ధూ హస్తముందని మేం భావించాం. విక్కీని చంపేందుకు హంతకులకు శగన్‌ప్రీత్ అన్ని రకాలుగా సాయంచేశాడు. తర్వాత శగన్ ఆస్ట్రేలియాకు పారిపోయాడు. ఆ తర్వాత కూడా శగన్‌తో సిద్ధూ స్నేహం కొనసాగింది. వద్దని మేం వారించినా వినలేదు. దాంతో సిద్ధూతో మా శత్రుత్వం అమాంతం పెరిగిపోయింది. రాజకీయనేతలతో, అధికారంలో ఉన్న పార్టీలతో సిద్ధూకు సత్సంబంధాలున్నాయి. మా శత్రువులు బలోపేతం కావడానికి సిద్ధూ తన రాజకీయ పలుకుబడి, డబ్బును ఉపయోగించాడు. సిద్ధూ తప్పులకు శిక్ష పడాలని మేం భావించాం. కేసు నమోదుచేసి జైల్లో పడేయాలని వాదించినా ఎవ్వరూ పట్టించుకోలేదు. పద్ధతిగా చెబితే విననప్పుడు తూటాల శబ్దాలైనా వింటారేమో. అందుకే తుపాకీ మోత మోగించాం’’ అని గోల్డీబ్రార్ చెప్పాడు. భారత్‌లో చట్టాలు ఉన్నప్పుడు చట్టాన్ని మీరెందుకు మీ చేతుల్లోకి తీసుకున్నారు? అని ప్రశ్నించగా.. ‘‘ చట్టం. న్యాయం. ఇలాంటివి భారత్‌లో లేవు. కేవలం శక్తివంతమైన వ్యక్తులకు మాత్రమే అవి దక్కుతాయి. సాధారణ ప్రజలకు అవి అందని ద్రాక్షే’’ అని అన్నాడు. ‘‘ చనిపోయిన విక్కీ సోదరుడు రాజకీయాల్లో ఉండి కూడా తన సోదరుడిని హత్యచేసిన వాళ్లకు శిక్షపడేలా చేయలేకపోయాడు. కావాలంటే అతడితో మాట్లాడి చూడండి అతనెంతగా న్యాయబద్ధంగా పోరాడాడో. చనిపోయిన విక్కీ కోసం నేను ఈ పనిచేశా. సిద్ధూను అంతంచేసినందుకు నాకు కాస్తంత పశ్చాత్తాపం కూడా లేదు’’ అని అన్నాడు. రెండు గ్యాంగ్‌ల మధ్య తగాదాలో సిద్ధూ మృతికి కారణమని తెలిసినా స్పష్టమైన కారణాలు ఇంతవరకూ ఎవరూ చెప్పలేదు. తొలిసారిగా గోల్డీబ్రారే ఈ అంశాలు వెల్లడించారని బీబీసీ తన కథనంలో పేర్కొంది.

మోదీని కలవాలంటే కరోనా టెస్టు మస్ట్

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కరోనా పాజిటివ్ కేసులు నానాటికీ పెరిగి పోతున్న తరుణంలో ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంఓ) కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీని ఎవరైనా కలవాలంటే తొలుత ఆర్‌టీ–పీసీఆర్ టెస్టు చేయించుకోవాల్సి ఉంటుందని తెలియజేసింది. మోదీ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకుంది.

భారత రాజ్యాంగం ఒక జీవరేఖ: సీజేఐ గవాయ్

లండన్: చిన్నప్పుడు మున్సిపల్ స్కూల్‌లో చదువుకున్న తాను ప్రస్తుతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నత స్థాయికి ఎదిగానంటే అందుకుభారత రాజ్యాంగమే కారణమని జస్టిస్ బి.ఆర్.గవాయ్ చెప్పారు. రాజ్యాంగం అంటే కేవలం సామాజిక పత్రం కాదని, అదొక జీవరేఖని పేర్కొన్నారు. మంగళవారం లండన్‌లోని ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఓ కార్యక్రమంలో జస్టిస్ గవాయ్ ప్రసంగించారు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ముందుచూపును రాజ్యాంగం ప్రతిబింబిస్తోందని తెలిపారు. కొన్ని దశాబ్దాల క్రితం లక్షలాది మంది భారతీయులు అంటరానివారుగా ఉండేవారని పేర్కొన్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత నిస్సహాయులు ధైర్యంగా గొంతు విప్పే పరిస్థితి వచ్చిందన్నారు. సమాజంలో, అధికారంలో వారు సగర్వంగా వాటా పొందుతున్నారని హర్షం వ్యక్తంచేశారు.

శుభాన్షు ‘యాక్సియం’ మళ్లీ వాయిదా

న్యూఢిల్లీ: భారత యువ వ్యోమగామి శుభాన్షు శుక్లాను అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లే ప్రతిష్టాత్మక యాక్సియం–4 వ్యోమనౌక ప్రయోగం మళ్లీ వాయిదాపడింది. అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ ‘యాక్సియం స్పేస్’ ఈ మిషన్‌ను నిర్వహిస్తోంది. షెడ్యూల్ ప్రకారం బుధవారం సాయంత్రం అమెరికాలోని ఫ్లోరిడా తీరం నుంచి స్పేస్‌ఎక్స్ వారి ఫాల్కన్–9 రాకెట్ ద్వారా డ్రాగన్ వ్యోమనౌకను నింగిలోకి పంపించనున్నారు. ఇందుకోసం రాకెట్ బూస్టర్లను మరోసారి తనిఖీచేయగా ద్రవ ఆక్సిజన్ లీకేజీని గుర్తించారు. దాంతో ప్రయోగాన్ని నిలిపివేశారు. ‘‘రాకెట్‌కు రిపేర్లు చేయడానికి కొంత సమయం పట్టే వీలుంది. మరమత్తులు, సమగ్ర తనిఖీలు పూర్తయ్యాక రాకెట్ ప్రయోగ తేదీని త్వరలో ప్రకటిస్తాం’’ అని స్పేస్‌ఎక్స్ సంస్థ తన ‘ఎక్స్’ ఖాతాలో బుధవారం ఒక పోస్ట్‌పెట్టింది. ఇతర వివరాలను స్పేస్‌ఎక్స్ ఉపాధ్యక్షుడు విలియం గెర్స్టెన్‌మేయర్ మీడియాకు వెల్లడించారు. లాంచ్‌ప్యాడ్‌పై ఏడు సెకన్లపాటు జరిపిన హీట్‌టెస్ట్‌లో ప్రొపల్షన్ వద్ద ద్రవ ఆక్సిజన్ లీకేజీలను గుర్తించినట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ చెప్పారు. యాక్సియం, స్పేస్‌ఎక్స్ నిపుణులతో ఈ రిపేర్ల అంశంపై చర్చించామని ఆయన తెలిపారు. వాస్తవానికి ఈ ప్రయోగం మే 29న చేపట్టాల్సిఉండగా ఆనాడు కుదర్లేదు. తర్వాత జూన్ 8, 10వ తేదీల్లోనూ ఇలాగే వాయిదాపడింది. యాక్సియం–4 మిషన్‌కు శుభాన్షు శుక్లా పైలట్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఆయన వెంట వస్తున్న అమెరికా వ్యోమగామి పెగ్గీ విట్సన్ మిషన్ కమాండర్‌గా పనిచేయనున్నారు. హంగేరీ వ్యోమగామి టిబోర్ కపూ, పోలండ్ వ్యోమగామి స్లావోజ్ ఉజ్‌నాన్‌స్కీ–విస్నీవెస్కీ సైతం ఇదే వ్యోమనౌకలో రోదసిలోకి వెళ్లనున్నారు. ఈ నలుగురూ ఐఎస్ఎస్‌కు చేరుకున్నాక 14 రోజుల పాటు అక్కడే పలు రకాల ప్రయోగాలు చేయనున్నారు. శుక్లాను ఐఎస్ఎస్‌కు పంపేందుకు ఇస్రో ఏకంగా రూ.550 కోట్లు ఖర్చుచేస్తున్నట్లు సమాచారం.

వెనక్కు తగ్గిన మస్క్

ట్రంప్‌కు మళ్లీ స్నేహహస్తం!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై మాటల యుద్ధానికి దిగిన ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వెనక్కు తగ్గారు. ఆయనతో సంబంధాలను మెరుగుపరుచుకునే ప్రయత్నాల్లో పడ్డారు. ట్రంప్‌ను విమర్శిస్తూ కొద్ది రోజుల క్రితం తాను చేసిన సోషల్ మీడియా పోస్టుల పట్ల విచారం వెలిబుచ్చారు. ‘‘ట్రంప్‌పై పెట్టిన కొన్ని పోస్టుల విషయంలో బాధపడుతున్నా. అనవసరంగా అతి చేశా’’ అంటూ మస్క్ బుధవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కానీ ట్రంప్ మాత్రం ఈ విషయంలో తగ్గేలా కన్పించడం లేదు. మస్క్‌తో సంబంధాలను సరిచేసుకునే ఉద్దేశం కూడా తనకు లేదని కొద్ది రోజులుగా మీడియా ప్రశ్నలకు బదులుగా ఆయన పదేపదే స్పష్టం చేస్తూ వస్తున్నారు. వారి ఇటీవలి వాగ్యుద్ధం ప్రపంచమంతటి దృష్టినీ ఆకర్షించడం తెలిసిందే. ఇద్దరి నడుమా కొద్ది నెలలుగా సాగుతున్న విభేదాలు కాస్తా ట్రంప్ ‘వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్’ను మస్క్ ఇటీవల తీవ్రంగా దుయ్యబట్టడంతో రచ్చకెక్కాయి. అంతటితో ఆగకుండా తనవల్లే ట్రంప్ రెండోసారి అధ్యక్షునిగా గెలిచారని ఆయన చెప్పుకొచ్చారు. దాన్ని ట్రంప్ తీవ్రంగా ఖండించడమే గాక మస్క్‌కు పిచ్చెక్కిందంటూ ఎద్దేవా చేశారు. ఆయన కంపెనీలకు కట్టబెట్టిన ప్రభుత్వ కాంట్రాక్టులన్నింటినీ తిరగదోడతానని హెచ్చరించారు. వాటిని మస్క్ బేఖాతరు చేయడమే గాక ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించిన రికార్డుల్లో ట్రంప్ పేరుందంటూ బాంబు పేల్చారు. ఈ ఉదంతంలో ఆయన గద్దె దిగడం ఖాయమన్నారు. దాంతో ఇద్దరి నడుమా సంబంధాలు పూర్తిగా చెడిపోయాయి.

ఆధార్ ఉంటేనే తత్కాల్

- జూలై 1 నుంచి అమలు
- 15 నుంచి ఓటీపీ నిబంధన
- ఏజెంట్లకు అరగంట తర్వాతే అవకాశం
- అక్రమాలను అరికట్టేందుకే: రైల్వే శాఖ

సాక్షి, న్యూఢిల్లీ: తత్కాల్ టికెట్ల బుకింగ్‌లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రైల్వే శాఖ పలు కొత్త నిబంధనలను అమల్లోకి తేనుంది. ఇకపై ఆధార్‌తో లింకైన యూజర్లు మాత్రమే ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో తత్కాల్ బుకింగులు చేసుకోగలరు. ఇది జూలై ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానుంది. జూలై 15 నుంచి యూజర్లు తమ మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని సైతం ఎంటర్ చేయడాన్ని కూడా తప్పనిసరి చేయనున్నారు. ఈ నిబంధన కౌంటర్లలో తత్కాల్ టికెట్లు కొనుగోలు చేసే ప్రయాణికులు, ఏజెంట్లకు కూడా వర్తిస్తుందని రైల్వే శాఖ వివరించింది. బుధవారం జారీ చేసిన సర్క్యులర్‌లో ఈ మేరకు స్పష్టం చేసింది. తత్కాల్ టికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టి వాటిని అందరికీ అందుబాటులో ఉంచే లక్ష్యంతోనే కొత్త నిబంధనలు తెస్తున్నట్టు పేర్కొంది. ఇందుకోసం అధీకృత ఏజెంట్లకు తత్కాల్ టికెట్ల బుకింగ్ సదుపాయం 30 నిమిషాలు ఆలస్యంగా అందుబాటులోకి వస్తుందని తెలిపింది.

ఇక 24 గంటల ముందే చార్టింగ్!

ఇకనుంచి రైళ్ల వెయిటింగ్ లిస్ట్, కన్ఫర్మ్ టికెట్ల చార్టింగ్ జాబితాను ఇకపై 24 గంటల ముందే వెల్లడించాలని రైల్వే శాఖ యోచిస్తోంది. పైలట్ ప్రాజెక్టుగా బికనేర్ డివిజన్‌లో దీన్ని అమలు చేస్తారు. సత్ఫలితాలనిస్తే దేశవ్యాప్తంగా అమలు చేస్తారు. ప్రస్తుతం రైలు బయలుదేరే 4 గంటల ముందు మొదటి చార్ట్, 30 నిమిషాల ముందు రెండో చార్ట్ విడుదలవుతాయి. కొత్త నియమాల ప్రకారం కన్ఫర్మ్‌డ్ సీట్ల సమాచారంతో కూడిన చార్టును 24 గంటల ముందే విడుదల చేస్తారు. తద్వారా దూరప్రయాణాలు చేసేవారు చివర్లో హడావుడి పడకుండా ప్రయాణాన్ని పక్కాగా షెడ్యూల్ చేసుకోవడం వీలవుతుందని భావిస్తున్నారు. ‘‘తత్కాల్ టికెట్లు ప్రయాణానికి 48 గంటల ముందు బుక్ అవుతాయి. కనుక 24 గంటల ముందు చార్ట్ విడుదలలో సమస్య ఉండదు’’ అని పేర్కొన్నాయి.

సివిల్స్-2025 ప్రిలిమినరీ ఫలితాలు వెల్లడి

న్యూఢిల్లీ: అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్‌సీ) నిర్వహించిన సివిల్స్ సర్వీసెస్–2025 ప్రిలిమినరీ పరీక్షల ఫలితాలను అధికారులు బుధవారం వెల్లడించారు. ఈ పరీక్షను మే 25వ తేదీన నిర్వహించడం తెల్సిందే. సివిల్స్ మెయిన్‌కు అర్హత సాధించిన అభ్యర్థుల రోల్ నంబర్ల జాబితాను విడిగా అదే వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. సివిల్ సర్వీస్ పరీక్షను యూపీఎస్‌సీ ఏటా మూడు దశల్లో నిర్వహిస్తోంది. ప్రిలిమినరీ, మెయిన్, ఇంటర్వ్యూల తర్వాత ఉత్తీర్ణులైన అభ్యర్థులను ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ తదితర సర్వీసుల్లోకి శిక్షణ తర్వాత తీసుకోనుంది. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్, 2025, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్,2025 ప్రక్రియలు మొత్తం పూర్తయ్యాక అభ్యర్థులు సాధించిన మార్కులు, కటాఫ్ మార్కులు, సమాధాన పత్రా(ఆన్సర్ కీ)లను https:// upsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరచ నున్నారు. స్క్రీనింగ్ టెస్ట్ తర్వాత ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(మెయిన్) ఎగ్జామినేషన్‌కు అర్హత సాధించిన వారి జాబితానూ విడిగా వెబ్‌సైట్‌లో పెట్టారు. ఢిల్లీలోని షాజహాన్ రోడ్డు ధోల్‌పూర్ హౌజ్‌లోని ఎగ్జామినేషన్ హాల్ భవంతిలో సహాయ,సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మెయిన్‌కు అర్హత పొందిన అభ్యర్థులు జూన్ 16 నుంచి 25వ తేదీలోపు వెబ్‌సైట్‌లో సంబంధిత తమ అదనపు వివరాలను పొందుపరచాల్సి ఉంటుంది. ఫీజు మినహాయింపులేని అభ్యర్థులు మెయిన్ పరీక్ష కోసం రూ.200 అడ్మిషన్ ఫీజు చెల్లించాలి.

సాక్షి హైదరాబాద్

గురువారం । 12 । జూన్ । 2025



సాగర్ రోడ్డుపై ఘోర ప్రమాదం

నాగార్జున సాగర్– హైదరాబాద్ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంటకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. -8లో



మార్వ్‌లెస్.. మాన్సూన్ వెడ్డింగ్స్..

పక్కాగా ప్లాన్ చేస్తే వానాకాలంలో పెళ్లి వేడుకలు మధురానుభూతిగా మార్చుకోవచ్చు. వధూవరులకు మంచి జ్ఞాపకాలు మిగులు తాయంటున్నారు వెడ్డింగ్ ప్లానర్లు. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

నగరంలో గురువారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

కూకట్‌పల్లిలో హాట్‌కేకుల్లా..

గజం భూమి ధర రూ.2.98 లక్షలు

- కేపీహెచ్‌బీ కాలనీ స్థలాలకు భారీ స్పందన
- రూ.141.36 కోట్లు పలికిన 18 ప్లాట్‌లు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు స్థలాలకు బుధవారం ఏర్పాటు చేసిన వేలం పాటలో భారీ స్పందన లభించింది. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని 7వ ఫేజ్‌లోని 18 ప్లాట్లను వేలం వేయగా అన్ని ప్లాట్లు హాట్‌కేక్‌ల్లా అమ్ముడుపోయాయి. 7వ ఫేజ్‌లోని ప్లాట్ నంబర్ 22ను అత్యధికంగా గజానికి రూ.2.98 లక్షల చొప్పున దక్కించుకున్నారు. 151 గజాలున్న ఈ ప్లాట్ 4 కోట్ల 52 లక్షల 72 వేల 160 రూపాయల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. అదే విధంగా 292 గజాలు ఉన్న 19వ నంబర్ ప్లాట్ గజానికి రూ.2.88 లక్షల చొప్పున వేలకు వేలం పాడారు. ఈ ప్లాట్ నుంచి 8 కోట్ల 40 లక్షల 96 వేల రూపాయలు వచ్చాయి. ఇక్కడ ఉన్న మొత్తం 18 ప్లాట్‌లలోని 6,236.33 గజాలకు కలిపి 141 కోట్ల 36 లక్షల 89 వేల 100 రూపాయల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

నాలా ఆక్రమణల తొలగింపు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నాలా విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. బుధవారం చింతలబస్తీలో నాలా ఆక్రమణలను హైడ్రా తొలగించింది. బంజారాహిల్స్ రోడ్ నెం.12 వద్ద ఉన్న కల్వర్టుకు చింతలబస్తీ వైపు ఆక్రమణలు జరిగాయి. ఈ కల్వర్టుకు ఓవైపు 15 మీటర్ల వెడల్పుతో నాలా ఉండగా... చింతలబస్తీ వైపు 7 మీటర్ల మేర కబ్జా జరిగినట్టు నిర్ధారించిన అధికారులు ఆ ఆక్రమణలను తొలగించారు. ఇసుక, చిన్న సిమెంట్ దుకాణంతో పాటు కల్లు కాంపౌండ్ రేకుల షెడ్డు కూల్చేశారు. పింఛన్ ఆఫీసు వద్ద ఉన్న కల్వర్టును పూర్తి స్థాయిలో విస్తరించనున్నారు. శంకర్‌పల్లిలోని బుల్కాపూర్ చెరువు నుంచి మొదలైన ఈ నాలా నాగులపల్లి, పుప్పాలగూడ, మణికొండ, దర్గా, మెహిదీపట్నం, బంజారాహిల్స్ రోడ్ నెం.12, చింతలబస్తీ, తుమ్మలబస్తీ మీదుగా హుస్సేన్‌సాగర్ ఉండే ఈ బుల్కాపూర్ నాలా ద్వారా నీరు సాఫీగా సాగేందుకు హైడ్రా చర్యలు తీసుకుంటోంది.

హైడ్రా ఆధ్వర్యంలో 130 మాన్సూన్ టీమ్స్

జీహెచ్ఎంసీ పర్యవేక్షణలో పూడికతీత పనులు

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత వర్షాకాలంలో నగరాన్ని వరద ముంచెత్తకుండా హైడ్రా కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా 130 మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్స్‌ను సిద్ధం చేస్తోంది. ఒక్కో బృందంలో 12 మంది సభ్యులు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ టీమ్స్‌కు హైడ్రా అధీనంలోని 51 డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలు తోడవుతాయి. ఇందులో 15 మంది చొప్పున సభ్యులు ఉండనున్నారు. మాన్సూన్ ఎమర్జెన్సీ, డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయంతో పని చేసేలా హైడ్రా అధికారులు దిశానిర్దేశం చేస్తారు. నీరు నిలిచే ప్రాంతానికి హుటాహుటిన వెళ్లే ఈ బృందాలు పని ప్రారంభిస్తాయి. వరద నీటిని రహదారి పైనుంచి తొలగించడంతో పాటు వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటాయి.

నివాస ప్రాంతాల్లోనూ వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటాయి. వర్షాకాలం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకునే బాధ్యతల్ని ప్రభుత్వం హైడ్రాకు అప్పగించిన విషయం విదితమే. ఈ కారణంగానే జీహెచ్ఎంసీ పరిధిలో ఉండే మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాల పర్యవేక్షణ బాధ్యత హైడ్రాకు వచ్చింది. మురుగు కాలువల్లో చెత్త, పూడిక తీసే పనులు మాత్రం జీహెచ్ఎంసీ నేతృత్వంలోనే కొనసాగుతాయని మున్సిపల్ శాఖ కార్యదర్శి ఇలంబర్తి నేతృత్వంలో బుధవారం జరిగిన కీలక సమావేశంలో నిర్ణయించారు. పూడికతీత పనులను జీహెచ్ఎంసీనే చేయనుంది. అవసరమైన ప్రతి చోటా హైడ్రా బృందాలు సహాయం అందించనున్నాయి.



బీఆర్ఎస్ శ్రేణులకు కేసీఆర్ అభివాదం



బీఆర్‌కే భవన్ వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలను అదుపు చేస్తున్న పోలీసులు



కేసీఆర్‌కు మద్దతుగా బైఠాయించిన ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ నేతలు

అంతటా.. ఉత్కంఠ!

విచారణకు హాజరైన కేసీఆర్

- బీఆర్ఎస్ నేతలు, శ్రేణుల హంగామా
- బీఆర్‌కే భవన్ పరిసరాల్లో బందోబస్తు

సాక్షి, సిటీబ్యూరో:

కాళేశ్వరంపై బుధవారం పీసీ ఘోష్ కమిషన్ ఎదుట మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరైన నేపథ్యంలో నగరంలోని బూర్గుల రామకృష్ణారావు భవన్ పరిసర ప్రాంతాల్లో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. ఈ కమిషన్ ఇప్పటి వరకు అనేక మంది ఉన్నతాధికారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లను ప్రశ్నించింది. గత శనివారం ఎంపీ ఈటల రాజేందర్, సోమవారం టి.హరీష్‌రావును పిలిచి విచారణ చేసింది. వీరి రాక నేపథ్యంలో పెద్దగా ఇబ్బంది లేకపోయినా.. బుధవారం కేసీఆర్ రాకతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా సంఖ్యలో బీఆర్‌కే భవన్ వద్దకు చేరుకుంటారని, కేసీఆర్‌కు సంఘీభావం తెలుపుతారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా భవన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మొత్తం మూడు అంచెల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు, భద్రత ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం నుంచే కొందరు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌కే భవన్ వద్దకు చేరుకున్నారు.

భవన్ ఎదురుగా ఉన్న రోడ్లలో ఒకదాంట్లోకి రాకపోకల్ని పూర్తిగా నిషేధించారు. రోప్‌లు ఏర్పాటు చేసిన అధికారులు ఎవరూ అక్కడికి రాకుండా చర్యలు తీసుకున్నారు. ఉదయం 11 గంటలకు బీఆర్‌కే భవన్‌కు కేసీఆర్ రావడంతో అక్కడ ఉన్న కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు భవన్ చుట్టుపక్కల, సమీపంలో ఉన్న ప్రాంతాలతో పాటు ఫ్లైఓవర్ వద్ద కూడా ఎవరినీ ఉండనీయలేదు. దీంతో మీడియా ప్రతినిధులతో అధికారులకు వాగ్వాదం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటన లేకుండా కేసీఆర్ తిరిగి వెళ్లడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

లక్డీకాపూల్ జంక్షన్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

రాత్రి 11 నుంచి తెల్లవారుజాము 5 వరకు

సాక్షి, సిటీబ్యూరో: వరద కాలువ నిర్మాణ పనుల కారణంగా లక్డీకాపూల్ జంక్షన్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సిటీ ట్రాఫిక్ చీఫ్ జోయల్ డెవిస్ బుధవారం ప్రకటించారు. ప్రతిరోజూ రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు ఇవి అమలులో ఉండనున్నాయి. ద్వారకా హోటల్ నుంచి లక్కీ రెస్టారెంట్ మీదుగా వెంకటేశ్వర హోటల్ వరకు 180 మీటర్ల పరిధిలో ఈ నిర్మాణం జరగనుంది. ఆయా సమయాల్లో వచ్చే వాహనాలను వివిధ మార్గాల్లో మళ్లించనున్నారు.

బడికి చలో!

సెలవులకు బైబై.. స్కూళ్లకు రయ్‌రయ్

- నేటి నుంచి పాఠశాలలు షురూ
- తరగతి గదుల ముస్తాబు
- ఆకట్టుకునేలా అలంకరణ
- సమస్యలు యథాతథం
- ప్రైవేట్‌లో ఫీజులు, పుస్తకాల మోత



సాక్షి, సిటీబ్యూరో: నూతన విద్యా సంవత్సరంలో గురువారం నుంచి బడి గంటలు మోగనున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఇక విద్యార్థులు ఉరుకులు పరుగులు పెట్టనున్నారు. చిన్నారులకు స్వాగతం పలికేందుకు, తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు ప్రైవేటు పాఠశాలలు, తరగతి గదులు అందంగా ముస్తాబయ్యాయి. విద్యాశాఖ ఆదేశాలతో సర్కారు బడులు సైతం తరగతి గదులను అందంగా అలంకరించారు. ఇప్పటికే సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాల్లో ప్రారంభం కాగా, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. టెక్నో, ఐటీ ఫౌండేషన్ పేరిట విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. బడ్జెట్ పాఠశాలలు కొత్త అడ్మిషన్ల కోసం పాట్లు పడుతున్నాయి. పదో తరగతిలో సాధించిన ఫలితాలతో ఆకర్షణీయ ప్రకటనలతో ఆకట్టుకుంటున్నాయి.

పేద కుటుంబాలపై ఆర్థిక భారం

ప్రతి నూతన విద్యా సంవత్సరం పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతోంది. కొత్త అడ్మిషన్ల కోసం డొనేషన్లు, స్కూల్ ఫీజులు, పుస్తకాలు, స్టేషనరీ తదితర ఖర్చులతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారింది. కొద్దోగొప్పో సంపాదన ఉన్న కుటుంబాల పరిస్థితి ఇలా ఉంటే... తక్కువ వేతనాలతో కాలం గడిపే అసంఘటిత కార్మికులు, చిరుద్యోగుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఇద్దరు పిల్లలున్న తల్లిదండ్రులు సాధారణ బడ్జెట్ స్కూల్లోనే రూ.లక్షకుపైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వాస్తవంగా కొన్ని ప్రైవేట్ స్కూళ్లు నిబంధనలకు విరుద్ధంగా స్టేషనరీ వ్యాపారాలు చేస్తున్నాయి. దీనిపై విద్యాశాఖ ప్రత్యేకంగా సర్క్యులర్ జారీ చేసినా.. ఫలితం లేకుండాపోయింది. స్కూళ్ల ప్రాంగణాల్లో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు యూనిఫాం, బెల్ట్, టై, డైరీ, లంచ్ బాక్స్, బ్యాగ్స్, షూస్.. ఇలా విద్యార్థులకు కావాల్సినవన్నీ బహిరంగంగానే విక్రయిస్తున్నాయి. కొన్ని స్కూళ్లయితే విద్యా సంస్థ పేరు సహా ఎమ్మార్పీ ముద్రించుకుని విద్యార్థులకు అంటగడుతున్నాయి. ఇతర షాపుల్లో కొనుగోలు చేసిన నోట్ పుస్తకాలను పరిగణించబోమని స్పష్టం చేస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు విధిలేని పరిస్థితుల్లో అక్కడే కొనుగోలు చేయాల్సి వస్తోంది.

గ్రేటర్ పరిధిలో 23 లక్షల మంది..

గ్రేటర్ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థలు కలిసి సుమారు 7,587 ఉండగా, వీటిలో దాదాపు 23 లక్షల మంది విద్యార్థులున్నట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరం కొత్తగా సుమారు లక్ష మంది వరకు చిన్నారులు ప్రైమరీ స్కూల్స్‌లో అడుగుపెట్టనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి సర్కారు బడుల్లో సైతం ఎల్‌కేజీలు, యూకేజీలు ప్రవేశపెట్టాలని విద్యాశాఖ నిర్ణయించింది. మొత్తమ్మీద హైదరాబాద్ జిల్లాలో 2,902 స్కూళ్లలో 9.90 లక్షలు, రంగారెడ్డి జిల్లాలో 2,761 స్కూళ్లలో 6.80 లక్షలు, మేడ్చల్ జిల్లాలో 1,924 స్కూళ్లలో 6.30 లక్షల మంది విద్యార్థులున్నారని అంచనా. ఇందులో సుమారు 17 లక్షల మందికిపైగా విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్నట్లు విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

పండుగ వాతావరణం కనిపించాలి

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

పాఠశాలల పునః ప్రారంభాన్ని పండుగ వాతావరణంలో జరుపుకోవాలని, ఇందులో విద్యార్థుల తల్లిదండ్రులను సైతం భాగస్వాములను చేయాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐఓఎస్, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. తొలిరోజే విద్యార్థులందరికీ అన్ని పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు కచ్చితంగా అందజేయాలని ఆదేశించారు. పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల హాజరు తెలియజేసే ఎఫ్ఆర్ఎస్‌ను మొదటి రోజు నుంచే ఉపయోగించాలని, విద్యార్థుల నమోదు, హాజరు గత సంవత్సరం కంటే ఎక్కువగా ఉండాలని సూచించారు. సమావేశంలో డీఈఓ ఆర్. రోహిణి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ కాలనీ స్థలాల కోసం సర్వే చేపట్టండి

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో:

హైదరాబాద్‌లో ఇందిరమ్మ మోడల్ కాలనీల స్థలాల కోసం సర్వే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో హౌసింగ్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, ప్లానింగ్ ఇంజినీరింగ్ విభాగాలు, అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అధికారులతో ఇందిరమ్మ మోడల్ కాలనీల ఏర్పాటుపై నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.

ఇందిరమ్మ మోడల్ కాలనీల కోసం ఇప్పటికే 15 ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో 20 ఏళ్లకు పైగా నివసిస్తున్న పేదలకు చేపట్టబోయే ఇందిరమ్మ మోడల్ కాలనీల్లో జీప్లస్ త్రీ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సైదాబాద్‌లోని సరళాదేవి నగర్, పిల్లి గుడిసెలు, మారేడుపల్లిలోని అంబేడ్కర్ నగర్, గురు బ్రహ్మ నగర్ తదితర ప్రాంతాల్లో సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సర్వేను వేగవంతంగా చేపట్టి నివేదిక అందించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గురు బ్రహ్మ నగర్‌లో హద్దులు, జూబ్లీహిల్స్‌లో ఉన్న 9 ఎకరాల ప్రభుత్వ భూమిని, అంబేడ్కర్ నగర్‌లోని 5 ఎకరాల భూమిలో సర్వే చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. డిఫెన్స్ భూముల్లోనూ సర్వే చేపట్టి ఆ వివరాలను అందించాలన్నారు. ఆ తదుపరి ప్రతిపాదనలు ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ విజయ్ కుమార్, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరాం, తహసీల్దార్లు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

‘దుమ్ము’ ధాం!

నగరంలో ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యం

- 100 దాటిన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్
- 150కి చేరిన పీఎం 10 ధూళి కణాలు
- నిర్మాణ, పారిశ్రామిక, వాహనాలు రద్దీగా ఉండే ప్రాంతాల్లో అధికం
- శ్వాసకోశ, కంటి సంబంధిత సమస్యలకు ఆస్కారం
- హెచ్చరిస్తున్న వైద్య నిపుణులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరుకుంటోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) వంద దాటి పరుగులు తీస్తోంది. రహదారులు దుమ్ము లేస్తున్నాయి. గాలి నాణ్యత 50 ఉండాల్సిన చోట 100 నుంచి 120గా నమోదవుతోంది. పీఎం10 (పార్టిక్యులేట్ మ్యాటర్) ధూళి కణాలు 150, పీఎం 2.5 ధూళి కణాల లెక్కలు 130 దాటుతున్నాయి. జూపార్క్, కోకాపేట్, సోమాజిగూడ, ఈసీఐఎల్, నాచారం, పాశమైలారం, న్యూ మలక్‌పేట్ తదితర ప్రాంతాల్లో గాలి నాణ్యత ఇండెక్స్ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఈ పరిస్థితులు శ్వాసకోశ, కంటి సంబంధిత వ్యాధులకు కారణమవుతున్నాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

ఈ ప్రాంతాల్లో పొంచి ఉన్న ప్రమాదం

- పారిశ్రామిక, నిర్మాణ రంగం జోరుగా ఉన్న ప్రాంతాలు, వాహనాలు అధిక సంఖ్యలో తిరిగే రహదారి పరిసర ప్రాంతాల్లో గాలి కాలుష్యం తీవ్రస్థాయిలో నమోదవుతోంది. పటాన్‌చెరు, ఐడీఏ పాశమైలారం, ఈసీఐఎల్ వంటి ప్రాంతాలతో పాటు నిర్మాణ రంగం జోరుగా ఉన్న కోకాపేట్, మియాపూర్, కేపీహెచ్‌బీ, మణికొండ, గండిపేట్, ఎల్‌బీనగర్ వంటి ప్రాంతాల్లో నాణ్యమైన గాలి లభించడం గగనమైపోయింది.
- నగరంలోని ప్రధాన రహదారులన్నీ కాలుష్య కారకాలుగా నిలుస్తున్నాయి. బంజారాహిల్స్, మెహిదీపట్నం, కోఠి, సికింద్రాబాద్, ఉప్పల్, లింగంపల్లి, సికింద్రాబాద్, అమీర్‌పేట్ తదితర ప్రాంతాల్లో వాహనాల రద్దీ అధికంగా కనిపిస్తోంది. మోటార్ సైకిల్ చోదకులు కళ్లలో దుమ్ము రేణువులు పడి సతమతమవుతున్నారు. ఐడీఏ పాశమైలారంలో పీఎం 10 సూక్ష్మ ధూళి కణాలు మంగళవారం 153 మైక్రో గ్రాములుగా(ఎంజీ) ఉండగా, బుధవారం 123 ఎంజీగా నమోదైంది. కోకాపేట్‌లో 136 ఎంజీ, నాచారంలో 130 ఎంజీగాను నమోదయ్యాయి. జూపార్క్ వద్ద పీఎం 10 సైజు మైక్రో ధూళి కణాలు 116 ఎంజీ ఉండగా, పీఎం 2.5 కణాలు 137 ఎంజీ ఉన్నాయి. నగరంలోని సనత్‌నగర్ ప్రాంతంలో నాణ్యమైన గాలి లభిస్తోందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రాంతం	గాలి నాణ్యత (ఏక్యూఐ)
జూపార్క్	116
ఈసీఐఎల్ కాప్రా	113
న్యూ మలక్‌పేట్	112
ఐడీఏ పాశమైలారం	106
సోమాజిగూడ	102
బంజారాహిల్స్	89
హైదరాబాద్	82
కోఠి	83
కేపీహెచ్‌బీ	84

వ్యర్థాల తరలింపుతో..

నగరంలో నిర్మాణ రంగం జోరుగా ఉన్న పలు ప్రాంతాల్లో ఇసుక, ఇటుకలు, సిమెంటు, మట్టి తవ్వకాలు, నిర్మాణ వ్యర్థాల తరలింపులో కనీసం జాగ్రత్తలు పాటించడం లేదు. దీంతో రహదారులు ఇసుక, మట్టి, కాంక్రీటు వ్యర్థాలతో దర్శనమిస్తున్నాయి. జీహెచ్ఎంసీ క్లీనింగ్ వాహనాలు పని చేస్తున్నప్పటికీ అవి కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతున్నాయి. రహదారికి కుడిచేయి వైపున్న డివైడర్ వైపు దుమ్మును క్లీన్ చేసి మమ అనిపిస్తున్నారు. నగరంలో జీహెచ్ఎంసీ చేపడుతున్న పై వంతెనలు, నాలాలు, ఇతర పలు అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉండటంతోనూ రహదారులు గాలి కాలుష్య కారకాలుగా మారుతున్నాయి.

కుమార్తె, మనవరాళ్లు కనిపించడం లేదంటూ మహిళ ఫిర్యాదు

వెంగళరావునగర్: తన కుమార్తె, మనవరాళ్లు కనిపించడం లేదంటూ ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం..కె.రమణ, భిక్షపతి దంపతులు రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె శిరీషకు 2012లో శివ అనే యువకుడితో వివాహం జరిపించారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. పెళ్లయిన నాటి నుంచి శిరీషను భర్త ఏదోరకంగా హింసిస్తున్నాడు. దాంతో గత ఏడు నెలలగా శిరీష తన ఇద్దరు కుమార్తెలతో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ నెల 6వ తేదీ శిరీష తన కుమార్తె ఆధార్ కార్డులో మార్పులు చేయిస్తానని ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రం వరకూ రాలేదు. ఫోన్ చేస్తే వస్తున్నానని చెప్పిందేగాని రాలేదు. మరుసటి రోజు తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన పిల్లలను హాస్టల్‌లో చేర్పించి, తాను జాబ్ చూసుకుంటానని చెప్పింది. అయితే నాటి నుంచి ఎన్నిమార్లు ఫోన్లు చేసినా సమాధానం లేదు. ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన శిరీష తల్లి రమణ బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంజారాహిల్స్‌లో వ్యభిచార గృహంపై దాడి



అరెస్టయిన వ్యభిచార గృహం నిర్వాహకులు, కస్టమర్లు, హౌస్‌కీపింగ్ సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ పోలీసులతో కలిసి వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ బృందం వ్యభిచారం గృహంపై దాడి చేసి నిర్వాహకుడితో పాటు ఇద్దరు హౌస్ కీపింగ్ సిబ్బంది, ముగ్గురు కస్టమర్లను అరెస్టు చేశారు. మరో నలుగురు మహిళలను రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు బంజారాహిల్స్ పోలీసులతో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వ్యభిచార గృహం నిర్వాహకుడు అనంతపురం జిల్లా కేశవరాయనిపేటకు చెందిన కుమ్మెత నరేందర్‌రెడ్డి, హౌస్ కీపింగ్ విధులు నిర్వర్తించే బీహార్‌లోని ముజఫర్‌పూర్ ప్రాంతానికి చెందిన ఆనంద్‌కుమార్, రాహుల్‌కుమార్‌లతో పాటు ముగ్గురు కస్టమర్లను పోలీసులు అరెస్టు చేశారు. అలాగే నలుగురు మహిళలను రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించారు. వీరి నుంచి రూ.26,500 నగదు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ హైవేపై ఘోర ప్రమాదం

కారును ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- అక్కడికక్కడే ముగ్గురు యువకుల మృతి
- మరో నలుగురికి తీవ్ర గాయాలు
- బర్త్ డే వేడుకలు చేసుకుని తిరిగి వస్తుండగా ప్రమాదం
- మృతులు, క్షతగాత్రులంతా సమీప బంధువులే





సాగర్‌రోడ్డుపై మాల్ గ్రామ సమీపంలో ప్రమాదానికి కారణమైన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, నుజ్జునుజ్జయిన కారు

యాచారం: నాగార్జునసాగర్– హైదరాబాద్ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంటకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతి వేగంగా వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎదురుగా వస్తున్న కియా కారును ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం, గుడిబండ గ్రామానికి చెందిన వాస సాయితేజ(24), వాస రాఘవేంద్ర(22), వాస పవన్‌కుమార్(26), వాస శివకుమార్, వాస సాయికుమార్(ఇద్దరు అన్నదమ్ములు), ఇదే జిల్లా మూసాపేట మండల కేంద్రానికి చెందిన మేకల సందీప్ సమీప బంధువులు. వీరంతా హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటున్నారు. మంగళవారం వాస శివకుమార్ పుట్టిన రోజు కావడంతో బీఎస్‌రెడ్డి నగర్‌కు చెందిన స్నేహితుడు శివకుమార్ గౌడ్‌తో కలిసి..ఉదయం నల్గొండ జిల్లా దేవరకొండ సమీపంలోని వైజాగ్ కాలనీకి వెళ్లారు. అక్కడ సంబ రాలు ముగించుకుని మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో తిరిగి హైదరాబాద్ బయల్దేరారు. మాల్ సమీపంలోకి రాగానే నగరం నుంచి దేవరకొండ వైపు వెళ్తున్న ట్రావెల్స్ బస్సు వీరి కారును ఢీకొట్టింది. ఈ సంఘటనలో సాయితేజ, రాఘవేంద్ర, పవన్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందారు. శివకుమార్, సాయికుమార్, శివకుమార్ గౌడ్, సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను మాల్, మన్నె గూడలోని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. పార్టీకి వెళ్లిన వారిలో పవన్‌కుమార్ ఒక్కడికే వివాహం జరిగింది. ఇతనికి భార్య వరలక్ష్మి, ఒక కూతురు ఉన్నారు. ప్రస్తుతం వరలక్ష్మి నాలుగు నెలల గర్భిణి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

సాగర్ రోడ్డుపై ట్రాఫిక్ జామ్

సాగర్ రోడ్డుపై జరిగిన ప్రమాదంతో గంటపాటు ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న యాచారం పోలీసులు అక్కడికి చేరుకుని కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను అతికష్టం మీద బయటకు తీశారు. ట్రావెల్స్ బస్సు, కారును ఢీకొన్న సమయంలో భారీ శబ్దం వచ్చిందని గ్రామస్తులు తెలిపారు. అతివేగం కారణంగానే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని తెలిపారు.



మృతులు పవన్‌కుమార్, సాయితేజ,రాఘవేంద్ర (ఫైల్)

సీఎం ఢిల్లీలోనే నోరెత్తుతారు ఎందుకో?

ఎమ్మెల్యే రాజాసింగ్

సాక్షి, సిటీబ్యూరో: 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలో నోరు మూసుకుని, ఢిల్లీ వెళ్లిన తరువాత నోరెత్తుతారు..ఆ సీక్రెట్ ఏంటో మాకు చెప్పాలి' అని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్‌మీడియాలో చేసిన ఈ కామెంట్స్ చక్కర్లు కొడుతున్నాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఎదురుగా ఉన్నప్పుడు మాట్లాడకుండా..ఢిల్లీలో ఆరోపణలు చేయడమేంటన్నారు. చెవులు లేని వారిని అడిగితే లాభం లేదు, వినేవారిని అడిగితే సమాధానం దొరుకుతుందని హితవు పలికారు. 'మీరు ఢిల్లీలోనే ఉన్నారు కదా..ప్రధాని మోదీని కలిసి మీరు చెప్పాల్సిన విషయాన్ని ఆయన ముందు పెట్టండి. తెలంగాణ అభివృద్ధికి ఎన్ని నిధులు ఇచ్చారనేది మేము ఎన్ని దఫాలు అసెంబ్లీ సాక్షిగా అడిగినా సమాధానం రావడం లేదు. మీరైనా ఆ జాబితాను పట్టుకుని రండి' అని కోరారు. గతంలో బీఆర్‌ఎస్ నేతలు అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారు. కనీసం మీరైనా నిజం చెప్తారన్న నమ్మకంతో మాట్లాడుతున్నానన్నారు. ప్రధానిని కలవండి చాలా పనులు అవుతాయని సీఎంకు రాజాసింగ్‌కు సూచించారు.

టీ కాస్తుండగా మంటలు అంటుకుని..

రహమత్‌నగర్: టీ కాచే క్రమంలో ఓ విద్యార్థినికి మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... ఎస్పీఆర్‌హిల్స్ ప్రాంతానికి మైనర్ బాలిక ఓ గురుకుల ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి చదువుతోంది. సెలవులకు ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో ఆ విద్యార్థిని ఈ నెల 9వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో టీ కాచేందుకు వంట గదిలోకి వెళ్లి టీ పెట్టింది. టీ గిన్నెను దించేందుకు సమీపంలో ఏమీ కనిపించక పోవడంతో తాను వేసుకున్న పంజాబీ డ్రెస్‌ను ఉపయోగించింది. అయితే, డ్రెస్‌కు మంటలు అంటుకోవడంతో అరుస్తూ బయటికి పరుగులు తీసింది. పొరుగు వారు వచ్చి మంటలార్పి విద్యార్థిని తల్లికి సమాచారం అందించి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుంది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా గంజాయి చాక్లెట్ల పట్టివేత

హయత్‌నగర్: గుట్టు చప్పుడు కాకుండా గంజాయి చాక్లెట్లు, నిషేధిత పొగాకు ఉత్పత్తులను అమ్ముతున్న ఓ దుకాణంపై దాడి చేసిన పోలీసులు బుధవారం రెండు టన్నుల గంజాయి చాక్లెట్లను గుర్తించి ఇద్దరిని అరెస్టు చేశారు. హయత్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం... యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం పుట్టపాక గ్రామానికి చెందిన గుండు శేఖర్ హయత్‌నగర్‌లోని శుభోదయ కాలనీలో ఉంటూ కుంట్లూర్ రోడ్డులో దుర్గా భవానీ ట్రేడర్స్ షాపు నిర్వహిస్తున్నాడు. అతనికి చౌటుప్పల్ ఆరెగూడెంలో నివాసం ఉండే బిహార్‌కు చెందిన రిషిశంకర్ మిశ్రా గంజాయి చాక్లెట్లను సరఫరా చేస్తున్నాడు. దీనిపై విశ్వసనీయ సమాచారంతో ఎస్ఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం షాపుపై దాడులు నిర్వహించారు. సెవెన్ మినార్ వట్టి, చార్మినార్ గోల్డ్ మునక్క పేర్ల లేబుల్స్‌తో ఉన్న సుమారు 2,035 కిలోల బరువు ఉన్న 10 గంజాయి చాక్లెట్ల బ్యాగులు దొరికాయి. వీటితో పాటు రూ.40 వేల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లు లభించాయి. దీంతో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ ఆలయ హుండీలో చోరీ.. పోలీసులకు ఫిర్యాదు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీలో నగదు దొంగలిస్తుండగా భక్తులు వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని ఆలయ వర్గాలకు అప్పగించారు. అయితే మైనర్ బాలుర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఆలయ వర్గాలు వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి చోరీ చేసిన నగదును తిరిగి హుండీలో వేయించి పంపించారు. అయితే కొద్ది రోజుల తర్వాత అందులో ఓ బాలుడు మళ్లీ ఆలయానికి వచ్చి అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆలయ ఏఈఓ రమేష్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 28వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఓ బాలుడు సన్నిధిలో ఉన్న హుండీలో నుంచి డబ్బులు తీస్తుండగా భక్తులు గమనించి తమకు అప్పగించారని, ఆ కొద్ది దూరంలోనే తమ విజిలెన్స్ సిబ్బంది మరో బాలుడిని పట్టుకోవడం జరిగిందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. హుండీ నుంచి చోరీ చేసిన రూ.1210 స్వాధీనం చేసుకుని తిరిగి హుండీలో వేయించామని, ఆ ఇద్దరు బాలురకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇప్పించి పంపించడం జరిగిందన్నారు. ఈ నెల 9వ తేదీన ఉదయం 11 గంటల సమయంలో ఇందులో ఒక బాలుడు ఆలయ ప్రాంగణంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా గమనించామన్నారు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకు ఎదురెళ్లి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: వేగంగా వస్తున్న రైలుకు ఎదురెళ్లి ఓ వ్యక్తి సికింద్రాబాద్ రైల్వే పీఎస్ పరిధిలో ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్‌రాజు వివరాల ప్రకారం..ఘట్‌కేసర్‌కు చెందిన నీరుడు నర్సిగరావు (36) డ్రైవర్. బుధవారం మధ్యాహ్నం ఘట్‌కేసర్ అప్‌లైన్ రైల్వేట్రాక్ వద్దకు చేరుకున్నాడు. కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు వేగంగా వస్తున్న రైలు కింద దూకేందుకు ప్రయత్నించాడు. ఈ ఘటనలో రైలు ఇంజిన్ కొక్కేనికి తట్టుకున్న నర్సింగరావును రైలు కొద్దిదూరం ఈడ్చుకు వచ్చింది. ఈ ఘటనలో గొంతులో కొక్కెం దిగి, కాళ్లు విరిగిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతుడు ఘట్‌కేసర్‌కు చెందిన నర్సింగరావుగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

అనుమానంతో భార్యను చంపిన భర్త



సౌందర్య (ఫైల్)

జవహర్‌నగర్: భార్యను రాడ్డుతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమ్మిడి అశోక్ (36), సౌందర్య (32) దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఉండగా..అశోక్ తరచు మద్యం తాగి వచ్చి వేధిస్తుండడంతో సౌందర్య వేరుగా ఉంటోంది. ఇంతకు ముందే అశోక్‌పై పోక్సో కేసు నమోదైంది. పలుమార్లు జైలుకు కూడా వెళ్లివచ్చాడు. ఈక్రమంలో తన భార్యకు వేరే వారితో వివాహేతర సంబంధం ఉందని అశోక్ అనుమానించాడు. బుధవారం పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న సౌందర్యను అశోక్ కాపుకాచి ఆమె తలపై ఇనుప రాడ్డుతో కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించామని, నిందితుడు అశోక్‌ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లాడని మందలించినందుకు...

అత్తను హత్యచేసిన అల్లుడు



బుజ్జమ్మ మృతదేహం

ఘట్‌కేసర్: సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లినందుకు ఓ అత్త ఆగ్రహించి అల్లుడిని మందలించింది. దీంతో అతడు కక్ష పెంచుకొని అత్తను హత్య చేసిన సంఘటన ఘట్‌కేసర్‌లో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మైసమ్మగుట్ట కాలనీకి చెందిన మంజుల బుజ్జమ్మ (40), అంబన్న దంపతుల రెండో కుమార్తె గీతకు శేరిలింగంపల్లికి చెందిన దొరబాబుతో ఐదేళ్ల క్రితం వివాహం జరిపించారు. జీవనోపాధికోసం వారు ఘట్‌కేసర్‌కు వలస వచ్చారు. స్థానికంగా రాళ్లు కొడుతూ అత్తగారి ఇంటి పక్కనే నివాసం ఉంటున్నాడు. నాలుగు రోజుల క్రితం దొరబాబు అత్త ఫోన్ ఎత్తుకెళ్లి రూ.1500కు విక్రయించి మద్యం తాగాడు. దీనిపై ఆగ్రహించిన బుజ్జమ్మ ఫోన్ ఎత్తుకెళ్లి ఎందుకు విక్రయించావు, డబ్బులు ఏం చేశావని నిలదీసింది. దీంతో ఇరువురి మధ్యన గొడవ జరిగింది. గతంలోను ఇలాంటి గొడవలు జరగడంతో ఆమెపై దొరబాబు కక్ష పెంచుకున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం దొరబాబు భార్య గీత, ఆమె సోదరి గౌరితో కలిసి జనగామ జిల్లా కర్నపూర్‌లోని చర్చికి వెళ్లారు. ఒంటరిగా ఉన్న దొరబాబు మద్యం సేవించి ఉండగా రాత్రి ఇంట్లో తేలు కుట్టిందని పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లి తిరిగి ఉదయం 4.30 ప్రాంతంలో ఇంటికొచ్చాడు. ఆ సమయంలో బుజ్జమ్మ ఒంటరిగా నిద్రపోతున్న విషయం గమనించి చంపేయాలని అనుకున్నాడు. వెంటనే ఆమె ముఖంపై దిండు అదిమిపెట్టి ఊపి రాడకుండా చేశాడు. అనంతరం గొంతు నులిమి హత్య చేసి..ఇంటికి గడియ వేసి వెళ్లిపోయాడు. ఉదయం ఇంటికొచ్చిన కూతుళ్లకు తల్లి మరణించి కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు దొరబాబును అదుపులోకి తీసుకొని విచారించగా అత్తను తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. ఫోన్ చోరీ విషయమై జరిగిన గొడవను మనసులో పెట్టుకొని అత్తను హత్య చేసినట్లు విచారణలో తేలింది. గాంధీ ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి చిన్న కూతురు గౌరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరం మీదుగా బెంగళూరుకు డ్రగ్స్ రవాణా

- ఒడిశాలో హాష్ ఆయిల్ తయారు చేసి విక్రయం
- రికార్డు స్థాయిలో 20 కేజీలు పట్టివేత
- ఇద్దరు నిందితుల అరెస్టు..



సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

నాగోలు: ఒడిశా రాష్ట్రంలో హాష్ ఆయిల్‌ను తయారు చేసి హైదరాబాద్ మీదుగా బెంగళూరుకు రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద రూ.1.20 కోట్ల విలువైన 20 కేజీల హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పాంగి కేశవరావు, కోరాపుట్ జిల్లా ఒడిశాకు చెందిన జయరాం ఖేముండు స్నేహితులు. సులభంగా డబ్బులు సంపాదించాలని ఆలోచనతో మాదకద్రవ్యాల రవాణాకు ప్లాన్ చేశారు. వీరు ఒడిశాలో తక్కువ రేటుకు హాష్ ఆయిల్‌ను కొని 10 రెట్లు ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గంజాయి వ్యాపారి కృష్ణతో పరిచయం పెంచుకున్నారు. కృష్ణ నుండి వారు 20 కిలోల హాష్ ఆయిల్‌ను సేకరించి బెంగళూరుకు చెందిన ఒక వ్యక్తికి విక్రయించడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. హాష్ ఆయిల్‌ను తీసుకుని హైదరాబాద్ మీదుగా బెంగళూరు చేరుకోవడానికి పెద్దఅంబర్‌పేట వచ్చారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు, అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు కలిసి కేశవరావు, జయరాంలను బుధవారం పట్టుకున్నారు. ప్రధాన నిందితుడైన కృష్ణ పరారీలో ఉన్నాడు. అతడు ఆర్టీఏ ఏజెంట్ కూడా కావడంతో అతన్ని త్వరలోనే పట్టుకుంటామని సీపీ వెల్లడించారు.


40 కేజీల గంజాయితో కేజీ హాష్ ఆయిల్ తయారీ

ఒక కేజీ హాష్ ఆయిల్ తయారీకి దాదాపు 40 కేజీల గంజాయి ఉపయోగిస్తారని, అంటే 20 కేజీల హాష్ ఆయిల్ తయారు చేయడానికి 800 కేజీల గంజాయి ఉపయోగిస్తారని సీపీ సుధీర్‌బాబు పేర్కొన్నారు. గంజాయి కంటే హాష్ ఆయిల్ రవాణా చేయడం సులభం అవుతోందని, అందుకే స్మగ్లర్లు ఈ మార్గం ఎంచుకున్నారని చెప్పారు.

రికార్డు స్థాయిలో..

కాగా ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీస్ అధికారులకు సీపీ ప్రత్యేక రివార్డులు అందజేశారు. రాచకొండ పరిధిలో 20 కేజీల హాష్ నూనెను పట్టుకోవడం రికార్డు అని ఇంతకు ముందు వీరే 13.5 కేజీల హాష్ నూనెను పట్టుకున్నారని, వారి రికార్డును వారే బద్దలు కొట్టారని సీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి డీసీపీ మనోహర్, అడిషనల్ డీసీపీ ఎస్‌ఓటీ ఎండీ షాకీర్ హుస్సేన్, ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రతి సర్కిల్ పరిధిలో కనీసం 5 షాపులను తనిఖీ చేయాలన్న కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో బుధవారం సుమారు 60 స్వీట్ షాపులను తనిఖీ చేశారు. గుర్తించిన లోపాలను సరిదిద్దడానికి నోటీసులు జారీ చేశారు. ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రతా ప్రమాణాలను పాటించాలని, వంటగది ప్రాంగణాన్ని శుభ్రంగా ఉంచాలని ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లకు సూచించారు. ప్రదర్శన కౌంటర్లలో ఉంచిన ఆహార పదార్థాలకు సరైన లేబులింగ్ చేయాలని చెప్పారు.

మేయర్‌ను దూషించిన నిందితుడి అరెస్టు



నిందితుడు మజ్జిగ రమేష్

బంజారాహిల్స్: గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు ఆమె తండ్రి, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావును వ్యక్తిగతంగా దూషించిన కేసులో నిందితుడిని బంజారాహిల్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..ఐడీపీ బొల్లారం శ్రీరామ్‌నగర్ బస్తీలో నివసించే మజ్జిగ రమేష్ (36) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. బుకింగ్‌లో భాగంగా ఈ నెల 1వ తేదీన క్యాబ్‌లో ప్రయాణికులను తీసుకుని రాజమండ్రి వెళ్లాడు. ఖాళీగా ఉన్న సమయంలో యూట్యూబ్ చూస్తుండగా బోరబండలో బీఆర్‌ఎస్ సీనియర్ నేత సర్దార్ ఆత్మహత్య చేసుకున్నాడని, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ వేధింపులను తట్టుకోలేకనే మృతి చెందినట్లుగా చూశాడు. దీంతో అదే రోజు రాత్రి గూగుల్‌లో సెర్చ్‌చేసి బాబా ఫసీయుద్దీన్ నెంబర్ సేకరించి ఆయనను తిడదామని ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. వెంటనే గూగుల్‌లో మరోసారి సెర్చ్ చేసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నెంబర్‌ను సేకరించాడు. అదే రోజు రాత్రి మేయర్‌కు ఫోన్ చేసి బోరబండ బీఆర్‌ఎస్ మైనార్టీ నేత సర్దార్ మృతి ఘటనలో దోషులను మీరంతా రక్షిస్తున్నారని, కాంగ్రెస్‌లో చేరిన తర్వాత మీరంతా ఒక్కటయ్యారని అసభ్య పదజాలంతో దూషించాడు. ఆ తెల్లవారి రాత్రి కూడా మరోసారి మేయర్‌కు ఫోన్ చేసి ఆమెను, ఆమె తండ్రిని వ్యక్తిగత దూషణలతో వేధించాడు. మరో మారు ఈ నెల 5వ తేదీన కూడా అర్ధరాత్రి ఫోన్ చేసి ఆమెను తీవ్ర ఇబ్బందులకు గురిచేశాడు. ఇలా మూడు సార్లు ఫోన్ చేసి తీవ్ర ఇబ్బందులు పెట్టాడు. దీంతో మేయర్ పీఆర్ఓ అఖిల్ ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలంటూ నిందితుడి ఫోన్ నెంబర్‌తో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని గత మూడు రోజులుగా నిందితుడి కోసం గాలింపు చేపట్టి శ్రీరామ్‌నగర్‌లోని ఇంట్లో బుధవారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. నిందితుడు క్యాబ్ నడిపిస్తుంటాడని, సొంతంగా కారు ఉందని, బీఆర్‌ఎస్ అభిమానిగా పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇదిలా ఉండగా మేయర్‌కు ఫోన్ చేసిన రోజు రాత్రి నిందితుడు పీకల దాకా మద్యం తాగి ఉన్నట్లు, మద్యం మత్తులోనే ఫోన్లు చేసినట్లుగా నిర్ధారణ అయ్యింది. నిందితుడిని అరెస్టు చేసి బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల నేపథ్యంలో హెచ్‌పీ రోడ్డు, ఎల్లమ్మ ఆలయం 11 కేవీ ఫీడర్లు ఐడీపీఎల్, బేగంపేట సబ్‌స్టేషన్ల పరిధిల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హెచ్‌పీ రోడ్డు, లక్ష్మీకళ, శ్రీరాములు థియేటర్ల ఏరియాలు, అశ్వినీ హెయిర్ ఆయిల్ లైన్, ఎల్లమ్మ దేవాలయం, బల్కంపేట, సాయిబాబా దేవాలయం, రేణుకానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. శంకర్‌లాల్‌నగర్, బాపూనగర్ 11 కేవీ ఫీడర్లు, జనప్రియ, ఈఎస్‌ఐ సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రేమ్‌నగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్, గోల్ థియేటర్ వెనుక లైన్లలో, బాపూనగర్, జస్టిస్ ఎన్.వి.రమణ బంగళా లైన్, అప్పర్ వాటర్‌ట్యాంక్, ఆంధ్రాబ్యాంకు లైన్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన వివరించారు.

శ్రీకృష్ణ మందిర నిర్మాణ పనులు ప్రారంభం

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ఇందిరానగర్ ఫేజ్–2 బస్తీలోని శ్రీకృష్ణ మందిరం అభివృద్ధి పనులు బుధవారం పునః ప్రారంభమయ్యాయి. దాదాపు 14 సంవత్సరాల క్రితం స్థానిక అమ్మవారి ఆలయ ఆవరణలో ఒక చిన్న కృష్ణ మందిరాన్ని ఏర్పాటు చేశారు. పెరుగుతున్న శ్రీకృష్ణ భగవానుడి భక్తులు పూజలు దృష్ట్యా ఈ ఆలయాన్ని పునఃప్రారంభించాలని స్థానిక యాదవ సంఘం నాయకులు నిర్ణయించారు. ఈ క్రమంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల సమక్షంలో ఆలయ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పల్లె లింగయ్య యాదవ్, పల్లె గురుమూర్తి యాదవ్, మల్లేశ్ యాదవ్, ఆలయ ధర్మకర్త వేముల యాదయ్య, బస్తీ నాయకులు చెన్నయ్య, వెంకటేశ్ ,భరత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్



బంజారాహిల్స్ రోడ్ నెం.2 ఇందిరానగర్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్: బస్తీలు, కాలనీల్లో గుట్టలుగా పేరుకుపోయిన వ్యర్థాలతో పాటు నిర్మాణ వ్యర్థాలను తొలగించేందుకు అధికారులు చేస్తున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో స్పెషల్ డ్రైవ్ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఇందిరానగర్‌తో పాటు జవహర్ కాలనీ, సాగర్ సొసైటీ, కమలాపురి కాలనీ ప్రాంతాల్లో నెలలుగా తరలని వ్యర్థాలను సిబ్బంది తొలగించారు. డివిజన్ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్నారు.

ఫొటోలను మార్ఫింగ్ చేసి యువతికి వేధింపులు

మాజీ స్నేహితుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్: స్నేహితుడు కదాని చనువుగా ఉంటే శారీరకంగా కలావలంటూ యువతిని ఒక యువకుడు వేధిస్తున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... సంగారెడ్డి జిల్లాకు చెందిన యువతి స్థానికంగా నివాసం ఉంటుంది. ఆమెకు 2021లో మూసాపేటలో నివాసం ఉండే బి.హేమంత్‌కుమార్‌తో పరిచయం అయింది. కొద్దిరోజులు ఫోన్లు చేసుకుంటూ స్నేహంగా ఉంటున్న హేమంత్ తనను శారీరకంగా కలవాలని ప్రపోజ్ చేశాడు. దాంతో ఆ యువతి తిరస్కరించింది. దీనికి ఆగ్రహించిన హేమంత్ ఇరువురూ స్నేహంగా ఉన్న ఫొటోలను మార్ఫింగ్ చేసి బెదిరిస్తున్నాడు. తనతో శారీరకంగా ఉండటపోతే సోషల్ మీడియాలో పెడతానంటూ వేధిస్తున్నాడు. విసిగిపోయిన యువతి బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల నిరసన



నిరసనలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు

ఫిలింనగర్: తెలంగాణను ఆవిర్భావం నుంచి అభివృద్ధి పథంలో నడిపించిన మహానాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల కుట్రలు, కుతంత్రాలతో, ఓర్వలేని రాజకీయాలతో విచారణ జరపడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బుధవారం ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీఆర్కే భవన్‌కు తరలివెళ్లారు. జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో పాటు ఫిలింనగర్ నుంచి నేతలు, కార్యకర్తలు ర్యాలీగా వెళ్లారు. ప్రభుత్వ విధానాన్ని ఎండగట్టారు. కేసీఆర్‌ను విచారణకు పిలవడాన్ని తప్పుబట్టారు. తెలంగాణను అగ్రపథాన నిలిపిన కేసీఆర్‌ను విచారణ పేరుతో ఇబ్బందులకు గురిచేయడం సరికాదని వారన్నారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన కార్యకర్తలు కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేయడంతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. వీరందరినీ పోలీసులు దూర ప్రాంతాల్లోనే నిలిపివేశారు.

‘అమ్మ మాట-అంగన్‌వాడీ బాట’

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు మరూ
- ఆరు రోజుల పాటు రోజుకో కార్యక్రమం
- ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు
- అమలు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



ఫిలింనగర్‌లోని గౌతంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల కోసం ఎగ్ బిర్యానీ సిద్ధం చేసిన టీచర్



బంజారాహిల్స్: అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్యపై అవగాహన పెంచేందుకు పటిష్టమైన ప్రణాళికలతో ముందుకువచ్చింది. ఇందులో భాగంగా ఈ నెల 11 నుంచి 16వ తేదీ వరకు ‘అమ్మ మాట–అంగన్‌వాడీ బాట’ పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది.

- ఆరు రోజుల పాటు ఐసీడీఎస్ ఖైరతాబాద్ సర్కిల్–2 పరిధిలో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించడమే కాకుండా అంగన్‌వాడీ టీచర్లకు రోజువారీ కార్యక్రమాలపై షెడ్యూల్‌ను అందజేసింది.
- బుధవారం ఐసీడీఎస్ ఖైరతాబాద్ పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట డివిజన్ల కిందికి వచ్చే 151 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ‘అమ్మ మాట–అంగన్‌వాడీ బాట’ కార్యక్రమం ప్రారంభమైంది. మొదటి రోజు చిన్నారులకు, గర్భిణులకు కేంద్రాల్లో ఎగ్ బిర్యానీ వండి తినిపించారు. ముఖ్యంగా పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఆరేళ్ల లోపు సుమారు 18,000 మంది చిన్నారులు ఉన్నట్లు సమాచారం. వీరిలో చాలామంది చిన్నారులను కేంద్రాల్లో చేర్పించేలా ఈ కార్యక్రమం ద్వారా కృషి చేయనున్నారు. అవగాహన ర్యాలీలు, సమావేశాలు, సామూహిక కార్యక్రమాలు, స్వచ్ఛ అంగన్‌వాడీ, పెరటి తోటల పెంపకంతో పాటు సామూహిక అక్షరాభ్యాసాలు వంటి కార్యక్రమాలతో విస్తృత ప్రచారానికి ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు వాటిని సమర్థవంతంగా అమలుచేయాలని నిర్ణయం తీసుకున్నారు.

కార్యక్రమాల వివరాలు ఇలా..

- బుధవారం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు అంగన్‌వాడీ కేంద్రాలను శుభ్రం చేసి అలంకరించారు. పిల్లలు, లబ్ధిదారులు కేంద్రాలకు వచ్చి సెల్ఫీలు, ఫొటోలు దిగారు. బస్తీ స్థాయిలో ప్రజా ప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు నిర్వహించారు.
- గురువారం మూడేళ్ల నెలలు పైబడిన చిన్నారులను గుర్తించి వారి నివాసాలకు వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. కొత్తగా పిల్లలను చేర్చుకుని ఐదేళ్లు దాటిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి ప్రభుత్వ, ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించే ప్రణాళికను తయారుచేసుకుంటారు.
- 12, 13 తేదీల్లో పెరటి తోటల పెంపకం పేరుతో పోషకాహారం నిల్వలు ఉండే ఆకు కూరలు, కూరగాయలను ఇంట్లోనే ఎలా పండించుకోవచ్చో వివరిస్తారు. పోషకాహారం ప్రాధాన్యాన్ని వివరించి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తారు.
- ఆఖరు రోజున తల్లిదండ్రులు బస్తీ పెద్దల సమక్షంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. పూర్వ ప్రాథమిక విద్య, అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించుకుంటారు.
- ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లు తమ తమ కేంద్రాల్లో తగిన ప్రణాళికలతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు షెడ్యూల్ రూపొందించుకున్నారు.

ప్రాణాలను కాపాడే ఆయుధం హెల్మెట్

- వాహనదారులు తప్పక గుర్తుంచుకోవాలి
- బంజారాహిల్స్ ట్రాఫిక్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్



రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్

బంజారాహిల్స్: టీటీఐ బేగంపేట ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని బ్రియో టెక్నాలజీస్ కంపెనీ సిబ్బందికి బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాష్‌గౌడ్ హాజరై ప్రమాదాల నివారణపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అతి వేగం అంతిమ ప్రయాణం అవుతుందన్న విషయం గుర్తుంచేకోవాలన్నారు. అందరూ రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ తదితర ట్రాఫిక్ ఉల్లంఘనలు చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దాని వల్ల వారి అమూల్యమైన ప్రాణాలు పోగొట్టుకోవడమే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా హాని కలిగించడం వల్ల వారి కుటుంబాల్లో విషాద ఛాయలు నెలకొంటున్నాయన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపడం అతి ప్రమాదకరమన్నారు. వాహనాలు ఎప్పుడూ కూడా నిర్లక్ష్యంగా నడపరాదన్నారు. వారికి కలిగిన సందేహాలను కూడా వివరించారు. కార్యక్రమంలో దాదాపు 150 మంది కంపెనీ సిబ్బంది, బ్రియో ఐటీ కంపెనీ డైరెక్టర్లు సయీద్ పర్వాన్, సయీద్ ఇమ్రాన్, అబ్దుల్ ముసీం, బేగంపేట టీటీఐ సిబ్బంది అయాన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలి: డీసీ సమ్మయ్య



బంజారాహిల్స్: ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్ల పక్కన చెత్తాచెదారం వేయకుండా తమ ఇంటి వద్దకే వచ్చే స్వచ్ఛ ఆటోలకు చెత్తను అందించాలని జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీసీ సమ్మయ్య కోరారు. ముందస్తు వర్షాకాల శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్‌ను బుధవారం ఆయన ఫిలింనగర్‌లో ప్రారంభించారు. ఈ నెల 3 నుంచి 27వ తేదీ వరకు కొనసాగనున్న ఈ డ్రైవ్‌లో భాగంగా పచ్చదనం–పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, వ్యర్థాలు, చెత్తను రోడ్లపై వేయడం వల్ల తలెత్తుతున్న సమస్యలను వివరిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ తమ పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా తీసుకోవాలన్నారు. చెత్త కుప్పలు పేరుకుపోయిన చోట వెంటనే వాటిని తొలగించాలని ఎస్ఎఫ్ఏలకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో అంటురోగాలు ప్రబలకుండా ఉండాలంటే, దోమలు వ్యాప్తి చెందకుండా అరికట్టాలంటే పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని సూచించారు.

నేడు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాల పంపిణీ



స్కూల్ యూనిఫాంలు చూపిస్తున్న టీచర్లు



పాఠ్య పుస్తకాలు సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయులు

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభం కానుండగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు బుధవారం విద్యార్థులకు అందజేసే స్కూల్ యూనిఫాంలతో పాటు పాఠ్య పుస్తకాలు సిద్ధం చేశారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 17 ప్రభుత్వ ఉన్నత, 43 ప్రాథమిక పాఠశాలలకు ఇప్పటికే విద్యార్థులకు అందజేయాల్సిన యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. టీచర్లు వీటన్నింటినీ సిద్ధం చేసుకుని తరగతుల వారీగా వారి వివరాలను రాసుకున్నారు. ఆరు నెలల క్రితమే ఆయా విద్యార్థుల దుస్తుల కొలతలు తీసుకున్నారు. దాని ప్రకారమే స్వయం సహాయక బృందాల సభ్యులు వీటిని కుట్టారు. గతంలో కంటే ఈ విద్యా సంవత్సరం ప్రతి విద్యార్థికి తగిన రీతిలో దుస్తులు స్టిచ్చింగ్ చేసి ఇచ్చారు. బడుల ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందివ్వాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం విద్యార్థులకు పండుగ వాతావరణంలో వీటిని పంపిణీ చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



వెంగళరావునగర్: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు లాల్ బహదూర్‌శాస్త్రి సేవానికేతన్ లైబ్రరీ కమిటీ ఆర్థిక సాయాన్ని అందజేసింది. యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లోని కమిటీ కార్యాలయంలో బుధవారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని నిరుపేద విద్యార్థినీ విద్యార్థులను 15 మందిని ఎంపిక చేసి, వారు ఇంటర్ చదువుకోవడానికి ఒకొక్కరికి రూ. 21 వేల చొప్పున ఆర్థిక సాయం అందించింది. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు రాంచందర్ మాట్లాడుతూ... దాతల సహకారంతో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు విద్యార్థులకు అందిస్తామని చెప్పారు. లాల్‌బహదూర్ శాస్త్రి సేవా నికేతన్ లైబ్రరీ కమిటీ వ్యవస్థాపక కార్యదర్శి నర్సింహులు, కోశాధికారి ఇక్బాల్ అహ్మద్, నేతలు రంగారావు, కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంక్షేమ నిధి ట్రస్ట్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్రావు

వెంకటేశ్వరకాలనీ: తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ సంక్షేమ నిధి నుంచి అర్చకులకు, ఉద్యోగులకు లభిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. వెంకట్రావు కోరారు. శ్రీనగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హైదరాబాద్ జిల్లా రీజియన్ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బందికి ఆయన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అర్చకులు, ఉద్యోగులకు మరణానంతరం, రిటైర్మెంట్ అనంతరం చెల్లించే గ్రాంటుతో పాటు ధూప దీప నైవేద్య ఖర్చులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ గ్రాంటు, రెగ్యులర్ ఉద్యోగుల రుణాలు, ఉపనయనం గ్రాంటు, ఇంటి నిర్మాణ రుణాలు, మరమ్మతుల రుణాలు విద్య, విధులు నిర్వహించలేని వికలాంగులైన ఉద్యోగులు గ్రాంట్ వంటి పథకాల గురించి ఆయన వివరించారు. ఈ పథకాల అమలులో ప్రభుత్వం పలు మార్గదర్శకాలు అందించిందని వాటి ప్రకారం ఉద్యోగులు అర్హత కలిగిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రవీంద్రాచార్యులు, అగ్రిహోత్రం చంద్రశేఖర్ శర్మ, మారుతి సత్యనారాయణ శర్మ, కృష్ణమాచార్యులు, బద్రీనాథ్ చార్యులు, వాసుదేవ శర్మ, మురళీధర శర్మ ఏడీసీ ఆర్‌జేసీలు, సహాయ కమిషనర్లు, కార్యనిర్వహణ అధికారులు, పాల్గొన్నారు.

పార్కులో మొక్కలు నాటిన కార్పొరేటర్

ఫిలింనగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిలింనగర్‌లోని జీహెచ్ఎంసీ పార్కులో బుధవారం మొక్కలు నాటారు. జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీసీ సమ్మయ్యతో కలిసి జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పార్కులో మొక్కలు నాటారు. స్థానికులు ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ప్రతిఒక్కరూ కార్యక్రమంలో భాగంగా తమ తమ పరిధిలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని వారు సూచించారు.



మంత్రి వివేక్‌కు అభినందన



బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర నూతన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిని బుధవారం ఫిలింనగర్‌కు చెందిన పలువురు దళిత నేతలు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మాల వెలుగు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోకేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మీ, రాష్ట్ర కార్యదర్శి రాజలింగం, దండు మన్యం, సాయిబాబా తదితరులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లి ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. మీ అందరి ఆశీస్సులు, ఆదరాభిమానాలతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని ఈ సందర్భంగా మంత్రి వివేక్ వారితో అన్నారు.

క్రీడల్లో సత్తాచాటుతున్న యువత



చిన్నారులతో జాతీయ బ్యాడ్మింటన్ చాంపియన్ తరుణ్ కోన

వెంగళరావునగర్: గతంలో విద్యార్థినీవిద్యార్థులు పుస్తకాలతోనే కుస్తీలు పడుతూ విజయాన్ని సాధించారని, అయితే ప్రస్తుతం యువత అటు చదువుతోపాటు ఇటు క్రీడల్లో సైతం రాణిస్తూ తమ సత్తాను ప్రపంచ వ్యాప్తంగా చాటుతున్నారని నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్ తరుణ్ కోన అన్నారు. మధురానగర్‌కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో షటిల్ బ్యాడ్మింటన్ సమ్మర్ కోచింగ్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపు ముగిసిన అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజయం సాధించిన వారికి అభినందనలు తెలియజేస్తూ ప్రత్యేక సమావేశాన్ని మధురానగర్ క్రీడా ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన తరుణ్ కోన మాట్లాడుతూ... ప్రతి విద్యార్థిలో మల్టీ టాలెంట్ ఉండాలని సూచించారు. పోటీల్లో విజయం సాధించిన వారికి ఆయన బహుమతులు, మెడల్స్ అందజేసి అభినందించారు. మధురానగర్‌కాలనీ సంక్షేమ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కోశాధికారి, సంయుక్త కార్యదర్శితో పాటుగా ఈసీ మెంబర్లు, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఎస్సీ లా విద్యార్థులకు ఆర్థిక సాయం

'అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్'లో శిక్షణకు ఆహ్వానం: ఉప సంచాలకులు

లక్డీకాపూల్: ఎస్సీ న్యాయవాద గ్రాడ్యుయేట్ విద్యార్థినీ విద్యార్థులకు ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ హైదరాబాద్ జిల్లా ఉప సంచాలకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లా గ్రాడ్యుయేట్ల నమోదు రుసుము, స్టైపండ్, వన్ టైమ్ గ్రాండ్ మొత్తాన్ని పెంచామని పేర్కొన్నారు. స్టైపండ్‌ను వెయ్యి నుంచి రూ.3 వేలకు పెంచామని తెలిపారు. డిజిటల్ పుస్తకాలు, కంప్యూటర్, ఫర్నీచర్, లాయర్ డ్రెస్ కోసం ఒక్కో అభ్యర్థికి గ్రాంట్‌ను రూ.5 వేల నుంచి రూ.50 వేలకు పెంచినట్లు తెలిపారు. హైదరాబాద్ జిల్లాలోని అర్హత గల షెడ్యూల్డ్ కులాల లా గ్రాడ్యుయేట్లకు అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు. జులై 31వ తేదీలోగా విద్యార్థులు tgepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఫ్యాటీ లివర్ ప్రమాదకరం

ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: గుండెపోటు నుంచి మధుమేహం వరకు కార్డియో మెటబాలిక్ వ్యాధులకు కేంద్రంగా ఫ్యాటీ లివర్ నిలుస్తోందని ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్లోబల్ ఫ్యాటీ లివర్ డే సందర్భంగా ఏఐజీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత విస్తృతమైన కాలేయ వ్యాధుల్లో ఫ్యాటీ లివర్ ఒకటని తెలిపారు. దాదాపు ప్రతి నలుగురిలో ఒకరు ఈ వ్యాధి బాధితులని పేర్కొన్నారు. ఫ్యాటీ లివర్ ఒక అంటు వ్యాధిగా ప్రారంభమైందన్నారు. వ్యాధులకు నిజమైన పరిష్కారం అవగాహనే అని పేర్కొన్నారు. లివర్ హెల్త్‌పై పాఠశాలలు, ఇల్లు, కమ్యూనిటీ ప్రదేశాల్లో మాట్లాడుకోవాల్సిన అవసరం ఉందని, యుక్త వయసులోనే అవగాహన కలిగి ఉండటం చికిత్స కంటే శక్తివంతమైనదని అన్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం, బరువు నిర్వహణ వంటి జీవనశైలి మార్పులు ఫ్యాటీ లివర్ వ్యాధిని నివారించడానికి ఉపయోగపడతాయని పలువురు వైద్యనిపుణులు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఆనంద్ కులకర్ణి, డాక్టర్ అంజు కపాడియా, డాక్టర్ పీఎన్‌రావు, డాక్టర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాకు మాన్సూన్ పనులు ఇవ్వొద్దు

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కోరిన బీజేపీ కార్పొరేటర్లు



లక్డీకాపూల్: మాన్సూన్ పనులను పూర్తిగా హైడ్రాకు వదలడంపై బీజేపీ కార్పొరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌ను బీజేపీ కార్పొరేటర్లు శ్రవణ్, శ్రీవాణి, మహేందర్ తదితరులు కలిసి మాన్‌సూన్ పనులను పూర్తిగా హైడ్రాకు వదలొద్దని విజ్ఞప్తి చేశారు. ఎమర్జెన్సీలో చెట్లు కూలినా, నాలాలో ఎవరైనా పడినా, వరద ముప్పు వంటి సమస్యలు వచ్చినప్పుడు జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్ టీమ్స్ అద్భుతంగా పనిచేశాయని, ఎటువంటి అవగాహన లేని హైడ్రాకు ఈ పనులు ఇవ్వడం వల్ల సమన్వయ లోపం తలెత్తుతుందని అన్నారు. నగరంలో ఇంకుడు గుంతల నిర్మాణంపై శ్రద్ధ వహించి యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరారు. మురుగు నీటి డైవర్షన్ ద్వారా మాత్రమే దోమల నియంత్రణ సాధ్యమని పేర్కొన్నారు. వెంటనే హైడ్రా, జీహెచ్‌ఎంసీ, కార్పొరేటర్లతో మాన్సూన్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు కూడా హైడ్రాతో కలిసి పనిచేస్తారని, త్వరలో సమన్వయ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని కళింగ కల్చరల్ ట్రస్ట్‌లో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు సంపూర్ణ సంస్థ ఆధ్వర్యంలో వస్త్రభూషణ పేరిట చేనేత వస్త్ర ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- ముచ్చింతల్ శివారులోని స్వర్ణ భారత్ ట్రస్టులో యూనియన్ బ్యాంక్, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్‌లతో కలిసి ఉచితంగా టైలరింగ్, సీసీటీవీ ప్రోగ్రాంలలో ఉచిత శిక్షణ ఇస్తారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

'కరెంట్'కు మాన్సూన్ షాక్!

- రోహిణి కార్తెలోనూ వర్షాలు.. ఎండలు లేక తగ్గిన వినియోగం
- 2024 మే నెలతో పోలిస్తే.. 2025 మేలో తగ్గిన విద్యుత్ రెవెన్యూ
- అంచనాలు తలకిందులు కావడంతో ఖంగుతిన్న డిస్కం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: సాధారణంగా వేసవిలో విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఎంత ఎండ, ఉక్కపోత ఉంటే అంతమేర కరెంటు వినియోగం ఉంటుంది. దానికి అనుగుణంగా డిస్కంకు బిల్లుల రూపంలో రావాల్సిన రాబడి కూడా అధికంగా ఉంటుంది. కానీ, డిస్కం ఇంజనీర్ల అంచనాలను మాన్సూన్ తారుమారు చేసింది. ఆదాయానికి గండికొట్టింది. గ్రేటర్ జిల్లాల్లో విద్యుత్ వాడకం మే నెలలో ఐదువేల మెగావాట్లకు చేరుకుంటుందని డిస్కం అంచనా వేసింది. ఆ మేరకు ముందస్తు ఏర్పాట్లు కూడా చేసింది. అయితే అధికారుల అంచనాలకు భిన్నంగా మే రెండో వారం నుంచే పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడం, ఎండలకు రోళ్లు, రోకళ్లు పగలాల్సిన రోహిణి కార్తెలోనూ ఏకధాటి వర్షాలు కురియడం, ఏసీలు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లను నిలిపివేయడం వల్ల నగరంలో విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గింది. 2024 మే నెలతో పోలిస్తే 2025 మే నెలలో నమోదైన విద్యుత్ డిమాండ్‌లో భారీ వ్యత్యాసం నమోదైంది. ఫలితంగా వేసవిలో విద్యుత్ అమ్మకాల ద్వారా రావాల్సిన ఆదాయాన్ని సంస్థ కోల్పోవాల్సి వచ్చింది. గృహ విద్యుత్ కనెక్షన్లు ఎక్కువగా ఉన్న కోర్ సిటీ సర్కిళ్లతో పోలిస్తే వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు ఎక్కువగా ఉన్న శివారు సర్కిళ్లలో మాత్రం ఆదాయం అనూహ్యంగా పెరిగింది. అంతేకాదు 2023 మే నెలలో నమోదైన విద్యుత్ డిమాండ్‌తో పోలిస్తే 2024 మే నెలలో సగటు విద్యుత్ డిమాండ్ 13.9 శాతం పెరిగింది. అదేస్థాయిలో వినియోగం కూడా 12.6 శాతం పెరిగింది. 2024 మేలో రికార్డైన సగటు విద్యుత్ డిమాండ్‌తో పోలిస్తే 2025 మేలో 3.2 శాతం తగ్గింది. వినియోగం 2.5 శాతానికి పడిపోయి అధికారుల అంచనాలను తలకిందులు చేసింది.

గత మూడేళ్లలో మే నెలలో విద్యుత్ వినియోగం ఇలా..

విద్యుత్ వినియోగం	2023	2024	2025
సగటు డిమాండ్(మెగావాట్లలో)	3206	3663	3566
సగటు వినియోగం(మిలియన్ యూనిట్లలో)	67.74	76.86	74.96
బిల్లుల రూపంలో సమకూరిన ఆదాయం(రూ.కోట్లలో)	899	1167	1129

గత మే నెలతో పోలిస్తే ప్రస్తుత రెవెన్యూ(రూ.కోట్లలో..)

సర్కిల్ పేరు	2024	2025
సైబర్ సిటీ	158	159
మేడ్చల్	145	144
రాజేంద్రనగర్	85	86
సంగారెడ్డి	72	74
సరూర్‌నగర్	113	105
సికింద్రాబాద్	99	95
బంజారాహిల్స్	121	113
హైదరాబాద్ సెంట్రల్	131	121
హైదరాబాద్ సౌత్	104	98
హబ్సిగూడ	131	126

ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్య



రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతివెస్లీ

రహమత్‌నగర్: నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పిల్లలను చేర్పించి ప్రయోజకుల్ని చేయాలని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ సూచించారు. ఎస్పీఆర్ హిల్స్ ఆరోగ్య నగర్ నాట్కో మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విద్యావ్యాప్తిలో నాట్కో స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు ఎనలేనివని అన్నారు. కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి మాట్లాడుతూ రహమత్ నగర్ డివిజన్‌లో అనేక అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వాటికి సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. డీడబ్ల్యూఓ ఆకేశ్వర్‌రావు, నాట్కో స్వచ్ఛంద ప్రతినిధి దాసన్న, ఇన్‌చార్జ్ సీడీపీవో లోవా కుమారి, సూపర్‌వైజర్ భారతి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు బస్తీలో ర్యాలీ నిర్వహించారు.

బోరబండ నాట్కో ప్రభుత్వ పాఠశాలలో...

బోరబండ డివిజన్‌లోని నాట్కో ప్రభుత్వ పాఠశాల బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గీత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఉత్తీర్ణత సాధిస్తున్నాయని అన్నారు.

బడ్జెట్ స్కూళ్లను ఎదగనివ్వడంలేదు: ట్రెస్మా



సమావేశంలో మాట్లాడుతున్న శివరాత్రి యాదగిరి, భాస్కర్‌రెడ్డి, నాగరాజు తదితరులు

ఉప్పల్: బడ్జెట్ స్కూళ్ల పక్కన కార్పొరేట్ స్కూళ్లకు విద్యాశాఖ అధికారులు అనుమతులు మంజూరు చేసి చిన్న స్కూళ్లను ఎదగనివ్వడంలేదని ట్రెస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, ముఖ్య సలహాదారు నల్ల భాస్కర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగరాజు మండిపడ్డారు. ఉప్పల్ మండలంలోని బుబల్జ్ స్కూల్ పక్కనే మరో కార్పొరేట్ స్కూల్‌కు అనుమతులిచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్న స్కూళ్లను ఎదగనివ్వకుండా చట్టంలో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని అధికారులే ఈ చర్యలకు పాల్పడటం శోచనీయమన్నారు. ఇప్పటికైనా ఎంఈవో, డీఈవోలు మేలుకుని తప్పులను సరిదిద్దుకోకపోతే ట్రెస్మా తరపున కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు. గోడు వినిపించిన చిన్నస్కూళ్లపై అధికారులు కక్ష కట్టి నిబంధనల పేరిట వేధింపులకు గురి చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నోటిఫికేషన్ల ద్వారానే పాఠశాలలకు అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఉప్పల్ మండల ట్రెస్మా అధ్యక్షుడు బాణాల విజయేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ చందన శ్రీనివాస్, జహంగీర్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు విజ్ఞప్తి



మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నేతలు

హిమాయత్‌నగర్: దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్) ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం(ఐఎన్‌టీయూసీ) నేతలు విజ్ఞప్తి చేశారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు యరగాని నాగన్న గౌడ్ నేతృత్వంలో సంఘం అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మోతె భాస్కర్‌రెడ్డి, కేతిరెడ్డి సత్యనారాయణరెడ్డి, గోపాల మల్లారెడ్డి, కడారి వీరేశం, మోడెం సురేష్, పోచంపల్లి కృష్ణమూర్తి, చింతకాయల సురేష్, కొన్నె వెంకటయ్య, ఏడాకుల సోమిరెడ్డి రాష్ట్ర సచివాలయంలో బుధవారం మంత్రి తుమ్మలను కలిసి వినతిపత్రం అందజేశారు. పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని, ప్రతి నెలా 5న డీసీసీబీ ద్వారా జీతభత్యాలు చెల్లించాలని, గ్రాట్యుటీ రూ.2 లక్షలు కాకుండా రిటైర్మెంట్ బెనిఫిట్స్ డీసీసీబీ ఉద్యోగుల మాదిరిగా ఇవ్వాలని, ఉమ్మడి జిల్లాలతో సంబంధం లేకుండా స్థానిక జిల్లాలోనే బదిలీలు చేయాలని, ఆరోగ్య కార్డులు కూడా ఇవ్వాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మానవత్వం చాటుకున్న మహిళా కానిస్టేబుల్

గోళ్లతో రక్కినా మతిస్థిమితంలేని యువతికి నైటీ తొడిగిన వైనం



యువతి చేతిలో గాయాల పాలైన కానిస్టేబుల్ అనిత

అమీర్‌పేట: మతిస్థిమితంలేక నడిరోడ్డుపై నగ్నంగా వెళ్తున్న ఓ యువతి పట్ల మహిళా కానిస్టేబుల్ మానవత్వం చూపింది. గోళ్లతో ముఖాన్ని రక్కినా, కాళ్లతో కడుపులో తన్నినా ఓర్పుగా భరించి ఓ నైటీని యువతికి తొడిగింది. పోలీసుల కథనం ప్రకారం... రాత్రివేళ అమీర్‌పేట నుంచి ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ వైపు మతిస్థిమితం లేని 28 ఏళ్ల యువతి నగ్నంగా నడుచుకుంటూ వస్తోంది. స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారమివ్వగా ఎస్ఆర్‌నగర్ కానిస్టేబుల్ అనిత ఆ ప్రాంతానికి వచ్చింది. ఎందుకిలా దుస్తులు లేకుండా తిరుగుతున్నావని యువతిని ప్రశ్నించగా ఎలాంటి స్పందనలేదు. దీంతో ఆ పక్కనే ఉన్న లేడీస్ హాస్టల్‌కు వెళ్లి ఓ నైటీ తెచ్చి ధరింపచేసేందుకు యత్నించగా యువతి ప్రతిఘటిస్తూ కానిస్టేబుల్ ముఖంపై రక్కింది. కడుపులో తన్నింది. అతికష్టం మీద యువతికి నైటీని తొడిగింది. రక్తం కారినా లెక్క చేయకుండా ఓర్పుతో వ్యవహరించి యువతికి నైటీ తొడిగి మానవత్వం చాటుకున్న కానిస్టేబుల్ అనితను స్థానికులు, పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

జస్టిస్ సుందర్ జీవితం స్ఫూర్తిదాయకం

లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: జస్టిస్ సుందర్ జీవితం స్ఫూర్తిదాయకమని తెలంగాణ లోకాయుక్త జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం కొత్తపేట్‌లోని స్పైసీ హబ్‌లోని కన్వెన్షన్ సెంటర్‌లో జస్టిస్ కె.సుందర్ న్యాయరంగ ప్రయాణంపై హైకోర్టు న్యాయవాది జి.అనిల్, కిరణ్‌కుమార్ రచించిన 'ఎ రెవర్డ్ ట్రాన్స్‌ఫర్ అండ్ యాన్ అన్ స్పోకెన్ లాస్'అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి, విశిష్ట అతిథిగా సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ న్యాయరంగ వృత్తి ఎంతో సాహసం, సున్నితత్వంతో కూడుకున్నదని, ఎంతటి ప్రతికూల కేసులు వచ్చినా ప్రశాంతతతో ఉంటేనే తడబాటు లేకుండా విజయవంతం కావచ్చన్నారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2010 నుంచి జస్టిస్ సుందర్‌తో తనకు పరిచయం ఉందని, ఎంతో క్లిష్టమైన ఎన్నో కేసులను ఆయన సునాయాసంగా వాదించి విజయం సాధించడం స్వయంగా చూశానన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ జస్టిస్ కె.సుందర్ బదిలీ కావడం తెలంగాణకు తీరని లోటని పేర్కొన్నారు. అనంతరం అతిథులు జస్టిస్ కె.సుందర్–శాంతి దంపతులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.జగన్, వివిధ జిల్లాల కోర్టుల జడ్జీలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

తెలుగు భాష తీయదనం పంచాలి

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



పురస్కారాలు అందజేసిన గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: విద్యారంగం ఆంగ్లమయమైన పరిస్థితుల్లో తెలుగుభాష తీయదనాన్ని పంచాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సాహితీవేత్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగిన సభలో రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రంథ పురస్కారాలను పలువురు సాహితీవేత్తలకు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలు పాఠశాలలో గడిపిన సమయం అంతా ఇంగ్లిష్‌లోనే మాట్లాడాల్సి వస్తుందని, పిల్లలకు తెలుగుభాషపై పట్టు రావాలంటే తల్లిదండ్రులు, సాహితీవేత్తలు కృషి చేయాలన్నారు. స్వాతంత్య్ర సమరం, నిజాం వ్యతిరేక పోరాటం, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో సాహిత్యమే కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, పరిషత్ కోశాధికారి మంత్రి రామారావు, రాంమూర్తితోపాటు సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

కోర్ ఇంజనీరింగ్ ఉద్యోగాలకే అధిక భద్రత

జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ కిషన్ కుమార్‌రెడ్డి



జేఎన్‌టీయూహెచ్‌లో సెమినార్‌ను ప్రారంభించిన వైస్ చాన్స్‌లర్ కిషన్ కుమార్‌రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: మెకానికల్, సివిల్, పెట్రోలియం వంటి కోర్ ఇంజనీరింగ్ శాఖల్లో మూడు, నాలుగు సంవత్సరాల అనుభవం తరువాత ఉద్యోగుల స్థాన భద్రత, నైపుణ్య విలువ మరింత పెరుగుతుందని జేఎన్‌టీయూ ఉపకులపతి డాక్టర్ టి.కిషన్ కుమార్‌రెడ్డి అన్నారు. ఓ పెట్రోలియం ప్లాంట్ డిజైన్ సంస్థలో ఉద్యోగుల సంఖ్య ఐదుగురు నుంచి 5 ఏళ్లలో 800 వరకు పెరిగిందని పేర్కొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వ విద్యాలయంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ ఆపర్చ్యునిటీస్ ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్ అండ్ గ్లోబల్ ఇండస్ట్రీ ట్రెండ్స్'అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ రంగం ప్రారంభంలో ఇచ్చే ఆకర్షణీయ వేతనాలు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వల్ల శీఘ్రంగా నిలిచిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రఖ్యాత గ్లోబల్ ఇండస్ట్రియల్ లీడర్ నవీన్ మున్నంగి మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీరింగ్ డిజిటల్ రంగాలతో కలుస్తూ బహు శాఖా వ్యాప్తి సాధిస్తుందని వివరించారు. విద్యార్థులు ఫండమెంటల్స్‌లో బలంగా ఉండాలని సూచించారు. మారుతున్న సాంకేతికతలతో సమన్వయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలునాయక్, డి.పి.భ్రమర, డాక్టర్ ఈ.రామ్జీ, ఎం.టి.నాయక్, డాక్టర్ ఎం.ఇందిరారాణి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూకు మరో అంతర్జాతీయ గుర్తింపు



హెచ్‌సీయూను ప్లాటినమ్ గ్రీన్ వర్సిటీగా గుర్తిస్తూ జారీ చేసిన సర్టిఫికెట్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)కి మరో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. 2024–2027 సంవత్సరానికి ప్లాటినమ్ ర్యాంక్ పొందిన గ్రీన్ యూనివర్సిటీగా హెచ్‌సీయూ గుర్తింపు సాధించింది. ఇది గ్రీన్ మెంటర్స్ ద్వారా స్థిరత్వంతో కూడిన అసాధారణమైన ప్రతిష్ఠాత్మక గౌరవమని చెప్పవచ్చు. యునెస్కో గ్రీనింగ్ ఎడ్యుకేషన్ పార్ట్‌నర్‌షిప్, అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సస్టెయినబిలిటీ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్(ఏఏఎస్‌హెచ్‌ఈ) మెంబర్‌గా, గ్రీన్ మెంటర్స్ యునైటెడ్ నేషన్స్ ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్‌తో ప్రత్యేక సంప్రదింపుల హోదాను హెచ్‌సీయూ కలిగి ఉంది. ఆడిట్ అండ్ అక్రిడిటేషన్ గవర్నెన్స్ అండ్ అకడమిక్స్, భవనాల డిజైన్లు, ల్యాండ్ స్కేపింగ్, నీటి నిర్వహణ విధానాలు, ఎనర్జీ యూజ్ అండ్ సేవింగ్స్, ఎయిర్ క్వాలిటీ లెవల్స్, ఆరోగ్య పరిరక్షణతోపాటు అనేక రకాల విధానాలు, అమలును పరిశీలించి ఈ గుర్తింపును అందించారు. మొత్తం 400 పాయింట్లలో 445 పాయింట్లను హెచ్‌సీయూ సంపాదించింది. కాగా 'ఈ అంతర్జాతీయ గుర్తింపు మా నిబద్ధతకు నిదర్శనం'అని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు అన్నారు. స్థిరమైన పద్ధతుల్లో పరిశోధనలు, విద్యావిధానాన్ని ఎంతో ముందుకు తీసుకెళ్లిన అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థుల అవిశ్రాంత కృషిని ఇది ప్రతిబింబిస్తుందన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతమే లక్ష్యం

బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి



రత్నానగర్‌లో అమ్మ మాట- అంగన్‌వాడి బాట కార్యక్రమంలో పాల్గొన్న సీతా దయాకర్‌రెడ్డి

నల్లకుంట: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతమే లక్ష్యంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా 3 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులందరూ కేంద్రాల్లో చేరేలా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని నర్సింహ బస్తీ, శివానందర్‌నగర్, రత్నానగర్, సత్యానగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ఆరా తీశారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు అందిస్తున్న పౌష్టికాహారం, చిన్నారుల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల నమోదు కోసం చేపట్టిన అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు వందన గౌడ్, బి. వచన్ కుమార్, మర్రిపల్లి చందన, గోగుల సరిత, ప్రేమలతా గర్వాల్, ఆయా అంగన్‌వాడి కేంద్రాల టీచర్లు, బస్తీల పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యాబోధనలో నూతన ఒరవడి

- ఇంట్లో కూర్చొని డిగ్రీ, పీజీ పాఠాలు వినవచ్చు

ఉస్మానియా యూనివర్సిటీ: మారుతున్న పరిస్థితులు, అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్నత విద్యలో నూతన ఒరవడి సంతరించుకుంది. ఎలాంటి విద్యార్హతలు లేకున్నా, వేల రూపాయల ఫీజులు చెల్లించకుండా, కాలేజీకి వెళ్లకుండా ఇంట్లో కూర్చొని ఉచితంగా డిగ్రీ, పీజీ కోర్సుల్లోని సింగిల్ సబ్జెక్టుల పాఠాలు వినేందుకు ఓయూ ఈఎంఎంఆర్‌సీ ప్రణాళికను రూపొందించింది. కేంద్ర ప్రభుత్వ విద్యా శాఖ సహకారంతో డిగ్రీలో 8 సబ్జెక్టులు, పీజీలో ఒక సబ్జెక్టు పాఠాలు వినేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. డిగ్రీ విద్యార్థులు లేదా విద్యార్హతతో సంబంధం లేకుండా ఆసక్తి గల అభ్యాసకులు స్వయం పోర్టల్ ద్వారా ఆగస్టు 31 వరకు పేర్లను నమోదు చేసుకోవాలని ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ రఘుపతి తెలిపారు. మాసివ్ ఆన్‌లైన్ (మూక్స్) డిగ్రీలో అడ్మినిస్ట్రేటివ్ థియరీ, అగ్రేరియన్ సోషియాలజీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇండియన్ అడ్మినిస్ట్రేషన్, సోషల్ కేస్‌వర్క్, సోషల్ వెల్ఫేర్ అడ్మినిస్ట్రేషన్, సోషల్ వర్క్ రీసెర్చ్, అర్బన్ సోషియాలజీ, అర్బన్ డెవలప్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ సోషియాలజీల్లో సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు క్యూఆర్ కోడ్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. జూలై నుంచి డిసెంబర్ సెమిస్టర్ పరీక్షలకు మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. నాలుగు నెల లపాటు బోధన అనంతరం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సర్టిఫికెట్‌ను అందజేయనున్నట్లు ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ రఘుపతి తెలిపారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడవచ్చు.

ప్రశ్నించే గొంతులంటే పాలకులకు భయం

– ప్రముఖ సినీనటుడు ప్రకాష్‌రాజ్



హిమాయత్‌నగర్: ప్రశ్నించే గొంతులను పాలకులు అణచివేయాలని చూస్తారని, కానీ చివరికి వాళ్లు గెలిచినట్లు చరిత్రలో లేదని ప్రముఖ సినీనటుడు ప్రకాష్‌రాజ్ అన్నారు. అణిచివేతలపై మౌనంగా ఉండకూడదని, అలా ఉంటే వాటిని సమర్థిస్తున్నట్లు అవుతుందని అన్నారు. బుధవారం రాత్రి బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 'భారతదేశ రాజకీయ ఖైదీల గొంతుకలు.. చందమామను ఎంతకాలం బందీ చెయ్యగలరు?'పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆంగ్లంలో సుచిత్ర విజయన్, ఫ్రాన్సెస్కో రేకియా రచించిన ఈ పుస్తకాన్ని కె.సురేష్ తెలుగులో అనువదించారు. ప్రముఖ కవి యాకూబ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రకాష్ రాజ్ మాట్లాడుతూ ప్రజల హక్కుల కోసం గొంతు విప్పిన వారిని జైళ్లలో పెట్టారని, వారి త్యాగాల వల్లే మనం ఈరోజు స్వేచ్ఛగా మాట్లాడుతున్నామని అన్నారు. రాజకీయ ఖైదీలు ఏదో చేశారని జైళ్లలో పెట్టలేదని, ఏదైనా చేస్తారేమో అని భయంతో జైళ్లలో నిర్బంధించారని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ హక్కుల కోసం గొంతెత్తాలని, పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ప్రకాష్ రాజ్ పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్టు వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్బంధాలు ఎక్కువయ్యాయని, ప్రశ్నించేవారిని అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేస్తున్నారని అన్నారు. చివరికి కాంగ్రెస్ అధినాయకుడు రాహుల్ గాంధీని కూడా అర్బన్ నక్సలైట్‌గా అభివర్ణించారని అన్నారు. సభలో సీనియర్ సంపాదకులు రామచంద్రమూర్తి, సామాజిక వేత్తలు ఖలిదా పర్వీన్, అనురాధ, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, ఓయూ విద్యార్థి నాయకుడు కోట శ్రీనివాస్, కె.శ్రీనివాస్, విమలక్క తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆటో పర్మిట్లు ఇవ్వడం హర్షణీయం

హిమాయత్‌నగర్: జీహెచ్‌ఎంసీ, ఓఆర్‌ఆర్ పరిధిలో కొత్తగా 65 వేల ఆటో రిక్షా పర్మిట్లు ఇస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ బి.వెంకటేశం అన్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని మిగతా డిమాండ్లను కూడా త్వరలో పరిష్కరించాలని కోరారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద శాతం పెరిగిన ఇంధన చార్జీలకు అనుగుణంగా ఆటోమీటర్ చార్జీలు పెంచాలని కోరారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 12, జూన్, 2025

మార్వెలెస్.. మాన్సూన్ వెడ్డింగ్స్..

వివాహాల్లో విస్తరిస్తున్న కొత్త తరహా ట్రెండ్

'చిటపట చినుకులు పడుతూ ఉంటే.. చెలికాడే సరసన ఉంటే.. చెట్టాపట్టగ చేతులు కలిపి చెట్టు నీడకై పరుగిడుతుంటే.. చెప్పలేని ఆ హాయి ఎంతో వెచ్చగ ఉంటుందోయీ..' అంటూ సాగే పాత తెలుగు సినిమా పాటను గుర్తు చేసేలా నేటి వెడ్డింగ్ ప్లానర్లు ప్లాన్ చేస్తున్నారు.. సాధారణంగా వర్షాకాలంలో పెళ్లిళ్లు అంటే కాస్త ఇబ్బంది.. చిరాకే.. కానీ, పక్కాగా ప్లాన్ చేస్తే వానాకాలంలో పెళ్లి వేడుకలను మధురమైన అనుభూతిగా మిగుల్చుకోవచ్చు. - సాక్షి, సిటీబ్యూరో

- వర్షాకాలంలో వాటర్ ప్రూఫ్ పెళ్లి వేదికలు
- శుభలేఖలు, మండపం, బరాత్ అన్నీ ప్రత్యేకమైనవే
- నగరంలో అందుబాటులో మండపాలు, రిసార్ట్స్
- రెయిన్ ప్రూఫ్ కాన్సెప్ట్స్‌తో మధురమైన అనుభూతి



పెళ్లిళ్ల సీజన్ ఆరంభమైంది. మరో వైపు వేసవి ముగియకముందే వర్షాలు భారీగా కురుస్తున్నాయి. అంగరంగ వైభవంగా అలంకరించుకొని, బంధువులు, స్నేహితుల మధ్య పెళ్లికి సిద్ధమవుతున్న తరుణంలో అకస్మాత్తుగా వర్షం పడితే ముందస్తు ప్లానింగ్ అంతా వేస్ట్ అవుతుంది. పెళ్లికి వచ్చిన వారు చిరాకు పడటంతో పాటు రావాల్సిన బంధువులు రాలేని పరిస్థితి తలెత్తుతుంది. అందుకే వానాకాలంలో పెళ్లి ముహూర్తాలు పెట్టుకోవడం కాసింత కష్టమే. కానీ, ఇవన్నీ పాత రోజులు. నిజం చెప్పాలంటే వర్షాకాలంలో పెళ్లి వధూవరులకు మంచి అనుభూతిని మిగులుస్తుందని అంటున్నారు వెడ్డింగ్ ప్లానర్లు.





హైబ్రిడ్ వేదికలు..

ఈమధ్య కాలంలో వర్షాకాలంలో వివాహాలు ట్రెండీగా మారాయి. పెళ్లి శుభలేఖల నుంచి మొదలుపెడితే వేదిక, మండపం అలంకరణ, అతిథుల ఆహ్వానం, ఫొటోగ్రఫీ, బరాత్ వరకూ అన్నీ ప్రత్యేకమైనవిగా ఉంటాయి. సౌకర్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూనే వధూవరులకు, అతిథులకు గొప్ప అనుభూతి కలిగేలా ప్లాన్ చేస్తున్నారు. సినిమాటిక్ పెళ్లి వేడుకలను వెడ్డింగ్ ప్లానర్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాయి. వాన ఇబ్బందుల నుంచి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. అన్ని రకాలుగా వేడుకలకు సిద్ధం చేయడమే ఈ సంస్థల ప్రత్యేకత. పెళ్లి మండపమే కాదు టెర్రస్, లాన్, ఓపెన్ ఏరియా అన్నింటినీ గ్లాస్ కనోపీలతో కవర్ చేస్తారు. జర్మన్ హ్యాంగర్ టెంట్లు, వాటర్ ప్రూఫ్ డోమ్‌లు, ముడుచుకునే పైకప్పులతో వివాహ వేదిక, మండపాలు నిర్మిస్తారు. అకస్మాత్తుగా వర్షం కురిస్తే వాన నీరు వెళ్లేందుకు సరైన మార్గాలను ఏర్పాటు చేస్తారు. ట్రాన్స్‌పరెంట్ పెళ్లి వేదిక, మండపాలతో వధూవరులకే కాదు అతిథులు కూడా వర్షం పడినా తడిసిపోకుండా వర్షపు జల్లులు, శబ్దాలను ఆస్వాదిస్తూ గొప్ప అనుభూతిని పొందుతారు.



భద్రత కీలకమే..

నాన్‌స్లిప్ టైల్స్, మ్యాట్‌లు, తగినంత లైటింగ్‌తో పాటు వృద్ధులకు డ్రై జోన్‌లను ఏర్పాటు చేస్తారు. వర్షాకాలంలో బరాత్‌లకు బదులుగా సన్నాయి మేళం, డోల్ చప్పుళ్లు, మ్యూజిక్ బ్లాస్టింగ్స్ ఏర్పాటు చేస్తారు. దీంతో అతిథులు గొడుగుల కింద నృత్యం చేసే వీలుంటుంది. విద్యుత్ అంతరాయం కలగకుండా బ్యాకప్ బ్యాటరీలు, జనరేటర్లను క్యారీ చేస్తారు. డీహ్యుమిడిఫయ్యర్లు, ప్లాస్టిక్ టార్ఫలిన్ ఏర్పాటు చేస్తారు. లాంతర్లు, షాండీలియర్ల వెలుగులో వధూవరులు గొడుగుల కింద లేదా వర్షంలో తడుస్తూనే రొమాంటిక్ ఫొటోలకు ఫోజులు ఇస్తారు.







వర్షాన్ని ఆస్వాదించేలా..

శుభలేఖ కూడా మేఘాలు, వర్షం చినుకులను ప్రతిబింబించేలా ముద్రిస్తారు. అతిథులు పెళ్లి వేదికలో అక్కడక్కడ శుభ్రమైన చిన్న టవల్స్‌ను అందుబాటులో ఉంచుతారు. బగ్ స్ప్రే ప్యాచ్‌లు, త్వరగా ఆరిపోయే న్యాప్‌కిన్‌లు, వర్షంలో, బురదలో జారిపడిపోకుండా ఫ్లిప్‌ఫ్లాప్ పాదరక్షలు అందుబాటులో ఉంచుతారు. అతిథులు వర్షం మూడ్ ఆస్వాదించేందుకు వేడి టీ, కాఫీలు, మసాలా మాక్‌టెయిల్స్, ముల్లడ్ వైన్ కాక్‌టెయిల్స్‌తో బార్ స్టేషన్లను ఏర్పాటు చేస్తారు.

దుస్తులలో ప్రత్యేకత..

వెల్వెట్, సిల్క్ వంటి బరువైన దుస్తులు హుందాగా కనిపిస్తాయి. అయితే వీటి వల్ల వర్షాకంలో ఇబ్బంది పడే పరిస్థితి తలెత్తుతుంది. ఒకవేళ వర్షంలో తడిస్తే అవి మరింత బరువుగా మారతాయి. పైగా వర్షం పడిన సమయంలో ఉక్కపోతకు ఇబ్బంది కలిగిస్తాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని వీటికి బదులు తేలికపాటి నేత వస్త్రాలు, ఆర్గాన్జా ఫ్యాబ్రిక్, మృదువైన నైలాన్‌తో తయారైన వస్త్రాలు, సిల్క్, సింథటిక్ ఫైబర్‌తో తయారైన జార్జెట్‌తో లెహంగాలను డిజైన్ చేస్తున్నారు. ఇవి నీటిని పీల్చుకోకపోవడంతో పాటు తేలికగా ఉండటమే వీటి ప్రత్యేకత. వాటర్ ప్రూఫ్ లైనింగ్, క్విక్ డ్రై దుపట్టాలను వధూవరులు ఎంచుకుంటున్నారు.

వార్నర్ బ్రదర్స్ కలెక్షన్ ప్రదర్శన

సాక్షి, సిటీ బ్యూరో: కార్టూన్ పాత్రల నుంచి స్ఫూర్తిగా రూపొందిన ఫుట్‌వేర్‌ను వార్నర్ బ్రదర్స్ కలెక్షన్ పేరిట సికింద్రాబాద్‌లోని క్యాంపస్ స్టోర్‌లో ప్రదర్శిస్తున్నారు. ఈ విషయాన్ని క్యాంపస్ యాక్టివ్ వేర్ లిమిటెడ్ సీఈఓ హోల్ టైమ్ డైరెక్టర్ నిఖిల్ అగర్వాల్ ఓ ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్‌లో తాము నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంపస్ కొత్త స్టోర్‌లో బ్యాట్‌మ్యాన్, సూపర్‌మ్యాన్ వంటి ఐకానిక్ పాత్రల నుంచి ప్రేరణ పొందిన వార్నర్ బ్రదర్స్ కలెక్షన్ ప్రదర్శిస్తున్నామన్నారు. అంతేకాకుండా వయసులకు అతీతంగా అందరికీ నప్పేలా విభిన్న సందర్భాలకు అనువైన పాదరక్షలు, విభిన్న శ్రేణి స్నీకర్లు, పెర్ఫార్మెన్స్ బూట్లు వంటి తాజా కలెక్షన్ ప్రదర్శిస్తున్నామన్నారు.

ఐబీఎంతో నగర 'వర్సిటీ' ఒప్పందం



సాక్షి, సిటీబ్యూరో : నగరానికి చెందిన గురునానక్ విశ్వవిద్యాలయం ప్రముఖ 'టెక్' కంపెనీ ఐబీఎంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇబ్రహీంపట్నంలోని 'వర్సిటీ' ఆవరణలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఐబీఎం ఇండియా సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ డైరెక్టర్ విఠల్ మాద్యాల్కర్, గురునానక్ విశ్వవిద్యాలయ ఛాన్సలర్ సర్దార్ జీఎస్.కోహ్లీ పాల్గొని వివరాలు వెల్లడించారు. దీని ద్వారా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్–సైబర్ సెక్యూరిటీలో స్పెషలైజేషన్ వంటివి సంయుక్తంగా అందిస్తామని వివరించారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న సాంకేతిక నైపుణ్యాలను సాధించి, బలమైన కెరీర్ నిర్మించుకోవడంలో విద్యార్థులకు ఈ ఒప్పందం సహాయపడుతుందన్నారు. టెక్ దిగ్గజ సంస్థ ఐబీఎంతో రాష్ట్రంలో ఒప్పందం కలిగిన తొలి విశ్వవిద్యాలయం తమదే కావడం పట్ల వర్సిటీ ప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

ఐ, పెన్సిల్ తెలుగు అనువాదం..



సాక్షి, సిటీ బ్యూరో: ప్రఖ్యాత ఆర్థిక విజ్ఞాన రచయిత లియోనార్డ్ రీడ్ రాసిన చారిత్రక వ్యాసం 'ఐ, పెన్సిల్'ను నగరవాసి, స్వతంత్రత సెంటర్ సహ వ్యవస్థాపకులు రాఘవేందర్ అస్కాని తెలుగులోకి అనువదించారు. 'నేను, పెన్సిల్ ని' అనే ఈ అనువాదాన్ని అట్లాంటాలో ఫౌండేషన్ ఫర్ ఎకనామిక్ ఎడ్యుకేషన్ మాజీ అధ్యక్షుడు లారెన్స్ డబ్ల్యూ.రీడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లారెన్స్ మాట్లాడుతూ.. ఒక సాధారణ పెన్సిల్‌ని ఎవరూ ఒక్కరిగా తయారు చేయలేరు అనే నిజంతో పాటు, మనం స్వేచ్ఛా మార్కెట్‌ని ఎలా అర్థం చేసుకోవాలో వివరిస్తుంది. ఇదే సందేశాన్ని తెలుగులో అందించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ అనువాదం భారత ఉపఖండంలో మిలియన్ల మంది తెలుగు పాఠకులకు మార్కెట్ స్వేచ్ఛ, స్వచ్ఛంద సహకారానికి సంబంధించిన గొప్ప సందేశాన్ని చేరవేస్తుందని అన్నారు.

గుర్తించండి.. పోరాడండి..



- రొమ్ము క్యాన్సర్‌పై ఫ్యూజీఫిల్మ్ ఇండియా అవగాహన
- ప్రతి 29 మంది మహిళల్లో ఒకరికి రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం
- నగరంలో ప్రచారం ప్రారంభించిన సీఎస్ఆర్ విభాగం వైస్ చైర్‌పర్సన్ ఉపాసన

సాక్షి, సిటీబ్యూరో : ఈ మధ్య సర్వ సాధారణంగా మారిన రొమ్ము క్యాన్సర్‌ను 'త్వరగా గుర్తించండి, త్వరగా పోరాడండి' అంటూ ఫ్యూజీఫిల్మ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక ప్రచార కార్యక్రమాన్ని అపోలో హాస్పిటల్స్ సీఎస్ఆర్ విభాగం వైస్ చైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల ప్రారంభించారు. అపోలో ఫౌండేషన్ అమలు చేస్తున్న ఈ ప్రచారాన్ని నగరంలోని ఐటీసీ కోహినూర్ వేదికగా బుధవారం దీనిని ప్రారంభించారు. ఉపాసన మాట్లాడుతూ.. వైద్యరంగంలో అత్యుత్తమ సేవలను అందించడమే కాకుండా.. బ్రెస్ట్ క్యాన్సర్ వంటి రోగాలను ముందుగా గుర్తించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. సరైన అవగాహన, తగిన సమాచారం, సత్వరగా చికిత్సకు వనరులు లేకపోవడంతో చాలామంది మహిళలు మరణిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజలకు చేరువ చేయడానికి ఫ్యూజీఫిల్మ్ ఇండియా చేపట్టిన ఈ సీఎస్ఆర్ ప్రచారం ఉపయోగపడుతుంది. ఐసీఎంఆర్ వారి జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీ అంచనాల ప్రకారం, మహిళలకు వచ్చే మొత్తం రోగాల్లో 14 శాతం ఇదే ఉంటోంది. ప్రతి 29 మంది మహిళల్లో ఒకరికి జీవితకాలంలో రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఫ్యూజీఫిల్మ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ కోజి వాడా ఈ ప్రచార వివరాలు వెల్లడించారు. దేశంలోని 24 నగరాల్లో, శిక్షణ పొందిన సిబ్బంది ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ఈ ప్రచారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు వైద్య నిపుణులు, సామాజిక సేవా రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

డెట్రాయిట్‌లో తెలుగు పల్లెవంట

నోరూరించే ఆహార పదార్థాలతో విందు

ఉల్లాసంగా గడిపిన 350 తెలుగు కుటుంబాలు



సాక్షి,సిటీబ్యూరో : అమెరికాలోని డెట్రాయిట్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 350కి పైగా కుటుంబాలు ఫార్మింగ్టన్ హిల్స్‌లోని శియావాసీ పార్క్‌లో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ (జీటీఏ) డెట్రాయిట్ ఛాప్టర్ ఆధ్వర్యంలో పల్లెవంట కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు, గేమ్స్, సామూహిక చర్చలు వంటి ఎన్నో ఆసక్తికర కార్యకలాపాల్లో చిన్నారుల నుంచి పెద్దల వరకూ పాల్గొని ఉల్లాసంగా గడిపారు. పల్లెవంటలో వడ్డించిన తెలంగాణ వంటకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బగారా అన్నం, చికెన్, పాలకూర, మామిడికాయ పప్పు, పచ్చిపులుసు, మటన్, రోకటి పచ్చళ్లు, పెరుగన్నం, బీట్‌రూట్ రైతా, వెరైటీ స్నాక్స్, మిఠాయిలు భోజన ప్రియులకు రుచికరమైన విందును అందించాయి. రంగురంగుల వేసవి దుస్తుల్లో వచ్చిన మహిళలు, పిల్లలు పార్క్‌ను పూలతోటలా మార్చారు. యువతులు, మహిళల కోసం అందమైన బ్యూటీ, ఫ్యాషన్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రవాసుల్లో ఐక్యతా భావనను, ఆనందాన్ని పెంపొందించేలా వేడుక నిర్వహించినట్లు జీటీఏ యూఎస్ఏ అధ్యక్షుడు ప్రవీణ్ కేసిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం కేవలం ఉత్సవంగా మాత్రమే కాదు, విలువలు, పరస్పర గౌరవం, ఐక్యతను కలిగిస్తాయన్నారు.



పేరిణి నృత్యం మన సంపద

వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకల్లో మామిడి హరికృష్ణ



గన్‌ఫౌండ్రీ : పేరిణి నాట్యం తెలంగాణ రాష్ట్ర సంపద అని రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. రవీంద్రభారతిలో సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పీఆర్‌కే నాట్య ప్రపంచం ఆధ్వర్యంలో గత 41 రోజులుగా నిర్వహించిన పేరిణి నాట్య వేసవి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాకతీయుల కాలం నుంచి పేరిణి నాట్యం ఉన్నట్లు గుర్తుచేశారు. ప్రస్తుత సమాజంలో కనుమరుగవుతున్న ఈ నృత్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందని అభిప్రాయపడ్డారు. చిన్నారులకు ఉచిత శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అంతకు ముందు వివిధ అంశాలపై సంస్థ చిన్నారుల నృత్య ప్రదర్శనలు అహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ పురస్కార గ్రహీతలు ఒగ్గు రవి, అందె భాస్కర్, సంస్థ అధ్యక్షుడు పేరిణి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

లులు మాల్‌లో బాక్సింగ్ పోటీలు..

13 నుంచి 15 వరకూ ఫైట్ నైట్–2 పేరుతో నిర్వహణ

మూసాపేట : కూకట్‌పల్లిలోని లులు మాల్‌లో యూబీసీతో కలిసి లులు యూబీసీ ఫైట్‌నైట్–2 పోటీలు నిర్వహించనున్నట్లు మాల్ రీజినల్ డైరెక్టర్ అబ్దుల్‌ఖాదీర్ షేక్, రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్ తెలిపారు. హైదరాబాద్ మాల్‌లో ఇలాంటి పోటీలు నిర్వహించడం ఇదే తొలిసారని, ఈ నెల 13 నుంచి 15 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయని తెలిపారు. తొలిరోజు ఫేజ్ ఆఫ్, రెండో రోజు కిక్ బాక్సింగ్, మూడో రోజు మువతాయ్ పోటీలు జరుగుతాయని, ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 9.30 గంటల వరకూ వీటి నిర్వహణ ఉంటుందని, ఈ ఈవెంట్‌లో దేశవ్యాప్తంగా 36 మంది బాక్సర్లు పాల్గొనున్నారని, ఆరుగురు రిఫరీలుగా వ్యవహరిస్తారని అన్నారు. ఈ పోటీలకు ఆర్ అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల, ఎమ్మెల్సీ కవితతో పాటు హీరోలు సుమన్, నితిన్ హాజరుకానున్నట్లు తెలిపారు. మాల్ ప్రాంగణంలోనే ఈ పోటీలు ఉంటాయని, ప్రతి ఒక్కరికీ ఉచిత ప్రవేశం ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా...

నేడు పోచంపల్లికి గవర్నర్ రాక



సాక్షి, యాదాద్రి: గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి రానున్నారు. హైదరాబాద్ రాజ్‌భవన్ నుంచి గవర్నర్ బయల్దేరి ఉదయం 10.45 గంటలకు భూదాన్‌పోచంపల్లి చేరుకుంటారు. మధ్యాహ్నం 12.15 గంటల వరకు పోచంపల్లిలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పర్యాటక పార్కును సందర్శించి.. చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలించనున్నారు. అనంతరం పద్మశ్రీ అవార్డు గ్రహీతలతో కలిసి చర్చిస్తారు. ఎంపిక చేసిన చేనేత కార్మికులతో ముఖాముఖిలో పాల్గొంటారు. చేనేత బీమా, థ్రిఫ్ట్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తారు. చేనేత వస్త్రాల ప్రదర్శనను తిలకిస్తారు. గవర్నర్ పర్యటన సందర్భంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖి

హాజరైన కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న 'మంత్రితో ముఖాముఖి' కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైన కొండా సురేఖ ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. మంత్రికి దరఖాస్తులు సమర్పించేందుకు ప్రజలు పెద్దఎత్తున గాంధీభవన్‌కు తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 109 దరఖాస్తులు మంత్రి తీసుకున్నారని, ఇందులో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసమే ఎక్కువగా విజ్ఞాపనలు ఉన్నాయని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా సురేఖ మీడియాతో మాట్లాడుతూ, మంత్రితో ముఖాముఖి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తున్నారని, ఇందులో పరిష్కరించేందుకు వీలున్న సమస్యలపై వెంటనే అధికారులతో మాట్లాడుతున్నామని, మిగిలిన వినతులను కూడా పరిశీలించి తగిన పరిష్కారం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

పాలన గాలికి వదిలేసి ఢిల్లీలో తిష్ట వేస్తారా?

సీఎంపై హరీశ్‌రావు విమర్శ



సాక్షి, హైదరాబాద్: పాలన గాలికి వదిలేసి ముగ్గురు మంత్రులకు పోర్ట్‌ఫోలియోలు కేటాయించేందుకు మూడు రోజులపాటు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీలో తిష్టవేశారని ఎక్స్‌వేదికగా మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సీఎం చేతగానితనం పంచాయతీ అధికారులకు, పారిశుద్ధ్య సిబ్బందికి శాపంగా మారుతోందన్నారు. చెత్త తరలించే ట్రాక్టర్లకు పెట్రోల్ బంకులో డీజిల్ ఉద్దెరకు పోయడం లేదని, సెక్రటరీలు ట్రాక్టర్ తాళాలను అధికారులకు అప్పగించే పరిస్థితికి తెచ్చారన్నారు. ఏడాదిన్నరగా నిధులు ఇవ్వకుంటే గ్రామ పాలన ఎలా సాధ్యమవుతుందో చెప్పాలని ప్రశ్నించారు. ఎట్లుండే తెలంగాణ.. ఎట్ల అయిందని, మీరు చెప్పిన మార్పు ఇదేనా అంటూ సీఎంను ప్రశ్నించారు. మాజీ సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీలను దేశం గర్వించే దిశగా తీర్చిదిద్దితే... సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం వల్ల పంచాయతీలు కునారిల్లుతున్నాయని హరీశ్ విమర్శించారు.

కొణతం దిలీప్ అరెస్టు.. విడుదల



నిర్మల్: బీఆర్ఎస్ సోషల్ మీడియా మాజీ అధ్యక్షుడు కొణతం దిలీప్‌రెడ్డి అరెస్టు, విడుదలలో హైడ్రామా కొనసాగింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్, కడెం, నిర్మల్ పోలీసుస్టేషన్లలో నమోదైన వివిధ కేసుల్లో జిల్లా పోలీసులు లుక్అవుట్ నోటీసులు జారీ చేసి మంగళవారం అర్ధరాత్రి ఆయన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం దిగగానే అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసి నిర్మల్ పట్టణ పోలీసుస్టేషన్‌కు తరలించారు. బుధవారం ఉదయం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఖానాపూర్ కేసులో నిర్మల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట దిలీప్‌ను హాజరుపర్చారు. మేజిస్ట్రేట్ రూ.10 వేలు పూచీకత్తుపై బెయిల్ ఇచ్చారు. ఈ క్రమంలో ఆయన కోర్టు బయటకు రాగానే మళ్లీ కడెం, నిర్మల్ కేసుల విషయంలో అదుపులోకి తీసుకుంటున్నట్లు పోలీసులు తెలపడంతో బీఆర్ఎస్ శ్రేణులు, లీగల్ టీం అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం దిలీప్‌ను పోలీసులు నిర్మల్ రూరల్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. పలు కేసులకు సంబంధించి నోటీసులు ఇచ్చి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. సీఎం రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో అభ్యంతరకరంగా ప్రచారం చేశారంటూ నమోదైన కేసుల విచారణ కోసం దిలీప్‌ను తీసుకువచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సాగుకు శాపం.. బాబుదే ఈ పాపం

ఏపీలో తిరోగమనంలో వ్యవసాయ రంగం ● తక్షణమే పొగాకు రైతులను ఆదుకోవాలి

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ డిమాండ్

> గత ఏడాది పొగాకు కేజీ ధర రూ.366. ఈ ఏడాది అది పెరగాల్సింది పోయి కనీసం రూ.200 కూడా సగటు ధర దక్కడం లేదు. ఖర్మకాలి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో రేటు దారుణంగా పడిపోయింది. మొన్న మిర్చి పంట సమయంలోనూ చంద్రబాబు ఇదే డ్రామా చేశారు. క్వింటా రూ.11,781తో కొంటామన్న ఈ పెద్ద మనిషి చంద్రబాబును అడుగుతున్నా.. ఎన్ని కేజీలు కొన్నారు? ఎంత మంది రైతుల నుంచి మిర్చి కొన్నారు? లెక్కలు చెప్పండి. నిజం ఏమిటంటే, చంద్రబాబు ప్రభుత్వం మిర్చి ఒక్క క్వింటా కూడా కొనలేదు.
>
> - వైఎస్ జగన్



పొదిలి పొగాకు వేలం కేంద్రంలో రైతుల గోడు వింటున్న వైఎస్ జగన్

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు : రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వ తీరుతో వ్యవసాయ రంగం తిరోగమనంలో కొనసాగుతోందని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు మళ్లీ సీఎం కావడం రైతులకు శాపంగా పరిణమించిందన్నారు. రైతుల ఆత్మహత్యలు పెరిగి పోయాయని, ఇటీవల ఒక్క ఉమ్మడి ప్రకాశం జిల్లాలోనే పర్చూరులో ఒకరు, కొండపిలో మరొకరు బలవన్మరణానికి పాల్పడ్డారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పొగాకు రైతులను ఆదుకోవాలని, వారికి గిట్టుబాటు ధర వచ్చేలా, మార్క్‌ఫెడ్‌ను వెంటనే రంగంలోకి దింపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే పంటల కొనుగోలుకు శ్రీకారం చుట్టకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బుధవారం ఆయన ప్రకాశం జిల్లా పొదిలి పొగాకు బోర్డును సందర్శించారు. అక్కడ అధికారులు, రైతులతో మాట్లాడిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసినా, రైతులకు కనీస మద్దతు ధర కంటే రూ.300 తక్కువ చెల్లించిందని చెప్పారు. వరి, మిరప, పత్తి, జొన్న, కందులు, పెసలు, రాగులు, మొక్కజొన్న, కోకో, వేరుశనగ, చీనీ, పొగాకు ఇలా.. ఏ పంట తీసుకున్నా రైతన్నకు రాష్ట్రంలో గిట్టుబాటు ధర రాని పరిస్థితి కనిపిస్తోందన్నారు. అదే ఏడాది క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు, రైతు రాజ్యంగా రాష్ట్రంలో పరిపాలన సాగిందని గుర్తు చేశారు. ఒక్క ఏడాదిలోనే అది పూర్తిగా దిగజారిందని చెప్పడానికి జిల్లాలో జరిగిన రైతుల ఆత్మహత్యలే నిదర్శనం అని తెలిపారు.

పచ్చ మూకల పైశాచికత్వం

పొదిలిలో వైఎస్ జగన్ పర్యటన భగ్నానికి విఫలయత్నం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు



పచ్చ మూకల రాళ్ల దాడిలో గాయపడిన దృశ్యం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రకాశం జిల్లా పొదిలిలో ప్రజలు నీరాజనం పలకడంతో సీఎం చంద్రబాబు అండ్ గ్యాంగ్‌కు వణుకు పుట్టింది. అనూహ్యంగా వేలాది మంది స్వచ్ఛందంగా తరలి వస్తుండటం చూసి కన్ను కుట్టింది. ఎలాగైనా సరే జగన్ పర్యటనను అభాసుపాలు చేయాలని కుట్రకు తెర లేపారు. ఇందుకు పోలీసులూ సహకరించారు. బుధవారం ఉదయం 11.30 గంటలకు పొదిలి–దర్శి రోడ్డులోని ఎస్ఎస్ఆర్ పెట్రోలు బంకు వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు వైఎస్ జగన్ చేరుకున్నారు. అక్కడ నుంచి 2.4 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొగాకు వేలం కేంద్రానికి రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ర్యాలీగా బయలుదేరారు. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకుడు గుణిపూడి భాస్కర్ ఇంటి వద్ద 200 మంది పచ్చ మూకలు కాపు కాశారు. ర్యాలీ పట్టణంలోకి ప్రవేశించగానే ఖాళీ కుండలు, నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. అక్కడ నుంచి ర్యాలీ నవాబ్ పేటకు చేరుకోగానే మరో పచ్చ గుంపు రోడ్డుపైకి చొచ్చుకొచ్చింది. ముందస్తు ప్రణాళిక ప్రకారం వెంట తెచ్చుకున్న రాళ్లతో పాటు జగన్ కాన్వాయ్ మీదకు చెప్పులు విసిరారు. జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉన్నట్లుండి ఒక్కసారిగా రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల పైకి రాళ్లు, చెప్పులు విసరడం ప్రారంభించారు. ఆ ప్రాంతంలోని కొన్ని ఇళ్లలో ముందుగానే తిష్ట వేసిన పచ్చ మూకలు.. డాబాల మీద నుంచి, ఇళ్లలోని కిటికీల నుంచి రాళ్లు విసిరారు. ఈ దాడిలో ఒక పోలీసు కానిస్టేబుల్, కొందరు రైతులు, కార్యకర్తలు గాయపడ్డారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి.. రాళ్ల దాడి చేసిన పచ్చ మూకలను వదిలిపెట్టి.. రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై లాఠీచార్జి చేశారు. దొరికిన వారిని దొరికినట్లు చితకబాదారు.

ఇదంతా ఒక ప్లాన్ ప్రకారమే జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పోలీసుల మద్దతుతోనే రాళ్ల దాడి జరిగిందని ఆరోపిస్తున్నారు. వైఎస్ జగన్ పోరుబాట ర్యాలీ జరుగుతున్న సమయంలోనే టీడీపీ నిరసనలకు పోలీసులు అనుమతివ్వడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పత్తి కొనుగోళ్ల నుంచి సీసీఐ దూరం!

▶ మొదటి పేజీ తరువాయి

ఒత్తిడి తెచ్చి ఆదిలాబాద్‌లో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఒప్పించినట్లు తెలిసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్‌పీ బదులు పీడీపీఎస్ విధానంలో పత్తి విక్రయాలు సాగితే రైతులకు కలిగే లాభ నష్టాలు ఎలా ఉంటాయనే విషయంపై నివేదిక రూపొందించాలని మార్కెటింగ్ శాఖను ఆదేశించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు బుధవారం అధికారులతో సమీక్ష జరిపి పీడీపీఎస్ విధానంపై చర్చించారు.

పీడీపీఎస్ అమలు సాధ్యమేనా..?

పత్తి కొనుగోళ్లలో పీడీపీఎస్ అమలు ఎంతవరకు సాధ్యమనే విషయంపై చర్చ జరుగుతోంది. ప్రత్యామ్నాయ ధరల మద్దతు విధానంగా భావిస్తున్న ఈ పథకం వల్ల రైతు తన పత్తి పంటను బహిరంగ మార్కెట్లో విక్రయించిన తర్వాత, మార్కెట్ ధర కన్నా ఎంఎస్‌పీ ఎంత తక్కువ ఉంటే ఆ మొత్తాన్ని నేరుగా డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతిన రైతు ఖాతాలో జమచేస్తారు. అంటే ప్రభుత్వం రైతు దగ్గర పంటను కొనదు. కానీ మార్కెట్లో రైతు నష్టపోయిన మొత్తాన్ని సర్దుబాటు చేస్తుందన్న మాట.

ఎంఎస్‌పీ-పీడీపీఎస్‌కు మధ్య తేడా..

అంశం	ఎంఎస్‌పీ విధానం	పీడీపీఎస్ విధానం
పంట కొనుగోలు	ప్రభుత్వం నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తుంది	రైతు మార్కెట్లో అమ్ముకుంటాడు. ప్రభుత్వం వ్యత్యాస ధర చెల్లిస్తుంది
గిడ్డంగులు, నిల్వ	ప్రభుత్వం నిల్వలు నిర్వహించాలి	నిల్వ అవసరం లేదు
నష్ట భారం	సీసీఐ భరిస్తుంది	రైతులకు నేరుగా కేంద్రం చెల్లిస్తుంది
ధర భద్రత	తక్షణం ఎంఎస్‌పీ ద్వారా అమ్మకం	మార్కెట్ ధరపై ఆధారపడుతుంది. తర్వాతే పరిహారం
పరిష్కార లక్ష్యం	ధర కంటే తక్కువకు అమ్మకుండా చూడటం	ధర తక్కువైతే తేడా మొత్తాన్ని రైతుకు అందజేయడం

రాష్ట్రంలో గత వానాకాలం సీజన్‌లో 44.73 లక్షల ఎకరాల్లో 20 లక్షల మందికి పైగా రైతులు పత్తి పంట సాగు చేస్తే, 21 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. అయితే, ఈ పంటను కేవలం 8.85 లక్షల మంది రైతుల నుంచే కొనుగోలు చేశారు. రైతు నేరుగా పంటను తీసుకొచ్చి మద్దతు ధరకు సీసీఐకి విక్రయించే అవకాశం ఉన్నా.. దళారులు, జిన్నింగ్ మిల్లుల వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై పంటను రైతుల పేరిట సీసీఐకి విక్రయిస్తున్నారని తేలింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణకు కూడా ఆదేశించింది. ఇక పీడీపీఎస్ పథకం ద్వారా ఎన్ని అక్రమాలు జరుగుతాయో ఊహించలేం. అదీ గాక 25 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత గల జిన్నింగ్ మిల్లులేవీ రాష్ట్రంలో లేవు. దీంతో జిల్లాల వారీగా దళారులే తక్కువ ధరకు కొనుగోలు చేసి మిల్లులకు విక్రయించుకునే పరిస్థితి ఉంటుంది. అప్పుడు వ్యత్యాసపు ధర ఊసే ఉండదని మార్కెటింగ్ శాఖ అధికారి ఒకరు తెలిపారు.

పదేళ్ల కిందటే మధ్యప్రదేశ్‌లో విఫలమైన ప్రయోగం

మధ్యప్రదేశ్‌లో 2016–17లోనే 8 ప్రధాన పంటలకు పీడీపీఎస్ విధానాన్ని అమలు చేశారు. సోయాబీన్, పెసర, మినప, కంది, మొక్కజొన్న, నువ్వులు, వేరుశనగ, రామ్‌దానా పంటలను పీడీపీఎస్‌లో చేర్చారు. అయితే, రైతులకు వ్యత్యాసాన్ని నిర్ధారించడంలో లోపాలు, వ్యత్యాసపు ధర చెల్లింపుల్లో ఆలస్యం, మార్కెట్ ధరల్లో తేడాలు, నిజమైన రైతులకు కాకుండా దళారీలకు చెల్లింపులు వంటివి చోటుచేసుకోవడంతో మరుసటి సంవత్సరమే ఆ పథకాన్ని నిలిపివేశారు. దానిని ఇప్పుడు తెలంగాణలో అమలు చేయాలని నిర్ణయించటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇకపై ఆదిలాబాద్ జిల్లాలో సీసీఐ పత్తిని రైతుల నుంచి కొనుగోలు చేయదు. రైతు మార్కెట్‌లో దళారులు చెప్పే ధరకు అమ్ముకోవాలి. అప్పుడు మార్కెట్ ధర ఎంఎస్‌పీ కన్నా తక్కువైతే ప్రభుత్వం సర్దుబాటు చేస్తుంది. అయితే, ఈ తేడాను నిర్ధారించేది ఎవరో తేలాల్సి ఉంది.

సామాజిక న్యాయంతో కేబినెట్ కూర్పు...

▶ మొదటి పేజీ తరువాయి

సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ జనాభాలో 15 శాతం ఉన్న ఎస్సీలకు 27 శాతం పదవులిచ్చాం. 4 మంత్రి పదవులతో పాటు స్పీకర్ పదవి ఎస్సీలకిచ్చాం. ఎస్టీలకు ఒక మంత్రి పదవి, డిప్యూటీ స్పీకర్ అవకాశం ఇచ్చాం. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 8 మంది రెడ్లు, 4 వెలమలకు మంత్రులుగా అవకాశమిచ్చి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేవలం మూడు మంత్రి పదవులే ఇచ్చారు..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. పార్టీ అధిష్టానంతో భేటీ నిమిత్తం మూడ్రోజుల కిందట ఢిల్లీ వచ్చిన సీఎం.. బుధవారం తన అధికారిక నివాసంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

స్థానిక సంస్థల్లోనూ 42 శాతం రిజర్వేషన్లు: సామాజిక న్యాయానికి పెద్దపీట వేసే పార్టీగా స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ 42% రిజర్వేషన్లను పార్టీ పరంగా అమలు చేస్తాం. ఈ మేరకు ఇతర పార్టీలను కూడా కోరతాం. కేంద్రం ఆమోదిస్తే అధికారికంగానూ అమలు చేస్తాం.కులగణన ఆధారంగా నిమ్న వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించే విషయమై జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కమిటీని నియమించాం. ఆ కమిటీ సిఫారసుల మేరకు ముందుకు వెళతాం. స్థానిక సంస్థల ఎన్నికలు కోర్టులో కేసులు తేలిన వెంటనే నిర్వహిస్తాం.

ప్రక్షాళన ప్రచారంలో నిజం లేదు : పాత మంత్రుల్లో ఎవరైనా తమకు పనిభారం ఎక్కువగా ఉందని చెబితే, వారి శాఖల మార్పుపై నిర్ణయం తీసుకుంటాం. రాష్ట్ర మంత్రివర్గంలోకి కొత్తగా చేరిన వారికి తన వద్ద ఉన్న శాఖలను పంచుతా. శాఖల ప్రక్షాళనపై జరుగుతున్న ప్రచారంలో నిజం లేదు. నా వద్ద 12 శాఖలు ఉన్నాయి. వీటినే కొత్త మంత్రులకు పంచాలని భావిస్తున్నా. మిగతా వారివద్ద ఏయే శాఖలున్నాయి, ఎక్కువ శాఖలున్న మంత్రులు ఎవరిపైనైనా పని భారం ఉందా? అన్న దానిపై చర్చిస్తాం. ఎవరైనా పనిభారం ఉందంటే శాఖలను మారుస్తాం. హైదరాబాద్‌లో అందరితో మాట్లాడి నిర్ణయం చేస్తాం.

'కాళేశ్వరం'పై రెండ్రోజుల్లో ప్రజల ముందుకు..: కాళేశ్వరం అక్రమార్కులపై కచ్చితంగా చర్యలుంటాయి. రెండ్రోజుల్లో హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి కాళేశ్వరంపై నా అభిప్రాయాన్ని, గతంలో జరిగిన తప్పిదాలను ప్రజల ముందు ఉంచుతా. కాళేశ్వరం ప్రాజెక్టును అప్పటి ప్రభుత్వం ఏటీఎంలా మార్చుకుందని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు ఆరోపణలు చేస్తే, ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ మాత్రం కాళేశ్వరంలో అంతా బాగానే ఉందని చెప్పడం ఏంటి? రాష్ట్రాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డే వంద శాతం అడ్డంకి. తెలంగాణ సమస్యలపై ఆయన కేంద్ర కేబినెట్‌లో ఒక్కసారైనా మాట్లాడారా? రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు కూడా తీసుకురాలేదు. నిర్మలా సీతారామన్ చెన్నైకి, ప్రహ్లాద్ జోషి కర్ణాటకకు మెట్రో తీసుకెళ్లారు. అలాంటిది తెలంగాణ మెట్రోకు కిషన్‌రెడ్డి ఎందుకు అడ్డుపడుతున్నారు? కేటీఆర్ వ్యతిరేకిస్తున్నారు కాబట్టే కిషన్‌రెడ్డి కూడా వ్యతిరేకిస్తున్నారు. తెలంగాణకు సంబంధించిన పెండింగ్ అంశాలపై రివ్యూ జరుపుతానంటే హైదరాబాద్ సచివాలయంలో లేదంటే.. ఢిల్లీలో.. ఎక్కడైనా అధికారులతో కలిసి సమీక్షకు నేను రెడీ.

కేసీఆర్ ఫ్యామిలీ రాష్ట్రానికి శత్రువులు: కేసీఆర్ కుటుంబం రాష్ట్రానికి దుష్మన్లు (శత్రువులు). వారిని, బీఆర్ఎస్ నేతలను నేను ఉన్నంతవరకు కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునేది లేదు. కేసీఆర్ ఫ్యామిలీ కొరివి దెయ్యాల ఫ్యామిలీ అని గతంలోనే చెప్పా. కేటీఆర్, హరీశ్‌రావు, కవిత అసెంబ్లీ రౌడీ సినిమాలో 'బాషా'బ్యాచ్ లాంటివాళ్ళు. వాళ్ల కుటుంబ పంచాయితీ ఆ సినిమా మాదిరిగానే ఉంది. మీడియా దృష్టి తమ వైపు తిప్పుకునేందుకు డ్రామాలు ఆడుతున్నారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని కవిత చెప్పింది. ఇప్పటివరకూ దానిపై కేసీఆర్ మాట్లాడలేదు.

అసమానతలున్నంత కాలం నక్సలిజం అంతం కాదు: నక్సలిజం సామాజిక సమస్య. దేశంలో సామాజిక అసమానతలున్నంత కాలం నక్సలిజం అంతం కాదు. ఎవరూ అంతం చేయలేరు. సామాజిక అసమానతలను తొలగించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో చర్యలను చేపట్టింది. ప్రధానిగా ఇందిరాగాంధీ భూ సంస్కరణలు తీసుకువచ్చారు. 'దున్నేవాడిదే భూమి'అనే నినాదం ఆదర్శంగా తెలంగాణలో నిరుపేదలకు లక్షల ఎకరాలు పంచారు. ఇళ్లు కట్టించారు. వీటివల్ల నక్సలిజం తగ్గింది. కులగణన సర్వే అమలుతోనూ నక్సలిజం తగ్గుతుంది.

కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు

వివేక్, లక్ష్మణ్, శ్రీహరిలకు మంత్రిత్వ శాఖలు ఇచ్చిన సీఎం రేవంత్



వివేక్



లక్ష్మణ్



శ్రీహరి

సాక్షి హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ముగ్గురు కొత్త మంత్రులకు శాఖలు కేటాయించారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల ప్రకారం గడ్డం వివేక్‌కు కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీల శాఖను అప్పగించారు. దీంతోపాటు గనులు, భూగర్భ వనరుల శాఖను కూడా వివేక్‌కు ఇచ్చారు. అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు సంక్షేమ శాఖలు కేటాయించారు. షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన, మైనారిటీ సంక్షేమం, వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్ల సాధికారత శాఖలను ఆయనకు అప్పగించారు. అలాగే వాకిటి శ్రీహరికి పశుసంవర్ధకం, డెయిరీ అభివృద్ధి, మత్స్యశాఖ కేటాయించారు. దీనికి అదనంగా క్రీడలు, యువజన సర్వీసుల శాఖను కూడా ఇచ్చారు. ఈ శాఖలన్నీ ఇప్పటివరకు ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. ఇంకా హోం, విద్య, మున్సిపల్ శాఖలు సీఎం వద్ద ఉన్నాయి. మరోవైపు కొందరు మంత్రుల శాఖలు మారుతాయని, గత రెండు రోజులుగా రాజకీయ వర్గాల్లో ప్రచారం జరిగింది. కొత్త మంత్రులు ప్రమాణం చేసిన మరుసటి రోజే సీఎం ఢిల్లీ వెళ్లడం, అక్కడే రెండు రోజులపాటు పార్టీ పెద్దలతో చర్చలు జరిపిన నేపథ్యంలో మంత్రుల శాఖల్లో మార్పులు ఉంటాయని ఊహాగానాలు వచ్చాయి. కానీ ఆ ఊహాగానాలకు తెరదించుతూ, తన వద్ద ఉన్న శాఖలనే కొత్త మంత్రులకు కేటాయిస్తానని బుధవారం మధ్యాహ్నం సీఎం రేవంత్ ఢిల్లీలో చిట్ చాట్ సందర్భంగా చెప్పారు. ఈ మేరకు రాత్రికల్లా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులు (జీవో నం:131) విడుదల చేయడం గమనార్హం. మిగతా మంత్రుల శాఖలోఎలాంటి మార్పూ లేదు. కాగా, శాఖల కేటాయింపు పూర్తయిన నేపథ్యంలో కొత్త మంత్రులు బాధ్యతల స్వీకారానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఒకట్రెండు రోజుల్లో ముహూర్తం చూసుకుని అధికారికంగా ముగ్గురు కొత్త మంత్రులు విధుల్లో చేరనున్నట్టు తెలిసింది.

తల్లికి వందనం రూ.13 వేలే!

- అదీ ఒకే మొత్తంగా ఇస్తారా.. లేక వాయిదాల పద్ధతో స్పష్టత కరువు
- నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు అన్నారు.. తీరా మాట మార్చేసిన చంద్రబాబు సర్కారు

సాక్షి, అమరావతి: 'నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ ఇస్తాం. ఒకరుంటే రూ.15 వేలు.. ఇద్దరుంటే రూ.30 వేలు.. ముగ్గురుంటే రూ.45 వేలు.. నలుగురుంటే రూ.60 వేలు ఇస్తాం.. అధికారంలోకి రాగానే తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం పథకం కింద ఈ మొత్తాన్ని జమ చేస్తాం'అని ఊరూరా.. ఇంటింటా ఎన్నికల ముందు ప్రచారం చేసిన చంద్రబాబు అండ్ గ్యాంగ్.. ఇప్పుడు మాట తప్పింది. అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని తొలి ఏడాది పూర్తిగా ఎగ్గొట్టడమే కాకుండా.. రెండో ఏడాది తూతూ మంత్రంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. రూ.15 వేల స్థానంలో రూ.13 వేలు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించిందని తెలిసింది. అది కూడా రాష్ట్రంలో 87,41,885 మంది విద్యార్థులుంటే.. 67,27,164 మందికి మాత్రమే ఇవ్వనుంది. ఈ లెక్కన 20,14,721 మందికి వివిధ కారణాలతో ఎగ్గొట్టనుంది. ఈ రూ.13 వేలను ఒకేసారి ఇస్తారా.. లేక వాయిదాల పద్ధతిలో ఇస్తారా.. అన్నది ఇంకా స్పష్టం చేయలేదు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా సూపర్ సిక్స్ అమలు చేయక పోవడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎన్ని డైవర్షన్ పాలిటిక్స్ చేసినా.. ప్రజలు ఈ పథకం గురించి ఎక్కడికక్కడ ప్రశ్నిస్తుండటంతో అరకొరగా అమలు చేయనుందని తెలుస్తోంది. అయితే అంతుబట్టని అంకెల గారడీతో తల్లుల కళ్లకు గంతలు కట్టింది. ప్రస్తుతం రాష్ట్రంలో 67,27,164 మంది విద్యార్థులున్నట్టు చెబుతోంది. ఈ లెక్కన తలో రూ.15 వేల చొప్పున రూ.10,090.74 కోట్లకు పైగా అవసరం. కానీ ఇచ్చేది రూ.8,745 కోట్లేనంటూ సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఈ లెక్క కేవలం 44.48 లక్షల మంది విద్యార్థులకే సరిపోతుంది. దీని ప్రకారం మిగిలిన 22.79 లక్షల మందికి కోత పెట్టనున్నట్టు చెప్పకనే చెప్పారు. నగదు జమ చేసే సమయానికి ఇంకెంత మందికి ఎగ్గొడతారోననే అనుమానం వ్యక్తమవుతోంది. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభమైన జూన్ నెలలో అమ్మఒడి జమయ్యేది. గతేడాది జూన్ నెలలో 42 లక్షల మంది తల్లులకు నిధులు జమ కావాల్సి ఉన్నా, ఎన్నికలు జరిగి కూటమి ప్రభుత్వం రావడంతో పథకం ఆగిపోయింది. కానీ సీఎం చంద్రబాబు గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు కొనసాగిస్తామన్నారు. అలాగే, ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం ఇస్తామన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం రెండేళ్లకు ఒక్కో విద్యార్థికి రూ.30 వేల చొప్పున ఇవ్వాలని తల్లులు డిమాండ్ చేస్తున్నారు.

గాలికి ఊరట

సీబీఐ కోర్టు తీర్పును సస్పెండ్ చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఓబుళాపురం మైనింగ్ కేసులో గాలి జనార్దన్‌రెడ్డికి సీబీఐ కోర్టు విధించిన ఏడేళ్ల జైలు శిక్షను సస్పెండ్ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. జనార్దన్‌రెడ్డితోపాటు ఓఎంసీ ఎండీ బీవీ శ్రీనివాస్‌రెడ్డి, నాటి గనుల శాఖ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, గాలి జనార్దన్‌రెడ్డి పీఏ మెఫజ్ అలీఖాన్‌లకు బెయిల్ మంజూరు చేసింది. రూ.10 లక్షల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని, దేశం విడిచి వెళ్లరాదని, పాస్‌పోర్టు సీబీఐ కోర్టులో సరెండర్ చేయాలంటూ పలు షరతులు విధించింది. అయితే, ఉద్యోగ విరమణ పొందిన తాను అంత మొత్తంలో పూచీకత్తు చెల్లించలేనని రాజగోపాల్ విజ్ఞప్తి చేయగా, రూ.లక్ష చొప్పున రెండు పూచీకత్తులు సీబీఐ కోర్టులో సమర్పించాలని ఆదేశించింది. బీవీ శ్రీనివాస్‌రెడ్డి, గాలి జనార్దన్‌రెడ్డి, రాజగోపాల్, మెఫజ్ అలీఖాన్‌లను దోషులుగా తేలుస్తూ గత నెల 6న సీబీఐ కోర్టు ఏడేళ్ల జైలు విధించింది. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో అప్పీళ్లు దాఖలు చేశారు. శిక్ష నిలిపివేయాలని, బెయిలివ్వాలని కోరుతూ మధ్యంతర అప్లికేషన్(ఐఏ)లు వేశారు. ఈ అప్లికేషన్లపై విచారణ ముగించి తీర్పు రిజర్వు చేసిన జస్టిస్ కె.లక్ష్మణ్ బుధవారం ఉత్తర్వులు వెలువరించారు.

ఎస్ఎల్‌బీసీ పనులపై ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సర్వే

- టన్నెల్ ప్రాంతంలో నేల స్వభావాన్ని కచ్చితంగా గుర్తించే ప్రయత్నం
- రక్షణ శాఖ హెలికాప్టర్లతో సర్వే నిర్వహిస్తాం: మంత్రి ఉత్తమ్



వీరేంద్ర తివారీతో చర్చిస్తున్న మంత్రి ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ తవ్వకం పనులు తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. టన్నెల్ ప్రాంతంలోని నేల స్వభావాన్ని కచ్చితంగా అంచనా వేసేందుకు ప్రత్యేక హెలికాప్టర్లతో ఎలక్ట్రో మ్యాగ్నటిక్ సర్వే చేయించాలని నిర్ణయించింది. అందుకోసం తక్కువ ఎత్తులో ఎగిరే సామర్థ్యం గల రక్షణ శాఖకు చెందిన రెండు హెలికాప్టర్లు వినియోగించనున్నారు. సర్వే పరికరాలను డెన్మార్క్ నుంచి ప్రత్యేకంగా తెప్పించనున్నారు. ఈ సర్వేపై బుధవారం నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ శాఖ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, సీఈ అజయ్‌కుమార్‌లు నార్త్ ఈస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ వీరేంద్ర తివారీ, బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ డీజీగా పనిచేసిన హర్‌పాల్‌సింగ్, కల్నల్ పరీక్షిత్ మెహ్రాలతో విడివిడిగా భేటీ అయ్యారు. టన్నెల్ పునరుద్ధరణ, సర్వే, నిర్మాణ పనులపై వారితో చర్చించారు. సర్వే కోసం రెండు ప్రత్యేక హెలికాప్టర్లను ఇవ్వాలని కోరగా, రక్షణ శాఖ అధికారులు అంగీకరించినట్లు మంత్రి తెలిపారు. ఎలక్ట్రో మ్యాగ్నటిక్ పరికరాలతో జరిపే సర్వే భూ ఉపరితలం నుంచి ఒక కిలోమీటర్ లోతు వరకు నేల స్వభావంతో పాటు ఇతర సమాచారాన్ని అందిస్తుందని తెలిపారు. నేల స్వభావాన్ని తెలుసుకోవడం ద్వారా నిర్మాణ పనులు సులభతరం అవుతాయని పేర్కొన్నారు. జూలై 12న సర్వే మొదలై వారం రోజుల్లో పూర్తవుతుందని వెల్లడించారు. వచ్చే రెండేళ్లలో టన్నెల్ పనులను పూర్తిచేసి కృష్ణా జలాలను గ్రావిటీ ద్వారా నల్లగొండ జిల్లాకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. టన్నెల్ పనుల పూర్తికోసం కల్నల్ పరీక్షిత్ మెహ్రా డిప్యుటేషన్‌పై రెండేళ్లపాటు సాగునీటి శాఖలో స్పెషల్ సెక్రటరీ హోదాలో పనిచేస్తారని చెప్పారు. టన్నెల్ తవ్వకాల్లో అపార అనుభవం ఉన్న జనరల్ హర్పాల్ సింగ్ తెలంగాణ ప్రభుత్వానికి జీతం తీసుకోకుండా గౌరవ సలహాదారుగా సేవలు అందిస్తారని వివరించారు.



● ట్రెండ్

BREAK FREE STORIES




● రాఫియా నిర్వహించిన 'డివోర్స్ క్యాంప్'లో...

డివోర్స్ క్యాంప్స్

విడాకులు తీసుకున్న స్త్రీల గురించి వ్యాఖ్యలు వినిపిస్తూనే ఉంటాయి. తప్పు ఎవరిదైనా వీరినే సందేహంగా చూస్తారు. విడాకుల తర్వాతి జీవితం పురుషుడికి ఉన్నంత సులువుగా స్త్రీకి లేదు. వారికంటూ స్నేహబృందం కష్టమే. అందుకే కేరళకు చెందిన రాఫియా తాజాగా నిర్వహించిన 'డివోర్స్ క్యాంప్' అందరి దృష్టినీ ఆకర్షించింది. విడాకులు పొందిన స్త్రీల బృందం రెండు రోజులపాటు స్నేహితులుగా మారి తమ మనోభావాలు పంచుకోవడమే ఈ క్యాంప్స్ లక్ష్యం. మొదటిది సక్సెస్ కావడంతో రాబోయే రెండు నెలల్లో మరో నాలుగు క్యాంప్స్ నిర్వహించనుంది రాఫియా.

'మేము కలిసేది మా బాధలు, పాత కథలు చెప్పుకుని ఏడ్వడానికి కాదు. మేము మర్చిపోయిన నవ్వును తిరిగి పొందడానికి' అంటుంది రాఫియా అఫి. 30 ఏళ్ల ఈ డివోర్సీది కేరళలోని ఇడుక్కి. వారం క్రితం ఈమె పదిహేను మంది డివోర్సీ మహిళలతో ఇడుక్కికి సమీపంలో ఉండే వాగమాన్ అనే అందమైనచోట రెండు రోజుల 'డివోర్సీ క్యాంప్' నిర్వహించింది. బహుశా దేశంలో ఇలాంటి మాట వాడుతూ స్త్రీల బృందం కలవడం ఇదే మొదటిసారి కావచ్చు. ఈ పదిహేనుమందిలో ఎక్కువమంది విడాకులు పొందినవారు... మిగిలిన వారు పొందేందుకు పోరాటం చేస్తున్నవారు. వీరిలో ఒకరిద్దరు తమ పిల్లలతో వచ్చారు కూడా.

మాకంటూ స్పేస్ కావాలి

'సమాజంలో విడాకులను ఇప్పటికీ వ్యక్తిగత వైఫల్యంగా చూస్తారు. విడాకులు పొందిన స్త్రీని చూస్తూ ఆమెకు చేతగాక కాపురాన్ని పాడు చేసుకుందని భావిస్తారు. కుటుంబ సభ్యులు మొదలు అందరూ సానుభూతిగా చూస్తుంటారు. వివాహంలో ఉన్నప్పుడు ఉన్న స్నేహాలన్నీ చెదిరిపోతాయి. విడాకుల వల్ల స్త్రీకి ఆర్థికంగా, వ్యక్తిగతంగా ఎంతో నష్టమున్నా ఇలాంటి పరిస్థితుల వల్ల ఎంతో ఒత్తిడి ఉంటుంది. మమ్మల్ని జడ్జ్ చేయని విధంగా మాకంటూ మేము ఒక స్పేస్‌ను హాయిగా గడిపేలా ఈ డివోర్సీ క్యాంప్ ఉపయోగపడుతోంది' అంది రాఫియా.

బ్రేక్ ఫ్రీ స్టోరీస్

రాఫియాకు ఇన్‌స్టాలో 'కుక్ ఈట్ బర్న్' అనే అకౌంట్ ఉంది. అందులో ఆమె సరదా వీడియోలు పెట్టేది. 'కాని నా విడాకుల గురించి మాట్లాడటానికి సందేహించిదాన్ని. విడాకులు పొంది తర్వాతి జీవితం విషయంలో లోలోపల ఆందోళనగా ఉన్నదాన్ని నేనొక్కదాన్నే అనుకున్నాను. నా ఇన్‌స్టాలో నా విడాకుల గురించి మాట్లాడటం మొదలుపెటాక నేనే కాదు.. నాలా ఉన్న స్త్రీలు ఎందరో ఉన్నారని వారి రెస్పాన్స్‌ను బట్టి అర్థమైంది. కేరళలో విడాకులు పొందిన స్త్రీలతో 'బ్రేక్ ఫ్రీ స్టోరీస్' పేరుతో ఒక వాట్సప్ గ్రూప్ పెడితే మానసిక ఓదార్పు మాత్రమే గాక లీగల్ సమస్యలకు ఇతరత్రా ఇష్యూస్‌కు ఒక సపోర్ట్ ఉంటుందని ప్రయత్నించాను. కొద్దిరోజుల్లోనే వందమంది మహిళలు చేరారు. వారిలో కొంతమందితో క్యాంప్ నిర్వహించాలని అనుకున్నాను. మొదటి ప్రయత్నంగా వాగమాన్‌లో రెండురోజుల క్యాంప్ ఉందని చెప్పాను. పదిహేను మంది వచ్చారు' అని తెలిపింది రాఫియా.

క్షణాల్లో ఆత్మబంధువులు

డివోర్సీ క్యాంప్‌కు వచ్చిన పదిహేను మంది మహిళలు అంతకు ముందు ఎటువంటి పరిచయం లేని వాళ్లు. కాని కలిసీ కలవగానే వీరంతా స్నేహితులైపోయారు. ఎడతెగని మాటలు... నవ్వులు... కొన్ని కన్నీళ్లు... ఆటలు... నృత్యాలు... ప్రకృతి తుళ్లిపడే కేరింతలు... మేమందరం ఒకే లాంటి సమస్యలో ఉన్నవాళ్లం అన్న భావన వారిని ఒక్కటి చేసి మానసిక బలం ఇచ్చింది. 'వీరిలో చాలామందికి సొంత కుటుంబ సభ్యుల నుంచీ సపోర్ట్ లేదు. విడాకుల సమయంలో స్త్రీలకు ఇతరుల మద్దతు లేకున్నా తల్లిదండ్రుల మద్దతు తప్పనిసరి. అదృష్టవశాత్తు నాకు ఉంది' అని తెలిపింది రాఫియా. "ఈ క్యాంప్‌లో అందరం కలిసి అనుకున్నమాట– విడాకుల తర్వాత కూడా మంచి జీవితాన్ని సాధించవచ్చుననే" అంది రాఫియా. ఇకపై నిర్వహించబోయే డివోర్సీ క్యాంపుల్లో థెరపీ, లీగల్ అడ్వయిజ్, ఫైనాన్షియల్ సపోర్ట్, సమాజాన్ని ఎదుర్కోవాల్సిన తీరు గురించి ఎక్స్‌పర్ట్‌లతో కౌన్సిలింగ్స్ ఉంటాయని చెబుతోంది రాఫియా.

ఆశ్చర్యం ఏమిటంటే ఈ క్యాంప్ అయిన వెంటనే రాఫియా ఫోన్ ఎడతెగక మోగుతోంది. అలెప్పీ, వాయనాడ్‌లాంటి చోట్ల ఆమె ఈ క్యాంప్‌లను ప్లాన్ చేసింది. అక్కడికి ఇప్పటికే వచ్చేవారు సిద్ధమయ్యారు కూడా.

కొసమెరుపు: విడాకులు పొందిన, పొందే క్రమంలో ఉన్న పురుషులు కూడా ఆమెకు ఫోన్ చేస్తున్నారు... ఇలాంటి క్యాంపులు నిర్వహించమని. 'ఆ సంగతి కూడా ఆలోచిస్తాను' అంటోంది రాఫియా.



పూల రెక్కలు... తేనెచుక్కలు

● గులాబీ రేకులు, నల్ల నువ్వులు, బార్లీ గింజలు సమపాళ్లలో తీసుకొని, పొడి చేసి, ఒక డబ్బాలో భద్రపరుచుకోవాలి. ఈ పొడిని కావల్సినంత తీసుకొని తగినన్ని రోజ్‌వాటర్ కలిపి, ముఖానికి పట్టించాలి. ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవాలి. పొడిబారిన చర్మం మృదువుగా, కాంతిమంతంగా అవుతుంది.

● అర టీ స్పూన్ తేనె, రెండు టేబుల్ స్పూన్ల రోజ్ వాటర్ కలిపి ముఖానికి, మెడకు రాసుకోవాలి. పదిహేను నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. తేనె చర్మానికి మాయిశ్చరైజర్‌లా ఉపయోగపడుతుంది. రోజ్ వాటర్‌తో చర్మ రంధ్రాలు శుభ్రపడి ముఖ చర్మం కాంతివంతమవుతుంది.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 11న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,310
బంగారం (22 క్యారెట్లు)	90,725
వెండి	1,05,000
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	99,540
బంగారం (22 క్యారెట్లు)	90,200
వెండి	1,09,600
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	98,400
బంగారం (22 క్యారెట్లు)	90,200
వెండి	1,19,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	99,540
బంగారం (22 క్యారెట్లు)	92,910
వెండి	1,09,600
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,650
బంగారం (22 క్యారెట్లు)	88,920
వెండి	1,04,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	98,400
బంగారం (22 క్యారెట్లు)	90,200
వెండి	1,19,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● మన(సు)లో మాట

ఇలాంటి భర్తతో జీవితాంతం ఉండగలనా?

నాకు గత ఏడాది పెళ్లయింది. నా భర్త ప్రభుత్వ ఉద్యోగి. పెళ్ళి అయిన మొదటి రోజు నుంచి నేను గమనించిందేమిటంటే... ఆయన తన గురించి తాను విపరీతంగా గొప్పలు చెప్పుకుంటారు. మిగిలిన వాళ్ళని మనుషులుగా కూడా చూడరు. నాఒక్క దానితోనే ఇలా ఉంటాడనుకున్నాను. కానీ బయట అందరితో ఇలాగే ఉంటాడని తెలిసింది. ఎక్కడికి వెళ్ళినా అందరూ తనని స్పెషల్‌గా చూడాలనుకుంటాడు. ఆయన చుట్టాల్లో, ఫ్రెండ్స్ సర్కిల్లో ఆయన్ని 'డబ్బారాయుడు' అంటారట. ఆఫీస్‌లో కూడా అందరితో ఇలా మాట్లాడుతున్నాడని తెలిసి ఆయనకి వార్నింగ్ కూడా ఇచ్చారు. అయినా ఆయన ప్రవర్తన మారలేదు. కిందపడ్డా తనదే పై చేయి అంటాడు. ఈ మధ్య నా కజిన్ పెళ్ళికి వెళ్తే అక్కడ తనకంటే ఆపెళ్ళి కొడుకుకి ఎక్కువ మర్యాదలు చేస్తున్నారని అలిగి వచ్చేశాడు. ఎవరైనా చిన్న మాట అన్నా నొచ్చుకుంటారు. ఆయనని ఎలా అర్థం చేసుకోవాలో తెలీట్లేదు. ఇలాంటి వ్యక్తితో నేను జీవితాంతం ఉండగలనా అనిపిస్తోంది!

- అలేఖ్య, చిత్తూరు

మీరు చెప్పిన విషయాలు చదివిన తరువాత మీ భర్తకి ఉన్న పర్సనాలిటీ సమస్య వల్ల మీరు తీవ్రమైన ఒత్తిడి, అసౌకర్యానికి గురవుతున్నారని అర్థమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో భవిష్యత్తు గురించి ఆందోళన సహజమే. మీ భర్త తనని గొప్పగా ప్రదర్శించుకోవడం, ఇతరుల్ని చిన్నచూపు చూడడం, విమర్శలను ఒప్పుకోకపోవడం, అందరిపై తానే మెరుగ్గా ఉండాలని కోరుకోవడం, తాను చాల గొప్పవాడిననే భావన, ఇతరుల భావాల పట్ల ఎంపతీ లేకపోవడం) ఇవన్నీ 'నార్సిసిస్టిక్' వ్యక్తిత్వ లక్షణాలుగా పేర్కొనవచ్చు. తమ తప్పులకి అవతలి వాళ్ళని బాధ్యులుగా చేసి గిల్టీగా ఫీల్ అయ్యేలా చేసే 'గ్యాస్ లైటింగ్' అనే పద్ధతిని వీళ్ళు ఎక్కువగా వాడతారు. ఈ పర్సనాలిటీ సమస్య జన్యుపరమైన కారణాలు, పెంపక లోపాలు, బాల్యంలో వారు పెరిగిన పరిస్థితుల వలన రావచ్చు. స్త్రీల కంటే పురుషుల్లో ఎక్కువగా ఈ సమస్యను చూస్తాము. వాళ్ళకు తాము ఏదైనా సమస్యతో ఉన్నామనే ఎరుక ఉండదు. అందువల్ల వీరికి చికిత్స చేయడం కూడా చాలా కష్టం. వారిలో మారాలనే ఆలోచన ఎంతో కొంత ఉంటే సైకోథెరపీ ద్వారా కొంతమార్పు తీసుకురావచ్చు. కాగ్నిటివ్ బిహేవియర్ థెరపీ' ద్వారా తన ఆలోచనల్ని, ప్రవర్తనల్ని మార్చుకోవచ్చు. కానీ ఇది కాస్త సమయంతో కూడుకున్న వ్యవహారం. మీరు ఇద్దరూ కలిసి కౌన్సెలింగ్ తీసుకుంటే సహజంగానే మీ బంధాన్ని మెరుగుపర్చుకోవచ్చు. కానీ దానికి కూడా అతను సహకరించాల్సిన అవసరం ఉంది.'నార్సిజం'కు ప్రత్యేకంగా మందులు లేవు. కానీ వీరిలో డిప్రెషన్, ఆందోళన లేదా కోపం లాంటి సమస్యలు ఉంటే వాటికి మానసిక వైద్యులు మందులు సూచిస్తారు. అయితే వీరితో జీవితాంతం కలిసి ఉండవచ్చా అనే ప్రశ్న చాలా సంక్లిష్టమైనది. కొంత కష్టమే అయినా మీరు అతన్ని అతనిలా అంగీకరించగలిగితే కలిసి ఉండొచ్చు. కానీ కొన్నిహద్దులు ఏర్పాటు చేసుకోవాలి. మీ ఆత్మగౌరవానికి భంగం కలిగేలా ప్రవర్తిస్తే మీరు అతనికి ఆ విషయాన్ని చెప్పగలగాలి. మీరు మానసికంగా దృఢంగా ఉండాలి. చివరిగా మీకు నాదొక సలహా. పొగడ్తకి లొంగని మనిషి లోకంలో లేరు. అలాంటిది మీ భర్తకు పొగడ్తే ఆహారం, నీరు అన్నీ! అప్పుడప్పుడూ మీరే అతన్ని పొగిడితే అతనూ సంతోషంగా ఉంటాడు. మీరూ కాస్త ప్రశాంతంగా ఉండొచ్చు. మీ లాంటి 'సైలెంట్ సఫరర్స్' లోకంలో చాలామందే ఉన్నారు. విడిపోవడం చాలా సులభం, కానీ కలిసి ఉండాలంటే మీవైపు నుండి కొంత సర్దుబాటు, ఓర్పు, త్యాగం అవసరం. గట్టి ప్రయత్నంతో చాలా సమస్యలు సర్దుకుంటాయి. ప్రయత్నిస్తే పోయేది ఏం లేదు. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ
sakshifamily3@gmail.com

● కొత్త దారి

గ్రీన్ ఆర్కిటెక్చర్


● కృతిక కట్టిస్తున్న ఎకో ఫ్రెండ్లీ భవనం


● కృతిక

కాంక్రీట్ జంగిల్స్‌గా మారిన నగరాలను చూసిన తరువాత ఒక కొత్త దారి గురించి ఆలోచించింది కృతిక. చెన్నైకి చెందిన యంగ్ ఆర్కిటెక్ట్ కృతిక వెంకటేష్ ఇంటి నిర్మాణానికి, పర్యావరణానికి మధ్య ఉన్న వైరుధ్యాలను దృష్టిలో పెట్టుకొని 'స్టూడియో ఫర్ ఎర్తెన్ ఆర్కిటెక్చర్' వెంచర్‌కు శ్రీకారం చుట్టింది.

ఈ స్టూడియోకు ఆధారం ఏమిటి?

మనం మరచిపోయిన శతాబ్దాలనాటి జ్ఞానం.

ఇంటి నిర్మాణంలో మట్టి, సున్నం... మొదలైన వాటిని ఉపయోగిస్తారు.

ఎన్నో రంగాలను లోతుగా అధ్యయనం చేసిన కృతిక సమకాలీన ఆర్కిటెక్చర్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణహిత మార్గాన్ని ఎంచుకుంది. లారీ బేకర్ అనే ఆర్కిటెక్ట్ పరిచయం అయిన తరువాత కేరళలోని ఆయన ఇనిస్టిట్యూట్‌కు వెళ్లి టెక్నిక్స్‌ను తెలుసుకుంది.

గాంధేయవాది అయిన లారీ బేకర్, ఇంటి నిర్మాణంలో స్థానిక వస్తువులను వాడతారు. తక్కువ ఖర్చు అయ్యే పద్ధతులను అనుసరిస్తారు. ఆయన అనుసరిస్తున్న పద్ధతులను తన ప్రాజెక్ట్‌లో భాగం చేయడంతో పాటు మరింత అధ్యయనం చేసింది కృతిక. ఒడిశా, జార్ఖండ్‌లాంటి రాష్ట్రాలకు వెళ్లి ఇంటి నిర్మాణాలను అధ్యయనం చేసింది.

'పర్యావరణానికి హాని చేస్తున్న వస్తువులు వాడకుండా ఇంటి నిర్మాణం చేయలేమా?' అనే ఆలోచన 'స్టూడియో ఫర్ ఎర్తెన్ ఆర్కిటెక్చర్'కు మూలం.



నేడు ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినం

నింగిలోని చుక్కలతో ఏనుగును చిత్రించుకోవడం... చందమామలో చెవుల పిల్లిని ఊహించుకోవడం... తొడుక్కున్న బట్టలను మాపుకోవడం.. చెట్లు, పుట్టలెక్కడం.. గెంతడం... ఒకరినొకరు గేలిచేసుకోవడం.. ఏడిపించుకోవడం.. యథేచ్ఛగా ఆడుకోవడం... పితూరీలు, అలకలు, ఉరకలు, పరుగులు... 'బాల్యం' అని మనసులో గూగుల్ చేస్తే మెదిలే ఇమేజెస్ అవి! నిజంగా పిల్లలందరూ అంత లగ్జరీ అనుభవిస్తున్నారా అని అనుకునేలోపే ముంబైలో ధారావీ, హైదరాబాద్‌లో జవహర్ నగర్ లాంటి ప్రాంతాలు స్ఫురణకు వస్తాయి! ధారావీ ఎక్కడో దూరం కాబట్టి రెండు రాష్ట్రాలకు సుపరిచితమైన జవహర్ నగర్‌ను సందర్శిద్దాం... ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా!

బాల్యానికి రాబందులుగా కాదు... బంధువులుగా ఉందాం!

'పిల్లల చేతుల్లో ఉండాల్సింది పలక.. బలపం లేదంటే పెన్ను.. పుస్తకం అంతేకానీ పనిముట్లు కాదు' అంటారు నోబెల్ శాంతి పురస్కార గ్రహీత, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు నడుంకట్టిన ఉద్యమనేత కైలాశ్ సత్యార్థి. కానీ జవహర్ నగర్‌లోని చాలా మంది పిల్లల చేతుల్లో పుస్తకాలు కనిపించవు. పనిముట్లే కనిపిస్తాయి. అది నూరు బస్తీల ప్రాంతం. దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన వలసలతో మినీ ఇండియాను తలపిస్తుంది. వాళ్లలో చాలామందికి ఆధార్‌లాంటి గుర్తింపు పత్రాలేమీ ఉండవు. వాళ్లు ఏ లెక్కల్లోకీ రాక స్కూల్ అడ్మిషన్ నుంచి ప్రభుత్వ సంక్షేమ, ప్రయోజనాల దాకా ఏవీ వారికి అందట్లేదు. దాంతో చాలామంది పిల్లలు బాలకార్మికులై కనిపిస్తారు.. ఈ జవహర్‌నగర్‌కి ఆనుకునే ఉన్న 350 ఎకరాల డంపింగ్ యార్డ్‌లో చెత్త ఏరుకుంటూ.. భవన నిర్మాణ కార్మికులుగా.. అమ్మాయిలైతే ఇళ్లల్లో పని చేస్తూ! ఇంకా సీజనల్ లేబర్‌గా కూడా! పసివాడని ఈ పిల్లలు గంజాయికి బానిసలై కూడా కనిపిస్తారు.

మూడు లక్షల జనాభా...

ఈ వంద బస్తీల్లో దాదాపు మూడు లక్షల జనాభా ఉంటుంది. సర్కారు బడులు పది మాత్రమే. అందులో ఎనిమిది ప్రైమరీ స్కూళ్లు, రెండు హైస్కూళ్లు. ఇది కాప్రా మండలం కిందకు వస్తుంది. ఈ మండలానికి కనీసం ఒక్క జూనియర్ కాలేజ్ కూడా లేదు. అందుకే స్కూల్‌కి వెళ్లే పిల్లలు కూడా టెన్త్ అవగానే అబ్బాయిలైతే కూలీలుగా మారుతున్నారు. అమ్మాయిలకైతే పెళ్లి చేసి పంపించేస్తున్నారు. పద్నాలుగు నుంచి పద్దెనిమిదేళ్లలోపు అమ్మాయిలకు పెళ్లిళ్లయిపోతున్నాయి. ఇది హైదరాబాద్ నగరంలోని పరిస్థితి! ఇలా మన దేశమంతటా సుమారు పద్దెనిమిది లక్షల నుంచి ముప్పైమూడు లక్షల వరకు బలకార్మికులు ఉన్నారని యూనిసెఫ్ డేటా వెల్లడిస్తోంది. వీళ్లంతా వ్యవసాయరంగంలో, కుటుంబ వ్యాపారాల్లో పనిచేస్తున్నారని నివేదిక తెలుపుతోంది. అయిదు నుంచి పద్నాలుగేళ్లలోపు పిల్లలంతా ఏదో ఒక పనిచేస్తున్నారని కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ వెల్లడించింది.

రెస్క్యూ, రిహాబిలిటేషన్ వీక్‌గా ఉంది



జవహర్ నగర్‌లోని డంపింగ్ యార్డ్‌కి ఆనుకున్న బస్తీల్లో స్క్రాప్ షాప్స్ ఎక్కువ. అందుకే ఇక్కడ చెత్త సేకరణ ఎక్కువగా జరుగుతుంది. ఇవి కాకుండా కన్‌స్ట్రక్షన్ లేబర్, డొమెస్టిక్ హెల్ప్, సీజనల్ లేబర్‌కి కూడా వెళ్తుంటారు. ఈ ప్రాంతంలో సరిపడా సర్కారు బడులు లేవు. ఉన్న వాటిల్లో చేరడానికి చాలామంది పిల్లలకు గుర్తింపు పత్రాలు లేవు. వాళ్లకు ప్రైవేట్ స్కూళ్లల్లో అడ్మిషన్స్ దొరికినా ఫీజులు కట్టేంత స్థోమత ఉండదు. దాంతో పనిలోకి వెళ్తున్నారు. పద్నాలుగేళ్లు దాటిన పిల్లలు గనుక ఒక్కసారి పనిలోకి వెళితే మళ్లీ వాళ్లను చదువు వైపు మళ్లించడం చాలా కష్టం. ఇక్కడ వార్డ్ లెవెల్ చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీలు (డబ్ల్యూఎల్‌సీపీసీ) కూడా యాక్టివ్‌గా లేవు. దీనివల్ల బాలకార్మికుల రెస్క్యూ, రిహాబిలిటేషన్ చాలా వీక్‌గా ఉంది.

- హిమబిందు, పిల్లల హక్కుల కార్యకర్త

చట్టం ఏం చెబుతోంది?

ద చైల్డ్ లేబర్ (ప్రొహిబిషన్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్, 1986 ప్రకారం పద్నాలుగేళ్ల లోపు పిల్లల చేత ఎలాంటి పనైనా చేయించడం నేరం. పద్నాలుగేళ్ల నుంచి పద్దెనిమిదేళ్ల పిల్లలకు పనివ్వొచ్చు. కానీ ప్రమాదకరమైన వృత్తులు.. పనులు.. పరిస్థితుల్లో ఆ పిల్లలను పెట్టకూడదు. ఈ చట్టానికి కొన్ని మినహాయింపులూ ఉన్నాయి. కుటుంబ వ్యాపారాలు, నిర్దిష్ట పరిస్థితుల్లో టీవీ, సినిమాలు వంటి వినోద రంగాల్లో పిల్లల పనిచేయవచ్చు.


● జవహర్ నగర్ డంపింగ్ యార్డ్

అమ్మాయిలే ఎక్కువ..

ప్రపంచవ్యాప్త బాలకార్మికుల్లో ప్రతి పదిమందిలో ఒకరు మన దేశం నుంచే కనిపిస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశంలో బాలకార్మికుల(5–14 ఏళ్లలోపు) సంఖ్య కోటికి పైనే ఉంది. అంటే అప్పటి పిల్లల జనాభాలో ఇది 3.9 శాతం. అబ్బాయిలతో పోల్చుకుంటే అమ్మాయిలే ఎక్కువగా పనిబాట పడుతున్నారని యూనిసెఫ్ సర్వే చెబుతోంది. ఇళ్లల్లో పని దగ్గర్నుంచి ఇంట్లో పెద్దవాళ్ల (అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు)ను చూసుకోవడం, తోబుట్టువులను సంభాళించడం వంటివన్నీ చేస్తున్నారన్నది నివేదికల మాట. మన దేశంలో బిహార్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాల్లో బాలకార్మికులు ఎక్కువ. ఇటుక బట్టీలు, తీవాచీ, వస్త్ర పరిశ్రమ, ఇళ్లు, హోటళ్లు.. టీ స్టాళ్ల లాంటి అసంఘటిత రంగాల్లో, వ్యవసాయం, మత్స్య పరిశ్రమల్లో బాలకార్మికులు ఎక్కువగా కనిపిస్తారు.

బాలకార్మిక వ్యవస్థ వేళ్లూనడానికి కారణాలు

అసమానత్వం, సరైన విద్యావకాశాలు, మంచి పని, సామాజిక భద్రత లేకపోవడం, సంప్రదాయ, సాంస్కృతిక చట్రాలు వంటివన్నీ బాలకార్మిక వ్యవస్థను పెంచి పోషిస్తున్నాయి. ఏ రూపాల్లో ఉన్నా 2025 కల్లా బాలకార్మిక వ్యవస్థను సంపూర్ణంగా నిర్మూలించాలనే యునైటెడ్ నేషన్స్ లక్ష్యానికి మద్దతు తెలుపుతూ సస్టెనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీఎస్) భారత ప్రభుత్వమూ సంతకం చేసింది. సంతకం చేయగానే సరిపోదు చిత్తశుద్ధితో ఆ బాధ్యతను నెరవేర్చాలి. పిల్లలందరినీ బడి బాట పట్టించి బాలకార్మికులు లేకుండా చేయడానికి విప్లవాత్మక మార్పులు తీసుకురావాలి అంటున్నారు బాలల హక్కుల కార్యకర్తలు.

● ఇన్నోవేషన్

డిగ్నిటీ డిస్పోజల్ ప్యాడ్స్


● ఉపాధి పొందిన మహిళలు



● గీతా సోలంకి

'నెలసరి కోసం డిస్పోజల్ ప్యాడ్స్ వాడాలంటే అధిక ఖర్చు' అనే అసంతృప్తిని ఎంతోమంది మహిళల నోటి నుంచి విన్నది గీతా సోలంకి. ఖర్చు మాట ఎలా ఉన్నా... అసౌకర్యం, తరచు ఇన్ఫెక్షన్‌లు... మొదలైన సమస్యలు ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని క్లాత్ ప్యాడ్స్‌పై రిసెర్చ్ మొదలుపెట్టింది గుజరాత్‌కు చెందిన గీతా సోలంకి. తక్కువ ఖర్చుతో అందరికీ అందుబాటులో ఉండేలా, సౌకర్యంగా ఉండేలా సరికొత్త ప్యాడ్స్‌కు రూపకల్పన చేసింది. 'యూనీప్యాడ్స్' అనే స్టార్టప్‌ను ప్రారంభించింది. వ్యవసాయాధారిత గ్రామమైన మోటవదియ అనే గ్రామంలో శానిటరీ ప్యాడ్ కంపెనీ స్థాపించడం అంత తేలిక కాదు. రకరకాల అపోహల వల్ల కంపెనీలో పనిచేయడానికి మహిళలు ముందుకు వచ్చేవారు కాదు. వారిని ఒప్పించడానికి కాస్త టైమ్ పట్టింది.

ఈ తరగతులు టైలరింగ్ పాఠాలకే పరిమితం కాలేదు. పీరియడ్స్‌కు సంబంధించిన సమస్యలు, మూఢనమ్మకాల గురించి కూడా చర్చ జరిగేది. మొదట్లో తడబడినా ఆ తరువాత మాత్రం పీరియడ్స్‌కు సంబంధించి తమకు ఎదురైన అనుభవాల గురించి నోరు విప్పేవారు.

పదిహేను మందితో ప్రారంభమైన కంపెనీలో ఇప్పుడు 185 మంది ఉద్యోగులు ఉన్నారు. ఆ మహిళల్లో వృత్తినైపుణ్యంతో పాటు మునుపెన్నడూ లేని ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది.

కౌంటీ క్రికెట్‌లో తిలక్ వర్మ...హ్యాంప్‌షైర్‌తో ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: భారత యువ ఆటగాడు ఠాకూర్ తిలక్ వర్మ ఇంగ్లండ్‌లో కౌంటీ క్రికెట్ ఆడనున్నాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్న తిలక్ వర్మ కౌంటీ చాంపియన్‌షిప్‌లో హ్యాంప్‌షైర్ తరఫున 4 మ్యాచ్‌లు ఆడనున్నాడు. ఇంగ్లండ్ క్లబ్ ప్రతినిధులు తిలక్‌ను సంప్రదించినట్లు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) బుధవారం వెల్లడించింది. జాతీయ జట్టు తరఫున 25 టి20లు, 4 వన్డేలు ఆడిన 22 ఏళ్ల తిలక్ వర్మ హైదరాబాద్ రంజీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇటీవల ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన తిలక్ వర్మ 18 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 50.16 సగటుతో 1204 పరుగులు చేశాడు. హైదరాబాద్‌కు చెందిన అంతర్జాతీయ ఆటగాడు తిలక్ వర్మ ఇంగ్లండ్ కౌంటీ చాంపియన్‌షిప్‌లో హ్యాంప్‌షైర్ క్లబ్ తరఫున ఆడనున్నాడు. ఈ మేరకు ఆ క్లబ్ ప్రతినిధులతో చర్చలు జరిగాయి. కౌంటీల్లో తిలక్ రాణిస్తాడనే నమ్మకముంది' అని హెచ్‌సీఏ ఒక ప్రకటనలో తెలిపింది. భారత ఆటగాళ్లలో రుతురాజ్ గైక్వాడ్ (యార్క్‌షైర్), యుజువేంద్ర చహల్ (నార్తాంప్టన్‌షైర్) కూడా ఈ సీజన్‌లో కౌంటీలు ఆడనున్నారు.



భారత్‌కు మరో పరాజయం

అర్జెంటీనా చేతిలో 3-4 గోల్స్‌తో ఓటమి ● ప్రొ హాకీ లీగ్


హర్మన్‌ప్రీత్ సింగ్

ఆమ్‌స్టెల్వీన్ (నెదర్లాండ్స్): అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రొ లీగ్‌లో భారత పురుషుల జట్టు పరాజయాల పరంపర కొనసాగుతోంది. గత రెండు మ్యాచ్‌ల్లో నెదర్లాండ్స్ చేతిలో ఓడిన హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత జట్టు... మూడో మ్యాచ్‌లో అర్జెంటీనా చేతిలో కూడా ఓడింది. యూరప్ అంచె పోటీల్లో భాగంగా బుధవారం జరిగిన పోరులో టీమిండియా 3-4 గోల్స్ తేడాతో అర్జెంటీనా చేతిలో పరాజయం పాలైంది. గత రెండు మ్యాచ్‌ల్లో పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలచడంలో విఫలమైన భారత్... ఈసారి పేలవ డిఫెన్స్‌తో మూల్యం చెల్లించుకుంది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (12వ, 33వ నిమిషాల్లో) రెండు గోల్స్ సాధించగా... అభిషేక్ (42వ నిమిషంలో) ఒక గోల్ కొట్టాడు. అర్జెంటీనా తరఫున మాటియాస్ రే (3వ నిమిషంలో), లూకాస్ మార్టినేజ్ (17వ నిమిషంలో), శాంటియాగో టరాజొనా (34వ నిమిషంలో), లూకాస్ మెండెజ్ (46వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. భారత డిఫెండర్ల తప్పిదంతో ఆట ప్రారంభమైన మూడో నిమిషంలోనే కెప్టెన్ మాటియాస్ రే అర్జెంటీనా ఖాతా తెరిచాడు. హర్మన్‌ప్రీత్ గోల్‌తో టీమిండియా స్కోరు సమం చేసినా... మన రక్షణ పంక్తి పదే పదే తప్పిదాలకు పాల్పడటంతో అర్జెంటీనా దూకుడు పెంచగలిగింది. ఆఖర్లో పెనాల్టీ కార్నర్ రూపంలో స్కోరు సమం చేసే అవకాశం వచ్చినా... మనవాళ్లు దాన్ని గోల్‌గా మలచలేకపోయారు. గురువారం మరోసారి అర్జెంటీనాతో భారత్ తలపడనుంది.

భారత్‌కు రెండో విజయం

ఆంట్‌వర్ప్ (బెల్జియం): యూరోప్ పర్యటనలో భారత జూనియర్ మహిళల హాకీ జట్టు జోరు కొనసాగుతోంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య బెల్జియంపై విజయం సాధించిన భారత అమ్మాయిలు... బుధవారం రెండో మ్యాచ్‌లో 2-1 గోల్స్ తేడాతో మరోసారి బెల్జియంపై గెలుపొందారు. భారత్ తరఫున లాల్‌థాట్లుయాంగి (35వ నిమిషంలో), గీతా యాదవ్ (50వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. బెల్జియం తరఫున్ వాన్ హెల్‌మోంట్ (48వ నిమిషంలో) ఏకైక గోల్ చేసింది. ఈ పర్యటనలో గురువారం భారత్ జట్టు చివరి మ్యాచ్ ఆడనుంది.

మనూ భాకర్‌కు నిరాశ



మ్యూనిక్: ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ వరల్డ్ కప్‌లో రెండో రోజు బుధవారం భారత్ ఒక్క పతకం కూడా గెలుచుకోలేకపోయింది. పారిస్ ఒలింపిక్స్ కాంస్యపతక విజేత మనూ భాకర్, చైన్ సింగ్ తమ విభాగాల్లో ఫైనల్స్‌కు అర్హత సాధించినా మెడల్ మాత్రం దక్కలేదు. మహిళల 25 మీటర్ల పిస్టల్ క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో మనూ 588 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. అయితే అసలు పోరులో ఆమె తడబడింది. ఫైనల్లో 20 పాయింట్లు మాత్రమే సాధించి మూడో ఎలిమినేషన్ రౌండ్‌ను దాటలేకపోయింది. ఇదే ఈవెంట్‌లో హైదరాబాద్ షూటర్ ఇషా సింగ్ కూడా నిరాశపర్చింది. క్వాలిఫయింగ్‌లో 585 పాయింట్లకే పరిమితమైన 11వ స్థానంలో నిలిచిన ఇషా ఫైనల్‌కు కూడా అర్హత సాధించలేదు. మరో భారత షూటర్ సిమ్రన్‌ప్రీత్ కౌర్ 32వ స్థానంలో నిలిచింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ ఈవెంట్‌లో చైన్ సింగ్ ఏడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఇటీవల అర్జెంటీనాలో జరిగిన ప్రపంచ కప్‌లో కాంస్యం గెలిచిన చైన్ సింగ్ క్వాలిఫయింగ్‌లో ఐదో స్థానంలో ఫైనల్‌కు చేరినా పతకం మాత్రం దక్కలేదు. నేడు జరిగే పోటీల్లో భారత షూటర్లు అర్జున్ బబూటా, సందీప్ సింగ్, సిఫ్ట్ కౌర్, శ్రియాంక, ఆషి చౌక్సీ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

మొదటి రోజు పేసర్ల హవా

సుదీర్ఘ ఫార్మాట్‌లో విశ్వ విజేతను తేల్చే అసలు సిసలు సమరం రసవత్తరంగా ప్రారంభమైంది. లార్డ్స్ వేదికగా డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య ప్రారంభమైన ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో పేసర్ల జోరు సాగుతోంది. పచ్చిక పిచ్‌పై పేసర్ రబాడ విజృంభించినా... ఆసీస్ బ్యాటర్లు కాస్త సంయమనం చూపడంతో మెరుగైన స్కోరు చేయగలిగింది. ఆ తర్వాత కంగారూ పేసర్ల ధాటికి దక్షిణాఫ్రికా టాపార్డర్ తడబడింది. రెండో రోజు తొలి సెషన్‌లో కమిన్స్, స్టార్క్, హాజల్‌వుడ్‌ను సఫారీ జట్టు ఎదుర్కోవడంపైనే ఈ మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంది.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 212 ఆలౌట్

- స్మిత్, వెబ్‌స్టర్ అర్ధ శతకాలు
- రబాడకు ఐదు వికెట్లు
- దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 43/4
- ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్



స్మిత్ వెబ్‌స్టర్



రబాడ



స్టార్క్

లండన్: బ్యాటర్ల పట్టుదలకు బౌలర్ల సహకారం తోడవడంతో... ప్రతిష్టాత్మక ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌ను ఆస్ట్రేలియా మెరుగ్గా ఆరంభించింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన ఆసీస్ బ్యాటింగ్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయినా... తమ పదునైన పేస్‌తో ప్రత్యర్థిని కట్టిపడేసింది. ఐసీసీ ట్రోఫీ చేజిక్కించుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా పెద్దగా మెరిపించలేకపోయింది. లార్డ్స్ వేదికగా బుధవారం ప్రారంభమైన ఈ పోరులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 56.4 ఓవర్లలో 212 పరుగులకు ఆలౌటైంది. బ్యూ వెబ్‌స్టర్ (92 బంతుల్లో 72; 11 ఫోర్లు), స్టీవ్ స్మిత్ (112 బంతుల్లో 66; 10 ఫోర్లు) అర్ధ శతకాలు సాధించారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో కగిసో రబాడ 5 వికెట్లు పడగొట్టగా... మార్కో యాన్సెన్ 3 వికెట్లు తీశాడు. అనంతరం తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 22 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 43 పరుగులు చేసింది. చేతిలో 6 వికెట్లు ఉన్న సఫారీ జట్టు... ప్రత్యర్థి తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 169 పరుగులు వెనుకబడి ఉంది. కెప్టెన్ తెంబా బవుమా (3 బ్యాటింగ్)తో పాటు డేవిడ్ బెడింగ్‌హామ్ (8 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఆసీస్ బౌలర్లలో స్టార్క్ 2... హాజల్‌వుడ్, కమిన్స్ చెరో వికెట్ పడగొట్టారు. బౌలర్ల హవా సాగుతున్న ఈ మ్యాచ్‌లో తొలి రోజే 14 వికెట్లు నేలకూలగా... అందులో సింహభాగం (12 వికెట్లు) పేసర్ల ఖాతాలోకే వెళ్లాయి.

రబాడ పేస్ దాడి..

ఐసీసీ టెస్టు గదను నిలబెట్టుకునేందుకు బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు శుభారంభం దక్కలేదు. 20 బంతులాడినా ఖాతా తెరవలేకపోయిన ఉస్మాన్ ఖ్వాజా (0)ను రబాడ పెవిలియన్ బాట పట్టించాడు. అదే ఓవర్‌లో కామెరూన్ గ్రీన్ (4) కూడా అవుటయ్యాడు. మార్క్‌రమ్ స్లిప్స్‌లో చక్కటి క్యాచ్‌తో గ్రీన్‌ను సాగనంపగా... క్రీజులో నిలిచేందుకు మొండిగా ప్రయత్నించిన లబుషేన్ (56 బంతుల్లో 17)ను యాన్సెన్ బుట్టలో వేసుకున్నాడు. ఇక ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌ల్లో మంచి రికార్డు ఉన్న ట్రావిస్ హెడ్ (11) కీపర్ వెరీన్ పట్టిన ఒంటి చేతి క్యాచ్‌తో పెవిలియన్ చేరుకున్నాడు. దీంతో ఆసీస్ 67 పరుగులకే 4 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో స్మిత్ తన అనుభవాన్ని చూపించాడు. పేసర్లను కాచుకుంటూ... చెత్త బంతుల్లో పరుగులు రాబట్టాడు. దీంతో ఇక కోలుకున్నట్లే అనుకుంటున్న దశలో మార్క్‌రమ్ బౌలింగ్‌లో అనవసర షాట్‌కు అతడు అవుట్ కాగా... కేశవ్ మహరాజ్ బంతిని రివర్స్ స్వీప్ ఆడే ప్రయత్నంలో అలెక్స్ కేరీ (23) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. మరో ఎండ్‌లో ధాటిగా ఆడిన వెబ్‌స్టర్‌ను కూడా రబాడ వెనక్కి పంపడంతో ఆసీస్ ఇన్నింగ్స్ వేగంగా ముగిసింది. 20 పరుగులకే జట్టు తమ చివరి 5 వికెట్లు కోల్పోయింది.

బెంబేలెత్తించిన పేస్ త్రయం...

దక్షిణాఫ్రికా పేసర్లు విజృంభించిన పిచ్‌పై ఆసీస్ పేస్ త్రయం మరింత రెచ్చిపోతుందని ఊహించినట్లే జరిగింది. బంతి బంతికి వికెట్ తీసేలా కనిపించిన కమిన్స్, స్టార్క్, హాజల్‌వుడ్... సఫారీ బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించారు. స్టార్క్ తొలి ఓవర్ చివరి బంతిని వికెట్ల మీదకు ఆడుకున్న మార్క్‌రమ్ (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరగా... కాసేపటికి రికెల్టన్ (16) కూడా అతడిని అనుసరించాడు. ఆసీస్ ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేసి అవకాశం ఇచ్చినా... దక్షిణాఫ్రికా బ్యాటర్లు వాటిని వినియోగించుకోలేకపోయారు. క్రీజులో అడుగు పెట్టిన తొలి బంతికే సింగిల్ తీసిన ముల్డర్ (44 బంతుల్లో 6) మరో పరుగు చేసేందుకు 39 బంతుల వరకు ఎదురు చూశాడంటే... కంగారూల బౌలింగ్ ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు దక్షిణాఫ్రికా కెప్టెన్ బవుమా 31వ బంతికి ఖాతా తెరవగా... స్టబ్స్ (2) ఎక్కువసేపు నిలవలేకపోయాడు.

4 దక్షిణాఫ్రికా తరఫున టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో కగిసో రబాడ నాలుగో స్థానానికి (332 వికెట్లు) చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతను అలెన్ డొనాల్డ్ (330)ను అధిగమించగా...టాప్-3లో వరుసగా డేల్ స్టెయిన్ (439), షాన్ పొలాక్ (421), మఖయా ఎన్తిని (390) ఉన్నారు.

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఖ్వాజా (సి) బెడింగ్‌హామ్ (బి) రబాడ 0; లబుషేన్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 17; గ్రీన్ (సి) మార్క్‌రమ్ (బి) రబాడ 4; స్మిత్ (సి) యాన్సెన్ (బి) మార్క్‌రమ్ 66; హెడ్ (సి) వెరీన్ (బి) యాన్సెన్ 11; వెబ్‌స్టర్ (సి) బెడింగ్‌హామ్ (బి) రబాడ 72; కేరీ (బి) కేశవ్ 23; కమిన్స్ (బి) రబాడ 1; స్టార్క్ (బి) రబాడ 1; లయన్ (బి) యాన్సెన్ 0; హాజల్‌వుడ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 17; **మొత్తం (56.4 ఓవర్లలో ఆలౌట్) 212. వికెట్ల పతనం:** 1-12, 2-16, 3-46, 4-67, 5-146, 6-192, 7-199, 8-210, 9-211, 10-212. **బౌలింగ్:** రబాడ 15.4-5-51-5; యాన్సెన్ 14-5-49-3; ఇన్‌గిడి 8-0-45-0; ముల్డర్ 11-3-36-0; కేశవ్ మహరాజ్ 6-0-19-1; మార్క్‌రమ్ 2-0-5-1.

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (బి) స్టార్క్ 0; రికెల్టన్ (సి) ఖ్వాజా (బి) స్టార్క్ 16; ముల్డర్ (బి)కమిన్స్ 6; బవుమా (నాటౌట్) 3; స్టబ్స్ (బి) హాజల్‌వుడ్ 2; బెడింగ్‌హామ్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (22 ఓవర్లలో 4 వికెట్లకు) 43. వికెట్ల పతనం:** 1-0, 2-19, 3-25, 4-30. **బౌలింగ్:** స్టార్క్ 7-3-10-2; హాజల్‌వుడ్ 7-3-10-1; కమిన్స్ 7-3-14-1; లయన్ 1-0-1-0.

సాక్షి సినిమా

హైదరాబాద్ టు ముస్సోరీ


● చిరంజీవి

ముస్సోరీలో ల్యాండ్ అయ్యారు చిరంజీవి. ఆయన హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో 'మెగా 157' (వర్కింగ్ టైటిల్) అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీటీవీ గణేశ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇతర కీలక పాత్రల్లో వెంకటేశ్, కేథరిన్ నటిస్తారనే ప్రచారం సాగుతోంది. అర్చన సమర్పణలో షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా తొలి షెడ్యూల్ హైదరాబాద్‌లో జరిగింది. మలి షెడ్యూల్ ముస్సోరీలో ప్రారంభమైందని, పది రోజుల పాటు ఈ షూటింగ్ షెడ్యూల్ జరుగుతుందని బుధవారం మేకర్స్ అధికారికంగా తెలిపి, ఓ వీడియోను విడుదల చేశారు. ఈ షెడ్యూల్‌లో చిరంజీవి, నయనతార, వీటీవీ గణేశ్ పాల్గొనగా కొన్ని కీలక, వినోదాత్మక సన్నివేశాలను చిత్రీకరించడానికి ప్లాన్ చేశారు. ''1990, 2000లలో చిరంజీవి గోల్డెన్ ఎరాలో కనిపించిన వింటేజ్ కామెడీ టైమింగ్‌ను ఈ సినిమాలో మళ్లీ ప్రేక్షకులు చూడబోతున్నారు. ఇది అభిమానులకు ఒక విజువల్ ట్రీట్. వచ్చే సంక్రాంతికి ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది.

గాడ్ ఆఫ్ వార్?


● ఎన్టీఆర్

'అరవింద సమేత వీర రాఘవ' చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్ మరోసారి రిపీట్ కానున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సన్నాహాలు మొదలయ్యాయని, ఈ చిత్రంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిగా ఎన్టీఆర్ నటిస్తారని సమాచారం. ఈ మైథలాజికల్ సినిమాను హారిక అండ్ హాసిని క్రియేషన్స్ సంస్థ నిర్మించనుందట. కాగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గురించి నిర్మాత నాగవంశీ 'ఎక్స్' వేదికగా పోస్ట్ షేర్ చేసి, ''మోస్ట్ పవర్‌ఫుల్ గాడ్ పాత్రలో నా మోస్ట్ ఫేవరెట్ అన్న నటించనున్నారు. గాడ్ ఆఫ్ వార్ ఈజ్ కమింగ్'' అని పేర్కొన్నారు. దాంతో ఎన్టీఆర్‌ను ఉద్దేశించే నాగవంశీ ఈ పోస్ట్ చేశారనే ఊహాగానాలు మొదలయ్యాయి. మరి... ఈ ఊహలు ఎంతవరకు నిజమవుతాయో చూడాలి.

డబ్బింగ్ స్టార్ట్: హృతిక్ రోషన్, ఎన్టీఆర్ హీరోలుగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ సినిమా 'వార్ 2'. ఈ చిత్రంలో కియారా అద్వానీ ప్రధాన పాత్రలో నటించారు. ఆదిత్యా చోప్రా నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది. ఈ సినిమా డబ్బింగ్ వర్క్‌ను మొదలు పెట్టారు ఎన్టీఆర్. ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది.

ఆల్ సెట్ గో!


● అల్లు అర్జున్

అల్లు అర్జున్ కొత్త సినిమా చిత్రీకరణకు అంతా సిద్ధమైంది. ఇక ఆల్ సెట్ గో... అంటూ అల్లు అర్జున్ చిత్రీకరణలో పాల్గొననున్నారు. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ చిత్రంలో దీపికా పదుకోన్ ఓ హీరోయిన్‌గా నటిస్తారు. మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా హీరోయిన్లుగా నటించనున్నారనే ప్రచారం సాగుతోంది. కాగా ఈ సినిమా చిత్రీకరణ ఈ వారంలోనే ప్రారంభం కానుందని తెలిసింది. దాదాపు ఇరవై రోజుల పాటు ముంబైలో జరగనున్న ఈ సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణలో అల్లు అర్జున్, మృణాల్ ఠాకూర్ పాల్గొంటారని, వీరిద్దరి కాంబినేషన్‌లో కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణను దర్శకుడు అట్లీ ప్లాన్ చేశారని సమాచారం. ఈ షెడ్యూల్‌లోనే ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను సైతం షూట్ చేసేలా సన్నాహాలు చేస్తున్నారట అట్లీ. అయితే ఈ తొలి షెడ్యూల్ షూటింగ్‌లో దీపికా పదుకోన్ పాల్గొనరట. ఇక ఈ సినిమా కోసం ఓ ప్రత్యేక ప్రపంచాన్ని అట్లీ సృష్టిస్తున్నారని, ఇందులో అల్లు అర్జున్ త్రిపాత్రాభినయం చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

వేడుక మొదలైంది


● సూర్య

కొత్త సినిమా వేడుక (షూటింగ్‌ని ఉద్దేశించి) మొదలైంది అంటున్నారు హీరో సూర్య. ఆయన హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ ద్విభాషా (తెలుగు, తమిళ) చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రవీనా టాండన్, రాధికా శరత్ కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సూర్య కెరీర్‌లోని ఈ 46వ చిత్రం షూటింగ్‌ని బుధవారం ప్రారంభించినట్లుగా చిత్రయూనిట్ ప్రకటించి, సూర్య బ్యాక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌పై 'అండ్ ది సెలబ్రేషన్ బిగిన్స్' అని ఉంది. ''లోతైన భావోద్వేగాలు, వాణిజ్య అంశాలను మిళితం చేసి, 'సార్, లక్కీ భాస్కర్' తరహాలోనే వెంకీ అట్లూరి మరో మంచి కథను ప్రేక్షకులకు అందించనున్నారు'' అని చిత్రబృందం పేర్కొంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమాకు సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

దర్శకుడు ఏఎస్ రవికుమార్ కన్నుమూత



ప్రముఖ దర్శకుడు ఏఎస్ రవికుమార్ చౌదరి హఠాన్మరణం చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఆయన మంగళవారం (జూన్ 10) రాత్రి తుది శ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు చెందిన ఆయన అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. కృష్ణ హీరోగా నటించిన 'అమ్మ దొంగా!' (1995) సినిమాకి డైరెక్టర్ సాగర్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు రవి కుమార్ చౌదరి. సుమారు దశాబ్దం పాటు సాగర్ వద్దనే అసిస్టెంట్‌గా ఉన్నారాయన. అదే విధంగా శ్రీను వైట్ల దర్శకత్వం వహించిన 'నీ కోసం' (1999) సినిమాకు కూడా అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశారు. ఆ తర్వాత ఆకాశ్, అర్జు గోవిత్రికర్ జోడీగా 'మనసుతో...' (2002) సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యారాయన. గోపీచంద్ హీరోగా నటించిన 'యజ్ఞం' (2004) సినిమాతో సూపర్ హిట్ అందుకున్నారు రవికుమార్. ఆ సినిమా విజయంతో బాలకృష్ణతో 'వీరభద్ర' (2005) చేసే అవకాశం అందుకున్నారు. అయితే ఆ చిత్రం ప్రేక్షకుల అంచనాలు అందుకోలేకపోవడంతో కాస్త విరామం తీసుకున్నారాయన. ఆ తర్వాత నితిన్‌తో 'ఆటాడిస్తా' (2008), తనీష్‌తో 'ఏం పిల్లో ఏం పిల్లడో' (2010), సాయిదుర్గా తేజ్‌తో 'పిల్లా నువ్వులేని జీవితం' (2014), గోపీచంద్‌తో 'సౌఖ్యం' (2015) వంటి సినిమాలు తెరకెక్కించారాయన. ఆ తర్వాత దాదాపు 8 ఏళ్లకు పైగా విరామం తీసుకుని, రాజ్ తరుణ్ హీరోగా 'తిరగబడరా సామి' సినిమా తీశారు రవికుమార్. 2024 ఆగస్టు 2న ఆ చిత్రం విడుదలైంది. ఇదే ఆయన చివరి సినిమా. 'పిల్లా నువ్వులేని జీవితం' చిత్రానికి ఉత్తమ స్క్రీన్ ప్లే రైటర్‌గా నంది పురస్కారం అందుకున్నారు. రవికుమార్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులతో పాటు తెలుగు దర్శకుల సంఘం సంతాపం ప్రకటించింది.

భావోద్వేగాల పా పా


● శశికాంత్, కోదండ రామిరెడ్డి, బి. గోపాల్, నీరజ కోట

కవిన్, అపర్ణ దాస్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'డా డా'. గణేశ్ కె. బాబు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో భాగ్యరాజా, వీటీవీ గణేశ్, ఐశ్వర్య, ప్రదీప్ శక్తి ఇతర పాత్రలు పోషించారు. తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని 'పా పా' పేరుతో జేకే ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై నిర్మాత నీరజ కోట తెలుగులో ఈ నెల 13న విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి ప్రముఖ దర్శకులు ఎ. కోదండ రామిరెడ్డి, బి. గోపాల్ ముఖ్య అతిథులుగా హాజరై, ట్రైలర్ విడుదల చేశారు. ఎ. కోదండ రామిరెడ్డి మాట్లాడుతూ– ''పా పా' ట్రైలర్ బాగుంది. మంచి భావోద్వేగాలున్న కుటుంబ కథా చిత్రంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంది. నీరజకి ఈ చిత్రంతో ఘన విజయం దక్కాలి'' అన్నారు. బి. గోపాల్ మాట్లాడుతూ– ''డా డా' తమిళంలో 42 కోట్ల రూపాయలు వసూలు చేసింది. తెలుగులో కూడా 'పా పా' మంచి విజయం సాధించి, నీరజకి పేరు, డబ్బు తీసుకురావాలి'' అని పేర్కొన్నారు. నీరజ కోట మాట్లాడుతూ– ''మా బ్యానర్‌లో విడుదల చేస్తున్న తొలి చిత్రం 'పా పా'. తెలుగు ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నా'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత నీరజ కోట భర్త శశికాంత్ పాల్గొన్నారు.

నిర్మాతకు సపోర్ట్ చేయడం గొప్ప విషయం

- 'దిల్' రాజు


● 'దిల్' రాజు, నితిన్, లయ, సప్తమి, శ్రీరామ్ వేణు

''తమ్ముడు' గురించి నితిన్‌కు ఫోన్ చేసి పరిస్థితి చెబితే... 'రాజుగారూ... మీరు ఎంత పంపిస్తారో పంపించండి... నా రెమ్యునరేషన్ డిమాండ్ చేయను' అన్నారు. 'సినిమా హిట్టయ్యాక మీరే పారితోషికం ఇవ్వండి' అని శ్రీరామ్ వేణు కూడా అన్నారు. నిర్మాత పరిస్థితి తెలుసుకుని డైరెక్టర్, హీరో ఇలా సపోర్ట్ చేయడం గొప్ప విషయం'' అని 'దిల్' రాజు పేర్కొన్నారు. నితిన్ హీరోగా లయ, వర్ష బొల్లమ్మ, సప్తమీ గౌడ కీలక పాత్రల్లో శ్రీరామ్ వేణు దర్శకత్వం వహించిన చిత్రం 'తమ్ముడు'. 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ చిత్రం జూలై 4న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో 'దిల్' రాజు మాట్లాడుతూ – ''గత ఆరు నెలల్లో నాలుగైదు సినిమాలు మాత్రమే ఆదరణ పొందాయంటే థియేట్రికల్‌గా పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సినిమా కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు. తెలుగు సినిమా నంబర్ వన్ పొజిషన్‌లో ఉంది. ఈ స్థాయిని కాపాడాలంటే అందరం కష్టపడాలి. ఇకనుంచి నా సినిమాలకు సంబంధించిన టీజర్, ట్రైలర్స్‌కు వచ్చే వ్యూస్‌ను కొనవద్దని నా టీమ్‌కి చెప్పాను. నిజాయతీగా ప్రేక్షకులు ఎంతవరకు నచ్చితే అంతవరకే చూస్తారు'' అన్నారు. నితిన్ మాట్లాడుతూ– ''మా డైరెక్టర్ నాలుగేళ్లు ఈ చిత్రం కోసం కష్టపడ్డారు. నా కెరీర్ బిగినింగ్‌లో 'దిల్' సినిమాకు రాజుగారు అత్యధిక బడ్జెట్ పెట్టారు. ఇప్పుడు 'తమ్ముడు'ని నా కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో నిర్మించారు'' అని తెలిపారు. శ్రీరామ్ వేణు మాట్లాడుతూ– ''తమ్ముడు' కథను కొందరు హీరోలకు చెబితే తిరస్కరించారు. కానీ, నితిన్ ఈ కథలోని భావోద్వేగాన్ని అర్థం చేసుకుని నాకు ఫ్రీడమ్ ఇచ్చారు'' అన్నారు. సినిమాటోగ్రాఫర్ కేవీ గుహన్, నటి లయ, హీరోయిన్ సప్తమీ గౌడ, నటి శ్వాసిక విజయన్, ఎడిటర్ ప్రవీణ్ పూడి, బాలనటి బేబి దిత్య మాట్లాడారు.

అప్పుడు ఒరిజినల్ కలెక్షన్స్ తెలుస్తాయి

''ఇండస్ట్రీలో ముప్పై ఏళ్లు కష్టపడితే ఈ స్థాయికి వచ్చాం. నా వల్ల ఇండస్ట్రీకి ఏదైనా మంచి జరగాలి కానీ, చెడు జరిగితే నా మనస్సాక్షి ఒప్పుకోదు. ప్రేక్షకులను థియేటర్స్‌కి తీసుకొచ్చేందుకు ఏం చేయాలి? అన్నది మా బాధ్యత. టిక్కెట్ ధరలు, క్యాంటీన్ ధరలు, థియేటర్లో సౌకర్యాలు.. ఇవన్నీ బెస్ట్‌గా ఇచ్చి ప్రేక్షకులను మళ్లీ థియేటర్స్‌కి రప్పించుకోవాలి. టిక్కెట్ ధరలు పెంచడం ఏమీ ఉండదు.. సాధారణ ధరల్లోనే వెళతాం. ప్రస్తుతం అమెరికాలో రన్ ట్రాక్ నడుస్తోంది. దాని వల్ల అసలైన కలెక్షన్ల వివరాలు తెలుస్తున్నాయి. ఇదే రన్ ట్రాక్ తెలంగాణలోనూ రావాలని సబ్ కమిటీలో చెప్పాను. అది వస్తే అన్ని కలెక్షన్లు ఒరిజినల్‌గా ఉంటాయి'' అని 'దిల్' రాజు పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్
గురువారం 12-6-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు గంటల 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
123	37
82,515	25,141

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,666	▲	14
డోజోన్స్	43,010	▲	153
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,864	▲	12
డాక్స్	23,940	▼	39
షాంఘై	3,402	▲	17
నికాయ్	38,421	▲	209


• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	85.10	86.12
£	బ్రిటన్ పౌండ్	113.90	116.86
€	యూరో	96.36	99.09
¥	జపాన్ యెన్ (100)	58.28	59.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	54.84	57.06
S$	సింగపూర్ డాలర్	64.22	68.88
SAR	సౌదీ రియాల్	21.91	23.41
UAE D	యూఏఈ దిర్హామ్	22.39	24.17
¥	చైనా యువాన్	11.01	12.83

‘రేర్’ మ్యాగ్నెట్ల కోసం రేసు..

- అమెరికా, రష్యా వైపు భారత్ చూపు
- ఐదు దేశాలతో చర్చలు
- వియత్నాం నుంచి సత్వరం దిగుమతులకు అవకాశం



అరుదైన లోహ అయస్కాంతాల (రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ – ఆర్‌ఈఎం) సరఫరాపై చైనా ఆంక్షలు విధించడం, దిగుమతి చేసుకున్న మ్యాగ్నెట్స్ నిల్వలు త్వరలోనే ఖాళీ అయిపోనుండటంతో ప్రత్యామ్నాయ అవకాశాలను దొరకపుచ్చుకోవడంపై భారత్ మరింతగా కసరత్తు చేస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాలు, గృహోపకరణాలు మొదలైన వాటిల్లో ఉపయోగించే మ్యాగ్నెట్స్ కొరత వల్ల ఉత్పత్తి దెబ్బతినే ముప్పు ఏర్పడటంతో ఆర్‌ఈఎం సరఫరా కోసం ఇతర దేశాలతో సంప్రదింపులు జరుపుతోంది. అమెరికా, రష్యా, వియత్నాం, ఇండొనేషియా, జపాన్‌లాంటి దేశాలతో చర్చిస్తోంది. అదే సమయంలో ప్రధాన సరఫరాదారైన చైనాతో కూడా చర్చలు జరుపుతోంది. ఇతర దేశాలతో భారత్ ఒప్పందాలు కుదుర్చుకున్నా సరఫరా వ్యవస్థను సిద్ధం చేసుకునేందుకు 45–60 రోజులు పడుతుందని అంచనా. ఆసియా దేశాల నుంచి దిగుమతి చేసుకునేందుకు 45 రోజులు, అమెరికా.. రష్యా నుంచి దిగుమతులకు 60 రోజుల వ్యవధి పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశీయంగా దిగుమతి చేసుకున్న నిల్వలు జూన్ ఆఖరు వరకే సరిపోతాయని అంచనా. దీంతో, ఒప్పందాలు కుదుర్చుకునేందుకు భారత్ వేగంగా పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం భారత్ ఏటా 809 టన్నుల ఆర్‌ఈఎంను దిగుమతి చేసుకుంటోంది. అమెరికాతో టారిఫ్‌ల యుద్ధంతో అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో కీలకమైన ఈ మ్యాగ్నెట్ల ఎగుమతులను ఏప్రిల్ మధ్య నుంచి చైనా నిలిపివేసింది. అంతర్జాతీయంగా ఆర్‌ఈఎం ఉత్పత్తిలో ఏకంగా 70 శాతం, ప్రాసెసింగ్‌లో 90 శాతం వాటాతో చైనా ఆధిపత్యం చలాయిస్తుండటంతో సరఫరా నిలిపివేత సెగ అన్ని దేశాలనూ తాకుతోంది.

ఆర్‌ఈఎం కొరత కేవలం ఆటోమొబైల్ పరిశ్రమపైనే కాకుండా స్మార్ట్ వాచీలు, వైర్‌లెస్ ఇయర్‌బడ్స్ (టీడబ్ల్యూఎస్) ఉత్పత్తిపై కూడా ప్రతికూల ప్రభావం చూపనుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఇలాంటి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల్లో సదరు మ్యాగ్నెట్ల వినియోగం తక్కువగానే ఉన్నప్పటికీ, కీలకమైన విడిభాగం కావడం వల్ల అది లేకపోతే ప్రోడక్టు అసంపూర్ణంగా ఉంటుందని పేర్కొన్నాయి. ఈ పరిశ్రమకు సంబంధించి మ్యాగ్నెట్ల నిల్వలు మరికొద్ది నెలల పాటు సరిపోవచ్చని, ఆ తర్వాత కూడా

స్మార్ట్‌వాచీలు, ఇయర్‌బడ్స్‌కూ ఎఫెక్ట్ ..



సరఫరా లేకపోతే సమస్యలు తీవ్రమవుతుందని వివరించాయి. అలర్టులు, నోటిఫికేషన్లు వచ్చినప్పుడు ఇయర్‌బడ్స్, స్మార్ట్ వాచీలు వైబ్రేట్ అయ్యేందుకు ఉపయోగపడే మోటార్లలో ఈ మ్యాగ్నెట్లను వినియోగిస్తారు. రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లపై చైనా ఆంక్షలు కొనసాగిస్తే, వాటిపై ఆధారపడే స్మార్ట్ వాచీలు, ఇతర డివైజ్‌ల కొరతకు దారి తీయొచ్చని విశ్లేషకులు చెప్పారు. కౌంటర్‌పాయింట్ నివేదిక ప్రకారం 2025 తొలి క్వార్టర్‌లో స్మార్ట్ వాచీల అమ్మకాలు 5% పెరిగినప్పటికీ, వార్షికంగా మాత్రం 33% క్షీణించిన పరిస్థితి నెలకొంది. అయితే, మ్యాగ్నెట్ల కొరతతో ఉత్పత్తి పడిపోయి, క్రమంగా సరఫరాకు మించిన డిమాండ్ ఏర్పడితే స్మార్ట్ వాచీల ధరలు పెరగొచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

ప్రత్యామ్నాయాలపైనా దృష్టి..

ఆసియా దేశాల్లో చూస్తే జపాన్‌లో కూడా ఆర్‌ఈఎం ఉన్నప్పటికీ చైనా మ్యాగ్నెట్లంత నాణ్యంగా ఉండవని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ముందుగా వియత్నాం, ఇండొనేషియా నుంచే ఆర్‌ఈఎంను దిగుమతి చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు వివరించాయి. అందులోనూ, సరఫరా వ్యవస్థను తక్షణం ఏర్పాటు చేసుకునే వీలున్నందున వియత్నాం నుంచి వెంటనే దిగుమతి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నాయి. మరోవైపు, కంపెనీలు మ్యాగ్నెట్లను విడిగా దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేకుండా మొత్తం అసెంబ్లీలను లేదా సబ్–అసెంబ్లీలను దిగుమతి చేసుకునేందుకు అనుమతించేలా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. అయితే, ఇందుకోసం ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక (పీఎల్‌ఐ) స్కీముల నిబంధనలు మార్చాల్సి ఉంటుందని పరిశీలకులు తెలిపారు. దిగుమతి చేసుకున్న వాటికి దేశీయంగా అదనంగా విలువ జోడిస్తేనే ప్రోత్సాహకాలు గానీ సబ్సిడీలు గానీ పొందడానికి వీలుంటుందని పీఎల్‌ఐ నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. మొత్తం అసెంబ్లీలను దిగుమతి చేసుకున్నా ప్రోత్సాహకాలు వర్తించేలా ప్రభుత్వం నిబంధనలు సడలిస్తే కాస్త ప్రయోజనకరంగా ఉంటుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

చైనాకు భారత ఆటో పరిశ్రమ బృందం




ఆర్‌ఈఎంల దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయడం కోసం ఆటో పరిశ్రమ ప్రతినిధుల బృందం చైనాకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే 40–50 మంది కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లకు వీసా అనుమతులు వచ్చాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ విషయంపై భేటీ అయ్యేందుకు చైనా వాణిజ్య శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ కోసం ఎదురు చూస్తున్నట్లు వివరించాయి. ఖరీదు తక్కువే అయినా కీలక భాగమైన ఆర్‌ఈఎంల ఎగుమతులపై చైనా ఆంక్షలు కొనసాగినా, క్లియరెన్సుల్లో జాప్యం జరిగినా భారత ఆటోమోటివ్ పరిశ్రమకు రిస్కుగా పరిణమిస్తుందని క్రిసిల్ రేటింగ్స్ పేర్కొంది.

– సాక్షి, బిజినెస్‌డెస్క్

హింద్ జింక్ డివిడెండ్ రూ. 10

మొత్తం రూ. 4,225 కోట్లు వెచ్చింపు



న్యూఢిల్లీ: మైనింగ్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2025–26) తొలి మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. తాజాగా నిర్వహించిన వాటాదారుల సమావేశంలో డైరెక్టర్ల బోర్డు రూ. 2 ముఖవిలువగల షేరుకి 500 శాతం డివిడెండ్‌ను ఆమోదించినట్లు హిందుస్తాన్ జింక్ పేర్కొంది. దీంతో ప్రతీ షేరుకి రూ. 10 చొప్పున వాటాదారులకు చెల్లించనుంది. ఇందుకు వేదాంతా గ్రూప్ సంస్థ మొత్తం రూ. 4,225 కోట్లు వెచ్చించనుంది. గతేడాది(2024–25) సైతం డివిడెండ్ల రూపేణా వాటాదారులకు మొత్తం రూ. 12,250 కోట్లు చెల్లించినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది షేరుకి రూ. 19, రూ. 10 చొప్పున రెండుసార్లు డివిడెండ్ ప్రకటించింది. అత్యధిక డివిడెండ్ ఈల్డ్ అందిస్తున్న మెటల్ రంగ దిగ్గజాలలో కంపెనీ ఒకటికాగా.. తాజా డివిడెండ్ ప్రకటనతో ప్రభుత్వానికి రూ. 1,180 కోట్లు చెల్లించనుంది. కాగా.. వెండి ఉత్పత్తిని రెట్టింపునకు(రూ. 1,500–2,000 మెట్రిక్ టన్నులు) పెంచుకోవడంతోపాటు.. రాజస్తాన్‌లో ఎరువుల ప్లాంటును ఏర్పాటు చేసే ప్రణాళికల్లో ఉంది. కంపెనీ ఇటీవల రాజస్తాన్, యూపీ, ఆంధ్రప్రదేశ్‌లలో కీలకమైన మినరల్ బ్లాకులను సాధించిన విషయం విదితమే.

హిందుస్తాన్ జింక్ షేరు బీఎస్‌ఈలో 2.5 శాతం క్షీణించి రూ. 520 వద్ద ముగిసింది.

రుణ రేట్లు తగ్గించిన యూనియన్ బ్యాంక్

కెనరా, ఐఓబీ కూడా...



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ యూనియన్ బ్యాంక్ తన రుణ రేట్లను అరశాతం తగ్గించింది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈఈఎల్‌ఆర్), రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్)ను 50 బేసిస్ పాయింట్లు తగ్గించినట్లు యూనియన్ బ్యాంక్ ప్రకటించింది. కొత్తగా రుణాలు తీసుకొనేవారితోపాటు, ప్రస్తుత రిటైల్ (గృహ, వాహన, వ్యక్తిగత), ఎంఎస్‌ఎంఈ రుణ గ్రహీతలకు ఈ నిర్ణయం మేలు చేస్తుందని తెలిపింది. మరోవైపు కెనరా బ్యాంక్ ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్ రేటును 8.75% నుంచి 8.25 శాతానికి తగ్గిస్తూ నిర్ణయాన్ని ప్రకటించింది. ఐఓబీ సైతం ఆర్‌ఎల్‌ఎల్‌ఆర్ రేటును 8.85 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది.

‘సాక్షి ప్లస్’ ఈ-పేపర్‌లో ..

గోల్డ్ ఈటీఎఫ్‌లకు మళ్లీ ఆదరణ	ఎలక్ట్రిసిటీ ఎఫ్అండ్‌వోకు గ్రీన్‌సిగ్నల్

ఐటీ, ఇంధన షేర్లకు డిమాండ్

- కలిసొచ్చిన అంతర్జాతీయ సంకేతాలు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు
- 123 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: ఐటీ, ఇంధన రంగ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు బుధవారం లాభాలతో ముగిశాయి. అమెరికా–చైనాల మధ్య సానుకూల వాణిజ్య చర్చలు, విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లు కలిసొచ్చాయి. సెన్సెక్స్ 123 పాయింట్లు పెరిగి 82,515 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 37 పాయింట్లు బలపడి 25,141 వద్ద నిలిచింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు ప్రథమార్థంలో ఓ మోస్తారు లాభాలు ఆర్జించగలిగాయి. ఒక దశలో సెన్సెక్స్ 392 పాయింట్లు బలపడి 82,784 వద్ద, నిఫ్టీ 81 పాయింట్లు ఎగసి 25,222 వద్ద గరిష్టాలు తాకాయి. ఇంట్రాడే గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణతో కొంతమేర ఆరంభ లాభాలు కోల్పోయాయి. ఆసియాలో అన్ని దేశాల స్టాక్ సూచీల ఒక శాతం, యూరప్ మార్కెట్లు 0.5% పెరిగాయి. అమెరికా స్టాక్ సూచీలు 1% లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- రంగాల వారీగా బీఎస్‌ఈ ఇండెక్సుల్లో ఆయిల్ అండ్‌గ్యాస్ 2%, ఇంధనం 1.33%, ఐటీ, హెల్త్‌కేర్ 1% పెరిగాయి. నెలవారీ అమ్మకాల్లో వృద్ధితో ఆటో షేర్లకు, భారత్, చైనాలతో అమెరికా వాణిజ్య చర్చలు సఫలం అవ్వొచ్చనే ఆశలతో ఐటీ షేర్లకు డిమాండ్ లభించింది.
- మహారాష్ట్ర ప్రభుత్వం దేశీయంగా తయారయ్యే విదేశీ లిక్కర్‌పై ఎక్సైజ్ సుంకం పెంచడంతో లిక్కర్ స్టాకులు అమ్మకాల ఒత్తిడికిలోనయ్యాయి. అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిల్లర్స్, యూనిటెడ్ స్పిరిట్స్, రాడికో ఖైతాన్, తిలక్‌నగర్ ఇండస్ట్రీస్ షేర్లు 7–4% నష్టపోయాయి.



భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–బయాలజీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– సైన్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–పాలిటీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–రీజనింగ్

ఆకర్షణీయ వేతనం.. ఉద్యోగ భద్రత

డిగ్రీ అర్హతతో కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతం చేసుకునేందుకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. కేంద్ర ప్రభుత్వ నియామకాల సంస్థ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ).. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్(సీజీఎల్) 2025కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలు /విభాగాలు/సంస్థల్లో మొత్తం 14,582 గ్రూప్ బి, సి పోస్టులను భర్తీ చేయనుంది. ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే.. ఆకర్షణీయ వేతనంతోపాటు ఉద్యోగ భద్రత ఉండే కేంద్ర కొలువు దక్కించుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ సీజీఎల్-2025తో భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

- మొత్తం పోస్టుల సంఖ్య: 14,582

పోస్టుల వివరాలు

అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఇన్‌కమ్ ట్యాక్స్, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్, సబ్ ఇన్స్‌పెక్టర్, ఇన్స్‌పెక్టర్, సెక్షన్ హెడ్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్, రీసెర్చ్ అసిస్టెంట్, డివిజనల్ అకౌంటెంట్, జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్, స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్ 2, ఆఫీస్ సూపరింటెండెంట్, ఆడిటర్, అకౌంటెంట్, పోస్టల్ అసిస్టెంట్/సార్టింగ్ అసిస్టెంట్, సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్/అప్పర్ డివిజనల్ క్లర్క్స్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్, ట్యాక్స్ అసిస్టెంట్ తదితర పోస్టులు ఉన్నాయి.

వేతనాలు

ఆయా పోస్టులను అనుసరించి పే లెవెల్ 7 (రూ.44,990–రూ.1,42,400), పే లెవెల్ 6 (రూ.35,400–రూ.1,12,400), పే లెవెల్ 5 (రూ 29,200 – రూ.92,300), పే లెవెల్ 4 (రూ.25,500– రూ.81,100) వేతనాలు లభిస్తాయి.

అర్హతలు

- జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు 10+2 స్థాయిలో మ్యాథమెటిక్స్ చదివి ఉండాలి. దీంతోపాటు కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.

» 14,582 పోస్టుల భర్తీకి ఎస్ఎస్‌సీ సీజీఎల్ నోటిఫికేషన్
» కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాల్లో ఉద్యోగాలు
» ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో దరఖాస్తుకు అవకాశం
» ఆన్‌లైన్ పరీక్షలు, స్కిల్ టెస్టు ద్వారా ఎంపిక

- స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్ 2 పోస్టులకు స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- మిగతా అన్ని పోస్టులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.

వయసు

01.08.2025 నాటికి ఆయా పోస్టును అనుసరించి 18–30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

టైర్–1(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), టైర్–2(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్), స్కిల్ టెస్టులు, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

టైర్ 1 రాత పరీక్ష

టైర్ 1 పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) 100 ప్రశ్నలు–200 మార్కులకు జరుగుతుంది. ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 25 ప్రశ్నలు–50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు–50 మార్కులు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 25 ప్రశ్నలు–50 మార్కులు, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ 25 ప్రశ్నలు–50 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 60 నిమిషాలు. ప్రశ్న పత్రం ఇంగ్లిష్/హిందీలో ఉంటుంది. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.50 మార్కులు తగ్గిస్తారు.

టైర్ 2 రాత పరీక్ష

- టైర్ 2 పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)లో రెండు పేపర్లు.. పేపర్ 1, పేపర్ 2 ఉంటాయి. ఇందులో ఆబ్జెక్టివ్ తరహా మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు అడుగుతారు (పేపర్ 1 సెక్షన్ 4–డేటా ఎంట్రీ స్పీడ్ టెస్ట్ తప్ప).
- పేపర్ 1ను సెషన్ 1, సెషన్ 2లుగా నిర్వహిస్తారు. సెషన్ 1, సెక్షన్1లో మ్యాథమెటికల్ ఎబిలిటీస్ 30 ప్రశ్నలు, రీజనింగ్ అండ్ జనరల్ ఇంటెలిజెన్స్ 30 ప్రశ్నలు అడుగుతారు. ఈ 60 ప్రశ్నల్లో ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున మొత్తం 180 మార్కులు కేటాయించారు. అదేవిధగా సెషన్ 1, సెక్షన్ 2లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ 45 ప్రశ్నలు, జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు అడుగుతారు. ఈ 70 ప్రశ్నల్లో ప్రతి ప్రశ్నకు 3 మార్కులు చొప్పున మొత్తం 210 మార్కులు కేటాయించారు. సెషన్ 1, సెక్షన్ 3లో కంప్యూటర్ నాలెడ్జ్ టెస్ట్‌లో 20 ప్రశ్నలు.. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున 60 మార్కులు కేటాయించారు.
- పేపర్ 1లోని సెషన్ 2, సెక్షన్ 4లో డేటా ఎంట్రీ స్పీడ్ టెస్ట్ ఉంటుంది.
- పేపర్ 2లో స్టాటిస్టిక్స్ 100 ప్రశ్నలు.. ఒక్కో ప్రశ్నకు 2 మార్కులు చొప్పున 200 మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- టైర్ 2లో పేపర్ 1, పేపర్ 2 పరీక్షలను వేర్వేరు షిఫ్ట్‌ల్లో నిర్వహిస్తారు. పేపర్ 1 పరీక్షకు అన్ని పోస్టుల అభ్యర్థులు తప్పనిసరిగా హాజరుకావాలి.
- కేంద్ర గణాంకాల మంత్రిత్వశాఖలోని జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్, స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్ గ్రేడ్ 2 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పేపర్ 2 పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది.



ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 04.07.2025
- టైర్ 1(సీబీటీ) పరీక్ష తేది: 2025,ఆగస్టు 13–30
- టైర్ 2(సీబీటీ) పరీక్ష తేది: 2025, డిసెంబర్.
- వెబ్‌సైట్: https://ssc.gov.in

రాత పరీక్షలో రాణించేలా

- టైర్ 1లో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్, ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్‌పై ప్రశ్నలు ఉంటాయి.
- జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ విభాగంలో.. వెర్బల్, నాన్ వెర్బల్ తరహా ప్రశ్నలు ఉంటాయి. ఇందులో మంచి మార్కులు సాధించేందుకు అనాలజీస్, అరిథమెటికల్ రీజనింగ్, ఫిగరల్ క్లాసిఫికేషన్, నంబర్ సిరీస్, కోడింగ్–డీకోడింగ్, న్యూమరికల్ ఆపరేషన్స్, వెన్ డయాగ్రమ్స్, న్యూమరికల్ ఆపరేషన్స్ తదితర అంశాలపై అవగాహన పెంచుకొని.. గత ప్రశ్నలు, మోడల్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.
- జనరల్ అవేర్‌నెస్ విభాగంలో.. అభ్యర్థికి పరిసరాలపై ఉన్న అవగాహనను పరిశీలించేలా ప్రశ్నలు అడుగుతారు. అదేవిధంగా తాజా జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతీయ సంఘటనలు, కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. భారత్‌కు పొరుగు దేశాలతో ఉన్న సంబంధాలతోపాటు చరిత్ర–సంస్కృతి, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, క్రీడలు, సైన్స్ రంగంలో పరిశోధనలు వంటి అంశాలపైనా ప్రశ్నలు అడిగే అవకాశముంది. కాబట్టి ఆయా అంశాలపై అవగాహన పెంచుకునేందుకు ప్రతి రోజూ ఏదైనా ప్రామాణిక దిన పత్రికను అనుసరించడం తోపాటు 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను చదవడం మేలు చేస్తుంది.
- క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ విభాగంలో బెస్ట్ స్కోర్ కోసం నంబర్స్, పర్సంటేజెస్, రేషియో అండ్ ప్రపోర్షన్స్, యావరేజెస్, ప్రాఫిట్ అండ్ లాస్, ఇంటరెస్ట్, పార్టనర్‌షిప్, మిక్చర్స్ అండ్ అలిగేషన్స్, టైమ్ అండ్ వర్క్, టైమ్ అండ్ డిస్టెన్స్, జామెట్రీ, ట్రిగనోమెట్రీ తదితర అంశాలపై పట్టు సాధించాలి.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగంలో..అభ్యర్థికి ఇంగ్లిష్ భాషపై ఉన్న పట్టును పరిశీలించేలా, రాత సామర్థ్యాన్ని పరీక్షించేలా ప్రశ్నలు ఉంటాయి. ఇందులో వొకాబ్యులరీ,గ్రామర్,సెంటెన్స్ స్ట్రక్చర్, సినానిమ్స్, యాంటానిమ్స్‌లపై ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు గ్రాడ్యుయేషన్ స్థాయిలో ప్రశ్నలు ఉంటాయని భావించి లోతైన ప్రిపరేషన్ సాగించాలి.

కెరీర్ గైడెన్స్ — కెరీర్‌ను ‘ప్యాక్’ చేసుకోండిలా!

నేటి పోటీ ప్రపంచంలో రోజుకొక వస్తువు మార్కెట్లో సరికొత్తగా అవిష్కృతమవుతోంది. అది షాప్‌లో కావొచ్చు. ఆన్‌లైన్లో కావచ్చు. అయితే, ఆ వస్తువుకు మార్కెటింగ్ కల్పించాలన్నా, వినియోగదారులను ఆకర్షించాలన్నా.. దాన్ని ప్యాక్ చేసే పద్ధతి ఎంతో కీలకం. ఒకే వస్తువును భిన్న సంస్థలు తయారు చేసినా.. వాటికి ప్రత్యేకతను తీసుకొచ్చేది ప్యాక్ చేసే విధానమే. ఈ నేపథ్యంలో.. వినూత్న కెరీర్ మార్గంగా నిలుస్తున్న ప్యాకేజింగ్ టెక్నాలజీ, అందుబాటులో ఉన్న కోర్సులు, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..

» ప్యాకేజింగ్‌లో డిప్లొమా, పీజీ డిప్లొమా కోర్సులు
» ఐఐపీలో కోర్సుల ఉత్తీర్ణులకు ఉపాధి అవకాశాలు

‘మేక్ ఇన్ ఇండియా’లో భాగంగా భారత్‌లో భారీగా వస్తువుల తయారీకి ఊతం లభిస్తోంది. దీంతో ప్రతి తయారీ సంస్థకు ప్యాకేజింగ్ నిపుణుల సేవలు ఎంతో కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్యాకే జింగ్ టెక్నీషియన్లకు డిమాండ్ ఏర్పడింది. ప్యాకేజింగ్ రంగంలో కోర్సులను అందించేందుకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ) సంస్థ ఏర్పాటైంది. దీని ప్రధాన కార్యాలయం ముంబైలో ఉంది. చెన్నై, న్యూఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్, అహ్మదాబాద్‌లలో ప్రాంతీయ కేంద్రాలున్నాయి.

ప్యాకేజింగ్ కోర్సులు.. కాలేజీలు

- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ) దేశ వ్యాప్తంగా ఉన్న క్యాంపస్‌ల్లో నేరుగా డిప్లొమా, పీజీ డిప్లొమా, ఎంఎస్ ప్యాకేజింగ్ తదితర కోర్సులను అందిస్తుంది.
- హైదరాబాద్ రామంతపూర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాల.. పదో తరగతి అర్హతతో పాలీసెట్‌లో ర్యాంకు ఆధారంగా ప్యాకేజింగ్ టెక్నాలజీపై డిప్లొమా కోర్సును అందిస్తుంది.
- హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ ప్యాకేజింగ్‌లో ఎమ్మెస్సీని ఆఫర్ చేస్తోంది. ఇవి కాకుండా దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లోని విద్యా సంస్థలు సైతం ప్యాకేజింగ్ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. ఇందులో షార్ట్‌టర్మ్, ఆన్‌లైన్ కోర్సులు సైతం ఉన్నాయి.

అర్హతలు

- ఐఐపీలో డిప్లొమా కోర్సు(దూర విద్య)లో ప్రవేశానికి ఆర్ట్స్, కామర్స్, సైన్స్, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్‌తోపాటు ఇంజనీరింగ్/టెక్నాలజీలో డిప్లొమా ఉత్తీర్ణులు కూడా అర్హులే. అయితే, ఏదైనా కంపెనీలో ప్యాకేజింగ్, మార్కెటింగ్, మ్యాన్యుఫ్యాక్చరింగ్‌లలో ఏడాది పని అనుభవం తప్పనిసరి.
- పీజీ డిప్లొమా కోర్సులకు సైన్స్, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు అర్హులు. డిగ్రీలో మ్యాథ్స్‌ను ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి.
- ఎంఎస్ ప్యాకేజింగ్ కోర్సుకు.. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, బయో టెక్నాలజీతో ఏదైనా ఒక సబ్జెక్టును డిగ్రీలో చదివి ఉండాలి. అగ్రికల్చర్, ఫుడ్ సైన్స్, పాలిమర్ సైన్స్ గ్రాడ్యుయేట్లు కూడా అర్హులే.

వయసు

ప్యాకేజింగ్‌లో డిప్లొమా కోర్సులకు డిగ్రీలో ఏ కోర్సులు చేసిన వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. వయసు నిబంధన లేదు. పీజీ డిప్లొమా, ఎంఎస్ ప్యాకేజింగ్ టెక్నాలజీ కోర్సులకు 30 ఏళ్ల లోపు ఉండాలి.

పరీక్ష, ఇంటర్వ్యూతో సీటు

పీజీ డిప్లొమా, ఎంఎస్ ప్యాకేజింగ్ కోర్సుల్లో ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా సీటు లభిస్తుంది. అభ్యర్థి డిగ్రీలో చదివిన సబ్జెక్టుల నుంచే ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష మల్టిపుల్ చాయిస్ పద్ధతిలో ఉంటుంది. ఇంటర్వ్యూలో అభ్యర్థికి ప్యాకేజింగ్ రంగంపై ఉన్న ఆసక్తిని ప్రధానంగా గమనిస్తారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఇంటర్వ్యూల్లో సాధించిన మార్కులకు వెయిటేజీ ఉంటుంది. ఐఐపీ వెబ్‌సైట్‌లో పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలను పొందవచ్చు.

కోర్సు వ్యవధి

దూర విద్య విధానంలో ఉండే డిప్లొమా కోర్సు కాల వ్యవధి 18 నెలలు. పీజీ డిప్లొమా, ఎంఎస్ ప్యాకేజింగ్ కాల వ్యవధి రెండేళ్లు ఉంటుంది. చివరి సెమిస్టర్‌లో ఇండస్ట్రియల్ ట్రెయినింగ్, ఇంటర్న్‌షిప్ ఉంటుంది. ఐఐపీ అన్ని క్యాంపస్‌లలో హాస్టల్ సౌకర్యం ఉంది.

ఉపాధి అవకాశాలు

ప్యాకేజింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి చక్కటి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ప్యాకేజింగ్ కంపెనీలు, ఆహార పరిశ్రమ, ఔషధ పరిశ్రమ, శీతల పానీయాలు, వస్తువుల తయారీ సంస్థలు, ఈ–కామర్స్‌ల్లో మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు పొందవచ్చు. రిలయన్స్, అదానీ, కోకాకోలా, బ్రిటానియా, డాక్టర్ రెడ్డీస్, హిమాలయ, అరవిందో, హల్దీరామ్, నెస్లే, గోద్రెజ్, మారికో, టాటా గ్లోబల్, టీవీఎస్ మోటార్స్ లాంటి ప్రముఖ కంపెనీలు ఐఐపీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా నియామకాలు జరుపుతున్నాయి.

కెరీర్

ప్యాకేజింగ్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు లభిస్తాయి. ప్యాకేజింగ్ సైంటిస్ట్, ప్యాకేజింగ్ ఇంజనీర్, ప్యాకేజింగ్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, మేనేజర్, క్వాలిటీ కంట్రోల్ అనలిస్ట్ ఇన్‌ప్యాకేజింగ్, ఆపరేటర్ తదితర ఉద్యోగాలు లభిస్తాయి. చాలా కంపెనీలు తమ ఉత్పత్తుల ప్యాకింగ్‌ను కాంట్రాక్టు పద్ధతిలో థర్డ్ పార్టీకి అప్పగిస్తున్నాయి. దీంతో, సొంతంగా ఏజెన్సీలు, కంపెనీలు ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధిని పొందే అవకాశం సైతం ఉంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది: 15.06.2025
- పరీక్ష తేది: 22.06.2025
- వెబ్‌సైట్: www.iipin.com

14న జాతీయ లోక్ అదాలత్

సాక్షి, హైదరాబాద్: ఎస్ఐ యాక్ట్, ఎక్సైజ్ కేసులు, కార్మిక వివాదాలు, మ్యాట్రిమోని యల్, సివిల్ కేసుల్లో రాజీ కోసం ఈ నెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి సీహెచ్.పంచాక్షరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ న్యాయసేవాధి కార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్ల డించారు. హైకోర్టుతో పాటు తాలూకా కోర్టు ల్లోనూ లోక్ అదాలత్ జరుగుతుందని పేర్కొన్నారు. కేసులను పరిష్కరించుకోవాలనుకునే వారు.. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయసేవా సదన్, మండల న్యాయసేవా కమిటీలను సంప్రదించాలని సూచించారు.



'ఏరువాక సాగారో అన్నో చిన్నన్న.. నీ కష్టమంతా తీరునురో అన్నో రైతన్న' అంటూ బుధవారం సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం కేంద్రంలో రైతులు ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎద్దులను కుంకుమతో అందంగా ముస్తాబు చేసి నాగళ్లు కట్టి డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వినాయకుడి దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

- మేళ్లచెరువు

మీ బ్యాంకు ఖాతాతో మనీ లాండరింగ్ జరిగింది

ఈడీ పేరుతో రూ.4.79 కోట్లు దోపిడీ

బెంగళూరులో వృద్ధులకు టోకరా వేసిన కేటుగాళ్లు.. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు



సాక్షి, హైదరాబాద్: బెంగళూరుకు చెందిన వృద్ధ దంపతులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పేరుతో 'డిజిటల్ అరెస్టు'చేసిన సైబర్ నేరగాళ్లు రూ.4.79 కోట్లు స్వాహా చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన అక్కడి సైబర్ ఎకనమిక్ అండ్ నార్కోటిక్స్ (సీఈఎన్) పోలీసులు, ఈ నేరంలో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరి పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడకు వచ్చిన ప్రత్యేక బృందం బుధవారం వారిని అరెస్టు చేసి తీసుకువెళ్లింది. బెంగళూరుకు చెందిన మంజునాథ్‌కు గత మార్చిలో బ్యాంకు ప్రతినిధుల పేరుతో ఓ ఫోన్ కాల్ వచ్చింది. మంజునాథ్ పేరు, ఆధార్ నంబర్‌తో తెరిచిన బ్యాంకు ఖాతాతో మనీ లాండరింగ్ జరిగినట్లు అవతలి వ్యక్తి చెప్పారు. దీనికి సంబంధించి ఈడీ అధికారులు సైతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, ఆ బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేసినట్లు చెప్పాడు. ఇది జరిగిన రెండు రోజులకు ఈడీ అధికారి అవతారం ఎత్తిన మరో సైబర్ నేరగాడు మంజునాథ్‌ను ఫోన్ చేశాడు. సదరు మనీలాండరింగ్ వ్యవహారాన్ని తమతో పాటు సీబీఐ అధికారులూ దర్యాప్తు చేస్తు న్నట్లు చెప్పాడు. ఆ బ్యాంకు ఖాతా, నేరంతో తనకు ఎలాంటి సంబంధం లేదని మంజునాథ్ లబోదిబోమన్నాడు. ఆ కేసులో నిందితులను ఇప్పటికే అరెస్టు చేశామని.. మీరు అనుమానితులు కావడంతో మీతో పాటు మీ భార్యను డిజిటల్ అరెస్టు చేస్తున్నామని నేరగాడు చెప్పా డు. నిర్దోషిత్వం నిరూపించుకోవడం కోసం తమ అధికారిక ఖాతాల్లోకి నిర్ణీత మొత్తం బదిలీ చేయా ల్సి ఉంటుందని చెప్పాడు. వెరిఫికేషన్ పక్రియ పూర్తయిన తర్వాత ఆ మొత్తాన్ని తిరిగి ఇచ్చేస్తా మని నమ్మించారు. ఇలా మంజునాథ్, ఆయన భార్య నుంచి రెండున్నర నెలల్లో రూ.4.97 కోట్లు స్వాహా చేశారు. కొన్ని రోజులు ఎదురు చూసినా తన నగదు తిరిగి రాకపోవడంతో పాటు నేర గాళ్లు వాడిన ఫోన్లు పని చేయకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించి, బెంగళూరు సౌత్ ఈస్ట్ డివిజన్ సీఈఎన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన అధికారులు ఆ నగదులో కొంత హైదరాబాద్‌కు చెందిన నారాయణ్ సింగ్ చౌదరి, ఈశ్వర్ సింగ్ పేర్లతో ఉన్న ఖాతాల్లోకి వెళ్లినట్లు గుర్తించారు. వీరు తరచూ శ్రీలంక వెళ్లి కొలంబోలోని క్యాసినోల్లో జల్సాలు చేస్తున్నట్లు తేల్చారు. కిరాణా దుకాణాలు నిర్వహిస్తున్న వీరు.. తమ పేర్లతో తెరిచిన కరెంట్ ఖాతాలను సూత్రధారులకు ఇచ్చి సహకరిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు చెప్తున్నారు.

సింగర్ మంగ్లీపై కేసు

చేవెళ్ల: అనుమతి లేకుండా పార్టీ నిర్వహించడంతో పాటు మద్యం, డీజే వినియోగించారనే అభియోగాలపై సింగర్ మంగ్లీతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదైంది. చేవెళ్ల మండలం ఈర్లపల్లి సమీపంలోని త్రిపుర రిసార్ట్‌లో మంగళవారం రాత్రి మంగ్లీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆమె కుటుంబ సభ్యులతో పాటు సన్నిహితులు, పలువురు సినీనటులు, గాయకులు దాదాపు 50 మంది వేడుకల్లో పాల్గొన్నారు. విందులో విదేశీ మద్యం, డ్రగ్స్ వాడుతున్నారనే సమాచారంతో సైబరాబాద్ ఎస్‌ఓటీ, లోకల్ పోలీసులు అర్ధరాత్రి 12:30 గంటలకు దాడులు నిర్వహించారు. పదిమందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా దామోదర్‌రెడ్డి గంజాయి తీసుకున్నట్లు తేలింది. అనంతరం సోదాలు చేసిన పోలీసులకు నాలుగు మద్యం ఫుల్‌బాటిళ్లు, ఆరు ఖాళీ బాటిళ్లు లభించాయి. రిసార్ట్‌లో మద్యం సరఫరాకు ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకపోవటంతో మంగ్లీతోపాటు పార్టీ నిర్వహించిన ఆమె మేనేజర్ దున్నే మేఘరాజ్, అతడి స్నేహితుడు దామోదర్‌రెడ్డి (గంజాయి పాజిటివ్ వచ్చిన వ్యక్తి), రిసార్ట్ అసిస్టెంట్ మేనేజర్ శివరామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. వేడుకల్లో మంగ్లీ సోదరి ఇంద్రావతి, సింగర్ కాసర్ల శ్యామ్, రచ్చ రవి, నటి దివి తదితరులు పాల్గొన్నట్లు తెలిసింది. పుట్టినరోజు వేడుకలు, పోలీసుల సోదాల వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.

మద్యం వినియోగానికి అనుమతి తప్పనిసరి

వేడుక ఏదైనా మద్యం వినియోగానికి ముంద స్తుగా ఎక్సైజ్‌శాఖ నుంచి అనుమతి తప్పనిసరి అని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అందుకుకోసం ప్రభుత్వం నిర్దేశించిన ఫీజు రూ.8 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. విదేశీ మద్యం వినియోగించాలనుకుంటే.. ఎక్సైజ్‌శాఖ అనుమతి పొందిన షాపుల నుంచే కొనుగోలు చేయాలి. ఏ ఎక్సైజ్ పోలీసు స్టేషన్ పరిధిలోని షాపు నుంచి మద్యాన్ని కొను గోలు చేస్తే.. ఆ స్టేషన్ పరిధిలోనే వినియోగించాల్సి ఉంటుంది. రెండు ఫుల్ బాటిల్స్‌కు మించి, పార్టీలో పది మందికి మించితే సంబంధిత శాఖ నుంచి లిఖిత పూర్వకంగా అనుమతి పొందాలి. పార్టీల్లో డిఫెన్స్, గోవా నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ వాడటా నికి అనుమతి ఇవ్వరని అధికారులు వివరించారు.

తెలియక తప్పు జరిగింది: మంగ్లీ

సింగర్ మంగ్లీ తన బర్త్‌డే పార్టీపై స్పందిస్తూ బుధవారం రాత్రి ఒక వీడియో విడుదల చేసింది. 'నా పుట్టినరోజు వేడుకల్ని అమ్మానాన్న, స్నేహితులతో కలిసి ఫ్యామిలీ ఫంక్షన్‌లా నిర్వహించుకున్నాం. మద్యం బాటిల్స్, డీజే సౌండ్స్‌కి అనుమతి తీసుకోవాలనే విషయంపై నాకు అవగాహన లేదు. తెలిసుంటే అనుమతి తీసుకునేదాన్ని. తెలియక తప్పు జరిగింది. అక్కడ లోకల్ లిక్కర్ తప్ప మత్తు పదార్థాలు వాడలేదు, తీసుకోలేదు. డ్రగ్ పాజిటివ్ వచ్చిన వ్యక్తి బయట తీసుకొని వచ్చాడు. ఈ విషయం పోలీసులే చెప్పారు. పోలీసులకు పూర్తిగా సహకరిస్తాను. అసత్య ప్రచారాలు చెయ్యొద్దు' అని ఆ వీడియోలో మంగ్లీ పేర్కొంది.

దాటవేత ధోరణిలో సమాధానం

- ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును రెండోసారి విచారించిన సిట్
- ప్రణీత్‌రావుతో కలిపి ప్రశ్నలు అడిగిన అధికారులు.. ఎస్ఐబీలో అనేక ఆపరేషన్లు జరుగుతాయన్న మాజీ చీఫ్
- 14న మళ్లీ విచారణకు రావాలని నోటీసు

సాక్షి, హైదరాబాద్: ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావును సిట్ అధికారులు మరోసారి ప్రశ్నించారు. ఈయన్ను సోమవారం ఉదయం 11.30 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు ప్రశ్నించిన విషయం తెలిసిందే. బుధవారం ఎనిమిదిన్నర గంటలపాటు విచారించారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ రెండో అంతస్తులో ఉన్న సిట్ కార్యాలయంలో వెస్ట్‌జోన్ డీసీపీ ఎస్ఎం విజయ్ కుమార్, సిట్ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఏసీపీ పి.వెంకటగిరి నేతృత్వంలోని బృందం ప్రభాకర్‌రావును ప్రశ్నించింది. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టయి, ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న ఎస్ఐబీ మాజీ డీఎస్పీ డి.ప్రణీత్‌రావును సిట్ అధికారులు విచారణకు పిలిచారు. ఇద్దరినీ కలిపి కొన్ని ప్రశ్నలు అడిగినట్టు తెలిసింది. అమెరికా నుంచి వచ్చిన తర్వాత సోమవారం తొలిసారిగా విచారణకు హాజరైన ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్‌తో తనకు ఏం సంబంధం అని, దానికి అనుమతి ఇవ్వడానికి సాధికారిక కమిటీ ఉంటుందని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారు. అయితే అప్పట్లో ఆయా ఫోన్లు ట్యాప్ చేయడానికి సహకరించాల్సిందిగా టెలికం సర్వీస్ ప్రొవైడర్లకు ఎస్ఐబీ నుంచి వెళ్లిన లేఖల్ని సిట్ బుధవారం తీసుకొచ్చింది. వీటిపై డిజిగ్నేటెడ్ అధికారిగా ప్రభాకర్‌రావు పేరు, ఆయన సంతకం ఉండటాన్ని సిట్ ప్రస్తావించింది. ట్యాపింగ్‌తో సంబంధం లేనప్పుడు ఆయా లేఖలపై ఎందుకు సంతకం చేశారంటూ ప్రశ్నించింది. జర్నలిస్టులు, వ్యాపారులతో పాటు నేతలు, వారి కుటుంబీకుల ఫోన్లు ఎందుకు ట్యాప్ చేశారని, వారి నంబర్లను ట్యాప్ చేస్తున్నారని తెలిసినప్పుడు లేఖలపై సంతకాలు ఎందుకు చేశారని అధికారులు ప్రశ్నించారు. కొందరు జడ్జిలకు సంబంధించిన కాల్ డిటేల్స్ సేకరించడం వెనుక ఉన్న కారణాలపై ఆరా తీశారు. అయితే పోలీసులు అడిగిన ప్రశ్నలకు ప్రభాకర్‌రావు దాటవేత ధోరణిలో సమాధానం ఇచ్చారు. ప్రణీత్‌రావుతో కలిపి ప్రభాకర్‌రావును విచారించిన సిట్ గతంలో సేకరించిన ఆధారాలు, తదితరాలను వీరి ముందు ఉంచారు.

హార్డ్‌డిస్క్ శకలాల్ని మూసీలో ఎందుకు వేశారు

ఇద్దరినీ వేర్వేరుగా కొన్ని ప్రశ్నలు అడిగిన పోలీసులు... కలిపి అవే అడిగి, వారు చెప్పిన సమాధానాలతో సరిచూశారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్ల కోసమే ఎస్ఐబీలో స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) ఏర్పాటు చేశానని చెప్పిన ప్రభాకర్‌రావు సమర్థత ఆధారంగానే ఆ బాధ్యతలు ప్రణీత్‌కు అప్పగించినట్టు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన సిట్ అధికారులు అలాంటప్పుడు ఎస్ఓటీ కోసం ప్రత్యేకంగా కంప్యూటర్లు, సర్వర్లు ఎందుకు ఏర్పాటు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. మావోయిస్టుల కోసం తాము చేసే కొన్ని అత్యంత రహస్య ఆపరేషన్ల కోసమే అలా ఏర్పాటు చేసినట్టు ప్రభాకర్‌రావు సమాధానం ఇచ్చారు. కొన్ని ఆపరేషన్లకు సంబంధించిన సమాచారం బయటకు పొక్కితే జాతీయ భద్రతతోపాటు కొందరు అధికారులకు ముప్పు అని, ఆ కారణంగానే ఆయా ఆపరేషన్ల సమాచారం ఉన్న హార్డ్‌డిస్క్‌లు పని పూర్తయిన తర్వాత ధ్వంసం చేస్తుంటామని ప్రభాకర్‌రావు సిట్ అధికారులకు తెలిపారు. అలా ధ్వంసం చేయడం సర్వసాధారణమే అయితే వాటి శకలాలను తీసుకెళ్లి నాగోలు వద్ద మూసీనదిలో పారేయాల్సిన అవసరం ఏమిటంటూ ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావులను సిట్ ప్రశ్నించింది. దీనికి సంబంధించి ప్రభాకర్‌రావు నుంచి సమాధానం రాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ విచారణ మొత్తాన్ని పోలీసులు వీడియో రికార్డింగ్ చేశారు. శనివారం మరోసారి విచారణకు రావాల్సిందిగా ప్రభాకర్‌రావుకు నోటీసులు జారీ చేశారు. ఆ రోజు ఈ కేసులో అరెస్టు అయి, బెయిల్‌పై ఉన్న మరో నిందితుడితో కలిపి విచారించనున్నట్టు తెలిసింది. ఇప్పటికీ ప్రభాకర్‌రావు నుంచి సరైన సహకారం లభించట్లేదని, పక్కా ఆధారాలు చూపించి ప్రశ్నిస్తున్నా ఆయన సమాధానాలు చెప్పట్లేదని సిట్ చెబుతోంది. తనను ట్యాపింగ్, సీడీఆర్‌ల విశ్లేషణకు సంబంధించిన ఆదేశాలు ప్రభాకర్‌రావు నుంచి వచ్చాయని ప్రణీత్‌రావు చెబుతుండగా... ప్రభాకర్‌రావు మాత్రం వీటిని ఖండిస్తున్నారని వివరిస్తున్నారు.

మంగళూరు పోర్ట్ టు సికింద్రాబాద్

అనుసంధానించేందుకు రూ.3,342 కోట్లతో బళ్లారి-చిక్జాజూర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టు

కేంద్ర మంత్రివర్గం ఆమోదం: అశ్వినీ వైష్ణవ్

సాక్షి, న్యూఢిల్లీ: మంగళూరు పోర్ట్‌ను సికింద్రాబాద్‌తో అనుసంధానించే ముఖ్యమైన బళ్లారి-చిక్జాజూర్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.3,342 కోట్ల వ్యయంతో చేపట్టబోయే ఈ ప్రాజెక్టు 185 కిలో మీటర్ల పొడవుతో ఉంటుంది. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి కృష్ణపట్నం పోర్టుకు మాత్రమే రైలు మార్గం ఉండగా, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కొత్తగా మంగళూరు పోర్టును సికింద్రాబాద్‌తో అనుసంధానిస్తారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సీసీఈఏ) రెండు కీలక రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేసింది. జార్ఖండ్‌లోని కొడర్మా- బర్కాకానా డబ్లింగ్ ప్రాజెక్టు, బళ్లారి-చిక్జాజూర్ డబ్లింగ్ ప్రాజెక్టుల ద్వారా ప్రయాణ సౌలభ్యం, సామగ్రి రవాణా సామర్థ్యం, తక్కువ లాజిస్టిక్ ఖర్చుతో సహజంగా కార్బన్ ఉద్గారాల తగ్గింపుతో ఉన్న మౌలిక వ్యవస్థను బలపరచనున్నారు. కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన ఈ రెండు ప్రాజెక్టుల మొత్తం వ్యయం రూ.6,405 కోట్లు. ఈ రెండు కీలక ప్రాజెక్టులను మూడు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

బళ్లారి-చిక్జాజూర్ ప్రాజెక్టు ఇలా...

బళ్లారి-చిక్జాజూర్ రైలు డబ్లింగ్ ప్రాజెక్టు కర్ణాటకలోని బళ్లారి, చిత్రదుర్గ జిల్లాలు, ఏపీలోని అనంతపురం జిల్లా మీదుగా సాగుతుంది. 185 కి.మీ. మార్గంలో 19 స్టేషన్లు, 29 మెయిన్ బ్రిడ్జీలు, 230 మైనర్ బ్రిడ్జీలు, 21 ఆర్వోబీలు, 85 ఆర్‌యూబీలు ఉంటాయి. ఈ డబ్లింగ్ ప్రాజెక్టు ఇనుము ధాతువు, కోక్ కోల్, స్టీల్, ఎరువులు, ఆహార ధాన్యాలు, పెట్రోలియం పదార్థాల రవాణాకు కీలకంగా మారనుంది. ఈ ప్రాజెక్టు వల్ల 470 గ్రామాలకు మెరుగైన రవాణా సేవలు, 13 లక్షల జనాభాకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుంది. ఏటా 18.9 మిలియన్ టన్నుల అదనపు సరుకు రవాణాకు వీలవడమే కాకుండా ఈ మార్గం వల్ల ప్రతి సంవత్సరం 101 కోట్ల కిలోల కార్బన్‌డైఆక్సైడ్ ఉద్గారాల తగ్గింపు సాధ్యమవుతుంది. ఈ నూతన ప్రాజెక్టు వల్ల దాదాపు 20 కోట్ల లీటర్ల డీజిల్ పొదుపు అవుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
గురువారం । 12 । జూన్ । 2025


బూడిపార్ల వేర్లను ఎండబెడుతున్న చెంచు మహిళ


అటవీ ప్రాంతంలో దొరికే గడ్డితో చీపుళ్లు తయారు చేస్తున్న చెంచు మహిళలు

అడవే ఆధారం.. బతుకు భారం..

అటవీ ఉత్పత్తుల సేకరణతోనే చెంచుల జీవనం

- నల్లమలలో తేనె, మారెడుగడ్డలు, చింతపండు సేకరణ
- క్రమంగా అంతరించిపోతున్న ఉత్పత్తులు
- కనిపించని జిగురు, ఇప్పపువ్వు
- అయోమయంలో చెంచుల జీవనం
- సంక్షేమ పథకాలకు దూరం


నల్లమలలో లభించే జిగురు

అచ్చంపేట: సంక్షేమ ఫలాలు దరి చేరవు. వ్యవసాయ భూమి లేదు. అటవీ ఉత్పత్తుల సేకరణే జీవనాధారం. ఇదీ నల్లమల అటవీ ప్రాంతంలోని వందలాది చెంచుల జీవనం. అటవీ ప్రాంతంలోని చెంచుల జీవనాన్ని మెరుగుపరిచేందుకు ఎన్ఆర్ఈ జీఎస్, వ్యవసాయ, గిరిజన సహకార సంస్థతో పాటు ఐకేపీ, టీపీఎంయూ ఐటీడీఏలో అంతర్భాగంగా ఉన్నప్పటికీ.. సంక్షేమ ఫలాలు వారి దరి చేరడం లేదు. ఫలితంగా అటవీ ఉత్పత్తుల సేకరణతోనే కాలం వెళ్లదీస్తున్నారు.

నల్లమల లోతట్టు ప్రాంతంలో..

ఉమ్మడి రాష్ట్రంలోని సున్నిపెంట (శ్రీశైలం)లో మహబూబ్‌నగర్, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలోని చెంచుల సంక్షేమం కోసం ఏర్పాటైన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ప్రభావితంగానే కొనసాగింది. 2014 రాష్ట్ర విభజన అనంతరం 2015 మార్చి నుంచి అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో ఐటీడీఏ ఏర్పాటు చేశారు. దీని పరిధిలో నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాలు ఉన్నాయి. ఐదు జిల్లాలోని 25 మండలాల్లో 172 గిరిజన గ్రామాలు, పెంటలున్నాయి. మొత్తం 4,041 చెంచు కుటుంబాల్లో 14,194 మంది జనాభా ఉంది. నల్లమల అటవీ ప్రాంతంలో 88 చెంచు పెంటలు ఉండగా.. 2,595 కుటుంబాల్లో 8,784 మంది చెంచులు నివసిస్తున్నారు. వీరిలో 4,341 మంది పురుషులు, 4,449 మంది మహిళలు ఉన్నారు. అభయారణ్యంలో లింగాల, అమ్రాబాద్, పదర మండలాలు ఉండగా.. 18 చెంచు పెంటలు ఉన్నాయి. 12 పెంటల్లో పూర్తిగా చెంచులే నివసిస్తుండగా.. మిగతా పెంటల్లో చెంచులతో పాటు ఎస్సీ, ఎస్టీలు ఉంటారు. అచ్చంపేట, కొల్లాపూర్ నియోజక వర్గాల పరిధిలోని లోతట్టు అటవీ ప్రాంతంలోని ఫర్హాబాద్, మల్లాపూర్, పుల్లాయిపల్లి, రాంపూర్, అప్పాపూర్, భౌరాపూర్, ఈర్లపెంట, మేడిమెల్కల, సంగడిగుండాలు, ధారవాగు, తాటిగుండాలు, పెద్దూటి, బట్టిచింతల, ఎంకలపెంట, ఎర్రపెంట, పాత ధారారం, కుండిచింతలబైలు తదితర చెంచు పెంటల్లో నివసించే వారి పరిస్థితి దుర్భరంగా తయారైంది.

ఫలాల సేకరణలో హద్దులు..

చెంచులు ప్రధానంగా దుంపలు, అటవీ ఉత్పత్తుల సేకరణ, వేటపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. నల్లమలలోని పలు చెంచు పెంటలకు నేటికీ సరైన రహదారులు లేవు. సరైన జీవనశైలి లేకపోవడంతో తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. అటవీ ప్రాంతంలో లభించే ఫలాల సేకరణకు హద్దులు ఏర్పాటు చేసుకుంటారు. వారు ఏర్పాటు చేసుకున్న సరిహద్దు ప్రాంతంలోనే అటవీ ఉత్పత్తులు సేకరిస్తుంటారు. ఇది వంశపారంపర్యంగా వస్తున్న హక్కుగా చెబుతున్నారు. చెంచుల ఆచారాలు, ఇంటి పేర్లు చెట్లు, వన్యప్రాణుల పేర్లతో కూడి ఉంటాయి.

చెట్ల పెంపకమేదీ?

అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం సాగించే చెంచుల బతుకులు ప్రశ్నార్థకంగా మారనున్నాయి. క్రమంగా అటవీ ఉత్పత్తులు అంతరించడం, చెంచుల జీవన ప్రమాణాలు పెంచాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉండటంతో... ఆహార కొరత ఏర్పడింది. నాగరికత ఎరుగని చెంచులు నేటికీ ఆహార సేకరణ దశలోనే ఉన్నారు. వీరి అభ్యున్నతికి బాటలు వేయాల్సిన ఐటీడీఏ.. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్నది వాస్తవం. కనుమరుగవుతున్న పండ్ల చెట్ల పెంపకంపై అధికారులు దృష్టి సారించడం లేదు. వేసవిలో కనీసం ఉపాధి పనులు కూడా చేపట్టకపోవడంతో.. చెంచులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు.

క్రూరమృగాలతో ముప్పు..

నల్లమల అటవీ ప్రాంతంలో తేనె, మారెడు గడ్డలు, జిగురు, చింతపండు, కుంకుడుకాయలు, ముష్టి గింజలు, ఎండు ఉసిరి, చిల్లగింజలు, నరమామిడి చెక్క, కరక్కాయలు, విప్పపువ్వు, విప్ప గింజలు, కానుగ గింజలు, తునికాకు, బుడ్డపార్ల వేర్లు, వెదురు వంటి వాటితో పాటు మరో పది రకాల అటవీ ఉత్పత్తులు లభిస్తాయి. వాతావరణ పరిస్థితులు, రేడియేషన్ ప్రభావం వల్ల సహజసిద్ధంగా లభించే అటవీ ఫలాలు క్రమంగా అంతరిస్తున్నాయి. పెద్దపులులు, క్రూరమృగాలతో ముప్పును సైతం లెక్కచేయకుండా ఫలాల సేకరణ చేయక తప్పడం లేదు. అటవీ ఉత్పత్తులు సేకరించి.. గిరిజన కార్పొరేషన్ సంస్థ (జీసీసీ) కేంద్రాల్లో విక్రయిస్తారు. వారికి కావాల్సిన సరుకులను అక్కడి నుంచి తీసుకెళ్తారు. రాష్ట్ర ప్రభుత్వం మొక్కల పెంపకంపై దృష్టి సారిస్తున్నప్పటికీ.. చెంచులకు ఫలాలు ఇచ్చే మొక్కల పెంపకంపై మాత్రం ఆసక్తి చూపడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికే అడవిలో లభించే తునికాకు సేకరణను అటవీశాఖ అధికారులు పదేళ్లుగా నిలిపివేశారు. రేడియేషన్ కారణంగా తేనెటీగలు అంతరించిపోవడంతో తేనెతుట్టెలు కనిపించడం లేదు. ఏడాది పొడవునా జిగురు, చింతపండు, తేనెపైనే చెంచులు ఆధారపడి జీవిస్తున్నారు.

ప్రత్యేక కార్యాచరణ



చెంచుల సంక్షేమం, అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కార్యాచరణ రూపొందించింది. చెంచుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం జన్‌మన్ యోజన) పథకం కింద 88 చెంచుపెంటల్లో 11 రకాల కార్యక్రమాలు విడతల వారీగా చేపడుతోంది. చెంచు పెంటల్లో 1,030 ఇళ్ల నిర్మాణం ప్రతిపాదించి, పనులు ప్రారంభించాం. కొంతమంది చెంచులకు కిసాన్ క్రెడిట్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, ఆధార్ కార్డులు అందజేశాం. ప్రత్యేకంగా మెడికల్ వాహనం ఏర్పాటు చేశాం. మరిన్ని కార్యక్రమాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం.

– రోహిత్‌రెడ్డి, ఇన్‌చార్జి పీవో, ఐటీడీఏ

బీమా సౌకర్యం కల్పించాలి



కొన్నేళ్లుగా స్వచ్ఛంద సంస్థలు మాత్రమే తేనె సేకరణలో మాకు ఉపయోగపడుతున్నాయి. వారు ఇచ్చిన కిట్లు కూడా పాడయ్యాయి. కొత్త వాటిని ఇవ్వ లేదు. గతంలో పెంటలకు అందుబాటు లో తేనె లభించేది. తేనె సేకరణకు ఆడవి లో చాలా దూరం వెళ్లాల్సి వస్తోంది. ప్రభు త్వం తేనెకు మద్దతు ధర కల్పించడంతో పాటు.. తేనె సేకరణకు వెళ్లే ప్రతి ఒక్కరికీ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి.

– బయ్యన్న, మల్లాపూర్ చెంచుపెంట

గుడిసెల్లోనే కాపురం..



లోతట్టు అటవీ ప్రాంతంలోని చెంచులు నేటికీ అనాగరిక జీవితం కొనసాగిస్తున్నారు. అటవీ ఉత్పత్తులు తగ్గాయి. జీవనం కొనసాగడం కష్టంగా ఉంది. పక్కా ఇళ్లు లేక నేటికీ బొద్దు గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. ప్రత్యేక ఉపాధి తీసివేసిన తర్వాత పనులు లేకుండా పోయాయి. వైద్యం అందక రోగాల బారిన పడుతున్నారు.

– నిమ్మల శ్రీనివాసులు, అధ్యక్షుడు, రాష్ట్ర ఆదివాసీ చెంచు ఐక్యవేదిక

డిజిటల్ సాధికారత కలకు ఎస్‌టీపీఐ రెక్కలు



- మూడు దశాబ్దాలకుపైగా ప్రయాణంలో భారత ఐటీ రంగానికి దన్ను
- సాఫ్ట్‌వేర్ ఎగుమతుల వృద్ధితోపాటు స్టార్టప్ వాతావరణం వేగవంతం
- దేశవ్యాప్తంగా 67 కేంద్రాలు, ద్వితీయశ్రేణి పట్టణాలపై ప్రత్యేక దృష్టి
- హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణ, ఏపీలో ఐదు చోట్ల ఉపకేంద్రాలు
- హైదరాబాద్ ఎస్‌టీపీఐ పరిధిలో రూ. 1.42 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు
- 1.35 లక్షల చదరపు అడుగుల వర్క్‌స్పేస్, 134 స్టార్టప్‌ల ఇంక్యుబేషన్

సాక్షి, హైదరాబాద్: భారత్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వాతావరణాన్ని బలోపేతం చేయడంతో ద్వారా దేశ 'డిజిటల్ సాధికారత'కలకు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా మూలస్తంభంగా నిలుస్తోంది. సుమారు మూడు దశాబ్దాల క్రితం (1991లో) ఏర్పాటైన ఎస్‌టీపీఐ దేశం నుంచి సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో వృద్ధి, సాంకేతిక స్టార్టప్‌ల వాతావరణాన్ని వేగవంతం చేయడంలో కీలకంగా పనిచేస్తోంది. ఎస్‌టీపీఐ ఇటీవలే 34వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జరుపుకుంది. ఈ కోవలోనే ఏర్పాటైన ఎస్‌టీపీఐ హైదరాబాద్ విభాగం తెలంగాణ, ఏపీలో ఐటీ, స్టార్టప్ రంగాలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. 1.35 లక్షల చదరపు అడుగుల వర్క్ స్పేస్‌తో భారత ఐటీ పరిశ్రమను ఎస్‌టీపీఐ హైదరాబాద్ బలోపేతం చేస్తోంది.

రూ. 4.76 కోట్ల ఎగుమతులతో..

దేశవ్యాప్తంగా ఎస్‌టీపీఐకి 14 చోట్ల డైరెక్టరేట్‌లు ఉండగా హైదరాబాద్ ఎస్‌టీపీఐ పరిధిలో తెలంగాణ, ఏపీ ఉన్నాయి. ఇరు రాష్ట్రాల్లోని కాకినాడ, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్‌లో కలుపుకొని మొత్తం ఐదు కేంద్రాలు ఉన్నాయి. సాఫ్ట్‌వేర్, ఐటీ ఉత్పత్తుల ఎగుమతుల లక్ష్యంగా ఎగుమతుల యూనిట్లు (ఈఓయూ), తయారీ జోన్లు (ఈపీజెడ్)లను ఎస్‌టీపీఐ ఏర్పాటు చేసింది. 2023–24లో రూ. 1.23 లక్షల కోట్లు, 2024–25లో రూ. 1.42 లక్షల కోట్ల ఐటీ ఎగుమతుల ద్వారా హైదరాబాద్ ఎస్‌టీపీఐ భారత ఆర్థిక వృద్ధిలో కీలకంగా మారింది. 1992–93లో రూ. 4.76 కోట్ల ఐటీ ఎగుమతుల ద్వారా హైదరాబాద్ ఎస్‌టీపీఐ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి.

ఇక్కడ 'ఇమేజ్'.. అక్కడ 'కల్పతరు'

ఐటీ ఎగుమతులను ప్రోత్సహించేందుకు ఎస్‌టీపీఐ హైదరాబాద్ కొత్తగా 'ఇమేజ్', 'కల్పతరు'ను ఏర్పాటు చేసింది. గేమింగ్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, కంప్యూటర్ విజన్, ఏఐ స్టార్టప్‌లకు అవసరమైన మార్గదర్శనం, సాంకేతిక మద్దతు, నిధుల సమీకరణ తదితరాల కోసం 2020లో హైదరాబాద్ ఇమేజ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను 10 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసింది. ఇందులో సీవీ ల్యాబ్, గేమ్ ల్యాబ్‌తోపాటు స్టార్టప్‌లకు అవసరమైన పలు సమీకృత కార్యక్రమాలు చేపట్టింది. అలాగే విశాఖపట్నంలో 'కల్పతరు'పేరిట సెంటర్ ఆఫ్ ఆంట్రప్రెన్యూర్‌షిప్‌ను స్థాపించారు. ఆవిష్కర్తలకు అవసరమైన మౌలిక వసతులు, నిధులు, మార్కెటింగ్ తదితరాలను కల్పతరు ద్వారా అందుబాటులోకి తెచ్చారు.

ద్వితీయ, తృతీయశ్రేణి పట్టణాల వైపు



దేశంలో ఐటీ రంగం శైశవ దశలో ఉన్న కాలంలో మూడు కేంద్రాలతో ప్రారంభమైన ఎస్‌టీపీఐ ప్రస్తుతం 67 కేంద్రాలకు కార్యకలాపాలను విస్తరించింది. అందులో 59 కేంద్రాలు ద్వితీయ, తృతీయశ్రేణి పట్టణాల్లోనే ఉన్నాయి. ఎస్‌టీపీఐలో నమోదైన ఐటీ పరిశ్రమల ద్వారా గతేడాది ఐటీ ఎగుమతులు రూ. 10 లక్షల కోట్లకు చేరాయి. దేశంలోని 24 ఎస్‌టీపీఐ సెంటర్ ఆఫ్ ఆంట్రప్రెన్యూర్‌షిప్ (సీఓఈ)ల ద్వారా 1,400 స్టార్టప్‌లకు మద్దతు లభించింది. వాటికోసం ఇప్పటివరకు రూ. 574 కోట్ల నిధులను సేకరించింది. దేశ డిజిటల్, ఆవిష్కరణల వాతావరణానికి ఎస్‌టీపీఐ మూల స్తంభంగా నిలుస్తోంది. హైదరాబాద్ ఎస్‌టీపీఐ పరిధిలోనూ 'ఇమేజ్', 'కల్పతరు'ద్వారా 134 స్టార్టప్‌లకు ప్రోత్సాహాన్ని అందించింది.


– అర్వింద్ కుమార్, డైరెక్టర్ జనరల్, ఎస్‌టీపీఐ

ఐటీ ఊతానికి ఎస్‌టీపీఐలు

దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి ఊతమిచ్చే లక్ష్యంతో 1991లో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ)కు శ్రీకారం చుట్టారు. ఐటీ సంస్థలకు అవసరమైన డేటా కమ్యూనికేషన్ సౌకర్యాలు, కంప్యూటర్లు, కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసే బాధ్యత ఎస్‌టీపీఐకి అప్పగించారు. మరోవైపు సాఫ్ట్‌వేర్ ఎగుమతులను ప్రోత్సహించడం, మార్కెటింగ్‌లో మద్దతు, ప్రాజెక్టులకు అనుమతులు, ఎగుమతులకు అవసరమయ్యే సర్టిఫికేషన్ తదితరాలన్నీ ఒకేచోట అందుబాటులోకి తెచ్చారు. తొలుత బెంగళూరు, పుణే, భువనేశ్వర్‌లో ఎస్‌టీపీఐయూ డైరెక్టరేట్‌లు ఏర్పాటు చేయగా ఆ తర్వాతి కాలంలో హైదరాబాద్, నోయిడా, గాంధీనగర్, త్రివేండ్రం తదితర చోట్లకు విస్తరించారు.

గర్భిణికి రక్షణ కల్పించండి

కుటుంబ వివాదంలో పోలీసులకు హైకోర్టు ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: ఏపీకి చెందిన దంపతులు దాఖలు చేసిన పిటిషన్‌లో వారి కుమార్తె, గర్భిణికి రక్షణ కల్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఎవరితోనైనా సమస్య ఉంటే హైకోర్టు న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నంబర్‌కు ఫిర్యాదు చేయాలని గర్భిణికి స్పష్టం చేసింది. సభ్యకార్యదర్శి సూచన మేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేయాలని పోలీసులకు చెప్పారు. అలాగే, పెట్రోలింగ్ నిర్వహించే పోలీసులు వాళ్ల ఇంటి వద్ద రిజిస్టర్‌లో కొంతకాలం రోజూ సంతకం చేయాలని పేర్కొంటూ.. పిటిషన్‌లో విచారణ ముగించింది. తమ కుమార్తెకు ఆమె భర్త మానసిక వైద్యం అందించే విషయంలో సందేహాన్ని వ్యక్తం చేస్తూ ఏపీకి చెందిన తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. ఆమె ప్రాణాలకు ముప్పుందని.. మియాపూర్ పోలీసులకు ఇచ్చిన వినతిపత్రంపై చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతూ గుంటూరుకు చెందిన శ్రీనివాసరావు దంపతులు పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ టి.వినోద్‌కుమార్ బుధవారం విచారణ చేపట్టారు. గతంలో న్యాయమూర్తి ఆదేశాల మేరకు కార్యదర్శి ఆమె ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై నివేదిక అందజేశారు. గర్భిణికి గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకోవాలని వైద్యులను న్యాయమూర్తి ఆదేశిస్తూ బుధవారం విచారణ ముగించారు.

చామల అవగాహన లేని అజ్ఞాని

ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు నిర్వచనం తెలియని శనేశ్వరులు కాంగ్రెస్ నాయకులు అని, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఓ అవగాహనలేని అజ్ఞాని అని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ విరుచుకుపడ్డారు. ఊర్లో పెళ్లికి కుక్కల హడావుడి అన్నట్టుగా కాంగ్రెస్ తీరు ఉందని బుధవారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. చామల కిరణ్ కుమార్‌రెడ్డికి అల్ప బుద్ధి, మందబుద్ధి, వక్రబుద్ధి.. ఆలోచన తక్కువ, ఆవేశం ఎక్కువ అని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుతోనే అత్యధిక ధాన్యం పండిందని, తెలంగాణ కరువును తీర్చింది కాళేశ్వరం ప్రాజెక్ట్ అని శ్రీనివాస్ పేర్కొన్నారు. కూలింది మేడిగడ్డ కాదని, కాంగ్రెస్ నాయకుల మెదళ్లు అని మండిపడ్డారు. ప్రాజెక్టులపై అవగాహన లేని దద్దమ్మలు కాంగ్రెస్ నాయకులని, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులపై విమర్శలు చేయడం సిగ్గుచేటని శ్రీనివాస్ ధ్వజమెత్తారు. మీరు వేసిన కమిషన్‌పైనే మీకే నమ్మకం లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి కాలం చెల్లిందని, సీఎం మెప్పుకోసం చిల్లర కూతలు కూస్తే ఖబడ్దార్ అని శ్రీనివాస్ హెచ్చరించారు.

వన మహోత్సవం వంద శాతం విజయవంతం అవ్వాలి

వన మహోత్సవం పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది వన మహోత్సవ కార్యక్రమం వంద శాతం విజయవంతం అయ్యేలా చూడాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టదలచిన వనమహోత్సవం కార్యక్రమాన్ని ఫారెస్టు డిపార్ట్‌మెంట్ అధికారులు మహోద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని, వృక్షో రక్షతి రక్షితః నినాదాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరముందని ఆమె పునరుద్ఘాటించారు. వన మహోత్సవం–2025 పోస్టర్‌ను బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. జిల్లాల్లో జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో మొక్కలు నాటేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. 2024లో డిపార్ట్‌మెంట్‌వారీగా, జిల్లాల వారీగా, రాష్ట్రవ్యాప్తంగా 20.02 కోట్ల మొక్కలు నాటాలని ప్రణాళికలు వేసుకోగా.. 19.04 కోట్లు నాటినట్టు గుర్తుచేశారు. ఈ దఫా వన మహోత్సవంలో ఈత, తాటి, వేప, చింత, కుంకుడు మొక్కలు నాటించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారిని గుర్తించి ప్రోత్సాహకాలివ్వాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మొక్కల పెంపకంలో ప్రత్యేకంగా కృషి చేసిన వారికి పలు విధాలుగా గుర్తింపునివ్వాలని అటవీ శాఖ ఉన్నతాధికారులకు చెప్పారు. కార్యక్రమంలో అటవీ ప్రధాన సంరక్షణాధికారిణి సువర్ణ, సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్, సోషల్ ఫారెస్టు రామలింగం తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మావోయిస్టుల ఎన్‌కౌంటర్

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా కుకనార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టులు అమర్చిన ఐఈడీ బాంబ్ పేలి ఏఎస్పీ ఆకాశ్‌రావు మృతి అనంతరం.. భద్రతా బలగాలు సుకుమా జిల్లాలో భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో కుకనార్ పోలీస్ స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులు ఎదురుపడగా.. ఇరువర్గాల మధ్య భీకర కాల్పులు జరిగాయి. కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో గాలించగా ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఆయుధాలు, సామగ్రి లభించాయని పోలీసులు తెలిపారు.

ఆ కులాలను తెలంగాణలో చేర్చవద్దు

కుల నిర్మూలన వేదిక

సాక్షి, హైదరాబాద్ : ఏపీలోని బీసీ కులాలను తెలంగాణ బీసీల జాబితాలో చేర్చవద్దని కుల నిర్మూలన వేదిక (కేఎన్‌వీ) రాష్ట్ర అధ్యక్షుడు పాపని నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు నాగరాజు బృందం వినతి పత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఏపీలో 138 బీసీ కులాలు ఉండేవని, అందులో ఏ గ్రూప్ నుంచి 8 కులాలు, బీ నుంచి 4 కులాలు, డీ నుంచి 14 కులాలను తెలంగాణ ప్రాంతంలో లేవన్న కారణంతో బీఆర్ఎస్ ప్రభుత్వం తొలగించిందని చెప్పారు. అయితే తొలగించిన ఆ 26 కులాలను తెలంగాణ బీసీ జాబితాలో మళ్లీ చేర్చాలని కొన్ని వర్గాల నుంచి డిమాండ్‌లు రావడం, పబ్లిక్ హియరింగ్‌కు పిలవడం.. అంటే తెలంగాణ బీసీ సమాజానికి ద్రోహం తలపెట్టడమేనని పేర్కొన్నారు. ఇలా చేస్తే అసలు ప్రత్యేక తెలంగాణ తెచ్చుకోవడం ఎందుకని ప్రశ్నించారు.

కొత్త బార్లకు డ్రా రేపు

- జీహెచ్‌ఎంసీ పరిధిలో డ్రా తీయనున్న ఎక్సైజ్ కమిషనర్
- దరఖాస్తుల రూపంలోనే రూ. 36 కోట్ల ఆదాయం

సాక్షి, హైదరాబాద్: ఈనెల ఆరో తేదీతో దరఖాస్తుల గడువు ముగిసిన బార్లకు శుక్రవారం డ్రా తీయనున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24, సరూర్‌నగర్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ ఎక్సైజ్ జిల్లాల్లోని నాలుగు బార్లకు డ్రా తీసి.. అదే రోజు కేటాయింపులు చేయనున్నారు. ఈ 24 బార్ల కోసం ఎక్సైజ్ శాఖ గత నెలలో దరఖాస్తులు ఆహ్వానించగా మొత్తం 3,668 దరఖాస్తులు వచ్చాయి. ఒక్క జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24 బార్లకు 3,520 దరఖాస్తులు వచ్చాయి. సరూర్‌నగర్‌లోని జల్‌పల్లి బార్‌కు 57, మహబూబ్‌నగర్‌లో 49, నిజామాబాద్‌లో 27, బోధన్‌లో బార్ కోసం 15 దరఖాస్తులు వచ్చాయి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి రూ.36.68 కోట్ల ఆదాయం దరఖాస్తుల రూపంలోనే సమకూరింది. కాగా, జీహెచ్‌ఎంసీలోని బార్లకు నార్సింగిలోని ఆడిటోరియంలో ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్, మహబూబ్‌నగర్‌లో కలెక్టర్ విజయేంద్ర బోయి, నిజామాబాద్, బోధన్‌లలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌లు డ్రా తీస్తారని ఎక్సైజ్ వర్గాలు వెల్లడించాయి.





బడి గంట మోగనుంది!

నేటి నుంచి బడి గంటలు మోగనున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు బడిబాట పట్టనున్నారు. 50 రోజులు పాటు పుస్తకాలు పక్కన పడేసిన విద్యార్థులు నేటి నుంచి స్కూల్ బ్యాగ్ నిండా పుస్తకాలు, చేతిలో క్యారేజీతో సైకిల్ మీద, ఆటోల్లో, బస్సుల్లో బడికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.ఈ నేపథ్యంలో బుధవారం తమ చదువుకు కావలసిన వాటిని కొనుగోలు చేశారు. - సాక్షి, నెట్‌వర్క్

మంగళూరు పోర్ట్- సికింద్రాబాద్ రైలు మార్గం

- రూ.3,342 కోట్లతో బళ్లారి–చిక్జాజూర్ రైలు డబ్లింగ్ ప్రాజెక్టు
- ఏపీలో అనంతపురం జిల్లా మీదుగా రైల్వే లైన్

సాక్షి, న్యూఢిల్లీ : మంగళూరు పోర్ట్‌ను సికింద్రాబాద్‌తో అనుసంధానించే ముఖ్యమైన బళ్లారి–చిక్జాజూర్ రైలు మార్గం డబ్లింగ్ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపింది. రూ.3,342 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టు పొడవు 185 కిలోమీటర్లు. ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి కృష్ణపట్నం పోర్టుకు మాత్రమే రైలు మార్గం ఉంది. తాజా ప్రాజెక్టుతో మంగళూరు పోర్టును సికింద్రాబాద్‌తో అనుసంధానిస్తారు. జార్ఖండ్‌లోని కొదర్మా – బర్కాకానా డబ్లింగ్ ప్రాజెక్టుకు కూడా ప్రధాని మోదీ నేతృత్వంలోని ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సీసీఈఏ) ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల మొత్తం వ్యయం రూ.6,405 కోట్లు. వీటిని మూడు సంవత్సరాల్లో పూర్తి చేయనున్నట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.బళ్లారి–చిక్జాజూర్ రైలు డబ్లింగ్ ప్రాజెక్టు కర్ణాటకలోని బళ్లారి, చిత్రదుర్గ జిల్లాలు, ఏపీలోని అనంతపురం జిల్లా మీదుగా సాగుతుంది. 185 కి.మి. మార్గంలో 19 స్టేషన్లు, 29 మెయిన్ బ్రిడ్జ్‌లు, 230 మైనర్ బ్రిడ్జ్‌లు, 21 ఆర్వోబీలు, 85 ఆర్‌యూబీలు ఉంటాయి. ఈ ప్రాజెక్టు వల్ల 470 గ్రామాలకు మెరుగైన రవాణా సేవలు, 13 లక్షల జనాభాకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనుంది. ఏటా 18.9 మిలియన్ టన్నుల అదనపు సరుకు రవాణాకు వీలవడమే కాకుండా ఈ మార్గం వల్ల ప్రతి సంవత్సరం 101 కోట్ల కిలోల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాల తగ్గింపు సాధ్యమవుతుంది. ఈ ప్రాజెక్టు ద్వారా దక్షిణాది రాష్ట్రాల్లో రవాణా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుంది.

కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఇళ్లపై ఈడీ దాడులు

బనశంకరి: కర్ణాటకలో సంచలనం రేకెత్తించిన మహర్షి కర్ణాటక వాల్మీకి గిరిజన అభివృద్ధి మండలి (కేఎం వీఎస్‌టీడీసీ)లో కోట్ల రూపాయల కుంభకోణంలో కేంద్ర ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. బుధవారం ఉదయమే ఉమ్మడి బళ్లారి జిల్లాలో, బెంగళూరులో పలువురు కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేల నివాసాలు, ఆఫీసుల్లో ముమ్మరంగా సోదాలు జరిపారు. బళ్లారి జిల్లా ఎంపీ తుకారాం, కంప్లి ఎమ్మెల్యే గణేశ్, కూడ్లిగి ఎమ్మెల్యే ఎన్‌టీ శ్రీనివాస్, బళ్లారి నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, బళ్లారి రూరల్ ఎమ్మెల్యే బీ.నాగేంద్ర పీఏ గోవర్ధన్ ఇళ్లు, బెంగళూరులోని ఆఫీసుల్లో సోదాలు చేశారు. వారి సన్నిహితులు, బంధువుల ఇళ్లలోనూ సోదాలు జరిగాయి. అక్రమ నగదు బదిలీ నియంత్రణ చట్టం కింద చేపట్టిన ఈ తనిఖీలు కర్ణాటక రాష్ట్రంలో కలకలం రేపాయి.వాల్మీకి అభివృద్ధి మండలి స్కాం గతేడాది ఫిబ్రవరిలో బయటకు వచ్చింది. ఆర్థికపరమైన అవకతవకలకు పాల్పడాలని ఒత్తిళ్లు వస్తున్నాయని లేఖ రాసి మండలి ఉద్యోగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలి ఖాతాల నుంచి ఓ మంత్రి రూ.94 కోట్లు తమ ఖాతాలకు బదిలీ చేసి తెలంగాణ శాసన సభ ఎన్నికలు, బళ్లారి లోక్ సభ ఎన్నికల్లో ఖర్చు చేశారని ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో అప్పటి మంత్రి బి.నాగేంద్ర రాజీనామా చేశారు. తరువాత ఈడీ ఆయన్ని అరెస్టు చేసింది. మండలి మేనేజింగ్ డైరెక్టర్‌ను, కొందరు ఉన్నతాధికారులను రాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో ఈడీ తాజాగా దాడులు ప్రారంభించింది. మళ్లించిన నిధుల నుంచి కంప్లి ఎమ్మెల్యే గణేశ్‌కు రూ.3 కోట్లు, ఎంపీ తుకారాంకు రూ.10 కోట్లు, ఎన్‌టీ శ్రీనివాస్‌కు కూడా కొంత నగదు చేరినట్లు ఈడీ వర్గాలు చెబుతున్నాయి.

క్లుప్తంగా...

స్వీపింగ్ మెషీన్లు, కాంపాక్టర్ల కొనుగోలుకు రూ.217.20 కోట్లు

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ప్రభుత్వం అనుమతి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నగర పాలక, పురపాలక సంస్థలలో రహదారులపై చెత్తను ఊడ్చేందుకు రూ.217.20 కోట్లతో స్వీపింగ్ మెషీన్లు, కాంపాక్టర్ల కొనుగోలుకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నేషనల్ ఎయిర్ క్లీన్ ప్రోగ్రామ్ కింద 13 నగరాలకు 14 స్వీపింగ్ మెషీన్లకు రూ.17. 70 కోట్లు, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి(ఏపీపీసీబీ) నిధులు రూ.90.50 కోట్లతో పురపాలక సంస్థలకు 94 స్వీపింగ్ మెషీన్లు, ఏపీపీసీబీ అదనపు నిధులు రూ.104 కోట్లతో స్వీపింగ్ మెషీన్లు, కాంపాక్టర్ల కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ ఈనెల 6న ప్రభుత్వానికి ప్రతిపాదించారు. దీనిపై పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఆమోదముద్ర వేశారు. ఆ మేరకు వాటి కొనుగోలుకు అనుమతి ఇస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్వీపింగ్ మెషీన్ల కొనుగోలు వ్యయంలో 50 శాతాన్ని చెల్లించే పురపాలక సంస్థలకు వాటిని సరఫరా చేయాలని, పురపాలక సంస్థల ఆర్థిక పరిస్థితి ఆధారంగా కొనుగోలుకు టెండర్లు పిలవాలని ఉత్తర్వుల్లో సూచించారు.

ఆక్వాకల్చర్ రంగం బలోపేతమే లక్ష్యం

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు


సాక్షి, అమరావతి: ఆక్వాకల్చర్ రంగం బలోపేతం కోసం గడిచిన ఆరు నెలలుగా అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నామని ఆక్వా కల్చర్ అడ్వైజరీ కమిటీ సభ్యులైన శాసనసభ స్పీకర్ రఘురామకృష్ణరాజు, అప్సడా కో వైస్ చైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి తెలిపారు. మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ అమెరికా విధించిన ప్రతీకార టాక్స్ నేపథ్యంలో రొయ్య రైతులకు తోడుగా నిలిచేందుకు ఏర్పాటు చేసిన అడ్వైజరీ కమిటీ ఎప్పటికప్పుడు సమావేశమవుతూ వారి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు.

రిలీవర్ లేకున్నా.. ఉపాధ్యాయులను బదిలీ చేయాలి

ఒంటేరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్

సాక్షి, అమరావతి: ఉన్నత పాఠశాలల్లో రిలీవర్ లేకపోతే 50 శాతం ఉపాధ్యాయులను మాత్రమే బదిలీ చేయాలన్న నిబంధన సరికాదని, రిలీవర్ లేకపోయినా బదిలీ పొందిన సబ్జెక్టు టీచర్లను రిలీవ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ నిబంధనతో తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ భాషలకు చెందిన స్కూల్ అసిస్టెంట్ 'ఒక్క పోస్టు ఉన్నచోటు' నుంచి బదిలీ పొందినప్పటికీ రిలీవ్ అయ్యే అవకాశం లేదన్నారు. 2023లో బదిలీ పొందిన హిందీ స్కూల్ అసిస్టెంట్స్ రిలీవర్ లేని కారణంగా అదే పాఠశాలలో నేటికీ కొనసాగుతున్నారని ఆయన గుర్తు చేశారు.

ఇద్దరు మావోయిస్టుల ఎన్‌కౌంటర్



దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా కుకనార్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టులు అమర్చిన ఐఈడీ బాంబ్ పేలి ఏఎస్పీ ఆకాశ్‌రావు మృతి అనంతరం.. భద్రతా బలగాలు భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో కుకనార్ పోలీస్ స్టేషన్ పరిధి అటవీ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులు ఎదురుపడగా.. ఇరువర్గాల మధ్య భీకర కాల్పులు జరిగాయి. అనంతరం ఆ ప్రాంతంలో గాలించగా ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలతో పాటు ఆయుధాలు, సామగ్రి లభించాయని పోలీసులు తెలిపారు.

ఆకలి తీర్చే అక్షయపాత్ర



భక్తుల కోరిక తీర్చడమే కాదు.. తన దర్శనానికి వచ్చినప్పుడు ఆకలి కూడా తీరుస్తున్నాడు జగత్‌కల్యాణ చక్రవర్తి..తిరుమల వేంకటేశ్వరుడు.. ఆ దేవదేవుడే ఆదేశించినట్లుగా ప్రతిరోజు తిరుమలలో అన్నప్రసాదవితరణ మహాయజ్ఞంలా సాగుతోంది....

- తిరుమలలో నిరంతరంగా సాగుతున్న టీటీడీ అన్నప్రసాద వితరణ...
- దాత రూ.44 లక్షలు విరాళమిస్తే రోజంతా అన్నప్రసాదాల పంపిణీ
- తిరుమల వెంగమాంబ సత్రంలో డిస్‌ప్లే బోర్డులో పేరు ప్రదర్శన
- రోజుకు 2.5 లక్షల మందికి వితరణ చేస్తున్న టీటీడీ

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు టీటీడీ నిరంతర యజ్ఞంగా అన్నప్రసాద వితరణ ఉచితంగా చేస్తోంది. 1985, ఏప్రిల్ 6న శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదానం పథకాన్ని అప్పటి ముఖ్యమంత్రి శ్రీ నందమూరి తారకరామారావు చేతులమీదుగా టీటీడీ ప్రారంభించింది. తదుపరి 1994, ఏప్రిల్ 1న శ్రీవేంకటేశ్వర నిత్యాన్నదానం ట్రస్టుగా, తర్వాత దీనిని శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుగా నామకరణం చేశారు. మొదటగా తిరుమలలో కల్యాణకట్ట ఎదురుగా గల పాత అన్నదానం కాంప్లెక్స్‌లో అన్నదానం జరిగేది. ఇప్పటి వరకు శ్రీ వైంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్‌కు దాతలు దాదాపు రూ. 2,190 కోట్ల విరాళాలను అందించారు. ఎందరో దాతలు ఇచ్చిన నిధులతో నిర్విరామంగా అన్నప్రసాద వితరణ సాగుతోంది. వ్యక్తిగతంగా దాతల పుట్టిన రోజు, దాతల కుటుంబ సభ్యుల పేర్లతో, దాతల ట్రస్ట్ లు, కంపెనీల పేరుతో రూ.44 లక్షలు అందించవచ్చు. శ్రీవారి పుట్టిన రోజు అయిన శ్రవణా నక్షత్రం, శ్రీ పద్మావతీ అమ్మవారి పుట్టిన రోజు అయిన ఉత్తరషాడ నక్షత్రం, పంచమితీర్థం, వైకుంఠ ఏకాదశి, శ్రీవారి, శ్రీపద్మావతీ అమ్మవారి ప్రత్యేక రోజుల్లో కూడా దాతలు విరాళంగా అందించవచ్చు.

భక్తుల నుంచి విశేష ఆదరణ

దాతలు రూ.44 లక్షలు అన్నప్రసాద వితరణకు విరాళం అందిస్తే, ఆ రోజంతా తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్–1లోని 20, వైకుంఠం క్యూ కాంప్లెక్స్– 2లోని 31 కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరిలోని 9 కంపార్ట్‌మెంట్లు, ఏటీసీ, ఎంబీసీ, టీబీసీ, పీఏసీ– 2, పీఏసీ – 4 కేంద్రాలు, శిలాతోరణం, కృష్ణతేజ వరకు బయటి క్యూలైన్లు, తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం కాంప్లెక్సులు, శ్రీగోవిందరాజ స్వామి ఆలయ అన్నప్రసాదరణ వితరణ కేంద్రం, రుయా ఆస్పత్రి, స్విమ్స్, మెటర్నిటి ఆస్పత్రి, బర్డ్, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి, తిరుచానూరులోని అన్నప్రసాద భవనం, ఒంటిమిట్టలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ చేస్తారు. ప్రతి రోజూ టీటీడీలో అన్నప్రసాదాల తయారీ, పంపిణీకి సుమారు పలువురు ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. అన్నప్రసాదాలు విభాగంలో పలువురు శ్రీవారి సేవకులు సేవలు అందిస్తున్నారు. తద్వారా భక్తులు నుంచి టీటీడీ అన్నప్రసాదం విభాగం విశేష ఆదరణ పొందుతోంది.



దాతలు స్వయంగా అన్న ప్రసాదం వడ్డించే అవకాశం

రూ. 44 లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులు ప్రత్యేకంగా అన్నప్రసాదాలు వడ్డించే అవకాశాన్ని టీటీడీ కల్పించింది. విరాళం అందించే దాతల పేరును తిరుమల వెంగమాంబ అన్నప్రసాద భవనంలోని డిస్ ప్లే బోర్డులో ప్రదర్శిస్తారు.



అదేవిధంగా ఒకరోజు అన్నప్రసాదాలను వడ్డిస్తారు. ఒక రోజు పూర్తిగా అన్నప్రసాద వితరణ రూ.44 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఉదయం అల్పాహారం కోసం రూ.10 లక్షలు, మధ్యాహ్నం భోజనం కోసం రూ.17 లక్షలు, రాత్రి భోజనం కోసం రూ.17 లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు అందిస్తారు. తిరుమల, తిరుపతి, ఒంటిమిట్టలోని టీటీడీ అన్నప్రసాదాలు వితరణ కేంద్రాల నుండి రోజుకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రికి సుమారు 2.5 లక్షల మంది భక్తులు అన్నప్రసాదాలను స్వీకరిస్తున్నారు.

పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులకు అంతర్రాష్ట్ర చార్జీలు మినహాయింపు



- 2028 జూన్ 30 లోపు ప్రారంభించే ప్రాజెక్టులకు వర్తించేలా గడువు పొడిగించిన కేంద్రం
- హైడ్రో పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టులకు ప్రయోజనం
- ఇదే ప్రయోజనంతో సెకీతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒప్పందం
- సెకీ విద్యుత్‌ను తీసుకోని కూటమి సర్కారు

సాక్షి, అమరావతి: పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు అంతర్రాష్ట్ర ప్రసార వ్యవస్థ (ఐఎస్‌టీఎస్) ఛార్జీల మినహాయింపును కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ మరో మూడేళ్లు పొడిగించింది. 2028 జూన్ 30 లోపు ప్రారంభించే హైడ్రో పంప్డ్ స్టోరేజ్ (పీఎస్పీ), బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) తదితర ప్రాజెక్టులకు ఈ ప్రయోజనం చేకూరుతుందని వెల్లడించింది. ఈ వెసులుబాటు వల్ల ప్రాజెక్టు ఖర్చు తగ్గుతుందని వెల్లడించింది. పవర్ గ్రిడ్ స్థిరత్వం, సమర్థవంత నిర్వహణకు ఆర్ఈ ప్రాజెక్టులు ఉపయోగపడతాయని తెలిపింది. తమ ఆదేశాలకు అనుగుణంగా లీగల్ టీమ్‌లు విద్యుత్ కొనుగోలు ఒప్పందా (పీపీఏ)లను రూపొందించుకోవాలని కేంద్రం సూచించింది.

'ఐఎస్‌టీఎస్' వెలుసుబాటుతో గతంలోనే ఒప్పందాలు

వ్యవసాయానికి పగటి పూట 9 గంటలు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో పాటు సామాన్య ప్రజలు, పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను అందించే లక్ష్యంతో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల స్థాపనకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అదే సమయంలో పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహించడం కోసం 2021 జనవరిలో కేంద్రం ఐఎస్‌టీఎస్ చార్జీలను పూర్తిగా మాఫీ చేసింది. అనంతరం ఐఎస్‌టీఎస్ చార్జీల మినహాయింపుతో యూనిట్ కేవలం రూ.2.49కే 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్‌ను అందిస్తామంటూ 2021 సెప్టెంబర్ 15న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) రాష్ట్రానికి లేఖ రాసింది. దీనిపై లోతుగా అధ్యయనం చేసిన తరువాత 2021 డిసెంబర్ 1న సెకీతో రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సరఫరా ఒప్పందం కుదుర్చుకుంది. కానీ ఇప్పటి వరకూ కూటమి ప్రభుత్వం సెకీ విద్యుత్‌ను తీసుకోలేదు. పైగా ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తిస్తాయంటూ టీడీపీ, దాని అనుబంధ ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయి. దేశంలోనే అత్యధికంగా 44.79 గిగావాట్ల పునరుత్పాదక సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ (పీఎస్‌పీ) ప్రాజెక్టుల ఏర్పాటుకు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందడుగు వేసింది. వివిధ జిల్లాల్లో ఉండే నీటి వనరులను ఉపయోగించుకొని పంప్డ్ హైడ్రో స్టోరేజీ, సౌర, పవన విద్యుత్‌ల కలయికగా ఈ అధునాతన ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది. ఇందులో 33,240 మెగావాట్లకు సంబంధించి 29 ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టులకు ఫీజిబులిటీ అధ్యయనం చేసి, 20,900 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన ప్రాజెక్టులకు డీపీఆర్‌లు కూడా పూర్తి చేసింది. ఇందులో 16,180 మెగావాట్ల ఉత్పత్తికి వివిధ కంపెనీలకు అనుమతులు కూడా ఇచ్చింది. వీటిని కూడా కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. ఈ మూడేళ్లలోనైనా ఈ ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం పట్టాలెక్కిస్తే అంతర్రాష్ట్ర ప్రసార చార్జీల నుంచి మినహాయింపు పొంది, రాష్ట్రానికి ప్రయోజనం కలుగుతుంది.

ఢిల్లీలో బాబు డాబు

ఏడాదిలో 20 సార్లు దేశ రాజధానికి సీఎం-అభివృద్ధి పేరుతో అప్పులు అడగడానికే..!

- పోలవరం ఎత్తు తగ్గింపుపై మౌనం
- మిర్చి రైతుకు మద్దతు ధర ఇప్పించడంలో విఫలం

సాక్షి, న్యూఢిల్లీ: సరిగ్గా ఏడాది కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 20 సార్లు ఢిల్లీకి వచ్చారు. ప్రతిసారీ అభివృద్ధే అజెండా అంటూ ప్రచారం చేసుకుంటున్నా... కొత్త అప్పులకు మద్దతు కోరడమే లక్ష్యంగా ఆయన పర్యటనలు సాగాయి. ఈ మేరకు కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ పెద్దలను కలుస్తూ వచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిని ధ్వంసం చేసిందని విమర్శిస్తూ... ఆ వంకతో కేంద్రం మద్దతుతో రూ.కోట్లు అప్పులు తెచ్చారు. అమరావతి పేరుతో ఇప్పటివరకు రూ.31 వేల కోట్లు తీసుకోవడం గమనార్హం. ప్రపంచ బ్యాంక్, ఏడీబీ నుంచి రూ.15 వేల కోట్లు పొందారు. ఇవి కాక బడ్జెటేతర అప్పులు రూ.19,410 కోట్లు. ఏడాదిలో భారీగా అప్పు చేయడంలోనే చంద్రబాబు తన మార్క్ చూపారు. ఇకప్రతిసారీ చంద్రబాబు ప్రత్యేక విమానంలోనే ఢిల్లీ వచ్చారు. దాదాపు 15–17 సార్లు రెండు రోజుల పాటు మకాం వేశారు. ఐదుసార్లు ప్రధాని మోదీని, ఆరుసార్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షాను, ఐదుసార్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. పోలవరం ఎత్తు 41.15 మీటర్లకు తగ్గిస్తున్నట్లు కేంద్రం పేర్కొన్నా.. చంద్రబాబు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ఎన్డీఏ నేతలు ఎవరూ నోరు మెదపలేదు. పైగా దీనిని వ్యతిరేకించిన వైఎస్సార్‌సీపీ ఎంపీలపై కూటమి ఎంపీలు పార్లమెంట్‌లో వ్యక్తిగత దూషణలకు దిగారు. ఎత్తు తగ్గిస్తున్నట్లు కేంద్రం స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొందని మీడియా ప్రశ్నించినా... కూటమి నేతల నుంచి సమాధానం రాలేదు.

- మిర్చి రైతులకు మద్దతు ధర కల్పించడంలోనూ చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారు. ఈ విషయంలో ఒక్కోసారి ఒక్కోలా స్పందించారు. క్వింటాకు రూ.11,600 ఇవ్వాలని కేంద్రాన్ని కోరగా... రూ.10,025 కంటే రూపాయి కూడా ఎక్కువ ఇచ్చేది లేదని కేంద్రానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) తేల్చి చెప్పింది. అయినా మిర్చికి మద్దతు ధర లభించిందని, కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నారు. ఏపీలో రేటు పెంచితే దేశం మొత్తం పెంచాల్సి వస్తుందని కేంద్రం చెప్పడంతో... చంద్రబాబు మళ్లీ ఈ విషయం ప్రస్తావించకపోవడం గమనార్హం. ఈ దోబూచులాటల కారణంగా మిర్చి రైతులకు రూ.8,827 కోట్లు నష్టం వాటిల్లింది.
- సంపద సృష్టిస్తానంటూ ఎన్నికల సమయంలో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆపై యూటర్న్ తీసుకున్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన సీఐఐ సదస్సులో పారిశ్రామికవేత్తల ద్వారానే సంపద సృష్టి జరుగుతుందని, వారు పెట్టుబడులు పెడితే తద్వారా వచ్చిన ఆదాయంతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించొచ్చు అని చెప్పుకొచ్చారు.

రబీకి 'తుంగభద్ర' గేట్ల మార్పు ఎఫెక్ట్!

కర్నూలు సిటీ: కర్నూలు జిల్లా రబీ పంటపై తుంగభద్ర గేట్ల మార్పు ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది. రాయలసీమ జిల్లాల తాగు, సాగునీటి అవసరాలకు తుంగభద్ర జలాలే ఆధారం. కర్ణాటక, తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర డ్యామ్. ఇందులోకి నీటి ప్రవాహం గత రెండో వారం నుంచే కొనసాగుతోంది. దీంతో బుధవారం ఈ నీటి సంవత్సరంలో వచ్చే నీటిని అంచనా వేసి నీటి కేటాయింపులపై చర్చించేందుకు ఎస్ఈల సమావేశం జరిగింది. గతేడాది తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోవడంతో ఆ గేటు స్థానంలో కొత్త గేటు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటు ఆ డ్యామ్ గేట్లన్నీ మార్చి కొత్త గేట్లు ఏర్పాటు చేయాలని రూ.58 కోట్లతో అంచనాలు వేసి, టెండర్లు ఖరారు చేశారు. డ్యామ్‌లో నీటి నిల్వలు 41 టీఎంసీల దిగువకు చేరిన తరువాతే గేట్ల ఏర్పాటుకు అవకాశం ఉంటుందని నిపుణులు ఇచ్చిన సలహా మేరకు ఖరీఫ్‌లో సాగు చేసే పంటలకు మాత్రమే నీటిని ఇవ్వాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు తాగు నీటి అవసరాలకు మాత్రమే నీటిని విడుదల చేసి, కొత్త గేట్లు ఏర్పాటు చేసే పనులు చేసేందుకు తీసుకున్న నిర్ణయంతో రబీకి సంబంధించి ఆయకట్టు రైతుల్లో ఆందోళన రాకుండా వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నారు. దీనిపై జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ, కర్నూలు జిల్లాలో ఖరీఫ్ కంటే రబీలో ఎల్ఎల్‌సీ పరిధిలో ఆయకట్టు ఎక్కువగా ఉందని, తాజాగా తీసుకుంటున్న నిర్ణయంతో తమ ప్రాంత రైతులు నష్టపోయే అవకాశం ఉందని సమావేశం దృష్టికి తీసుకు వెళ్లారు. తుంగభద్ర దిగువ కాలువకు వాస్తవంగా 24 టీఎంసీలకు గాను, ప్రస్తుతం 13.585 టీఎంసీలు, కేసీ కెనాల్‌కు డ్యాం నిల్వ నీటిలో నుంచి కేటాయించిన 10 టీఎంసీలకు గాను, 5.660 టీఎంసీల నీటిని కేటాయించారు.

నాలా చట్టం రద్దుకు విధివిధానాలు రూపొందించాలి

అధికారులకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల ఆదేశం



సాక్షి, అమరావతి: వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్పిడి చేసుకునేందుకు ఉద్దేశించిన ఏపీ అగ్రికల్చర్ ల్యాండ్ (కన్వర్షన్ ఆఫ్ నాన్ అగ్రికల్చరల్ పర్పస్) యాక్ట్ 2006ను రద్దు చేసేందుకు విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు రాష్ట్ర మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. రెవెన్యూ శాఖలో సంస్కరణల కోసం ఆరుగురు మంత్రులతో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో మంత్రి అనగాని అధ్యక్షతన జరిగింది. పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ నాలా చట్టం వల్ల వ్యవసాయేతర అవసరాలకు భూములను మార్పిడి చేసుకునేందుకు పలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉందన్నారు. నాలాను రద్దు చేసి ప్రజలు పన్ను కడితే ఆటోమేటిక్‌గా భూ మార్పిడి జరిగేలా ముసాయిదా విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఏదైనా మున్సిపాల్టీలో వెంచర్ వేస్తే వారికి భూ మార్పిడి ఎలా చేయాలి, ఎవరైనా పరిశ్రమ పెడితే వారికి భూమార్పిడి అత్యంత సులభంగా, కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఎలా చేయాలో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ నాలా పన్ను ఎక్కువగా ఉందని పలు సంఘాల నుంచి అభ్యంతరాలు వచ్చాయని, దాన్ని ఎంతమేర తగ్గించవచ్చో ప్రతిపాదనలు ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు.

ఇండోసోల్, బీపీసీఎల్ పూర్తికి పీఐయూ ఏర్పాటు

సాక్షి, అమరావతి: రామాయపట్నం వద్ద సోలార్ మాడ్యూల్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్న ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్, ఆయిల్ రిఫైనరీ యూనిట్ ఏర్పాటు చేస్తున్న భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్) ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడానికి ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ) పేరుతో కమిటీని ఏర్పాటు చేస్తూ సీఎస్ ఉత్తర్వులిచ్చారు. పరిశ్రమల శాఖ కమిషనర్/డైరెక్టర్ చైర్‌పర్సన్‌గా ఉండే ఈ పీఎంయూలో ఏపీఐఐసీ ఈడీ, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో, నెల్లూరు జిల్లా కలెక్టర్లతో పాటు ఉన్నతాధికారులు సభ్యులుగా ఉన్నారు. పరిశ్రమల శాఖ పెట్టుబడులు, ప్రోత్సాహకాల జేడీ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.



పాండవులు పూజించిన పుణ్యక్షేత్రమిది. సాక్షాత్తూ పార్వతీ పరమేశ్వరుల పాదధూళి పడిన పావన తీర్థమిది. సురపతి అయిన ఇంద్రుడు సందర్శించిన ఆలయమిది. అదే మురుడేశ్వర్. ఇక్కడ కొలువైన స్వామికి మురుడేశ్వరుడని పేరు. ఈ స్వామిని పూజించడం వల్ల తమ కోరికలన్నీ నెరవేరతాయని భక్తుల విశ్వాసం. అందుకే ఇక్కడికి దేశంలోని అన్ని ప్రాంతాలనుంచి భక్తులు వచ్చి పూజిస్తుంటారు. అతి ప్రాచీన క్షేత్రమైన ఈ పుణ్యస్థలి ఉన్నది కర్ణాటకలోని ఉత్తర కన్నడ జిల్లా బత్కల్ తాలూకాలో.




ఎలా వెళ్లాలంటే..?

గోకర్ణం నుంచి మురుడేశ్వరం సుమారు 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. మురుడేశ్వరం 17వ నంబరు జాతీయ రహదారిలో ఉండటం వల్ల రవాణా సౌకర్యాలు బాగానే ఉన్నాయి. బెంగళూరు, మంగుళూరు, హుబ్లీ, ధర్మస్థల నగరాలనుంచి బస్సులున్నాయి. నేరుగా రైలు సౌకర్యం కూడా ఉంది.

భోజన, వసతి: ఇక్కడ యాత్రికులు ఉండటానికి వసతి గృహాలు, హోటళ్లు ఉన్నాయి.





• పుణ్యస్థలి

మురుడేశ్వర్

కోరికలు తీర్చే పావన క్షేత్రం

రావణాసురుడు తన అనన్యసామాన్యమైన భక్తితో శివుని మెప్పించి, కైలాసం నుంచి ఆయన ఆత్మలింగాన్ని తీసుకుని వస్తుంటాడు. రావణాసురుడి చేతికి శివుడి ఆత్మలింగం చిక్కితే, అతను దాన్ని లంకలో ప్రతిష్ఠిస్తే ఇక రావణుని అకృత్యాలకు అడ్డుకట్ట వేయగలవారే ఉండరనే ఉద్దేశ్యంతో దేవతల కోరికమేరకు వినాయకుడు ఒక పిల్లవాడి రూపంలో వస్తాడు. సాయంత్రం వేళ సంధ్యావందనం చేయడం కోసం ఆత్మలింగాన్ని ఎవరికి అప్పగించాలా అని ఆలోచిస్తూ ఉంటాడు రావణుడు, ఆత్మలింగాన్ని తన చేతిలో పెట్టే ముందు దానిని మార్గమధ్యంలో భూమిమీద ఎక్కడా ఉంచకూడదని శివుడు చెప్పిన విషయాన్ని గుర్తు తెచ్చుకున్న రావణుడి కంట పడతాడు బ్రాహ్మణ బాలుడి వేషంలో ఉన్న గణపతి. కాసేపు శివలింగాన్ని చేతితో పట్టుకుని ఉంటే, తాను స్నానసంధ్యలు ముగించుకుని వస్తానని చెప్పి వెళతాడు రావణుడు. పథకం ప్రకారం, రావణుడు వచ్చేలోగా శివలింగాన్ని నేలమీద పెట్టేస్తాడా బాలుడు. ఇంకేముంది, శివలింగం భూమిలో దిగబడిపోతుంది. రావణుడు ఎంత ప్రయత్నించినా బయటకు రాదు. అప్పుడు రావణుడు ఆగ్రహంతో ఆత్మలింగానికి కప్పి ఉన్న వస్త్రం, దారం తదితర వస్తువులను విసిరి పారేస్తాడు. ఆ వస్తువులు ఎక్కడెక్కడ పడ్డాయో, అక్కడ శివలింగాలు ఉద్భవించి, ఆ ప్రదేశాలు మహిమాన్విత ప్రదేశాలుగా మారిపోయాయి. అవే, గోకర్ణక్షేత్రానికి దగ్గరలో ఉన్న సజ్జేశ్వర, గుణవంతేశ్వర, మురుడేశ్వర, ధారేశ్వర లింగాలు. ఈ క్షేత్రాలన్నీ



కలిపి పంచక్షేత్రాలుగా ప్రసిద్ధి చెందాయి. ఆత్మలింగం మీద ఉన్న వస్త్రాన్ని రావణాసురుడు విసిరేస్తే, ఆ వస్త్రం పడిన ప్రదేశమే మురుడేశ్వరమయింది. మురుడ అంటే కన్నడంలో వస్త్రం అని అర్థం. సంతోషం అనే అర్థం కూడా ఉంది. అందరికీ సంతోషాన్ని ఇచ్చే ప్రదేశం కాబట్టి ఇది మురుడేశ్వరక్షేత్రమయిందని అంటారు. మురుడేశ్వరంలో ఉద్భవించిన శివలింగానికి పానవట్టాన్ని దేవశిల్పి విశ్వకర్మను రప్పించి, శివుడే స్వయంగా దగ్గరుండి తయారు చేయించాడని ప్రతీతి.

ఈ క్షేత్రానికి ఉత్తరాన భవానీమాత, తూర్పున దుర్గామాత, ఇతర దేవతలందరూ మిగిలిన దిక్కులలో ఉండి పరిరక్షిస్తూ ఉంటారని, బ్రహ్మదేవుడు కూడా ఇక్కడికి వచ్చి మురుడేశ్వరుడిని పూలు, పత్రాలతో పూజించి, పండ్లను నివేదించి వెళుతుంటాడని, బ్రహ్మదేవుడు శివుడిపై తన కమండలంతో చిలకరించిన నీటితో కమండల తీర్థం అనే పవిత్ర సరస్సు ఏర్పడిందనీ స్థలపురాణం చెబుతోంది. .

అనితర సాధ్యమైన శిల్పసౌందర్యం...

మురుడేశ్వర దేవాలయం ఆ కాలంలో దేవాలయ నిర్మాణంలో పవిత్రతకు, అద్భుత శిల్పసౌందర్యానికి నిదర్శనం. మురుడేశ్వర దేవాలయం ఆవరణంలో కనిపించే శివుని ఎత్తైన పాలరాతి విగ్రహం అందరినీ ఆశ్చర్య చకితులను చేస్తుంది. 123 అడుగుల ఎత్తున్న ఈ విగ్రహాన్ని నిర్మించడానికి రెండేళ్ల పట్టిందట. 20 అంతస్తులతో కూడిన ఆలయ గాలిగోపురం సుమారు 250 అడుగుల ఎత్తులో ఉంటుంది. గాలిగోపురానికి ఇరుపక్కలా గల ఏనుగు ప్రతిమలు సజీవ శిల్పాల్లా కనిపిస్తాయి.


తీర్థేశ్వరం కూడా...

మురుడేశ్వరంలో పవిత్ర స్నానాలు చేయడానికి బ్రహ్మ తీర్థం, కమండల తీర్థం, అగ్నితీర్థం, భీమతీర్థం, దేవతీర్థం అనే ముఖ్యమైన తీర్థాలున్నాయి. ఈ తీర్థాలలో స్నానం చేయడం వల్ల దీర్ఘవ్యాధులు నశిస్తాయని, కోరిన కోరికలు నెరవేరతాయనీ అంటారు.

ఆలయ ప్రాంగణంలోనే ఇతర దేవతల సన్నిధులు కూడా ఉన్నాయి. వాటిలో గణపతి మందిరం, గౌరీమందిరం, దత్తాత్రేయ, సుబ్రహ్మణ్య, ఆంజనేయ మందిరాలు ముఖ్యమైనవి. ఆలయం ఆవరణలో ఉన్న రావిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి, తమ కోరికలను నెరవేర్చమని భక్తులు ముడుపులు కడుతుంటారు.

– డి.వి.ఆర్. భాస్కర్

• ఇస్లాం వెలుగు



అది దైవ నిర్ణయమే!

పూర్వం ఒక ఊళ్ళో పెద్దవ్యాపారి ఉండేవాడు. గొప్ప ధనవంతుడు, చాలా మంచివాడు. అతనికి ఒక కూతురు ఉండేది. అల్లారుముద్దుగా పెంచి పెద్దచేశాడు. తన స్నేహితుని కొడుకుకే ఇచ్చి పెళ్ళి చేశాడు. వాళ్ళదికూడా చాలా పెద్దవ్యాపారమే. వారసత్వంగా వచ్చిన ఆస్తిపాస్తులతోపాటు, వ్యాపారంలో అల్లుడు కూడా బాగానే సంపాదించాడు. అల్లుడు, బిడ్డ వేరే ఊర్లో వ్యాపారం చేసుకుంటూ సంతోషంగా జీవితం గడుపుతున్నారు.

కాని రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. బళ్ళు ఓడలవుతాయి, ఓడలు బళ్ళవుతాయి. అల్లుడి వ్యాపారంలో తీవ్రమైన నష్టాలు సంభవించాయి. ఆస్తులన్నీ కరిగిపోయ్యాయి. చివరికి కుటుంబ పోషణ కూడా భారంగా మారిపోయింది. ఒక్కోసారి పస్తులు కూడా గడపాల్సిన దుర్దినాలు దాపురించాయి. అయినా ఆత్మాభిమానంతో అలానే నెట్టుకొస్తున్నాడు. ఈ విషయం మామగారికి తెలిసి ఒకటి రెండుకాదు, చాలాసార్లు ఆదుకున్నాడు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. చివరికి ఎవరి అదృష్టంలో ఎలా ఉంటే అలానే జరుగుతుందని అతను కూడా చూసీచూడనట్లు వదిలేశాడు. బాగా బతికిన తనబిడ్డపరిస్థితిని తలుచుకొని తల్లి చాలా బాధపడేది. కాని ఎలా జరిగేది అలానే జరుగుతుందని, బాధపడి చేసేదేమీ లేదని భర్త ఊరడించేవాడు. ఎంతైనా తల్లి మనసు కదా..

ఒకసారి భర్త ఊరిలో లేని సమయంలో బిడ్డను, అల్లుడిని విందుకు ఆహ్వానించింది. రకరకాల, రుచికరమైన పదార్థాలు వండిపెట్టింది. వెళ్ళేటప్పుడు సున్నిఉండలు తయారు చేసి, వాటిని గాజుసీసాలో పేర్చి మధ్యలో కొన్ని బంగారునాణాలు పెట్టి బిడ్డకు ఇచ్చింది. ఇంటికి వెళ్ళినతరువాత తినమని. అయితే ఆ సున్ని ఉండలు అమ్మితే ఎంతో కొంత పైకమొస్తుంది, దేనికో ఒకదానికి ఉపయోగపడుతుందని ఆ సున్నుండల సీసాను ఓ మిఠాయిదుకాణంలో అమ్మేసి పైకం తీసుకొని వెళ్ళిపోయారా దంపతులు. అదేరోజు ఊరినుండి తిరిగొస్తున్న భర్త, ఇంటికి మిఠాయిలు తీసుకెళదామనే ఉద్దేశ్యంతో నేరుగా ఆ మిఠాయి దుకాణానికి వెళ్ళి సున్నుండలు కొనుగోలు చేశాడు. యాదృచ్ఛికంగా దుకాణదారు కూడా అదే సున్నుండల సీసాను అతనికి ఇచ్చాడు. భర్త తెచ్చిన సున్నుండల సీసా చూసి అతని భార్య అవాక్కయింది. తరువాత జరిగిన విషయమంతా భర్తకు వివరించింది. అప్పుడు భర్త, 'ఎవరికి ఏది ప్రాప్తమో అది వారికి తప్పక లభించి తీరుతుంది. అది అల్లాహ్ నిర్ణయం. దాన్నెవరూ మార్చలేరు. ఈ నాణాలు అటు మన అల్లుడు, బిడ్డవాళ్ళ అదృష్టంలోనూ లేవు. ఇటు మిఠాయి కొట్టువాడి అదృష్టంలోనూ లేవు. మన అదృష్టంలో మాత్రమే ఉన్నాయి. అందుకే అవి ఎటూ వెళ్ళకుండా నేరుగా మనచేతికే వచ్చాయి. మనం అనుకున్నట్లు ఏదీ జరగదు. అంతా ఆయన నిర్ణయమే' అన్నాడు. అంటే, ఎవరికి ఏది ప్రాప్తమో అది తప్పకుండా వారికే లభించి తీరుతుందన్నమాట.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

ఏ సమయంలో ఏ దేవుణ్ణి పూజించాలి?



సూర్య భగవానుని 4.30 నుంచి ఆరులోగా పూజించాలి. ఈ సమయంలో పూజ శ్రీ రామునికి, శ్రీ వెంకటేశ్వరునికి కూడా ప్రీతి. ఆరు నుంచి ఏడున్నర వరకు మహాశివుని, దుర్గను పూజించిన మంచి ఫలం కలుగుతుంది. మధ్యాహ్నం పన్నెండు గంటలప్పుడు శ్రీ ఆంజనేయస్వామిని పూజించిన హనుమ కృపకు మరింత పాత్రులగుదురు. రాహువును సాయంత్రం మూడుగంటలకు పూజించిన మంచి ఫలితం కలుగుతుంది. సాయంత్రం ఆరు గంటల సమయాన అనగా సూర్యాస్తమయమున శివపూజకు దివ్యమైన వేళ. రాత్రి ఆరు నుంచి తొమ్మిదివరకు లక్ష్మీదేవిని పూజించిన ఆమె కరుణా కటాక్షాలు లభిస్తాయి. తెల్లవారు జామున మూడు గంటలకు శ్రీమహావిష్ణువును పూజిస్తే వైకుంఠవాసుడి దయ అపారంగా ప్రసరిస్తుంది.

మణిపుర చక్రం



గతవారం మొదటి రెండుపొరల గురించి చెప్పుకున్నాం కదా.. ఈ వారం మూడవ చక్రం నాభి లేదా మణిపుర చక్రం గురించి...

మీరు మంచి ఆహారాన్ని తిన్నపుడు మీకు కలిగే ఆనందం వర్ణనాతీతం. ఆకలితో ఉన్నట్లైతే మీరు ధ్యానంలో కూడా సరిగా కూర్చోలేరు, ఆనందించలేరు. భగవంతుడు మీ ఎదురుగా ఉన్నా కూడా ''ఓ దేవుడా! మొదటగా నా కడుపు నింపు. నేను నీతో తర్వాత మాట్లాడతాను'' అని అంటారు. ఆకలితో ఉన్నప్పుడు మనం ఆహారాన్ని తింటున్నప్పుడు కలిగే ఆనందాన్ని వర్ణించలేం. నాభి ఈ ఆనందం కూడా చాలా తాత్కాలికం. అలా సంపూర్ణంగా ఆనందించగలిగితే మీరు మరల మరల కావాలని కోరుకోరు. దానిని అధిగమించడానికి సంతృప్తి ఒక్కటే మార్గం. రెండు ముద్దలు తిన్నా సరే మీరు సంతృప్తి చెందాలి. సంతృప్తితో ఉండటమే మీరు నాభి చక్రాన్ని సరిచేసుకునే మార్గం. మీ వస్తుసంబంధమైన కోరికలకు అంతులేదు. ఎన్ని వస్తువులు ఉన్నా కానీ ఇంకా కావాలనుకుంటారు. కానీ దేనినీ ఆనందించలేరు.. దాని వల్ల నాభి చక్రం అలజడికి లోనవుతుంది. దీనిని అరికట్టే మార్గం నాభి చక్రం సంతృప్తి. ప్రతి విషయంలోనూ మీరు సంతృప్తిని కలిగి ఉండాలి. కాబట్టి ఆనందించడానికి సంతృప్తి ఒకటే మార్గం. ఇది నిత్య ధ్యానసాధన ద్వారా మనలో శ్రీ లక్ష్మీనారాయణ శక్తిని జాగృతి చేసుకోగలగడం ద్వారా సాధ్య పడుతుంది.

సంతృప్తి అనేది ఆత్మ సాక్షాత్కారం లేకుండా సాధ్యం కాదు. కాబట్టి ఆత్మసాక్షాత్కారం పొందకుండా మీరు సంతృప్తిని కలిగి ఉండాలని చెపితే అది ఏదో ఒక ఉపదేశంలాగానే ఉంటుంది. కానీ ఆత్మ సాక్షాత్కారం పొందిన తరువాత మీ ఆత్మని ఏది సంతృప్తి పరుస్తుందో మీకు తెలుస్తుంది. కాబట్టి మీ ప్రాముఖ్యతలు మారతాయి.



శ్రీ మాతాజీ నిర్మలాదేవి

డా. పి. రాకేష్

(మన అంతర్గత సూక్ష్మ శరీర నాడీ వ్యవస్థ గురించి శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనం ఆధారంగా)

• బౌద్ధవాణి

ఆ గౌరవం అనుభవానికే..!



ఒక అడవిలో ఏనుగు, కోతి, తిత్తిరి పిట్ట స్నేహంగా జీవిస్తున్నాయి. ప్రతి రోజూ మూడూ ఒకచోట చేరి సాధక బాధలు చెప్పుకునేవి. తాము గడించిన అనుభవాలు పంచుకునేవి. ఒకరోజున వాటికి ఒక ఆలోచన వచ్చింది. మన ముగ్గురిలో జ్ఞానులు ఎవరు? పెద్ద ఎవరు? పెద్దవారు ఎవరైతే వారికి మిగిలిన ఇద్దరూ నమస్కరించాలి. గౌరవించాలి'' అని అనుకున్నాయి.

అప్పుడు ఏనుగు– ''మీ ఇద్దరికంటే నేనే పెద్దను. గౌరవనీయుడను. ఎందుకంటే ఇదిగో ఈ మర్రిచెట్టు ఇప్పుడు మహావృక్షంగా ఉంది. కానీ ఈ చెట్టు చిన్న మొక్కగా ఉన్నప్పుడే నాకు తెలుసు. నేను ఆ మొక్క మీదినుండి నడిచిపోయేవాణ్ణి. అప్పుడు దాని చివరి కొమ్మలు నా పొట్టకు తాకుతూ ఉండేవి''అని చెప్పింది.

ఆ మాటలు విన్న కోతి– ''ఓ! మిత్రమా! అలాగా! ఐతే విను. ఈ చెట్టు చిన్న మొక్కగా ఉన్నప్పటినుంచే నాకు తెలుసు. నేను కూర్చొని దీని చిగుర్లు తినేదాన్ని. కాబట్టి నేనే పెద్దను. నన్నే గౌరవించాలి''అంది. ఆ రెండింటి మాటలు విన్న తిత్తిరి పిట్ట నవ్వుతూ– ''మిత్రులారా! ఈ చెట్టుకు తల్లి వృక్షం నదీతీరం ఆవల గట్టున ఉంది. దాని కాయలు తిని, ఇటుగా వచ్చి ఇక్కడ రెట్ట వేశాను. అందులోని విత్తనమే ఈ చెట్టుగా మొలిచింది'' అంది. మిగిలిన రెండూ ఆశ్చర్యపడి– ''మిత్రమా! మా ఇద్దరికీ ఈ ఒక్క చెట్టే తెలుసు. నీకు ఈ చెట్టు, దాని ముందరి తరం చెట్టూ తెలుసు. తరతరాల అనుభవం నీది. కాబట్టి నీవే గౌరవనీయుడవు''అని తిత్తిరికి నమస్కరించాయి.

బుద్ధుడీ కథ చెప్పి– ''భిక్షువులారా! పెద్దల్ని మనం అందుకే గౌరవించాలి. మనం వారికి ఇచ్చే గౌరవం వారి వయస్సుకే కాదు, అనుభవానికి'' అని చెప్పాడు.

– డా. బొర్రా గోవర్ధన్

• సువార్త

జూన్ 15న ఫాదర్స్ డే సందర్భంగా...

నాన్న నాయకత్వ పటిమ

'తండ్రి తన కుమారుల యెడల జాలి పడునట్లు యెహోవా తన యందు భయభక్తులు గలవారి యెడల జాలిపడును ' – కీర్తన 103:13.


తమ కుమారుల విషయమై భూసంబంధులు శరీర సంబంధులైన ఇహలోక తండ్రులు జాలి పడునట్లుగానే పరమందుండు నిత్యుడగు ఆత్మల తండ్రియైన యెహోవా దేవుడు కూడా జాలి పడుతున్నాడని దైవిక ఆత్మ ప్రేరేపణతో దావీదు ఈ సంకీర్తనలోని ఈ చరణాన్ని చాలా ఉన్నతంగా లిఖించాడు. తమ కుమారులను, కుమార్తెలను క్రీస్తువలె పరమ తండ్రి ప్రేమతో ప్రేమించే ఈ లోకపు శరీర సంబంధ నాన్నలు కుటుంబ వ్యవస్థలో గౌరవనీయులుగా గుర్తుండిపోతారు.

క్రీస్తు వివరించిన ఒక కథ రూపక ఉపమానం 'తప్పిపోయిన కుమారుడు'లో తండ్రి పాత్ర చాలా ఉన్నతంగా ఉంటుంది (లూకా 15:11–32). తండ్రి కంటె తనకు ఆస్తిపాస్తులే ముఖ్యమనుకొని దూర దేశానికి పోయిన కుమారుడు చివరకు తన తండ్రి ప్రేమను గుర్తించి పశ్చాత్తాపంతో ఏడ్చుకుంటూ ఇక ఏ దిక్కు లేక తన సొంత ఇంటికి తిరుగు ముఖం పడుతూ వస్తూ ఉంటాడు. 'వాడింక దూరంగా ఉన్నప్పుడు తండ్రి వానిని చూచి కనికరపడి, పరుగెత్తి వాని మెడమీదపడి ముద్దు పెట్టుకొనెను' అంటూ గ్రంథం వివరిస్తుంది.

ఇక్కడ నిన్ను క్షమించాను అనేది తండ్రి తన ప్రేమ ద్వారా ఉన్నతంగా వెలిబుచ్చాడు. తన భక్తులనే పిల్లలు తప్పులు చేయడం, దేవుడు ఉన్నత మనస్సుతో వారిని క్షమించడం అనేది తరచూ జరిగే ప్రక్రియ. పెద్దలు అనగా తండ్రులు తప్పులు చేస్తే అంతా వింతగా చెప్పుకుంటూ ఆలోచనల్లో పడతారు. పిల్లలు తప్పులు చేస్తే అది సహజంగానే చూస్తారు. దీంతో తండ్రులైన పెద్దలు వారిని క్షమించుటకు సిద్ధమనస్సుతో ఎప్పుడూ సంసిద్ధులై ఉంటారు. ఇదే దేవ స్వభావం. ఇది ఆది కాలం నుండి వస్తున్నదే. పిల్లల దృష్టిలో మా నాన్నలు తప్పుచేయరు అనేదే వారి ప్రగాఢ నమ్మకం.

ఒకప్పుడు ఒక తండ్రికి కుమారుడుగా ఉన్నప్పుడు నాన్నలు తప్పిదాలు, పొరపాట్లు చేసే ఉంటారు. తండ్రి స్థానానికి వచ్చాక ఆ స్థాయి... ఆ హోదాయే వేరు. దేవుడు సర్వ మానవాళికి తండ్రిగా ఉన్నాడని, ఆయన స్వభావంతో అట్టి స్ఫూర్తితో నడుచుకోవాలనే స్పృహ ఉన్నన్ని రోజులు తండ్రి బాధ్యతలు ఎంతో ఉన్నతంగా ఘనంగా ఉంటాయి. క్రీస్తు ఆ విస్తార జన సమూహాలను చూసి వారు కాపరి లేని గొర్రెలవలె విసిగి చెదరి ఉన్నందున వారి మీద కనికర పడ్డాడు (మత్త 9:36). నాన్నలకు ఇంటి పెద్ద, ఇంటి కాపరి, సంరక్షకుడు, యజమానుడు వంటి బిరుదులు కూడా ఉన్నాయి. క్రీస్తులో ఉండే ప్రేమ, క్షమాపణ వంటి గుణాలు నాన్నలలో కనిపిస్తుంటాయి.

నిజానికి ఇవి తండ్రియైన దేవుని సుగుణాలు. నిండు మనస్సుతో వాటిని ఆచరణలో చూపి చూపి ఆ లక్షణాలను అసాంతం తన సొంతం చేసుకోగలిగాడు క్రీస్తు. ప్రతి నాన్న ఈ స్థాయి ప్రేమను తమ పిల్లలకు అందించటం ద్వారా వారి భవిష్యత్తుకు సరైన బాటలు వేయగలుగుతారు. దేవా, ఇప్పుడే కాక ఎప్పుడూ నీకు నేను లోబడితేనే నా పిల్లలు నాకు లోబడతారు అంటూ ప్రార్థిస్తూ, ఇట్టి సాధారణ సత్యాన్ని మనస్సున పెట్టి ఎరిగిన నేటి నాన్నలు మరల కొత్తగా దేవునితో కొత్త ఒప్పందం చేసుకొని కొత్తగా పునర్వైభవ నాయకులు కాగలుగుతున్నారు. అప్పుడు అప్పుడెప్పుడో కాదు, ఇప్పుడు ప్రేమ, కనికరం, క్షమాపణ అనేవి నాయకత్వ పటిమకు మరెంతగానో ఉపకరించే లక్షణాలుగా గుర్తిస్తున్నారు. తమ పిల్లలకు సకాలంలో కావలసినవి ఇవే అంటున్నారు.



ప్రేమ, క్షమాపణ అనేవి గొప్ప నాయకత్వ లక్షణాలు. వీటితో ముడిపడిన ఉన్నత జీవితమే ప్రతి నాన్నది. అదెలాగంటే, దూర దేశానికి పోకుండానే నాన్న కళ్ళ ముందే అతని పరిసరాలలోనే అతని సమక్షంలో ఉంటూనే తప్పిపోయిన కుమారుల జీవిత ఉదంతాలు ఎన్నో ఎన్నెన్నో ఇప్పుడు. ఇక్కడ తప్పిపోవడం అంటే మంచి మార్గం నుండి వైదొలగడం. సత్ప్రవర్తన విడిచిపెట్టి చెడు స్నేహాల వైపు తిరగడం. ఇప్పుడైతే అది చాటున ఏ దూర దేశంలోనో చేసే పని కాదు. కుటుంబాన్నే ఏమార్చి ఇక్కడే చేయవచ్చు. తమ కన్న బిడ్డలు కుటుంబం పాలిట నిష్ప్రయోజకులుగా, సమాజానికి తలవంపులు తెచ్చే దుష్టులు, చీడ పురుగులుగా మారక ముందే నాన్నలు మేల్కొంటున్నారు. తమ పిల్లల మంచి భవిష్యత్తుకై దేవునికి మొరపెడుతున్నారు. మరింత జ్ఞానవంతులుగా నాన్నలు ఉండి వారు ఆత్మ సంబంధులు, ఆధ్యాత్మిక వాదులైతే తక్షణ మేలుకోరి ఉత్తమ సలహాల విషయమై తమ ఇహలోకపు తండ్రులను ఆశ్రయించడమే కాకుండా, పరమ తండ్రి పాదాలు విడువక గట్టిగా పట్టుకొని దావీదులా విలపించే వారుగా కూడా వారు ఉంటున్నారు. ఇలాంటి పిల్లలను ఇచ్చావేంటీ? తండ్రీ, నాయనా! అంటూ వాపోతూ దేవుని పాదాల ముందు విలపించినా కూడా నాన్నలు నాయకులుగా ఎప్పటికీ అగ్రగణ్యులే. వారంతా మహారాజులే. ఎందుకంటే వారు పరమ తండ్రి పాత్రను గుర్తుకు తెచ్చే స్థితిలో హుందాగా జాగరూకతతో వ్యవహరిస్తూ ఉంటున్నారు. ఇది పిల్లలు గుర్తిస్తే ఆ ఇంట ఇక ఏ సమస్యలు ఎన్నడూ తలెత్తవు.

విలువలతో కూడిన నాణ్యమైన ఎదుగుదలకు ఇవే తక్షణావసరం అన్నది ఎదిగిన నాన్నలలో ఉండే ఈ అరుదైన నాయకత్వ పటిమే. భవిష్యత్తు పట్ల భయాలు లేని దూరదృష్టి యోచనలతో భరోసా ఇచ్చే నాన్నలు తమ ప్రేమ పాలన పెంపకం పట్ల ఆశాభావం కలిగి పూర్తిస్థాయి ఆత్మవిశ్వాసంతో తొణకని బెణకని నాయకత్వ పటిమతోనే తమ కుమారులను, కుమార్తెలను ముందుకు నడిపించ గలుగుతున్నారు.

– జేతమ్

బిజినెస్ రీల్

లైఫ్‌స్టైల్ 'ఎండ్ ఆఫ్ సీజన్ సేల్' ప్రచార కార్యక్రమంలో తమన్నా

ముంబై: ఫ్యాషన్ డిజైన్ సంస్థ లైఫ్‌స్టైల్ ఎండ్ ఆఫ్ సీజన్ సేల్(ఈఓఎస్‌ఎస్) పేరుతో భారీ సేల్ ప్రకటించింది. ఇందులో భాగంగా అగ్రగామి ఫ్యాషన్ బ్రాండ్ల ఉత్పత్తులపై 50% తగ్గింపు అందిస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు ద్వారా కొనుగోలు చేస్తే 10% తక్షణ తగ్గింపు పొందవచ్చు. ఈ సీజన్ సేల్ ప్రచారం కోసం



సినీ నటి తమన్నా భాటియాతో ఒప్పందం కుదుర్చుకుంది. "ప్రతి ఒక్కరికి లేటెస్ట్ ఫ్యాషన్ బ్రాండ్లను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈఓఎస్‌ఎస్‌ను తీసుకొచ్చాము. తమన్నా ప్రచార చిత్రాల ద్వారా ఈ సేల్‌కు మరింత ఆదరణ లభిస్తుంది" అని కంపెనీ డిప్యూటీ సీఈవో రితేష్ మిశ్రా తెలిపారు.

జీవిత బీమా ప్రీమియంలో మెరుగైన వృద్ధి

ఏప్రిల్, మే నెలల్లో 11 శాతం అధికం

న్యూఢిల్లీ: జీవిత బీమా కంపెనీలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లో మెరుగైన వృద్ధిని చూశాయి. న్యూ బిజినెస్ ప్రీమియం ఆదాయం (కొత్త పాలసీల ద్వారా) 10.8 శాతం పెరిగింది. లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన డేటా ప్రకారం.. మే నెలలో న్యూ బిజినెస్ ప్రీమియం ఆదాయం 12.6 శాతం పెరిగి రూ.30,463 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది మే నెలలో ఇది రూ.27,034 కోట్లుగా ఉంది. ఇక ఏప్రిల్, మే నెలల్లో కలిపి న్యూ బిజినెస్ ప్రీమియం



ఆదాయం రూ.52,427 కోట్లు వసూలైంది. క్రితం ఆర్థిక సంవత్సరం (2024–25) మొదటి రెండు నెలల్లో న్యూ బిజినెస్ ప్రీమియం ఆదాయం రూ.47,293 కోట్లుగా ఉంది. మొదటిసారి బీమా పాలసీల విక్రయంపై కంపెనీలు ప్రత్యేకంగా దృష్టి సారించడం ఈ వృద్ధికి దారి తీసింది. ఇండివిడ్యువల్ సింగిల్ ప్రీమియం పాలసీల రూపంలో ఆదాయం 5.21 శాతం పెరిగి మే నెలలో రూ.3,525 కోట్లుగా ఉంది. జీవిత బీమా రంగంలో దిగ్గజ సంస్థ అయిన ఎల్‌ఐసీ న్యూ బిజినెస్ ప్రీమియం మే నెలలో 10.27 శాతం పెరిగి రూ.18,405 కోట్లకు చేరుకుంది. మే నెలలో ఎల్‌ఐసీ గ్రూప్ ప్రీమియం ఆదాయం 13.79 శాతం వృద్ధి చెందింది. ఏప్రిల్, మే రెండు నెలలకు కలిపి గ్రూప్ ప్రీమియం ఆదాయం 13.66 శాతం పెరిగింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-6-2025

విశాఖ	550–00
చిత్తూరు	613–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535–00
విజయవాడ	550–00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540–00
వరంగల్	542–00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
GRASIM	2,704.00	3.66
HCLTECH	1,721.30	3.19
INFY	1,628.00	2.01
TECHM	1,638.00	1.68
WIPRO	259	1.62

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INDUSINDBK	836	-1.07
ADANIENT	2,584.10	-1.11
BEL	392.25	-1.3
POWERGRID	295.1	-1.98
SHRIRAMFIN	684.6	-2.26

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	8,715
ఎన్‌ఎస్‌ఈ	1,24,232
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,49,617
ఎఫ్‌ఐఐ	- 446
డీఐఐ	+ 1.585

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.00 (రాత్రి 11.30కు)	$ 64.98
బ్రెంట్	69.60 (రాత్రి 11.30కు)	$ 66.87

క్విక్ రెస్టారెంట్లకు ధరల సెగ

- తగ్గిపోతున్న మార్జిన్లు
- మెరుగ్గా ఫుడ్ డెలివరీ సంస్థలు
- బీఎన్‌పీ పారిబా నివేదిక

న్యూఢిల్లీ: ద్రవ్యోల్బణం దెబ్బతో క్విక్ సర్వీస్ రెస్టారెంట్లు (క్యూఎస్‌ఆర్) మార్జిన్లపరమైన ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నాయి. డిమాండ్ మందగించడంతో ముడి సరుకుల ఖర్చులు పెరిగినప్పటికీ క్యూఎస్‌ఆర్ కంపెనీలు రేట్లను పెంచాలంటే వెనుకాడుతున్నాయి. స్టోర్ల విస్తరణ విషయంలోనూ ఆచితూచి వ్యవహరిస్తున్నాయి. మరోవైపు, అదే సమయంలో ఫుడ్ డెలివరీ సంస్థల మార్జిన్లు మాత్రం మెరుగ్గా ఉంటున్నాయి. బీఎన్‌పీ పారిబా రూపొందించిన ఓ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి.

డిస్కౌంట్లను నిర్దిష్ట కస్టమర్లకు మాత్రమే పరిమితం చేస్తున్నప్పటికీ సగటు రోజువారీ అమ్మకాలు తగ్గడంతో క్యూఎస్‌ఆర్‌ల మార్జిన్లపై ఒత్తిడి కొనసాగుతున్నట్లు నివేదిక పేర్కొంది. స్టోర్లను ఎడాపెడా వేగంగా విస్తరించడం, నిర్వహణ వ్యయాలు భారీగా పెరిగిపోవడం తదితర అంశాల వల్ల స్థూల మార్జిన్లపై ప్రభావం పడుతోందని వివరించింది. ఇక, ఫుడ్ డెలివరీ సంస్థల విషయానికొస్తే స్విగ్గీ, జొమాటోలాంటి అగ్రిగేటర్ల మార్జిన్లు మాత్రం మెరుగ్గా ఉంటున్నాయి. భారీ స్థాయిలో ఎదిగిన ఈ రెండు సంస్థలు.. క్యూఎస్‌ఆర్ చెయిన్ల కన్నా చిన్నవైన రెస్టారెంట్లను కస్టమర్లకు మరింత చేరువ చేశాయి. దీంతో లిస్టెడ్ క్యూఎస్‌ఆర్ కంపెనీలకు మార్కెట్లో పోటీ పెరిగింది. ఇది సరిపోదన్నట్లు ఆన్‌లైన్ ఫుడ్ అగ్రిగేటర్లు తమ సొంత డార్క్ కిచెన్ బ్రాండ్లను (బిస్ట్రో, స్నాక్ మొదలైనవి) ప్రారంభించి, ప్రత్యేక యాప్‌ల ద్వారా 10–15 నిమిషాల్లోనే ఫుడ్ డెలివరీ సేవలు అందిస్తున్నాయి. ఈ పరిణామాలతో గత నాలుగేళ్లుగా చూస్తే ఫుడ్ డెలివరీ సంస్థల మార్జిన్లు పెరుగుతుండగా, క్యూఎస్‌ఆర్‌ల మార్జిన్లపై ఒత్తిడి కొనసాగుతోందని నివేదిక వివరించింది.





సామర్థ్యాలు పెంచుకోవాలి..

జూబిలెంట్ ఫుడ్స్‌లాంటి క్యూఎస్‌ఆర్ కంపెనీలు ముడి సరుకుల ధరలపరంగా సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ, డిమాండ్ బలహీనంగా ఉండటంతో ధరలను పెంచేందుకు ఇష్టపడటం లేదు. నివేదిక ప్రకారం.. ఫుడ్ డెలివరీ సంస్థలతో పోలిస్తే క్యూఎస్‌ఆర్ చెయిన్ల అమ్మకాలు తక్కువ స్థాయిలోనే ఉంటున్నాయి. లిస్టెడ్ క్యూఎస్‌ఆర్ చెయిన్ల మొత్తం అమ్మకాలు 2024 ఆర్థిక సంవత్సరంలో 9 శాతం పెరగ్గా, 2025 ఆర్థిక సంవత్సరంలో 10 శాతానికి పరిమితమయ్యాయి. అదే ఫుడ్ డెలివరీ సంస్థల స్థూల ఆర్డర్ల విలువ (జీవోవీ) 2024 ఆర్థిక సంవత్సరంలో 19 శాతంగా, 2025 ఆర్థిక సంవత్సరంలో 18 శాతంగా నమోదైంది. దేశీ క్యూఎస్‌ఆర్ మార్కెట్లో పోటీపడాలంటే ప్రస్తుత సంస్థలు తమ మార్కెట్ వాటాను కాపాడుకోవాలంటే వినూత్నమైన విధంగా వేగం, మెనూ, డెలివరీ సామర్థ్యాలను పెంచుకోవడంపై దృష్టి పెట్టాల్సి ఉంటుందని పేర్కొంది. ఆదాయ పన్ను రేట్ల సవరణలు, ఇతరత్రా సానుకూల పరిణామాలతో డిమాండ్ మళ్లీ పుంజుకోగలదని క్యూఎస్‌ఆర్ సంస్థలు ఆశిస్తున్నాయి.

బ్లాక్‌స్టోన్ చేతికి కోల్టేపాటిల్

మెజారిటీ వాటా కొనుగోలుకి సీసీఐ సై



న్యూఢిల్లీ: రియల్టీ రంగ కంపెనీ కోల్టేపాటిల్ డెవలపర్స్‌లో పీఈ దిగ్గజం బ్లాక్‌స్టోన్ మెజారిటీ వాటా కొనుగోలు చేసేందుకు కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) అనుమతించింది. అనుబంధ సంస్థ బీఆర్‌ఈపీ ఏషియా 3 ఇండియా హోల్డింగ్ కో 7 పీటీఈ లిమిటెడ్ ద్వారా కోల్టేపాటిల్‌లో బ్లాక్‌స్టోన్ మెజారిటీ వాటా సొంతం చేసుకోనుంది. షేర్ల కొనుగోలు, సబ్‌స్క్రిప్షన్‌ల ద్వారా కోల్టేపాటిల్‌లో బ్లాక్‌స్టోన్ 40 శాతం వాటాను కొనుగోలు చేయనున్నట్లు సీసీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ లావాదేవీ నేపథ్యంలో ఓపెన్ ఆఫర్ ద్వారా సైతం షేర్ల కొనుగోలుకి వీలుంటుందని తెలియజేసింది. లిస్టెడ్ కంపెనీ కోల్టేపాటిల్ ప్రధానంగా రియల్టీ రంగంలో నిర్మాణం, అభివృద్ధి, అమ్మకాలు చేపడుతోంది. ఈ ఏడాది మార్చిలో రూ. 1,150 కోట్లకు కోల్టేపాటిల్‌లో 40 శాతం వాటా కొనుగోలుకి బ్లాక్‌స్టోన్ ఒప్పందం కుదుర్చుకుంది. దీనిలో భాగంగా ప్రిఫరెన్షియల్ ఈక్విటీ షేర్ల కేటాయింపు ద్వారా బ్లాక్‌స్టోన్ తొలుత 14.3 శాతం వాటా సొంతం చేసుకోనుంది.

గోల్డ్ ఈటీఎఫ్‌లకు మళ్లీ ఆదరణ

- మే నెలలో రూ. 292 కోట్ల పెట్టుబడులు
- రూ. 62,453 కోట్లకు ఏయూఎం

న్యూఢిల్లీ: బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్‌లు)కు మే నెలలో తిరిగి డిమాండ్ ఏర్పడింది. ఇన్వెస్టర్లు రూ.292 కోట్ల పెట్టుబడులు పెట్టారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఈ ఫండ్స్ నుంచి ఇన్వెస్టర్లు రూ.6 కోట్లను వెనక్కి తీసుకోగా, మార్చిలోనూ రూ.77 కోట్ల పెట్టుబడులను ఇవి కోల్పోవడం గమనార్హం. గోల్డ్ ఈటీఎఫ్‌ల పట్ల ఇన్వెస్టర్లలో తిరిగి ఆసక్తి పెరిగినట్టు తెలుస్తోంది. మే చివరికి గోల్డ్ ఈటీఎఫ్‌ల నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ రూ.62,453 కోట్లకు పెరిగింది. ఏప్రిల్ చివరికి ఇది రూ.61,422 కోట్లుగా ఉంది. "మే నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెరగడం ఇన్వెస్టర్లలో ఆసక్తి పెరుగుతుండడాన్ని సూచిస్తోంది. బంగారం ధరలు గరిష్టాల్లో స్థిరంగా ఉండడం, అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగుతుండడంతో హెడ్జింగ్‌కు బంగారం మంచి సాధనంగా కనిపిస్తోంది" అని మార్నింగ్ స్టార్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ ఇండియా సీనియర్ అనలిస్ట్ నేహల్ మెష్రామ్ పేర్కొన్నారు. ముఖ్యంగా మే నెలలో బంగారం ధరలు స్థిరంగా ఉండడంతో పోర్ట్‌ఫోలియో రీబ్యాలన్స్‌కు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపించి ఉంటారని అభిప్రాయపడ్డారు.

పెరుగుతున్న అవగాహన

తమ పెట్టుబడుల్లో బంగారాన్ని కూడా కలిగి ఉండాలని ఇన్వెస్టర్లు తెలుసుకుంటున్నారని, దీంతో గోల్డ్ ఈటీఎఫ్‌ల కొనుగోళ్లు పెరిగినట్టు జెర్మినేట్ ఇన్వెస్టర్ సర్వీసెస్ సీఈవో సంతోష్ జోసెఫ్ తెలిపారు. "బంగారం అన్నది వినూత్నమైన సాధనం. ఇది డాలర్ డినామినేషన్‌లో ఉంటుంది. ఈక్విటీలతో సంబంధం లేనిది. ఈక్విటీలకు ప్రతికూల సంబంధం కలిగి ఉంటుంది. కనుక పోర్ట్‌ఫోలియో హెడ్జింగ్‌కు ఇదొక చక్కని సాధనం" అని జోసెఫ్ చెప్పారు. గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో రూ.1,980 కోట్లుగా ఉండడం గమనార్హం. అంటే మే నెలలో కాస్త మెరుగుపడినప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో పుంజుకోవాల్సి ఉందని తెలుస్తోంది. బంగారం ధరలు గత కొన్నేళ్లలో స్థిరమైన ర్యాలీ చేయడం గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులను గణనీయంగా వృద్ధి చేసిందని చెప్పుకోవాలి. ఇక మే నెలలో గోల్డ్ ఈటీఎఫ్‌ల పరిధిలో ఫోలియోలు (పెట్టుబడి ఖాతాలు) 2.24 లక్షలు పెరిగాయి. దీంతో మే చివరికి మొత్తం ఫోలియోలు 73.69 లక్షలకు చేరాయి. గోల్డ్ ఈటీఎఫ్‌లు స్టాక్ ఎక్స్ఛేంజీలలో ట్రేడ్ అయ్యే డిజిటల్ బంగారం సాధనం. భౌతిక బంగారం ధరలను ఇవి ప్రతిఫలిస్తుంటాయి. గోల్డ్ ఈటీఎఫ్ ఒక యూనిట్ ఒక గ్రాము బంగారానికి సమానంగా ఉంటుంది.



ఎలక్ట్రిసిటీ ఎఫ్అండ్‌వోకు గ్రీన్‌సిగ్నల్

ఎన్‌ఎస్‌ఈలో ప్రవేశపెట్టేందుకు సెబీ సై

న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ ఇకపై నెలవారీ ఎలక్ట్రిసిటీ ఫ్యూచర్ కాంట్రాక్టులను ప్రవేశపెట్టనుంది. ఇందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతించినట్లు ఎన్‌ఎస్‌ఈ వెల్లడించింది. విద్యుత్ ధరల హెచ్చుతగ్గులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు హెడ్జింగ్ టూల్స్‌గా వీటిని మార్కెట్ వర్గాలు వినియోగించుకోనున్నట్లు పేర్కొంది. తద్వారా విద్యుత్ రంగంలో తగిన ధరల సంకేతాలతోపాటు.. పెట్టుబడుల ప్రోత్సాహానికి వీలు కలగనున్నట్లు తెలియజేసింది. విద్యుదుత్పత్తితోపాటు.. ప్రసారం, పంపిణీ, రిటైల్ తదితర విభాగాలలో పెట్టుబడులు పెరిగే వీలున్నట్లు వివరించింది. ఎలక్ట్రిసిటీ డెరివేటివ్స్ ఎకోసిస్టమ్ మరింత విస్తరించేందుకు తాజా అనుమతి సహకరించగలదని, ఇందుకు ఇది తొలి అడుగు అని ఎన్‌ఎస్‌ఈ ఎండీ, సీఈవో ఆశిష్‌కుమార్ చౌహాన్ పేర్కొన్నారు. నియంత్రణ సంస్థల అనుమతులకు అనుగుణంగా త్రైమాసిక, వార్షిక తదితర దీర్ఘకాలిక కాంట్రాక్టులు ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు తెలియజేశారు. కాగా.. ఎలక్ట్రిసిటీ డెరివేటివ్స్‌ను ప్రవేశపెట్టేందుకు సెబీ నుంచి గ్రీన్‌సిగ్నల్ లభించినట్లు గత వారం



ఎంసీఎక్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

కొత్త యూపీఐ విధానం

ఇన్వెస్టర్ల పరిరక్షణ లక్ష్యంగా సెబీ కొత్త యూపీఐ మార్గదర్శకాలను తప్పనిసరి చేసింది. ఇన్వెస్టర్ల నుంచి నిధులు సమీకరించే అన్ని రిజిస్టర్డ్ ఇంటర్మీడియరీలకు ఇవి వర్తిస్తాయని స్పష్టం చేసింది. సెక్యూరిటీల మార్కెట్లో ఆర్థిక లావాదేవీలకు వీలు, వీటి భద్రత లక్ష్యంగా తాజా యూపీఐ మెకనిజంకు తెరతీసినట్లు సెబీ తెలియజేసింది. వెరసి 2025 అక్టోబర్ 1నుంచి యూపీఐ చెల్లింపుల మెకనిజం అమల్లోకి రానున్నట్లు సెబీ చీఫ్ తుహిన్ కాంతా పాండే వెల్లడించారు. ఇటీవల కాలంలో అన్‌రిజిస్టర్డ్ సంస్థలు ఇన్వెస్టర్లను మోసగించడం ఎక్కువైన నేపథ్యంలో సెబీ తాజా చర్యలు చేపట్టింది. ధృవీకరించిన, భద్రతతోకూడిన చెల్లింపుల చానల్‌కు తెరతీయడం ద్వారా సెక్యూరిటీల మార్కెట్లో ఇన్వెస్టర్ల పెట్టుబడులకు రక్షణ కల్పించనున్నట్లు పాండే వివరించారు.

ఐపీవోకు ఒర్క్లా ఇండియా

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు

మసాలాలు, పరిమళ ద్రవ్యాల విక్రయ కంపెనీ ఒర్క్లా ఇండియా పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా 2.28 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు, ఇతర వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్లకు 90 శాతం వాటా ఉంది. ఎంటీఆర్, ఈస్టర్న్ బ్రాండ్‌తో కంపెనీ విభిన్న మసాలాలు విక్రయించే సంగతి తెలిసిందే. ఐపీవో కంపెనీకికాకుండా నిధులు ప్రమోటర్లకు, ప్రస్తుత వాటాదారులకు అందనున్నాయి. గతంలో ఎంటీఆర్ ఫుడ్స్‌గా కార్యకలాపాలు నిర్వహించిన కంపెనీ వివిధ మసాలా దినుసులతోపాటు.. మిఠాయిలు, బ్రేక్‌ఫాస్ట్ మిక్స్‌లు తదితరాలను సైతం తయారు చేస్తోంది. కాగా.. టెక్నోప్యాక్ నివేదిక ప్రకారం 2023–24లో దేశీ ప్యాకేజ్‌డ్ ఫుడ్ విభాగం విలువ రూ. 10.18 లక్షల కోట్లుగా అంచనా.

జియో బ్లాక్‌రాక్ అడ్వైజరీ సేవలకు అనుమతి

న్యూఢిల్లీ: జియో బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్.. ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ (పెట్టుబడి సలహా) సేవలు అందించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీతోపాటు స్టాక్ ఎక్స్ఛేంజ్ బీఎస్‌ఈ నుంచి అనుమతి లభించినట్టు ప్రకటించింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ (జేఎఫ్ఎస్ఎల్), అమెరికాకు చెందిన బ్లాక్‌రాక్ 50:50 జాయింట్ వెంచర్ కంపెనీయే జియో బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్. మార్క్ పిల్‌గ్రిమ్‌ను ఎండీ, సీఈవోగా నియమించినట్టు జియో బ్లాక్‌రాక్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ ప్రకటించింది. ఇన్వెస్టర్లు తమకు అనుకూలమైన ప్రత్యేక ఆర్థిక పరిష్కారాలు కోరుకుంటున్న నేపథ్యంలో తమ జాయింట్ వెంచర్ సంస్థ ప్రపంచస్థాయి సలహా సేవలు అందించనుందని జేఎఫ్ఎస్ఎల్ ఎండీ, సీఈవో హితేష్ సేతియా తెలిపారు. మరోవైపు జియో బ్లాక్‌రాక్ అస్సెట్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ మ్యూచువల్ ఫండ్స్ సేవలు అందించేందుకు గత నెల 27న సెబీ నుంచి అనుమతి లభించడం గమనార్హం.

నజారాలో ఝున్‌ఝున్‌వాలా వాటా విక్రయం

ప్రస్తుతం 3.6 శాతానికి తగ్గిన వాటా

న్యూఢిల్లీ: సుప్రసిద్ధ ఇన్వెస్టర్ రాకేష్ ఝున్‌ఝున్‌వాలా సతీమణి రేఖా ఝున్‌ఝున్‌వాలా తాజాగా గేమింగ్, ఈస్పోర్ట్స్ కంపెనీ నజారా టెక్నాలజీస్‌లో1.4 శాతం వాటా విక్రయించారు. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఈ నెల 9–10 మధ్య 12,36,500 షేర్లు విక్రయించారు. దీంతో నజారా టెక్‌లో రేఖ వాటా 3.6 శాతానికి తగ్గింది. అయితే వాటాను ఏ ధరలో విక్రయించిందీ వెల్లడికాలేదు. కాగా.. ఈ నెల తొలి వారం (2–6)లోనూ 1.98 శాతం వాటాకు సమానమైన 17,38,500 షేర్లు అమ్మివేశారు. దీంతో రాకేష్ ఝున్‌ఝున్‌వాలా ఎస్టేట్ వాటా నజారా టెక్నాలజీస్‌లో 7.05 % నుంచి 3.66 శాతానికి దిగివచ్చింది. ఝున్‌ఝున్‌వాలా ఎస్టేట్ ప్రస్తుతం కంపెనీలో 32,08,620 షేర్లను మాత్రమే కలిగి ఉంది. ఈ నేపథ్యంలో నజారా టెక్ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం బలపడి రూ. 1,274 వద్ద ముగిసింది.

మెరుగైన కస్టమర్ సేవలకు ఎస్‌బీఐ ప్రాధాన్యం

13,455 జూనియర్ అసోసియేట్ల నియామకం

న్యూఢిల్లీ: దేశంలోనే అగ్రగామి బ్యాంక్ ఎస్‌బీఐ కస్టమర్‌కు మెరుగైన సేవలను అందించడంపై దృష్టి సారించింది. ఇందుకు వీలుగా బ్యాంక్ శాఖల స్థాయిలో 13,455 జూనియర్ అసోసియేట్లను నియమించుకున్నట్లు ప్రకటించింది. 35 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిధిలో ఖాళీలను భర్తీ చేసేందుకు నియామకాలు చేపట్టినట్లు తెలిపింది. పరిశ్రమలోనే దీన్నొక పెద్ద నియామక ప్రక్రియగా పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో ప్రాథమిక స్థాయి పరీక్షల అనంతరం ఏప్రిల్ నెలలో ప్రధాన పరీక్షలు నిర్వహించినట్టు తెలిపింది. పారదర్శక విధానంలో చివరికి 13,455 అభ్యర్థులను ఎంపిక చేసినట్టు వెల్లడించింది. వివిధ కేటగిరీల్లో కలిపి మొత్తం 18,000 మందిని బ్యాంక్ నియమించుకోనుండగా.. ఇందులో 13,500 మంది క్లరికల్ ఉద్యోగులు అని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. 3,000 మంది ప్రొబేషనరీ ఆఫీసర్లు కాగా, మిగిలిన వారు స్థానిక అధికారులుగా పేర్కొన్నారు.



ఏబీ క్యాపిటల్‌లో వాటా కొనుగోలు

మిరే అసెట్ ఎంఎఫ్, బ్లాక్‌రాక్ పెట్టుబడులు

న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ సర్వీసుల కంపెనీ ఆదిత్య బిర్లా(ఏబీ) క్యాపిటల్‌లో తాజాగా మిరే అసెట్ ఎంఎఫ్, బ్లాక్‌రాక్, గోల్డ్‌మన్ శాక్స్ తదితర సంస్థలు దాదాపు 1 శాతం వాటా కొనుగోలు చేశాయి. ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఇందుకు రూ. 568 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. బీఎస్‌ఈ బ్లాక్‌డీల్ గణాంకాల ప్రకారం 0.9 శాతం వాటాకు సమానమైన 2.34 కోట్ల షేర్లు కొనుగోలు చేసిన సంస్థలలో మోతీలాల్ ఓస్వాల్ ఎంఎఫ్, ఎడిల్‌వీజ్ ఎంఎఫ్, హెచ్‌ఎస్‌బీసీ ఎంఎఫ్ తదితరాలు సైతం ఉన్నాయి. షేరుకి రూ. 242.65 సగటు ధరలో వీటిని సొంతం చేసుకున్నాయి. ఎస్‌పీవీ జోమీ ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా ఆడ్వెంట్ ఇంటర్నేషనల్ ఈ వాటాను విక్రయించింది. ఈ లావాదేవీ తదుపరి ఏబీ క్యాపిటల్‌లో జోమీ ఇన్వెస్ట్‌మెంట్స్ వాటా 3.84 శాతం నుంచి 2.94 శాతానికి తగ్గింది.

బీఎస్‌ఈలో ఏబీ క్యాపిటల్ షేరు 1.5 శాతం బలపడి రూ. 246 వద్ద ముగిసింది.

825 బిలియన్ డాలర్ల ఎగుమతులు

- 2025–26లో సాధిస్తాం
- అంతర్జాతీయంగా ఎన్నో సవాళ్లు
- కేంద్ర వాణిజ్య మంత్రి గోయల్

బెర్న్: ప్రపంచ వాణిజ్యం భౌగోళిక రాజకీయంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని.. అయినా భారత్ 2025–26లో 825 బిలియన్ డాలర్ల ఎగుమతులను (రూ.70.12 లక్షల కోట్లు) సాధిస్తుందని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హమాస్ పోరు, రెడ్‌సీ సంక్షోభాలను ప్రస్తావించారు. సవాళ్లతో కూడిన సందర్భాల్లో భారత్ విజేతగా నిలిచినట్టు గుర్తు చేశారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ 2024–25లో భారత్ 825 బిలియన్ డాలర్ల ఎగుమతులను నమోదు చేసినట్టు చెప్పారు. కొన్ని సంస్థల అంచనాల ప్రకారం అంతర్జాతీయ వాణిజ్యం క్షీణతను చవిచూడనుందని మంత్రి చెప్పారు. భారతీయ ఎగుమతిదారుల సమాఖ్య (ఎఫ్‌ఐఈవో) మాత్రం 2025–26లో ఎగుమతులు 21 శాతం పెరిగి ట్రిలియన్ డాలర్లుగా ఉంటాయని అంచనా వేసింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితులు పెరిగిపోయిన తరుణంలో కొనుగోలుదారులు తమ సోర్సింగ్ (ముడి సరుకుల సమీకరణ)ను వైవిధ్యం చేసుకోవడానికి ఆసక్తి చూపిస్తుండడం వృద్ధికి అనుకూలిస్తుందని ఎఫ్‌ఐఈవో ప్రెసిడెంట్ ఎస్‌సీ రల్హన్ తెలిపారు. ఎఫ్‌ఐఈవో అంచనా మేరకు 2025–26లో వస్తు ఎగుమతులు 12 శాతం పెరిగి 525–535 బిలియన్ డాలర్లుగా ఉండనున్నాయి. 2024–25లో వస్తు ఎగుమతులు 437 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. సేవల గుమతులు గత ఆర్థిక సంవత్సరంలో 387 బిలియన్ డాలర్లుగా ఉంటే, ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో ఇవి 20 శాతం పెరిగి 465–475 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చన్నది ఎఫ్‌ఐఈవో అంచనా.

ఎఫ్‌టీఏలతో సానుకూలత

యూఏఈ, ఆస్ట్రేలియా, ఐరోపా ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఈఎఫ్‌టీఏ)తో భారత్ చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) ఎగుమతుల వృద్ధికి అనుకూలిస్తుందని ఎఫ్‌ఐఈవో అంచనా వేస్తోంది. ఇందులో ఈఎఫ్‌టీఏతో ఒప్పందం ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానుంది. కాంగ్రెస్ పాలనలో కుదిరిన ఎఫ్‌టీఏలు దేశీ సంస్థలకు నష్టం చేసినట్టు వాణిజ్య మంత్రి గోయల్ అన్నారు. పోటీ దేశాలైన ఆసియా దేశాలతో ఒప్పందాలు చేసుకోగా, అవి కూడా సమతుల్యంగా లేనట్టు చెప్పారు. ఆయా దేశాలకు భారత్ మార్కెట్ అవకాశాలు కల్పించగా, బదులుగా మనకు మంచి అవకాశాలు దక్కలేదన్నారు. మోదీ సర్కారు మాత్రం అభివృద్ధి చెందిన దేశాలైన ఆస్ట్రేలియా, యూకే, ఈఎఫ్‌టీఏ, ఈయూ, యూఏఈ, ఒమన్ తదితర దేశాలతో ఒప్పందాలు చేసుకుంటున్నట్టు చెప్పారు.




క్లాసెన్

దేశం కన్నా... లీగ్‌లే మిన్న?





ఫ్రాంచైజీ క్రికెట్‌కే ఓటేస్తున్న ఈతరం క్రికెటర్లు

లీగ్‌ల్లో ఆడేందుకు ‘సై’అంటున్న కుర్రాళ్లు

జాతీయ జట్టు కంటే ఫ్రాంచైజీలకే ప్రాధాన్యం

పనిభారం నెపంతో దేశానికి ప్రాతినిధ్యం వహించేందుకు వెనకడుగు!

భారీ షాట్లకు పెట్టింది పేరైన కరీబియన్ వీరుడు నికోలస్ పూరన్ ముప్పై ఏళ్లు రాకముందే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. దక్షిణాఫ్రికా విధ్వంసక బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ 33 ఏళ్లకే మూడు ఫార్మాట్లకు వీడ్కోలు పలికాడు. ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్లు మ్యాక్స్‌వెల్, స్టొయినిస్ వన్డే క్రికెట్‌కు దూరమయ్యారు. ఈ నలుగురిలో మ్యాక్స్‌వెల్ తప్ప మిగిలిన ముగ్గురికి ఎలాంటి ఫిట్‌నెస్ సమస్యలు లేవు. మరికొంత కాలంగా ధాటిగా ఆడగల సత్తా ఉన్నవాళ్లే అయినా... ఇలా అంతర్జాతీయ క్రికెట్‌కు అర్ధాంతరంగా వీడ్కోలు పలకడం వెనక అసలు మతలబు మాత్రం లీగ్ క్రికెట్‌కు పెద్దపీట వేసేందుకే అనేది జగమెరిగిన సత్యం!

వెస్టిండీస్ క్రికెట్ బోర్డుతో వివాదాల కారణంగా కరీబియన్ ఆటగాళ్లు మొదటి నుంచి విశ్వవ్యాప్తంగా జరుగుతున్న ఫ్రాంచైజీ లీగ్‌లకే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. జాతీయ జట్టు తరఫున అయితే ఆటతో పాటు బాధ్యత కూడా మోయాల్సి ఉంటుంది. అందుకు ప్రతిఫలంగా దక్కే మొత్తం కూడా చాలా తక్కువ. మన దేశంలో రంజీ మ్యాచ్ ఆడే ఆటగాడికి దక్కే ఫీజు సైతం అందుకోని అంతర్జాతీయ క్రికెటర్లు బయట ఎందరో ఉన్నారు. దీంతో వారంతా ఫ్రాంచైజీలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. రెండు నెలల పాటు కుటుంబంతో సహా విహారయాత్రకు వెళ్లినట్లు వెళ్లి ఓ నాలుగు ఓవర్లు బౌలింగ్ చేయడమో... లేక బ్యాటింగ్‌లో కొన్ని మెరుపులు మెరిపించడంతోనో పని కానిస్తున్నారు!

– సాక్షి క్రీడావిభాగం

అంతర్జాతీయ క్రికెట్‌లో పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలంటే ఒక ఆటగాడు తన జీవిత కాలాన్ని వెచ్చించాల్సిందే. అహర్నిశలు కృషి చేస్తే తప్ప ఆ స్థాయికి చేరుకోవడం చాలా కష్టం. కఠోర శ్రమకు కాలం కూడా కలిసొస్తేనే ఫలితాలు సానుకూలంగా వస్తాయి. అలాంటిది జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకున్న తర్వాత ఆటగాళ్లు ఆ విధులకు దూరంగా ఉండటానికి కారణాలు లేకపోలేదు. వెస్టిండీస్ బోర్డు విషయానికి వస్తే... వార్షిక కాంట్రాక్టులు, మ్యాచ్ ఫీజులు, ఆటగాళ్లకు సౌకర్యాలు, బకాయిలు ఇలా సవాలక్ష కారణాలతో ఆ దేశంలోని నాణ్యమైన ఆటగాళ్లు జాతీయ జట్టుకు ఆడేందుకు విముఖత చూపుతున్నారు. క్రిస్ గేల్ నుంచి మొదలుకొని కీరన్ పొలార్డ్, డ్వేన్ బ్రావో, డారెన్ స్యామీ, ఆండ్రీ రసెల్, సునీల్ నరైన్, హెట్‌మైర్, నికోలస్ పూరన్ ఇలా వెస్టిండీస్ స్టార్ ఆటగాళ్లంతా లీగ్‌లతోనే విశ్వవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నారు. ప్రపంచంలో ఏమూల లీగ్ క్రికెట్ జరుగుతున్నా అందులో ప్రముఖంగా కనిపించే ప్లేయర్లు కరీబియన్లే అనడంలో సందేహం లేదు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ప్రమాదకర ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకున్న పూరన్ 2016లో తొలిసారి జాతీయ జట్టుకు ఆడాడు. ఈ తొమ్మిదేళ్ల కాలంలో వెస్టిండీస్ తరఫున 61 వన్డేలాడిన అతడు 1983 పరుగులు చేశాడు. 106 టి20 మ్యాచ్‌ల్లో 2275 పరుగులు చేశాడు. దూకుడుగా ఆడగల సామర్థ్యం... ఎలాంటి స్థితిలో అయినా భారీ షాట్లు కొట్టగల నైపుణ్యం అతడికి మంచి ‘ఫినిషర్’అనే గుర్తింపు తెచ్చిపెట్టాయి. అయితే కెరీర్ ఆరంభం నుంచి కేవలం వన్డే, టి20లపైనే దృష్టి పెట్టిన పూరన్... సుదీర్ఘ ఫార్మాట్ జోలికి పోలేదు. 2023లో చివరి వన్డే మ్యాచ్ ఆడిన అతడు... గతేడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌పై ఆఖరి టి20 మ్యాచ్ ఆడాడు. విండీస్ జట్టుకు కెప్టెన్‌గానూ వ్యవహరించిన పూరన్... 29 ఏళ్లకే అకస్మాత్తుగా అంతర్జాతీయ క్రికెట్ నుంచి వైదొలగడం వెనక ఫ్రాంచైజీ క్రికెట్‌లో చేసుకున్న ఒప్పందాలు కీలకపాత్ర పోషించాయి. ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న పూరన్... వివిధ లీగ్‌ల్లో ఎంఐ ఎమిరేట్స్, ఎంఐ న్యూయార్క్, నార్తర్న్ సూపర్ చార్జర్స్, ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్, బార్బడోస్ ట్రిడెంట్స్, డెక్కన్ గ్లాడియేటర్స్, డర్బన్ సూపర్ జెయింట్స్, గయానా అమెజాన్ వారియర్స్, ఇస్లామాబాద్ యునైటెడ్, ఖుల్నా టైటాన్స్, ముల్తాన్ సుల్తాన్స్ ఇలా లెక్కకు మిక్కిలి ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించాడు గతేడాది పొట్టి ఫార్మాట్‌లో 170 సిక్స్‌లు బాది నయా రికార్డు సృష్టించిన పూరన్... ఐపీఎల్ 18వ సీజన్‌లో 40 సిక్స్‌లు కొట్టి అగ్రస్థానంలో నిలిచాడు.



స్టొయినిస్

క్లాసెన్ ఇదే దారిలో...

ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ స్కోర్లతో రికార్డులు తిరగరాయడంలో కీలకపాత్ర పోషించిన దక్షిణాఫ్రికా ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ కూడా ఇటీవల మూడు ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. 33 ఏళ్ల క్లాసెన్ దక్షిణాఫ్రికా జాతీయ జట్టు తరఫున 4 టెస్టులు, 60 వన్డేలు, 58 టి20లు ఆడాడు. వన్డేల్లో 2141 పరుగులు చేసిన క్లాసెన్... పొట్టి ఫార్మాట్‌లో 1000 పరుగులు చేశాడు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల తెగువ... భారీ షాట్‌లతో ప్రత్యర్థి బౌలర్ల లయ దెబ్బతీయగల నేర్పు అతడి సొంతం. కుటుంబంతో ఎక్కువ సమయం గడపడంతో పాటు ఫ్రాంచైజీ క్రికెట్‌పై మరింత దృష్టి పెట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు క్లాసెన్ ప్రకటించినా... దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే ఉద్దేశంతో డిమాండ్ ఉన్నప్పుడే మరింత డబ్బు చేసుకోవాలనే అతడు అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్నాడనేది సుస్పష్టం. ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో ధాటిగా ఆడగల మేటి బ్యాటర్ అయిన క్లాసెన్‌కు విశ్వవ్యాప్తంగా లీగ్‌ల్లో మంచి గిరాకీ ఉంది.

వీళ్లు కూడా...

గతేడాది టి20 ప్రపంచకప్ గెలిచిన అనంతరం ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన భారత స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ... తాజాగా టెస్టుల నుంచి కూడా తప్పుకున్నారు. వీరిద్దరూ ఇప్పుడు కేవలం వన్డేలకు మాత్రమే అందుబాటులో ఉన్నారు. కుర్రాళ్లకు అవకాశం కల్పించేందుకే అంతర్జాతీయ టి20ల నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించిన ఈ జోడీ... ఐపీఎల్‌లో మాత్రం అదరగొట్టింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరఫున అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచిన కోహ్లి... బెంగళూరు తొలిసారి చాంపియన్‌గా నిలవడంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఇక ‘హిట్‌మ్యాన్’రోహిత్ ఇచ్చిన ఆరంభాలతోనే ముంబై జట్టు ‘ప్లే ఆఫ్స్’కు చేరగలిగింది. ఈ ఇద్దరూ మరి కొన్నేళ్లు ఐపీఎల్‌లో కొనసాగడం ఖాయంగానే కనిపిస్తోంది. మార్టిన్ గప్టిల్, దిముత్ కరుణరత్నే, తమీమ్ ఇక్బాల్, మహ్మదుల్లా ఇలా వివిధ దేశాలకు చెందిన పలువురు ప్లేయర్లు ఈ ఏడాదే అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పినా... వారు లీగ్‌ల్లో పెద్దగా ప్రభావం చూపడం లేదు.


పూరన్

‘కివీ’ల రూటే సపరేటు!

ఇది ఇలా ఉంటే... న్యూజిలాండ్ ఆటగాళ్ల తీరు మరో రకం. జాతీయ జట్టు తరఫున వార్షిక కాంట్రాక్టు తీసుకోవడానికి ఇష్టపడని పలువురు క్రికెటర్లు... ఫ్రాంచైజీలతో జతకట్టేందుకు ‘సై’అంటున్నారు. సెంట్రల్ కాంట్రాక్టు తీసుకుంటే... జాతీయ జట్టుకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాల్సి రావడంతో... స్టార్ క్రికెటర్లు సైతం దీనికి దూరమయ్యారు. ఈ జాబితాలో న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్, డెవాన్ కాన్వే, ఫిన్ అలెన్, టిమ్ సీఫెర్ట్, లూకీ ఫెర్గూసన్ ఉన్నారు. వీరంతా వేర్వేరు దేశాల్లో జరిగే లీగ్‌ల్లో పాల్గొనేందుకు జాతీయ జట్టుకు దూరమయ్యారు. గతంలో ఐపీఎల్‌లో కీలకపాత్ర పోషించిన విలియమ్సన్‌ను ఈసారి వేలంలో ఎవరూ పట్టించుకోకపోవడంతో అతడు పాకిస్తాన్ క్రికెట్ లీగ్‌లో ఆడగా... కాన్వే చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు.


విలియమ్సన్

వన్డేలకు మ్యాక్సీ ‘టాటా’...

ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ కూడా ఈ మధ్యే వన్డే ఫార్మాట్ నుంచి తప్పుకున్నాడు. పనిభారాన్ని దృష్టిలో పెట్టుకొని టి20లపై ఎక్కువ దృష్టి పెట్టాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మ్యాక్సీ ప్రకటించినా... దీని వెనుక కూడా లీగ్‌ల హస్తం ఉంది. ఐపీఎల్‌లో ఒకదశలో అత్యధిక ధర పలికే ఆటగాళ్లలో ఒకడైన ఈ ఆసీస్ ఆల్‌రౌండర్ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబర్చడంలో కాస్త వెనుకబడి... పెట్టిన ధరకు న్యాయం చేయలేకపోయిన సందర్భాలే అధికం. ఆసీస్ తరఫున 7 టెస్టుల్లో 339, 149 వన్డేల్లో 3990, 116 టి20ల్లో 2664 పరుగులు చేసిన 36 ఏళ్ల మ్యాక్స్‌వెల్... ఇకపై కేవలం పొట్టి ఫార్మాట్‌లో మాత్రమే ఆడనున్నాడు. ఆస్ట్రేలియా పేస్ ఆల్‌రౌండర్ స్టొయినిస్ కూడా ఈ ఏడాదే వన్డేలకు వీడ్కోలు పలికాడు. ఐపీఎల్ 18వ సీజన్‌లో తన మెరుపులతో అభిమానులను అలరించిన స్టొయినిస్... జాతీయ జట్టు తరఫున 71 వన్డేల్లో 1495, 74 టి20ల్లో 1245 పరుగులు చేశాడు. వన్డేల్లో 48, టి20ల్లో 45 వికెట్లు సైతం పడగొట్టాడు. అయితే జాతీయ విధుల కన్నా... లీగ్ క్రికెట్ ద్వారానే ఎక్కువ సంపాదించుకోవచ్చనే ఈ ఆటగాళ్లంతా ఫ్రాంచైజీ క్రికెట్‌పై ఎక్కువ దృష్టి సారిస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు.


మ్యాక్స్‌వెల్

‘ఫిఫా’ ప్రపంచకప్‌కు బ్రెజిల్ క్వాలిఫై

సావో పాలో: వచ్చే ఏడాది జరగనున్న ప్రతిష్టాత్మక ‘ఫిఫా’ ప్రపంచకప్‌నకు బ్రెజిల్, ఈక్వెడార్, ఆస్ట్రేలియా జట్లు అర్హత సాధించాయి. దక్షిణ అమెరికా అర్హత టోర్నీలో భాగంగా బ్రెజిల్ జట్టు మంగళవారం అర్ధరాత్రి దాటాక జరిగిన మ్యాచ్‌లో 1–0 గోల్ తేడాతో పరాగ్వేపై విజయం సాధించింది. తద్వారా ‘ఫిఫా’ వరల్డ్‌కప్ బెర్తు దక్కించుకుంది. ఇప్పటి వరకు ఐదుసార్లు (1958, 1962, 1970, 1994, 2002లో) చాంపియన్‌గా నిలిచిన బ్రెజిల్ 2022 ప్రపంచకప్‌లో క్వార్టర్‌ఫైనల్లో ఓడింది. మరో వైపు పెరూతో జరిగిన మ్యాచ్‌ను ‘డ్రా’ చేసుకోవడం ద్వారా ఈక్వెడార్ ముందంజ వేసింది. ఇప్పటికే వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించిన డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా, కొలంబియాతో మ్యాచ్‌ను 1–1తో ‘డ్రా’ చేసుకుంది. 2026లో మూడు దేశాలు ఆతిథ్యమిస్తున్న ఫిఫా ప్రపంచకప్‌లో 48 జట్లు పాల్గొననున్నాయి. దక్షిణ అమెరికా అర్హత టోర్నీలో అర్జెంటీనా 35 పాయింట్లతో అగ్ర స్థానంలో ఉండగా... ఈక్వెడార్, బ్రెజిల్ చెరో 25 పాయింట్లతో వరుసగా రెండో, మూడో స్థానాల్లో ఉన్నాయి. దక్షిణ అమెరికా నుంచి వరల్డ్‌కప్‌నకు ఆరు జట్లు నేరుగా అర్హత సాధించనున్నాయి. బొలీవియాతో మ్యాచ్‌లో 0–2తో పరాజయం పాలైన చిలీ జట్టు... వరుసగా మూడోసారి విశ్వ సమరానికి దూరమైంది. మరోవైపు ఆస్ట్రేలియా వరుసగా ఆరో సారి ఫిఫా ప్రపంచకప్ బెర్తు దక్కించుకుంది. 2–1 గోల్స్ తేడాతో సౌదీ అరేబియాపై గెలవడం ద్వారా ఆసీస్ ముందంజ వేసింది.



ఇంగ్లండ్ క్లీన్‌స్వీప్

వెస్టిండీస్‌పై 3–0తో టి20 సిరీస్ కైవసం

సౌతాంప్టన్: సమష్టి ప్రదర్శనతో సత్తా చాటిన ఇంగ్లండ్ జట్టు... వెస్టిండీస్‌పై టి20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. వన్డే సిరీస్‌లోనూ వైట్‌వాష్‌కు గురైన కరీబియన్ జట్టు... ఈ పర్యటనలో ఒక్క మ్యాచ్‌లోనూ గెలుపు రుచి చూడకుండానే ఇంటిబాట పట్టింది. మంగళవారం అర్ధరాత్రి దాటాక జరిగిన మూడో టి20లో ఆతిథ్య ఇంగ్లండ్ 37 పరుగుల తేడాతో విండీస్‌ను చిత్తుచేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 248 పరుగులు చేసింది. ఈ ఫార్మాట్‌లకు ఇంగ్లండ్‌కు ఇది రెండో అత్యధిక స్కోరు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ బెన్ డకెట్ (46 బంతుల్లో 84; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), జేమీ స్మిత్ (26 బంతుల్లో 60;4 ఫోర్లు, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో విజృంభించారు. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 8.5 ఓవర్లలోనే 120 పరుగులు జోడించడంతో ఇంగ్లండ్ మరింత భారీ స్కోరు చేయడం ఖాయమే అనిపించినా.. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (35 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆశించినంత వేగంగా ఆడలేకపోయాడు. జోస్ బట్లర్ (22; 1 ఫోర్, 2 సిక్స్‌లు), జాకబ్ బెథెల్ (16 బంతుల్లో 36 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) ఆకట్టుకున్నారు.



వెస్టిండీస్ బౌలర్లలో రూథర్‌ఫోర్డ్, అకీల్, మోతి తలా ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్యఛేదనలో వెస్టిండీస్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 211 పరుగులు చేసింది. రావ్‌మన్ పావెల్ (45 బంతుల్లో 79 నాటౌట్; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు), షై హోప్ (27 బంతుల్లో 45; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) పోరాడారు. లూయిస్ (9), చార్లెస్ (9), హెట్‌మైర్ (26), రూథర్‌ఫోర్డ్ (1), షెఫర్డ్ (0), హోల్డర్ (25) విఫలమయ్యారు. ఇంగ్లండ్ బౌలర్లలో ల్యూక్ వుడ్ 3, ఆదిల్ రషీద్ 2 వికెట్లు పడగొట్టారు. బట్లర్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ అవార్డు దక్కింది. హ్యారీ బ్రూక్ కెప్టెన్సీలో వన్డే, టి20 సిరీస్‌లు క్లీన్‌స్వీప్ చేసిన ఇంగ్లండ్ జట్టు ఇక సుదీర్ఘ ఫార్మాట్‌పై దృష్టి పెట్టనుంది. ఈ నెల 20 నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ ప్రారంభం కానుంది.

న్యూయార్క్ కెప్టెన్‌గా పూరన్

న్యూయార్క్: ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వెస్టిండీస్ స్టార్ బ్యాటర్ నికోలస్ పూరన్ మేజర్ క్రికెట్ లీగ్ (ఎంఎల్‌సీ)లో ఎంఐ న్యూయార్క్ జట్టుకు సారథిగా ఎంపికయ్యాడు. ‘కొత్త కెప్టెన్ పూరన్‌కు స్వాగతం. ప్రపంచంలోనే అత్యుత్తమ టి20 బ్యాటర్‌లలో ఒకడైన పూరన్ నాయకత్వంలో జట్టు మరింత ముందుకు దూసుకెళ్తుందని నమ్మకంగా ఉన్నాం’ అని ఫ్రాంచైజీ పేర్కొంది. 2023 ఎంఎల్‌సీ సీజన్‌లో 388 పరుగులతో టాప్‌లో నిలిచిన పూరన్... గురువారం నుంచి ప్రారంభం కానున్న మూడో సీజన్‌లో జట్టును నడిపించనున్నాడు. వెస్టిండీస్ జాతీయ జట్టు తరఫున 106 మ్యాచ్‌లాడిన పూరన్ ఐపీఎల్‌లో లక్నో సూపర్ జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. విండీస్ తరఫున అత్యధిక అంతర్జాతీయ టి20లు, అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కిన పూరన్... 61 వన్డేల్లో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్ 18వ సీజన్‌లో లక్నో తరఫున 196.25 స్ట్రయిక్ రేట్‌తో 524 పరుగులు చేశాడు. గతేడాది 170 సిక్స్‌లతో కొత్త రికార్డు నెలకొల్పిన ఈ కరీబియన్ బ్యాటర్... తాజా ఐపీఎల్‌లోనూ 40 సిక్స్‌లు బాదాడు.




41 రష్యా బాంబర్ విమానాలను ధ్వంసం చేసి ఆ దేశానికి భారీ నష్టాలు మిగిల్చిన ఆపరేషన్ స్పైడర్స్ వెబ్‌లో ఉక్రెయిన్ వాడిన డ్రోన్లు. ఉక్రెయిన్ సీక్రెట్ సర్వీస్ వీటిని ప్రత్యేకంగా డిజైన్ చేసింది



ఎల్జీబీటీక్యూ సమూహాలకు మద్దతుగా ఇంద్రధనుస్సు రంగులతో రూపొందిన జీబ్రా క్రాసింగ్. బుధవారం బ్యాంకాక్‌లోని సంయన్ మిత్ర్ టౌన్ మాల్ వద్ద ఇది అందరి దృష్టినీ ఆకర్షించింది.



రష్యా రాకెట్ దాడుల కారణంగా బుధవారం ఉక్రెయిన్‌లోని ఖర్కీవ్‌లో మంటల్లో తగలబడిపోతున్న నివాస భవనం. ఉక్రెయిన్ ఎమర్జెన్సీ సర్వీస్ ఈ ఫొటోను విడుదల చేసింది.

న్యూయార్క్ మేయర్ రేసులో మీరా నాయర్ కుమారుడు

పోటీలో ముందంజలో ఉన్న జోహ్రాన్ క్వామి మమ్‌దానీ

- ఆకట్టుకుంటున్న ఎన్నికల అజెండా
- దక్షిణాసియా మూలాలను గుర్తుచేస్తూ ప్రచారం



ప్రఖ్యాత సినీ దర్శకురాలు మీరా నాయర్ కుమారుడు, ఇండియన్–అమెరికన్ రాజకీయ నాయకుడు జోహ్రాన్ క్వామి మమ్‌దానీ అమెరికా వాణిజ్య రాజధాని న్యూయార్క్ మేయర్ పదవికి పోటీ పడుతున్నాడు. ఒడిశాలో జన్మించిన మీరా నాయర్ 'మీరాబాయి ఫిలిమ్స్'బ్యానర్ కింద పలు చిత్రాలు నిర్మించడంతోపాటు దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. కామసూత్ర, మాన్‌సూన్ వెడ్డింగ్, సలామ్ బాంబే వంటి చిత్రాలతో ఆమె సంచలనం సృష్టించారు. డెమొక్రటిక్ పార్టీ సభ్యుడైనా ఆమె కుమారుడు మమ్‌దానీ ప్రస్తుతం న్యూయార్క్ స్టేట్ అసెంబ్లీ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. న్యూయార్క్ సిటీ మేయర్ ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయి. ఈ పదవికి మాజీ గవర్నర్ ఆండ్రూ కొమో పేరు ప్రస్తుతం ప్రముఖంగా వినిపిస్తోంది. మరోవైపు ఆయనకు మమ్‌దానీ గట్టి పోటీనిస్తున్నాడు. నిధుల సేకరణ, నూతన ఆలోచనలు, ఆశయాలతోపాటు టెక్నాలజీని విస్తృతంగా వాడుకుంటూ జనాదరణ పొందే ప్రయత్నం చేస్తున్నాడు. ఆండ్రూ కొమోను ఓడించడం ఖాయమని ధీమాగా చెబుతున్నాడు. ఒకవేళ మమ్‌దానీ అనుకున్న లక్ష్యం సాధిస్తే.. న్యూయార్క్ సిటీకి మొట్టమొదటి ముస్లిం మేయర్‌గా, తొలి ఇండియన్–అమెరికన్ మేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు.

ఎవరీ మమ్‌దానీ?

జోహ్రాన్ మమ్‌దానీ 1991 అక్టోబర్ 18న ఉగాండాలోని కంపాలాలో జన్మించాడు. ఆయన తండ్రి మహమూద్ మమ్‌దానీ, తల్లి మీరా నాయర్. మహమూద్ మమ్‌దానీ ఉగాండాతో ప్రముఖ మార్కిస్ట్ పండితుడు. జోహ్రాన్‌కు ఐదేళ్ల వయసున్నప్పుడు ఆ కుటుంబం దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌కు చేరుకుంది. రెండేళ్ల తర్వాత అమెరికాలోని న్యూయార్క్‌లో స్థిరపడింది. జోహ్రాన్ మమ్‌దానీకి 2018లో అమెరికా పౌరసత్వం లభించింది. బ్రాంక్స్ హైస్కూల్ ఆఫ్ సైన్స్‌తోపాటు బౌడిన్ కాలేజీలో విద్యాభ్యాసం చేశాడు. కాలేజీలో ఉన్నప్పుడు రాజకీయాలపై ఆసక్తి చూపించేవాడు. స్థానికంగా రాజకీయ, సేవ కార్యక్రమాల్లో వాలంటరీగా సేవలందించేవాడు. 2017లో డెమొక్రటిక్ సోషలిస్టు ఆఫ్ అమెరికా అనే సంస్థలో చేరాడు. తర్వాత డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా 2020, 2021, 2022, 2024లో న్యూయార్క్ స్టేట్ అసెంబ్లీకి ఎన్నికయ్యాడు. క్వీన్స్ 36వ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. చట్టసభల్లో చురుగ్గా పని చేస్తున్నాడు. 20 బిల్లును ప్రతిపాదించగా, అందులో మూడు బిల్లులు చట్టాలుగా మారాయి. న్యూయార్క్ మేయర్ రేసులో 2024 అక్టోబర్ 23న అడుగుపెట్టాడు. జోహ్రాన్ మమ్‌దానీలో మంచి కళాకారుడు కూడా ఉన్నాడు. 2019లో 'నానీ'పేరిట ఒక మ్యూజిక్ వీడియో విడుదల చేశాడు. షియా ముస్లిం మతస్థుడైన మమ్‌దానీ ఇటీవలే రమా దువాజీని వివాహం చేసుకున్నాడు. ఆమె సిరియాలో జన్మించారు. పలు పత్రికల్లో చిత్రకారిణిగా పనిచేశారు. మమ్‌దానీ దంపతులు క్వీన్స్‌లోని ఆస్టోరియాలో నివాసం ఉంటున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పాలస్తీనాకు మద్దతు

మమ్‌దానీ ఎన్నికల అజెండా ప్రజలను ఆకట్టుకుంటోంది. నగరంలో అద్దెలపై ఫ్రీజింగ్ విధిస్తానని, రవాణా, శిశు సంరక్షణ సేవలు ఉచితంగా అందిస్తానని, కనీస వేతనాన్ని 30 డాలర్లకు పెంచుతానని మమ్‌దామీ హామీ ఇస్తున్నారు. ఇక ఇజ్రాయెల్–పాలస్తీనా వివాదంలో మమ్‌దానీ పాలస్తీనాకు బహిరంగంగా మద్దతు పలుకుతున్నాడు. గాజాలో వెంటనే కాల్పుల విరమణ పాటించాలని ఇజ్రాయెల్‌ను డిమాండ్ చేస్తున్నారు. అన్ని రకాల వివక్షకు ఆయన బద్ధ వ్యతిరేకి. అలాగే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలను మమ్‌దానీ నిశితంగా విమర్శిస్తున్నాడు. ఎన్నికల ప్రచారంలో తన దక్షిణాసియా మూలాలను పదేపదే గుర్తుచేస్తున్నాడు. హిందీ భాషలో ఒక వీడియో విడుదల చేశాడు. ఇందులో బాలీవుడ్ సినిమాలు, డైలాగ్‌ల ప్రస్తావన ఉంది. బిలియనీర్స్ కే పాస్ ఆల్రెడీ సబ్ కుచ్ హై, అబ్ ఆప్‌కా టైమ్ ఆయేగా(ధనవంతులకు అన్నీ ఉన్నాయి. ఇప్పుడు మీ వంతు వస్తుంది) అని ఓటర్లకు చెబుతున్నాడు. ఈ నెల 24న మేయర్ ఎన్నిక జరుగనుంది. ర్యాంక్డ్–చాయిస్ వోటింగ్ సిస్టమ్ ద్వారా మేయర్‌ను ఎన్నుకుంటున్నారు. అంటే ఓటర్లు తమ ప్రాధాన్యత ప్రకారం ఐదుగురు అభ్యర్థులకు ర్యాంకులు ఇస్తారు. ఈ ర్యాంకుల్లో అగ్రస్థానంలో నిలిచిన అభ్యర్థికి మేయర్ పదవి లభిస్తుంది.

యూఎస్‌లో లాటిన్ రగడ

వలసదారుల రగడతో అమెరికా భగ్గుమంటోంది. అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపే క్రమంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన చర్యలు వివాదాలకు దారితీస్తున్నాయి. మెక్సికో వంటి లాటిన్ అమెరికా దేశాల వలసదారులు వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అక్రమ వలసదారులనే అభియోగాలతో లాస్ ఏంజెలెస్‌లో గత శుక్రవారం పదుల సంఖ్యలో లాటిన్ ప్రజలను ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ (ఐసీఈ) విభాగం అరెస్టు చేసింది. వాటిని వ్యతిరేకిస్తూ మొదలైన ఆందోళనలు చూస్తుండగానే తీవ్ర రూపు దాలుస్తున్నాయి. లాటిన్లు భారీ సంఖ్యలో రోడ్లపైకి వచ్చి నిరసనలకు విధ్వంసానికి పాల్పడుతున్నారు. జాతీయ బలగాల మోహరింపు, మూకుమ్మడి అరెస్టులతో కూడా పరిస్థితి అదుపులోకి రాలేదు. అల్లర్లు ఇతర నగరాలకూ విస్తరిస్తుండటంతో లాస్ ఏంజెలెస్‌లో తాజాగా కర్ఫ్యూ విధించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో అమెరికాలో మొత్తం అక్రమ వలసదారులు, వారిలో లాటిన్ అమెరికన్లు ఎందరన్న దానిపై చర్చ జరుగుతోంది.

అంతటా మెక్సికన్ జెండాలే!

లాస్ ఏంజెలెస్ అల్లర్లలో పాల్గొంటున్న నిరసనకారుల్లో ఎవరి చేతుల్లో చూసినా మెక్సికో జెండాలే కన్పిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలవారికి కలల గమ్యస్థానం అమెరికా. దాంతో అనేక దేశాల నుంచి వలసదారులు అక్కడికి సక్రమ, అక్రమ మార్గాల్లో పోటెత్తుతూ వచ్చారు. 2022 గణాంకాల ప్రకారమే అమెరికాలో కోటి 10 లక్షల మందికి పైగా అక్రమ వలసదారులున్నారు. వారిలో ఏకంగా 77 శాతం, అంటే 79 లక్షల పై చిలుకు లాటిన్ అమెరికన్లే. వారిలోనూ ఏకంగా 41 లక్షలతో మెక్సికో తొలిస్థానంలో ఉంది. సెంట్రల్ అమెరికా దేశాల వారు 21 లక్షలు, దక్షిణ అమెరికా నుంచి 10 లక్షలు, కరీబియన్ దీవుల నుంచి 7.3 లక్షల మంది ఉన్నారు. మరోవైపు మూడేళ్లుగా అమెరికాకు వెళ్తున్న శరణార్థుల సంఖ్య కూడా బాగా పెరుగుతోంది. 2016లో 85 వేలుగా నమోదైన శరణార్థులు 2021 నాటికి 11 వేలకు తగ్గారు. కానీ 2024లో ఏకంగా లక్ష మంది పొట్ట చేతపట్టుకుని అమెరికాలో ప్రవేశించారు. వీరిలో ఆఫ్రికా, దక్షిణాసియా దేశాల వారి సంఖ్యే ఎక్కువ.

– సాక్షి, నేషనల్ డెస్క్

అక్రమ వలసదారులు	
మొత్తం సంఖ్య	1.1 కోట్లు
లాటిన్ అమెరికా	79 లక్షలు
ఆసియా	17 లక్షలు
యూరప్, కెనడా	7.8 లక్షలు
ఆఫ్రికా	3.8 లక్షలు
పశ్చిమాసియా	1.8 లక్షలు
ఇతరులు	80 వేల పై చిలుకు

శరణార్థులు	
మొత్తం సంఖ్య (2024లో)	లక్ష పై చిలుకు
ఆఫ్రికా	34,017
ఆసియా	37,521
లాటిన్ అమెరికా	
కరీబియన్	25,358
యూరప్	3,180

ఔను, నేనే చంపించా!

'హనీమూన్' కేసులో సోనమ్ అంగీకారం

- విచారణలో వివరాలన్నీ ఏకరువు పెట్టిన వైనం

షిల్లాంగ్: దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన హనీమూన్ హత్య కేసులో నిందితురాలు సోనమ్ తన నేరం అంగీకరించింది. హనీమూన్ పేరుతో పథకం ప్రకారమే భర్త రాజా రఘువంశీని మేఘాలయ తీసుకెళ్లి ప్రియుడు రాజ్ కుష్వాహా సాయంతో చంపించినట్టు పోలీసుల విచారణలో వెల్లడించింది. సోమవారం యూపీలోని గాజీపూర్‌లో అదుపులోకి తీసుకున్న ఆమెను మంగళవారం రాత్రి షిల్లాంగ్ తీసుకొచ్చారు. తనకేమీ తెలియదంటూ బుధవారం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ముందు సోనమ్ తొలుత బుకాయించింది. తమపై ఎవరో దాడి చేశారని, తాను బాధితురాలినని పాత కథే వినిపించింది. దాంతో సిట్ తనదైన శైలిలో విచారించింది. రాజాను చంపేశాక హంతకులను సోనమ్ కలుసుకున్న సీసీటీవీ ఫుటేజీ, వాళ్లతో ఆమె ఫోన్ సంభాషణల తాలూకు కాల్ రికార్డులు తదితర సాక్ష్యాధారాలు ముందు పెట్టడంతో ఆమె ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. బోరున విలపిస్తూ నేరాన్ని అంగీకరించింది. మర్డర్ ప్లాన్‌ను పూసగుచ్చినట్లు వెల్లడించింది. ప్రియుడు, కిరాయి హంతకులతో కలిసి భర్తను చంపేశానని వెల్లడించింది. కుష్వాహా, కిరాయి హంతకులు విశాల్ సింగ్ చౌహాన్, ఆకాశ్ రాజ్‌పుత్, ఆనంద్ కుర్మీ మంగళవారమే నేరాన్ని అంగీకరించడం తెలిసిందే. హత్య సమయంలో సోనమ్ అక్కడే ఉందని, రాజాను తాము చంపుతుండగా కళ్లారా చూసిందని కూడా వారు తెలిపారు. దోషులు ఇక శిక్ష నుంచి తప్పించుకోలేరని షిల్లాంగ్ ఎస్పీ వివేక్ చెప్పారు.

8 రోజుల పోలీసు కస్టడీ

సోనమ్, కుష్వాహా, ఇతర నిందితులను షిల్లాంగ్ కోర్టు 8 రోజుల పోలీసు కస్టడీకి అప్పగించింది. సీన్ రీకన్‌స్ట్రక్షన్ నిమిత్తం నిందితులను పోలీసులు ఘటనా స్థలికి, మధ్యప్రదేశ్‌కు తీసుకెళ్లనున్నారు. ఘాతుకానికి పాల్పడ్డ సోనమ్‌తో సంబంధాలు తెంచుకున్నట్టు ఆమె సోదరుడు గోవింద్ చెప్పాడు. రాజా కుటుంబాన్ని క్షమాపణలు కోరాడు. ''సోనమ్‌ను ఆమె ప్రియుడు కుష్వాహా చెల్లీ అని పిలిచేవాడు. తన మూడేళ్లుగా అతనికి రాఖీ కూడా కడుతోంది. వారి అక్రమ సంబంధం గురించి ముందే తెలిస్తే ఈ ఘోరం జరగనిచ్చేవాళ్లం కాదు''అంటూ వాపోయాడు. భర్తనే హత్య చేయించిన సోనమ్‌ను ఉరి తీయాలన్నాడు.

కొండపై నుంచి తోసేస్తా!

- భర్త హత్యకు సోనమ్ ప్లాన్ 'బి'
- పెళ్లయిన 4 రోజులకే పథకం



సోనమ్



రాజా రఘువంశీ

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన రాజాకు మే 11న సోనమ్‌తో పెళ్లయింది. హనీమూన్‌కు మేఘాలయ వెళ్లిన ఆ జంట 23వ తేదీ నుంచి కనిపించకుండా పోయింది. 10 రోజుల తర్వాత ఓ లోయలో రాజా మృతదేహం దొరికింది. ఈ హనీమూన్ హత్యోదంతంలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సంచలనం రేపిన ఈ కేసు దర్యాప్తుకు పోలీసులు 'ఆపరేషన్ హనీమూన్'అని పేరుపెట్టారు. వారు వెల్లడించిన వివరాల మేరకు... పెళ్లి తర్వాత నాలుగు రోజులకు సోనమ్ తన అమ్మగారింటికి వెళ్లింది. ప్రియుడు కుష్వాహాతో కలిసి ఫోన్లోనే హత్యా పథకం రూపొందించింది. ''నువ్వేం కంగారు పడకు. కిరాయి హంతకులతో పని కాని పక్షంలో ఫొటో తీసే నెపంతో రాజాను నేనే స్వయంగా కొండ మీదినుంచి కిందకు తోసి చంపేస్తా''అని ప్రియునికి భరోసా ఇచ్చింది! రాజాకు మాయ మాటలు చెప్పి పెళ్లయిన నాటినుంచి హత్యకు గురయ్యేదాకా అతనితో శారీరకంగా కలవకుండా జాగ్రత్త పడుతూ వచ్చింది.



బుధవారం రఫాలో అమెరికా దన్నుతో నడుస్తున్న వితరణ కేంద్రం నుంచి ఆహార పదార్థాలు, మానవతా సాయంతో కూడిన బ్యాగులను తీసుకెళ్తున్న పాలస్తీనావాసులు

పాలస్తీనా పౌరులపై పాశవిక కాల్పులు

గాజాలో మరో 36 మంది మృతి.. 207 మందికి గాయాలు

గాజా: కాలే కడుపులతో పిల్లా పాపలతో కలిసి ఆహారం కోసం ఎగబడుతున్న అమాయక పాలస్తీనా పౌరులపైనా ఇజ్రాయెల్ సైన్యం నిర్దాక్షిణ్యంగా దాడులకు దిగుతోంది. విదేశాలు పంపిస్తున్న మానవతా సాయం కోసం అందుకోకుండానే జనం విగత జీవులవుతున్నారు. గాజాలో ఆహార పంపిణీ కేంద్రాల వద్ద బారులు తీరిన పాలస్తీనా పౌరులపై మంగళవారం అర్ధరాత్రి తర్వాత ఇజ్రాయెల్ సైనికులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 36 మంది మరణించారని, 207 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్య శాఖ ప్రకటించింది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించినట్లు వెల్లడించింది. గాజాలో సుదీర్ఘ విరామం తర్వాత ఇజ్రాయెల్ ప్రభుత్వం ఆంక్షలు తొలగించడంతో ఇటీవలే మానవతా సాయం పంపిణీ ప్రారంభమైంది. ఆహారం, మంచినీరు, ఔషధాలు, దుస్తుల కోసం జనం గంటల తరబడి వేచి చూస్తున్నారు. వారు తమపై దాడులకు ప్రయత్నించారన్న సాకుతో ఇజ్రాయెల్ సేనలు కాల్పులు జరుపుతుండడం ఆందోళన కలిగిస్తోంది. మానవతా సాయం పంపిణీ కేంద్రాల వద్ద గత కొన్ని రోజులుగా జరుగుతున్న కాల్పుల్లో 163 మంది మృతిచెందారు. 1,495 మంది గాయాలపాలయ్యారు. ఈ కేంద్రాలన్నీ మిలటరీ జోన్లలోనే ఉన్నాయి. ఇక్కడికి స్వతంత్ర మీడియాను అనుమతించడం లేదు. మరోవైపు కాల్పుల విరమణపై హమాస్‌తో చర్చలు జరుగుతున్నాయని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ ప్రకటించారు. ఈ చర్చల్లో అర్థవంతమైన ప్రగతి సాధించామని, హమాస్ చెరలో ఉన్న 55 మంది బందీలు త్వరలో విడుదలవుతారన్న నమ్మకం ఉందని పేర్కొన్నారు. హమాస్, ఇజ్రాయెల్ మధ్య 2023 అక్టోబర్ 7న యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే. గత 20 నెలలుగా ఇరువర్గాల మధ్య దాడులు, ప్రతిదాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా 55,104 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించినట్లు గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. అలాగే 1,27,394 మంది గాయపడ్డారని తెలియజేసింది. ఇజ్రాయెల్ వైమానిక, క్షిపణి దాడుల్లో గాజా భూభాగం చాలావరకు ధ్వంసమైంది. 90 శాతం మంది నిరాశ్రయులయ్యారు. ఇప్పటివరకు 20,000 మంది హమాస్ మిలిటెంట్లను హతమార్చామని ఇజ్రాయెల్ చెబుతోంది. కానీ, అందుకు ఆధారాలేవీ చూపించడం లేదు.

ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్ ఆవిర్భావం సహజమే

మాజీ ఐసీఎంఆర్ చీఫ్ భార్గవ భరోసా

న్యూఢిల్లీ: కరోనా వైరస్‌లలో కొత్తగా ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్ పుట్టడంపై పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది సార్స్–కోవ్–2 వేరియంట్‌లో సహజ ఉత్పరివర్తనమని భారత వైద్యపరిశోధనా మండలి(ఐసీఎంఆర్) మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ బలరాం భార్గవ చెప్పారు. భారత్‌లో వెలుగుచూసిన కరోనా పాజిటివ్ కేసుల్లో 200 కేసులు ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్ కారణంగా సోకాయని నిర్ధారణ కావడంతో ఈ అంశంపై భార్గవ స్పందించారు. ''సార్స్–కోవ్–2 తరచూ సహజంగా పరివర్తనం చెందుతోంది. దాని ఉత్పరివర్తనమే ఎక్స్‌ఎఫ్‌జీ. ఇది సహజ ఆవిర్భావమే'' అని ఆయన అన్నారు. జూన్ 11వ తేదీనాటికి దేశవ్యాప్తంగా కరోనా క్రియాశీలక కేసుల సంఖ్య 7,000 మార్కును దాటింది. గత 24 గంటల్లోనే 300 కొత్త కేసులు నమోదయ్యాయి. ఆరుగురు కోవిడ్ కారణంగా కన్నుమూశారని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. సార్స్–కోవ్–2 జన్యువిశ్లేషణ కన్సార్షియం(ఇన్సాకాగ్) తాజా గణాంకాలప్రకారం దేశవ్యాప్తంగా 206 దాకా ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్ కేసులున్నాయి. పలు రాష్ట్రాల్లో ఎక్స్‌ఎఫ్‌జీ కేసులున్నాయి. వాటిలో అత్యధికంగా మహారాష్ట్ర నుంచి 89, పశ్చిమబెంగాల్ నుంచి 49, కేరళలో 15, తమిళనాడులో 16, గుజరాత్‌లో 11, మధ్యప్రదేశ్‌లో 6, ఆంధ్రప్రదేశ్‌లో ఆరు, ఒడిశాలో మూడు, తెలంగాణ ఒక కేసు నమోదయ్యాయి. ''మానవ వ్యాధినిరోధక వ్యవస్థను ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్ ఏమార్చగలదని తొలుత వార్తలొచ్చాయి. వాటిల్లో నిజం లేదు. ఈ వేరియంట్ సోకిన వారిలో వ్యాధి ముదురుతుందనే బలమైన ఆధారాలు లేవు'' అని భార్గవ అన్నారు.

11 ఏళ్లలో 33 తప్పులు

మోదీ పాలన మొత్తం అబద్ధాలు, మోసాలే: ఖర్గే

కలబురిగి: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం 11 ఏళ్లలో 33 తప్పులు చేసిందని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. కేవలం అబద్ధాలు, మోసాలతో మోదీ కాలం గడిపేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలోకి వచ్చాక యువతను నిలువునా దగా చేశారని, ఓట్ల కోసం పేదలను వాడుకున్నారని మోదీపై మండిపడ్డారు. ప్రధానమంత్రి మోసాలపై పార్లమెంట్‌లోనూ తాను గళమెత్తానని తెలిపారు. తాను 65 ఏళ్లుగా రాజకీయాల్లో కొనసాగుతున్నానని, ఇందులో 55 ఏళ్లు పదవుల్లో ఉన్నానని, నరేంద్ర మోదీ లాంటి మోసకారి ప్రధానమంత్రిని ఏనాడూ చూడలేదని ధ్వజమెత్తారు. బుధవారం కర్ణాటకలోని కలబురిగిలో మల్లికార్జున ఖర్గే మీడియా సమావేశంలో మాట్లాడారు. చెప్పింది మోదీ ఏనాడూ చేయలేదని, అదేమిటని ప్రశ్నిస్తే ఆయన దగ్గర సమాధానం ఉండదని విమర్శించారు. ఆయనకు అబద్ధాలు తప్ప మరొకటి తెలియదన్నారు. మోదీ తప్పుల జాబితాలో పెద్దనోట్ల రద్దు, ఉద్యోగాల సృష్టి జరగకపోవడం, పంటలకు కనీస మద్దతు దక్కపోవడం వంటివి ఎన్నో ఉన్నాయని తెలిపారు. ఇవన్నీ తప్పులన్న విషయం ప్రధాని అంగీకరించడం లేదని విమర్శించారు. చేసిన తప్పులకు ప్రజలకు క్షమాపణ చెప్పకపోగా మాటలతో మభ్యపెడుతున్నారని దుయ్యబట్టారు. 11 ఏళ్లు గడిచిపోయానని, ఇప్పటిదాకా చేసిందేమీ లేదని ఆక్షేపించారు.

డిప్యూటీ స్పీకర్‌ను నియమించాలి

లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని ఖాళీగా కొనసాగిస్తుండడాన్ని ఖర్గే తప్పుపట్టారు. రాజ్యాంగం ప్రకారం డిప్యూటీ స్పీకర్‌ను నియమించాలని సూచిస్తూ ప్రధాని మోదీకి లేఖ రాశానని చెప్పారు. రాజ్యాంగం ప్రకారమే ప్రభుత్వం నడుచుకోవాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డిప్యూటీ స్పీకర్ పోస్టు ఖాళీగా ఉన్న దాఖలాలు ఏనాడూ లేవని వెల్లడించారు.

బడుగు విద్యార్థులకు సకాలంలో స్కాలర్‌షిప్‌లు

మోదీకి లేఖలో రాహుల్ డిమాండ్

న్యూఢిల్లీ: దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీ, మైనార్టీ విద్యార్థుల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థుల వసతి గృహాల్లో వసతులు అధ్వాన్నంగా మారడంతో వారు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వారికి సకాలంలో ఉపకార వేతనాలు అందజేయాలని కోరుతూ తాజాగా ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. దేశంలోని విద్యార్థుల్లో 90 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈబీసీ, మైనార్టీ వర్గాలకు చెందినవారేనని గుర్తుచేశారు. ఇటీవల తాను బిహార్‌లోని దర్భంగాలో అంబేడ్కర్ హాస్టల్ సందర్శించానని, అక్కడ ఒక్కో గదిలో ఏడుగురు విద్యార్థులు సర్దుకుపోతున్నారని, కనీస వసతులు కూడా సరిగ్గా లేవని తెలిపారు. పోస్టు–మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందకపోవడంతో చదువులు మానేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. హాస్టల్, స్కాలర్‌షిప్‌ల సమస్య దేశవ్యాప్తంగా ఉందన్నారు.

ఖర్కీవ్‌పై రష్యా డ్రోన్ దాడులు

ముగ్గురి మృతి.. 64 మందికి గాయాలు

కీవ్: ఈశాన్య ఉక్రెయిన్‌లోని ఖర్కీవ్‌పై రష్యా సేనలు బుధవారం అర్ధరాత్రి తర్వాత భారీఎత్తున క్షిపణులు ప్రయోగించాయి. ఈ దాడుల్లో ముగ్గురు మరణించారని, 64 మంది గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. డ్రోన్ల దాడులతో కొన్ని భవనాల్లో మంటలు వ్యాపించాయి. అత్యవసర సహాయక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి మంటలు ఆర్పివేశారు. గ్యాస్, విద్యుత్, నీటి సరఫరాను పునరుద్ధరించారు. రష్యా డ్రోన్ దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా స్పందించారు. రష్యా చర్యలను సహించే ప్రసక్తే లేదని, దాడులకు ప్రతిదాడులు కచ్చితంగా ఉంటాయని హెచ్చరించారు.

దిగ్విజయ్ సోదరుడు లక్ష్మణ్‌పై కాంగ్రెస్ వేటు

రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలకు పార్టీ క్రమశిక్షణ చర్య

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్‌సింగ్ తమ్ముడు లక్ష్మణ్ సింగ్‌ను పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించారు. పార్టీవ్యతిరేక కార్యకలాపాలకు లక్ష్మణ్ పాల్పడుతున్నారని పార్టీ క్రమశిక్షణ చర్యల కమిటీ కార్యదర్శి తారిఖ్ అన్వర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పహల్గాం విషయంలో ఎలా స్పందించాలనే కనీస పరిపక్వత రాహుల్, ఆయన బావ రాబర్ట్ వాద్రాలకు లేదు. వీళ్ల అపరిపక్వ వైఖరి విపరిణామాలను దేశం చవిచూస్తోంది. రోడ్లపై ముస్లింలను నమాజ్‌కు అనుమతించనందుకే ఉగ్రవాదులు ఇలా దాడులు చేస్తున్నారని రాబర్ట్‌వాద్రా అన్నారు''అని లక్ష్మణ్‌సింగ్ ఇటీవల వ్యాఖ్యానించారు. దీనిపై క్రమశిక్షణ కమిటీకి ఫిర్యాదులు రావడంతో పార్టీ ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

బట్టమేక పక్షి శాస్త్రీయ నామం?

జీవశాస్త్ర పరిచయం

భూమిపై ఎన్నో వైవిధ్యభరితమైన జీవులుంటాయి. జీవుల శాస్త్రీయ అధ్యయనమే బయాలజీ. సుమారు 4.5-5 బిలియన్ ఏళ్ల క్రితం భూమి ఏర్పడింది. భూమి ఏర్పడిన 1 నుంచి 1.5 బిలియన్ ఏళ్ల తర్వాత జీవం ఆవిర్భవించింది. ఆ తర్వాత జరిగిన జీవ పరిణామం ద్వారా ఎన్నో రకాలు జీవులు ఆవిర్భవించాయి.

- భూమిపై జీవ ఆవిర్భావాన్ని వివరించే సిద్ధాంతాల్లో ప్రధానమైంది పాన్‌స్పెర్మియ, జీవావిర్భావ సిద్ధాంతాలు. పాన్‌స్పెర్మియ సిద్ధాంతం ప్రకారం భూమిపై జీవులు ఆవిర్భవించనే లేదు. భూమి వెలుపల నుంచి గ్రహ శకలాల ద్వారా లేదా గ్రహాంతర వాసుల ద్వారా భూమిపైకి చేరి ఆ తర్వాత పరిణామం చెందాయని ఈ సిద్ధాంతం వి వరిస్తోంది. స్వాంటి అర్హీనియస్ దీన్ని వివరించాడు. ప్రస్తుతం అధిక ఆమోదంలో ఉన్న సిద్ధాంతం Theory of orgin of life(జీవావిర్భావ సిద్ధాంతం). దీన్ని A.I. ఒపారిన్ అనే రష్యాకు చెందిన జియోకెమిస్ట్, జేబీఎస్ హాల్డేన్ అనే బ్రిటన్ జన్యుశాస్త్రవేత్తలు స్వతంత్రంగా ప్రతిపాదించారు. వీరు ప్రతిపాదించిన వివరాల ప్రకారం భూమిపై జీవావిర్భావానికి ముందు జీవ రసాయనాలు ఆవిర్భవించాయి.
- పూర్వభూమి వాతావరణం కార్బన్, హైడ్రోజన్, నత్రజని వాయువుల మిశ్రమంగా ఉండేది. నీరు, నీటి ఆవిరి ఉన్నప్పటికీ స్వేచ్ఛా ఆక్సిజన్ ఉండేది కాదు. ఇలాంటి వాతావరణాన్ని క్షయకరణ (Reducing) వాతావరణం అంటారు. అప్పటి అధిక ఉష్ణోగ్రతల ప్రభావానికి కార్బన్, హైడ్రోజన్, నత్రజని మధ్య రసాయన చర్యలు జరిగి మీథేన్, హైడ్రోజన్ సయనైడ్, అమోనియా లాంటివి ఏర్పడ్డాయి. వీటితో నీటి ఆవిరి చర్యపొందడం ద్వారా ప్రస్తుతం కేవ లం జీవుల్లో మాత్రమే కనిపించే అమైనో ఆమ్లాలు, చక్కెరలు, కొవ్వు ఆమ్లాలు, నత్రజని క్షారాలు లాంటి సరళ జీవ రసాయనాలు ఏర్పడ్డాయి. ఈ సరళమైన అణువుల మధ్య చర్యల ద్వారా ప్రోటీన్లు, కొవ్వులు, కేంద్రకామ్లాలు, పిండి పదార్థాలు తయారయ్యాయి. సముద్ర నీటిలో ఈ రసాయనాలు కలిసిపోయి జరిగిన కొన్ని చర్యల ద్వారా పూర్వపర జీవకణం ఏర్పడింది.
- భూమిపై ఏర్పడిన మొదటి జీవులన్నీ అవాయుజీవులు (Anaerobes). వీటి చర్యల ద్వారా నీటి అణువు విచ్ఛిన్నమై క్రమంగా స్వేచ్ఛా ఆక్సిజన్ విడుదలైంది. ఆ తర్వాత మొక్కలు ఆవిర్భవించి వాటిలోని కిరణజన్య సంయోగక్రియ ద్వారా మరింత ఆక్సిజన్ వాతావరణంలోకి విడుదలైంది. ప్రస్తుతం భూమిపై ఉన్న 21 శాతం ఆక్సిజన్‌కు ప్రధాన మూలం మొక్కల్లోని కిరణజన్య సంయోగ క్రియ. భూమిపై జీవం ఆవిర్భవించిన తర్వాత, జీవ పరిణా మం జరిగింది. సరళ స్థాయి నుంచి సంక్లిష్ట స్థాయి జీవులు ఎలా పరిణామం చెందాయన్నది మూడు ప్రధాన సిద్ధాంతాలు వివరిస్తాయి. వీటిలో మొదటిది 'ఫ్రాన్స్‌కు చెందిన జంతుశాస్త్రవేత్త జె.బీ. లామార్క్ ప్రతిపాదించిన ఆర్జిత లక్షణాల అనువంశిక సిద్ధాంతం (Theory of Inheritance of Aquired characters). పర్యావరణ ప్రభావం ద్వారా జీవుల్లో కొత్త లక్షణా లు ఏర్పడి అవి తర్వాతి తరాలకు అవిచ్ఛిన్నంగా సంక్రమించడం ద్వారా కొత్త జాతు లు ఆవిర్భవిస్తాయని ఈ సిద్ధాంతం వివరిస్తుంది. ఇంగ్లండ్‌కు చెందిన ఛార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన సిద్ధాంతం ప్రకృతివరణ సిద్ధాంతం. దీని ప్రకారం ప్రకృతిలోని పోటీ ఫలితంగా ఆ పోటీ తట్టుకొని నిలిచే జీవజాతులను ప్రకృతి వరిస్తుంది.హ్యూగోడిబ్రీస్ అనే డచ్ వృక్షశాస్త్రవేత్త ఉత్పరివర్తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.
- భూమిపై ఉన్న జీవులను వర్గీకరించడం ద్వారా వాటిపై సమగ్ర అవగాహన సాధ్యమవుతుంది. అన్ని జీవులు పెరుగుదల, జీవక్రియ, ప్రత్యుత్పత్తి లాంటి సమాన లక్షణాలను ప్రదర్శించినప్పటికీ వాటిలోని కొన్ని ప్రత్యేకతల కారణంగా వాటిని విభజించాల్సిన అవసరముంటుంది. భూ మిపై ఉన్న జీవులన్నింటినీ మొక్కలు, జంతువులు అనే రెండు రకాలుగా అరిస్టాటిల్ వర్గీకరించాడు. అనంతరం అనేక సూక్ష్మజీవులను గుర్తించిన తర్వాత వాటిని కూడా కలుపుకొని అర్థవంతంగా వర్గీకరించాల్సిన అవసరం ఏర్పడింది. రాబర్ట్ విట్టేకర్ అనే జీవశాస్త్రవేత్త జీవులన్నింటినీ ఐదు ప్రధాన రాజ్యాలుగా వర్గీకరించాడు. ప్రస్తుతం ఈ వర్గీకరణే ప్రపంచవ్యాప్తంగా వినియోగంలో ఉంది. కణ సంక్లిష్టత, శరీర సంక్లిష్టత, పోషణ ఆధారంగా జీవులను ఐదు రాజ్యాలుగా వర్గీకరించాడు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

I. **మొనీరా రాజ్యం:** కేంద్రక పూర్వ జీవులన్నింటినీ ఈ రాజ్యంలో వర్గీకరించారు. ఇవన్నీ ఏక కణజీవులు. ఇవి కేంద్రక పూర్వ కణాలతో నిర్మితమై ఉంటాయి.
ఉదా: బ్యాక్టీరియా, సయనో బ్యాక్టీరియా (పూర్వనామం: నీలి ఆకుపచ్చ శైవలాలు)

II. **ప్రొటిస్టా రాజ్యం:** నిజ కేంద్రక జీవుల్లో ఏక కణ జీవులను ఈ రాజ్యంలో చేర్చారు. జంతువుల్లో ప్రోటోజోవా అనే ఏక కణ జీవులను,మొక్కల్లోని ఏకకణ శైవలాలను ఈ రాజ్యంలో చేర్చారు.

III. **శిలీంధ్ర రాజ్యం:** మొక్కలు, జంతువులు కానీ శిలీంధ్రాలు (Fungi) ఈ వర్గంలో చేర్చారు. శిలీంధ్రాలు పరపోషకాలు. అత్యధిక శిలీంధ్రాలు విచ్ఛిన్నకారులు. జంతు, వృక్ష కళేబరాలపై ఆధారపడతాయి. శిలీంధ్రాల ద్వారా మానవుల్లో, పంట మొక్కల్లో అనేక వ్యాధులు కలుగుతాయి. ఉదా: కాండిడా, పెన్సీలియం.



IV. **వృక్ష రాజ్యం:** అన్ని బహుకణ మొక్కలను ఈ వర్గంలో చేర్చారు. కిరణ జన్య సంయోగక్రియ ద్వారా వాటి ఆహారాన్ని అవే తయారు చేసుకుంటాయి. ఇవన్నీ స్వయం పోషకాలు.
ఉదా: బహుకణ శైవలాలు, బ్రయోఫైట్స్, టెరిడోఫైట్స్, వివృత బీజాలు, ఆవృత బీజాలు.

V. **జంతురాజ్యం (Animalia):** అన్ని బహుకణ జంతువులను ఈ రాజ్యంలో వర్గీకరించారు. ఇవన్నీ పరపోషకాలు. అత్యధికంగా స్వేచ్ఛా జీవులు.కొన్ని పరాన్న జీవులు కూడా ఉంటాయి.
ఉదా: రక్తాన్ని పీల్చే అడదోమలు, పేగులోని బద్దెపురుగులు. అత్యధిక జంతువులు శాకాహారులు. కొన్ని మాంసాహారులు, మరికొన్ని సర్వభక్షకాలు కూడా ఉంటాయి.

వివిధ జీవుల శాస్త్రీయ అధ్యయనాల పేర్లు

శిలీంధ్రాలు	మైకాలజీ
శైవలాలు	ఫైకాలజీ
మొక్కలు	ఫైటాలజీ/బోటనీ
జంతువులు	జువాలజీ
స్పంజికలు	పారాజువాలజీ
గడ్డి మొక్కలు	అగ్రోస్టాలజీ
వృక్షాలు	డెంద్రాలజీ
క్షీరదాలు	మామోలజీ
పక్షులు	ఆర్నిథాలజీ
సరీసృపాలు	హెర్పటాలజీ
సర్పాలు	సర్పెంటాలజీ/ఒఫియాలజీ
కప్పలు	బాట్రకాలజీ
చేపలు	ఇక్రియాలజీ
కీటకాలు	ఎంటమాలజీ
తిమింగలాలు	సెటాలజీ
సీతాకోక చిలుకలు	లెపిడో టెరాలజీ
సాలీడు	అరెనియాలజీ

మాదిరి ప్రశ్నలు

1. ప్రకృతి అధ్యయనం కోసం 1831-36 మధ్య కాలంలో డార్విన్ ఏ నౌకలో ప్రయాణించాడు?
   1) HMS బీగిల్ 2) టైటానిక్
   3) KSK జైగాంట్ 4) TTS పర్ల్
2. ఏ మొక్కపై పరిశోధన ద్వారా హ్యూగో డిబ్రీస్ ఉత్పరివర్తన సిద్ధాంతాన్ని ప్రతిపా దించాడు?
   1) తోట బఠాని 2) గులాబీ
   3) ఈనోథిర 4) ఏదీకాదు
3. భూమిపై ఆవిర్భవించిన తొలి కణాలకు ఒపారిన్ పెట్టిన పేరు?
   1) ప్రొటినాయిడ్ 2) కొయసర్వేట్
   3) కణం 4) న్యూక్లియాయిడ్
4. కిందివాటిలో సరైంది?
   ఎ) ప్రస్తుత భూమి వాతావరణం ఆక్సీకరణ వాతావరణం
   బి) పూర్వభూమిలోని సముద్రనీరు అంతస్సారు జలం
   1) ఎ మాత్రమే 2) బి మాత్రమే
   3) ఎ, బి 4) ఏదీకాదు
5. కిందివాటిలో శిలీంధ్రం ఏది?
   1) ఈస్టు 2) పుట్టగొడుగు
   3) పెన్సీలియం 4) పైవన్నీ
6. అతిపెద్ద జంతు వర్గం?
   1) మొలస్కా 2) ఆర్థ్రోపొడా
   3) కార్డేటా 4) నిడేరియా
7. జంతు, మొక్క లక్షణాలు రెండూ ఉన్న జీవి?
   1) అమీబా 2) పారమీసియం
   3) ప్లాస్మోడియం 4) యూగ్లీన
8. బట్టమేక పక్షి శాస్త్రీయ నామం?
   1) ప్లటనిస్ట గాంజిటిక
   2) ఆర్డియోటిస్ నైగ్రిసెప్స్
   3) అకినోనిక్స్ జుబేటస్
   4) సిట్టాకుల క్రామెరీ
9. కింది ఏ పక్షులను డార్విన్ పేరుతో పిలుస్తారు?
   1) స్వాలోస్ 2) ఫించ్
   3) వల్చర్ 4) సీగల్
10. మొక్కలన్నింటిలో ఉన్నతమైనవి?
    1) ఆవృత బీజాలు 2) వివృత బీజాలు
    3) బ్రయోఫైట్స్ 4) టెరిడోఫైట్స్
11. కిందివాటిలో ద్విదళబీజం ఏది?
    1) కొబ్బరి 2) మొక్కజొన్న
    3) వరి 4) మామిడి
12. వృక్ష శాస్త్ర పితామహుడు?
    1) అరిస్టాటిల్ 2) థియోఫ్రాస్టస్
    3) లిన్నెయస్ 4) డార్విన్
13. 'డిసెంట్ ఆఫ్ మ్యాన్' గ్రంథ రచయిత?
    1) ఛార్లెస్ డార్విన్ 2) జె.బి. లామార్క్
    3) హ్యూగో డెబ్రీస్ 4) జి.జె. మెండెల్
14. కిందివాటిలో నిజమైన చేప ఏది?
    1) స్కార్పియాన్ ఫిష్
    2) స్టోన్ ఫిష్ 3) పఫర్ ఫిష్
    4) పైవన్నీ
15. కిందివాటిలో బ్యాక్టీరియం ఏది?
    1) నాస్టాక్ 2) అనబీన
    3) రైజోబియం 4) క్యాలోథ్రిక్స్
16. ఈస్టు శాస్త్రీయ నామం?
    1) సెకరో మైసిస్ సెరివిజియే
    2) పెన్సీలియం నొటేటం
    3) కాండిడా ఆల్బికన్స్ 4) ఏదీకాదు
17. కిందివాటిలో పాక్షిక జల క్షీరదం ఏది?
    1) సీల్ 2) వాల్‌రస్
    3) ఆటర్ 4) పైవన్నీ
18. జీవ వైవిధ్యం అత్యధికంగా ఉన్న దేశాల్లో భారత్ స్థానం?
    1) 1 2) 6 3) 12 4) 24
19. శిలీంధ్రం, మొక్క వేర్ల మధ్య ఏర్పడే సహజీవనం?
    1) లైకెన్ 2) మైకోరైజా
    3) మైకోబియాంట్ 4) ఫైకోబియాంట్
20. ప్రస్తుతం ప్రపంచంలో ఎన్ని పులుల ఉపజాతులు ఉన్నాయి?
    1) 6 2) 8 3) 10 4) 12

సమాధానాలు

1) 1; 2) 3; 3) 2; 4) 3; 5) 4; 6) 2; 7) 4; 8) 2; 9) 2; 10) 1; 11) 4; 12) 2; 13) 1; 14) 4; 15) 3; 16)1; 17) 4; 18) 2; 19) 2; 20) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

ఇర్కాన్‌లో 15 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రెగ్యులర్ ప్రాతిపదికన ఎగ్జిక్యూటివ్/సివిల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 15.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో డిగ్రీ(సివిల్ ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.05.2025 నాటికి 33 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.30,000 నుంచి రూ.1,20,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జేజీఎం, హెచ్ఆర్ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ-4, డిస్ట్రిక్ సెంటర్, సాకెట్, న్యూఢిల్లీ-110017 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 13.06.2025.
» **వెబ్‌సైట్:** https://ircon.org

ఎయిమ్స్ మంగళగిరిలో 117 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), మంగళగిరిలో.. వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 117.
» **విభాగాలు:** అనెస్తీషియాలజీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, బర్న్స్-ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్-వ్యాస్క్యులర్ సర్జరీ, కమ్యూనిటీ-ఫ్యామిలీ మెడిసిన్, డెర్మటాలజీ, ఎండోక్రైనాలజీ-మెటబాలిజమ్, ఈఎన్‌టీ, ఫోరెన్సిక్ మెడిసన్-టాక్సికాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ ఆంకాలజీ, మైక్రోబయాలజీ, నియోనెటాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, ఆబెస్ట్రెక్స్-గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్స్, ఫార్మకాలజీ, యూరాలజీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్, డీఎం, ఎంఫిల్, ఎంఎస్సీ, ఎంసీహెచ్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
వయసు: 45 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు మెడికల్ అభ్యర్థులకు రూ.67,000, నాన్ మెడికల్ అభ్యర్థులకు రూ.56,100.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.06.2025.
» **వెబ్‌సైట్:** www.aiimsmangalagiri.edu.in

ఒక కాంతి సంవత్సరం (కి.మీ.లలో)?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సైన్స్

మన విశ్వం

- నక్షత్ర వీధుల్లో చిన్న, చిన్న గుంపుల్లో ఉన్న నక్షత్ర సముదాయాలను తారాగణం లేదా నక్షత్రరాశి అంటారు.
- నక్షత్రరాశుల్లో కొన్నింటిని ఉత్తరార్ధగోళం నుంచి చూడగలిగితే, మరికొన్నింటిని దక్షిణార్ధ గోళం నుంచి మాత్రమే చూడగలం. ఇప్పటివరకు మొత్తం 88 నక్షత్ర రాశులను శాస్త్రజ్ఞులు అధ్యయనం చేశారు.
- సూర్యుడు తిరిగే దారిని సంవత్సర కాలం మొత్తం 12 భాగాలుగా విభజించి, వాటి ఆకారాలను బట్టి నక్షత్ర సముదాయాలను 12 పేర్లతో పిలుస్తున్నారు. ఈ పన్నెండు రాశులను కలిపి రాశిచక్రం అంటారు.
- జ్యోతిష్య శాస్త్రజ్ఞులు ఈ రాశుల తేదీలను బట్టి కాలాలను, రుతువులను, పంచాగాలను గుణిస్తారు.
- రాకెట్లు రెండు రకాలు అవి.. 1. యుద్ధ రాకెట్లు, 2. రోదసీ రాకెట్లు.
- కృత్రిమ ఉపగ్రహం భూమ్యాకర్షణ శక్తిని అధిగమించి నిర్దిష్ట కక్ష్యలో ప్రవేశించేందుకు సెకనుకు 11.2 కి.మీల. వేగం అవసరం.
- కృత్రిమ ఉపగ్రహాలు భూమికి ఉపగ్రహాలుగా పనిచేస్తే, స్పేస్ ప్రోబ్స్ అనేవి ఇతర గ్రహాలను శోధించేందుకు తోడ్పడతాయి.
- ప్రప్రథమంగా రష్యా.. 1957, అక్టోబర్ 4న మానవుడు లేని స్పుత్నిక్-1 అనే అంతరిక్ష నౌకను రోదసీలోకి పంపింది.
- 1961, ఏప్రిల్ 12న రష్యాకు చెందిన కల్నల్ యూరీ గగారిన్.. వస్తోక్ అనే అంతరిక్ష నౌక ద్వారా 83.34 ని।।ల్లో మొట్టమొదటిసారిగా భూ ప్రదక్షిణం చేశాడు.
- 1963లో వస్తోక్-6 అనే అంతరిక్ష నౌకలో రష్యా మహిళ లెఫ్టినెంట్ కల్నల్ వాలెంటీనా టెరిస్కోవా అంతరిక్ష యానం చేసింది.
- 1969, జూలై 21న అమెరికాకు చెందిన అపోలో-11 అనే అంతరిక్ష నౌక ద్వారా నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఎడ్విన్ ఆల్డ్రిన్‌లు ప్రప్రథమంగా చంద్రుడిపై కాలుమోపారు.
- 1984, ఏప్రిల్ 3న భారతదేశానికి చెందిన స్క్వాడ్రన్ లీడర్ రాకేష్‌శర్మ.. సోయూజ్-టి-11 అనే రోదసీ నౌక ద్వారా అంతరిక్షయానం చేశాడు.
- భారతదేశం కూడా రోదసీ పరిశోధనల్లో ఎంతో ప్రగతిని సాధించింది. ఆర్యభట్ట, భాస్కర 1, 2, రోహిణి, ఐఆర్ఎస్, ఇన్‌శాట్ - 1ఎ, 1బి, 1సి, 1డి, 2ఎ, 2బి; పీఎస్ఎల్‌వీ - డి2 మొదలైన ఉపగ్రహాలను ప్రయోగించింది.
- ఆంధ్రప్రదేశ్‌లో శ్రీహరికోట వద్ద రాకెట్ లాంచింగ్ స్టేషన్ (షార్) ఉంది.
- మన విశ్వం వేలకొద్దీ గెలాక్సీలను కలిగి ఉంది. ప్రతి గెలాక్సీలోనూ మిలియన్ల నక్షత్రాలున్నాయి.
- నక్షత్రాలకు వాటి చుట్టూ తిరిగే గ్రహ కూటములున్నాయి.
- గ్రహాలకు వాటి చుట్టూ తిరుగుతూ ఉండే ఉపగ్రహాలుంటాయి. అందువల్ల మన విశ్వం చాలా విశాలమైంది.
- సూర్యుడు పాలపుంత అనే గెలాక్సీకి చెందిన ఒక సామాన్య నక్షత్రం. సూర్యుడు, గ్రహాలు, వాటి ఉపగ్రహాలు, ఆస్టరాయిడ్స్ అన్నింటినీ కలిపి సూర్య కుటుంబం అంటారు.
- గ్రహాలన్నీ సూర్యుడి చుట్టూ వివిధ దీర్ఘ వృత్తాకార మార్గాల్లో తిరుగుతున్నాయి.
- భూమి సహజ ఉపగ్రహం చంద్రుడు.
- భూమి సూర్యుడి చుట్టూ ఒక పరిభ్రమణం పూర్తి చేయడానికి ఒక సంవత్సరం పడుతుంది. అంటే 365 1/4 రోజులు. భూమి తన అక్షం చుట్టూ తాను తిరగడానికి 24 గంటలు పడుతుంది.



- సూర్యుడికి, భూమికి మధ్య దూరాన్ని ఖగోళ ప్రమాణం అంటారు.
  1AU = 1.496×10^{11}మీ।।
- కాంతి ఒక సంవత్సర కాలంలో శూన్యం లో ప్రయాణించే దూరాన్ని కాంతి సంవత్సరం అంటారు.
- ఒక కాంతి సంవత్సరం = 9.3×10^{15} మీ।। = 6.33×10^{4} AU
- పార్‌సెక్ అనేది దూరం ప్రమాణాలన్నింటిలోనూ పెద్దది. ఇది 3.26 కాంతి సంవత్సరాలకు సమానం.
- బుధ గ్రహం పరిభ్రమణ కాలం - 88 రోజులు.
- అత్యధిక పరిభ్రమణ కాలం కలిగిన గ్రహం ప్లూటో (248 సం।।లు).
- గ్రహాలన్నింటిలో పెద్ద గ్రహం - గురుడు (బృహస్పతి)
- గ్రహాలన్నింటిలో చిన్న గ్రహం - బుధుడు.
- సూర్యుడి నుంచి కనిష్ట దూరంలో బుధుడు, గరిష్ట దూరంలో ప్లూటో ఉన్నాయి.
- అత్యధిక ఉపగ్రహాలు ఉన్న గ్రహం-శని (30)
- ఉపగ్రహాలు లేని గ్రహాలు - బుధుడు, శుక్రుడు.
- భూమి మీద మినహా మిగతా గ్రహాలపై ప్రాణులు ఉండటానికి అనుకూల వాతావరణ పరిస్థితులు లేవు.
- బుధ గ్రహం సూర్యుడికి అతి సమీపంలో ఉండటం వల్ల దాని మీద పగలు అతి వేడిగా, రాత్రి అతి చల్లగా ఉంటుంది.
- శుక్ర గ్రహం అతి దట్టమైన మేఘాలతో కప్పి ఉండటం వల్ల సూర్యకాంతి దాని తలాన్ని చేరలేదు.
- శని గ్రహం కిలోమీటర్ల మందం ఉన్న మంచు పొరలతో కప్పి ఉండటం వల్ల అతి చల్లగా ఉంటుంది. కాబట్టి ప్రాణులుండేందుకు అవకాశం లేదు.
- కుజ గ్రహం మాత్రం ఆక్సిజన్, నీటి ఆవిరిలతో కూడిన వాతావరణం కలిగి ఉంది. దాని ఉష్ణోగ్రత 25^0 సెంటీగ్రేడ్ నుంచి 40^0 సెంటీగ్రేడ్‌కి మధ్యలో ఉంటుంది.
- ధ్రువ నక్షత్రాన్ని ఆంగ్లంలో పోలారిస్ అంటారు. ఇది భూమి ఉత్తర ధ్రువానికి ఎదురుగా ఉంది.
- ధ్రువ నక్షత్ర స్థానాన్ని సప్తర్షి మండలం సహాయంతో తెలుసుకోవచ్చు.
- సప్తర్షి మండలాన్ని ఇంగ్లిష్‌లో గ్రేట్‌బేర్ అంటారు.
- గ్రేట్‌బేర్ అనేది నాగలి లేదా గాలిపటం ఆకారంలో ఉంటుంది.
- సూర్యుడు తన చుట్టూ తాను ఒకసారి తిరిగి రావడానికి 25 రోజులు పడుతుంది.
- లీప్ సంవత్సరంలో 366 రోజులుంటాయి. ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.
- సూర్యుడి తర్వాత భూమికి అత్యంత సమీపంలోని నక్షత్రం- ప్రాక్సిమాసెంటారి
- హేలీ తోకచుక్క 76 సంవత్సరాలకు ఒకసారి కనిపిస్తుంది.
- రాశులన్నింటిలో పెద్ద తారాగణం - హైడ్రా
- చంద్రుడిపై వస్తువుల బరువు భూమిపై బరువులో ఆరో వంతు ఉంటుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. చంద్రుడు తన చుట్టూ తాను, అలాగే భూమి చుట్టూ తిరగడానికి పట్టే రోజులు? (డీఎస్సీ-2000)
   1) 30 రోజులు 2) 29 1/2 రోజులు
   3) 92 1/2 రోజులు 4) 29 రోజులు
2. ధ్రువ నక్షత్రం నావికులకు దేన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడుతుంది? (డీఎస్సీ - 2000)
   1) గెలాక్సీ 2) గాలి
   3) దిక్కు 4) వాతావరణం
3. ఒక కాంతి సంవత్సరం (కి.మీ.లలో)? (డీఎస్సీ-2001)
   1) $3\times10^4\times60\times60\times24\times365.25$
   2) $3\times10^2\times60\times60\times24\times365.25$
   3) $3\times10^5\times60\times60\times24\times365.25$
   4) $3\times10^3\times60\times60\times24\times365.25$
4. నక్షత్రాలు కాంతిని నలుదిశలకు వెదజల్లాలంటే వాటిలో ఉండాల్సిన ఉష్ణోగ్రత? (డీఎస్సీ-2002)
   1) 10 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   2) 5 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
   3) 5 మిలియన్ డిగ్రీల ఫారన్‌హీట్
   4) 10 మిలియన్ డిగ్రీల సెంటీగ్రేడ్
5. 1994లో విజయవంతంగా ప్రయోగించిన భారతీయ ఉపగ్రహ నౌక? (డీఎస్సీ-2002)
   1) ఇన్‌శాట్-1బి 2) పీఎస్ఎల్‌వీడీ-2
   3) భాస్కర-2 4) ఆర్యభట్ట
6. సూర్యుడికి, భూమికి మధ్య ఉన్న సగటు దూరం?
   1) 149,000,000 కి.మీ.
   2) 149,598,500 కి.మీ.
   3) 149,593,300 కి.మీ
   4) 149,895,500 కి.మీ.
7. ఏ అంతరిక్ష నౌకల ద్వారా అంగారక గ్రహంపై జీవరాశి లేదని నిరూపించారు? (డీఎస్సీ-2003)
   1) స్కాటర్న్ - 5, స్కాటర్న్ - 6
   2) అపోలో - 11, సోయూజ్-టీ-11
   3) వైకింగ్-1, వైకింగ్-2
   4) సోయూజ్ -టీ-11, శాల్యూట్
8. బుధ గ్రహం పరిభ్రమణ కాలం? (డీఎస్సీ-2006)
   1) 88 రోజులు 2) 248 రోజులు
   3) 365 రోజులు 4) 243 రోజులు
9. స్క్వాడ్రన్ లీడర్ రాకేశ్ శర్మ అంతరిక్ష యానం చేసిన రోజు? (డీఎస్సీ-2006)
   1) 3-6-1984 2) 3-4-1984
   3) 3-4-1985 4) 3-6-1985
10. భూమధ్య రేఖ వద్ద భూమి వ్యాసం కి.మీ.లలో? (డీఎస్సీ - 2008)
    1) 12,576 2) 12,657
    3) 12,756 4) 12,765
11. సూర్యుడి చుట్టూ పరిభ్రమించే గ్రహాల్లో ద్రవ్యరాశిలో రెండో స్థానంలో ఉన్న గ్రహం, ఆత్మభ్రమణ కాలం అన్నింటి కంటే ఎక్కువ ఉన్న గ్రహం వరుసగా? (డీఎస్సీ - 2008)
    1) బృహస్పతి, భూమి
    2) బుధుడు, అంగారకుడు
    3) శని, శుక్రుడు 4) నెప్ట్యూన్, యురేనస్
12. స్పేస్ ప్రోబ్‌కు ఉదాహరణ? (డీఎస్సీ-2008)
    1) పయనీర్ 2) ఆర్యభట్ట
    3) భాస్కర - 2 4) అట్లాంటిస్
13. ఏ గ్రహం మీద ఆక్సిజన్, నీటి ఆవిరితో కూడిన వాతావరణం ఉంది? (డీఎస్సీ-2012)
    1) కుజుడు 2) బుధుడు
    3) బృహస్పతి 4) యురేనస్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 4; 5) 2; 6) 2; 7) 3; 8) 1; 9) 2; 10) 3; 11) 3; 12) 1; 13) 1.

మాదిరి ప్రశ్నలు

1. భారతదేశం మొదటగా భూకక్ష్యలోకి ప్రయోగించిన కృత్రిమ ఉపగ్రహం?
   1) ఆర్యభట్ట
   2) భాస్కర-1
   3) ఇన్‌శాట్ - 1బి
   4) భాస్కర - 2
2. అన్నింటికంటే ప్రకాశంగా కనిపించే గ్రహం?
   1) శని 2) భూమి
   3) శుక్రుడు 4) బుధుడు
3. పగలు, రాత్రి ఏర్పడడానికి కారణం?
   1) భూ పరిభ్రమణం
   2) భూ భ్రమణం
   3) ఉల్కాపాతం
   4) ఏదీకాదు
4. సూర్య గ్రహణం ఏ సందర్భంలో ఏర్పడుతుంది?
   1) భూమి.. చంద్రుడికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   2) చంద్రుడు.. భూమికి, సూర్యుడికి మధ్య వచ్చినప్పుడు
   3) సూర్యుడు భూమి, చంద్రుడి మధ్య వచ్చినప్పుడు
   4) అన్నీ
5. రాశుల్లో అన్నింటికంటే పెద్ద తారాగణం?
   1) సెరస్ 2) ఇంకారస్
   3) హైడ్రా 4) హేలీ
6. రష్యా సహకారంతో భారతదేశంలో రాకెట్ లాంచింగ్ స్టేషన్‌లు ఏర్పర్చిన ప్రదేశాలు?
   1) తుంబా 2) శ్రీహరికోట
   3) ఢిల్లీ 4) 1, 2
7. అత్యధిక ఉపగ్రహాలు కలిగిన గ్రహం?
   1) శని 2) బృహస్పతి
   3) బుధుడు 4) శుక్రుడు
8. ఇప్పటివరకు గుర్తించిన నక్షత్రాల్లో అతిపెద్దది?
   1) సెరస్ 2) ఎప్సిలాన్ అరిగ
   3) హైడ్రా 4) ఇంకారస్
9. మొట్టమొదటి స్పేస్ షటిల్?
   1) అపోలో 2) స్పుత్నిక్
   3) కొలంబియా
   4) వస్తోక్
10. స్కైలాబ్ అనే ప్రయోగాత్మక అంతరిక్ష ప్రయోగ కేంద్రాన్ని ఏ దేశం ఏర్పాటు చేసింది?
    1) రష్యా 2) అమెరికా
    3) ఇండియా 4) సింగపూర్

సమాధానాలు

1) 1; 2) 3; 3) 2; 4) 2; 5) 3; 6) 4; 7) 1; 8) 2; 9) 3; 10) 2.

రాజ్యాంగ రిట్లలో 'ఆజ్ఞ' అనేది దేని అర్థం?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

మాదిరి ప్రశ్నలు

1. వివిధ ప్రకరణలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
ఎ) ప్రకరణ 43ఎ - కార్మికులకు యాజమాన్యంలో భాగస్వామ్యం కల్పించడం
బి) ప్రకరణ 43బి: సహకార సంఘాలను ప్రోత్సహించడం
సి) ప్రకరణ 48ఎ - అడవులు, వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలి
డి) ప్రకరణ 39ఎ - సమన్యాయం, ఉచిత న్యాయ సహాయం
1) ఎ, బి, సి 2) బి, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

2. స్పీకర్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
1) స్పీకర్‌ను రాష్ట్రపతి తొలగించవచ్చు
2) ఎన్నిక సమయంలో స్పీకర్ సభలో సభ్యుడు కానవసరం లేదు. కానీ నియమించిన ఆరు నెలల్లో పార్లమెంట్‌కు ఎన్నికవ్వాలి
3) సభ సాధారణ కాలపరిమితి కంటే ముందే రద్దయితే దానితో పాటే స్పీకర్ కూడా తన పదవిని కోల్పోతారు
4) రాజీనామా పత్రాన్ని డిప్యూటీ స్పీకర్‌కు సమర్పించాలి

3. కింది వాటిలో భారత ఎన్నికల సంఘం విధులు ఏవి?
ఎ) లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ ఉపాధ్యక్షుడి ఎన్నిక నిర్వహించడం
బి) కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల నిర్వహణ
సి) ఎన్నికలకు సంబంధించిన అనుమానాలు, వివాదాలపై నిర్ణయం
1) ఎ, బి 2) ఎ, సి
3) బి, సి 4) పైవేవీకావు

4. అతి తక్కువ కాలం పదవిలో ఉన్న రాష్ట్రపతి ఎవరు?
1) సర్వేపల్లి రాధాకృష్ణన్
2) జాకీర్ హుస్సేన్ 3) జ్ఞానీ జైల్ సింగ్
4) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్

5. రాజ్యసభ ద్రవ్యబిల్లుకు సవరణలు సూచించినప్పుడు..?
1) లోక్‌సభ ఆ సవరణలను ఆమోదించవచ్చు, తిరస్కరించవచ్చు
2) లోక్‌సభ ఆ ద్రవ్య బిల్లును వదిలేస్తుంది
3) లోక్‌సభ ఆ ద్రవ్య బిల్లును రాజ్యసభకు పునఃపరిశీలనకు పంపిస్తుంది
4) రాష్ట్రపతి ఆ ద్రవ్య బిల్లు గురించి ఉభయ సభల సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తారు

6. కింది వాక్యాల్లో సరైంది ఏది?
1) ఒక వ్యక్తిని ఏక కాలంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు గవర్నర్‌గా నియమించరాదు
2) సుప్రీంకోర్టు న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమించిన విధంగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులను గవర్నర్ నియమిస్తారు
3) గవర్నర్‌ను పదవి నుంచి తొలగించే విధానం రాజ్యాంగంలో పేర్కొనలేదు
4) కేంద్రపాలిత ప్రాంతాలకు శాసనసభ ఉంటే లెఫ్టినెంట్ గవర్నర్ మెజార్టీ పార్టీ నాయకుడిని సీఎంగా నియమిస్తారు

7. వివిధ ప్రకరణలకు సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
ఎ) ప్రకరణ 123-ఆర్డినెన్సులను జారీ చేయడానికి రాష్ట్రపతికి ఉన్న అధికారం
బి) ప్రకరణ 213 - గవర్నర్ ఆర్డినెన్సును జారీ చేసే అధికారం
సి) ప్రకరణ 262 - అంతర్రాష్ట్రీయ మండలి ఏర్పాటు
1) ఎ, బి, సి 2) బి, సి
3) ఎ, బి 4) ఎ, సి

8. రాజ్యాంగ పరిషత్ కమిటీలు, వాటి అధ్యక్షులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
జాబితా - I
i) సారథ్య సంఘం ii) క్రెడెన్షియల్ కమిటీ
iii) ప్రాథమిక హక్కుల ఉపకమిటీ
iv) యూనియన్ పవర్స్ కమిటీ
జాబితా - II
a) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
b) రాజేంద్ర ప్రసాద్c) జె.బి. కృపలానీ
d) జవహర్ లాల్ నెహ్రూ
1) i-b, ii-a, iii-c, iv-d
2) i-a, ii-b, iii-c, iv-d
3) i-b, ii-c, iii-a, iv-d
4) i-c, ii-a, iii-b, iv-d

9. అటార్నీ జనరల్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
ఎ) లోక్‌సభ చర్చల్లో పాల్గొనవచ్చు
బి) లోక్‌సభ కమిటీ సభ్యుడు
సి) లోకసభలో మాట్లాడొచ్చు
డి) లోక్‌సభలో ఓటు వేయవచ్చు
1) ఎ మాత్రమే 2) బి, డి
3) ఎ, బి, సి 4) ఎ, సి

10. 'భారత సార్వభౌమత్వం, ఐక్యత, అఖండతలను సమర్థించడం, సంరక్షించడం'లను దేనిలో పేర్కొన్నారు?
1) రాజ్యాంగ ప్రవేశిక 2) ఆదేశిక సూత్రాలు
3) ప్రాథమిక హక్కులు 4) ప్రాథమిక విధులు

11. మొదటి ఆర్థిక సంఘం అధ్యక్షుడు ఎవరు?
1) కె. సంతానం 2) ఎ.కె. చాంద్
3) కె.సి. నియోగి 4) వై.బి. చవాన్

12. కింది వాటిలో అఖిల భారత సర్వీసులకు సంబంధించి నియామకాలు చేసేది?
1) రాష్ట్రపతి
2) ఏ రాష్ట్రానికి చెందితే ఆ రాష్ట్ర గవర్నర్లు
3) యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్
4) ఆయా రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్లు

13. 'జీరో అవర్' అని దేన్ని అంటారు?
1) సభ ప్రారంభమైన తొలి గంట
2) సభ్యులు ఎవరూ హాజరుకాని సమయం
3) ప్రశ్నోత్తరాల సమయం ముగిసిన తర్వాత, సభా కార్యక్రమాల ప్రారంభానికి ముందు ఉన్న సమయం
4) ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభానికి, సభా కార్యక్రమాల ముగింపునకు మధ్య సమయం

14. రాజ్యాంగ రిట్లలో 'ఆజ్ఞ' అనేది దేని అర్థం?
1) ప్రొహిబిషన్ 2) మాండమస్
3) సెర్షియోరరి 4) కో వారెంటో

15. కేంద్రంలో ఏర్పాటైన మొదటి సంకీర్ణ ప్రభుత్వం ఏది?
1) జనతా ప్రభుత్వం
2) యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం
3) నేషనల్ డెమొక్రటిక్ ప్రభుత్వం
4) నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం

16. కింది వారిలో ఉన్నతాధికార, దౌత్య సంబంధ పదవులు చేపట్టి ఉపరాష్ట్రపతులుగా కొనసాగిన వారెవరు?
1) డా.ఎస్.రాధాకృష్ణన్ 2) జి.ఎస్. పథక్
3) వి.వి. గిరి 4) బి.డి. జెట్టి

17. పీఠికలోని 'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' అనే భావాలను ఏ విప్లవం నుంచి గ్రహించారు?
1) రష్యా 2) ఫ్రెంచ్
3) అమెరికా 4) జర్మనీ

18. 'సామ్యవాదం, లౌకికవాదం' అనే పదాలను భారత రాజ్యాంగంలో ఎన్నో సవరణ ద్వారా చేర్చారు?
1) 44 2) 40 3) 38 4) 42

19. 'కో వారెంటో' అంటే..?
1) బంధీ ప్రత్యక్ష 2) అధికార పృచ్ఛ
3) పరమాదేశ 4) ఉత్ప్రేషణ

20. 'స్థానిక సంస్థల పితామహుడు' అని ఎవరిని పిలుస్తారు?
1) లార్డ్ రిప్పన్ 2) లార్డ్ కానింగ్
3) లార్డ్ డఫ్రిన్ 4) లార్డ్ మౌంట్ బాటన్

21. 'ఒక తప్పునకు రెండుసార్లు శిక్షార్హం కాదు' అని తెలిపే సిద్ధాంతం ఏది?
1) రిపగ్నసీ సిద్ధాంతం
2) ద్వంద్వ శిక్ష నిషేధ సిద్ధాంతం
3) గ్రహణ సిద్ధాంతం
4) రెట్రిబ్యూషన్ సిద్ధాంతం

22. కమిటీలు, అవి సిఫారసు చేసిన అంశాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
జాబితా - I
i) బల్వంతరాయ్ మెహతా కమిటీ
ii) అశోక్ మెహతా కమిటీ
iii) సి.హెచ్. హనుమంతరావు కమిటీ
iv) ఎల్.ఎం. సింఘ్వీ కమిటీ
జాబితా - II
a) రెండంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు
b) జిల్లా ప్రణాళికా బోర్డుల ఏర్పాటు
c) మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటు
d) పంచాయతీరాజ్ సంస్థలను రాజ్యాంగ బద్ధం చేయాలి
1) i-b, ii-a, iii-c, iv-d
2) i-c, ii-b, iii-a, iv-d
3) i-c, ii-a, iii-b, iv-d
4) i-d, ii-a, iii-b, iv-c



23. కింది వాటిలో సరైన వాక్యం ఏది?
ఎ) జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఏటా జనవరి 25న నిర్వహిస్తారు
బి) ఎన్నికల సంఘం తన నివేదికను రాష్ట్రపతికి సమర్పిస్తుంది
సి) ఎన్నికల సంఘం తన నివేదికను పార్లమెంట్‌కు సమర్పిస్తుంది
డి) ఎన్నికల సంఘం తన నివేదికను ఎవరికీ సమర్పించాల్సిన అవసరంలేదు
1) ఎ, డి 2) బి, డి
3) ఎ, సి 4) సి, డి

24. కింది వాటిలో సమాఖ్య ప్రభుత్వ లక్షణాలు ఏవి?
ఎ) ఏక పౌరసత్వం బి) ద్వంద్వ ప్రభుత్వం
సి) లిఖిత రాజ్యాంగం డి) ద్విసభా పద్ధతి
ఇ) ఒకే రాజ్యాంగం
ఎఫ్) కేంద్రం రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించడం
1) ఎ, బి, సి, ఎఫ్ 2) బి, సి, డి
3) డి, ఇ, ఎఫ్ 4) ఎ, సి, డి, ఇ

25. కింది వాటిలో ఏక కేంద్ర లక్షణాలు ఏవి?
ఎ) అఖిల భారత సర్వీసులు
బి) అత్యవసర అధికారాలు
సి) అధికార విభజన
డి) స్వతంత్ర ప్రతిపత్తి ఉన్న న్యాయవ్యవస్థ
ఇ) గవర్నర్ వ్యవస్థ
ఎఫ్) రాజ్యాంగేతర సంస్థలు
1) ఎ, బి, ఇ, ఎఫ్ 2) బి, సి, డి
3) డి, ఇ, ఎఫ్ 4) ఎ, సి, డి, ఇ

26. కింది వాటిలో సరైన జత ఏది?
ఎ) జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం - ఏప్రిల్ 24
బి) ప్రవాస భారతీయ దివస్ - జనవరి 9
సి) ప్రాథమిక విధుల దినోత్సవం - జనవరి 3
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, బి, సి 4) సి, డి

27. జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలి పదవీ కాలం ఎన్నేళ్లు?
1) రెండేళ్లు 2) మూడేళ్లు
3) నాలుగేళ్లు 4) ఐదేళ్లు

28. ప్రాంతీయ పార్టీలు, వాటి వ్యవస్థాపక అధ్యక్షులకు సంబంధించి కింది వాటిని జతపరచండి?
జాబితా - I
i) శివసేన ii) ద్రవిడ మున్నేట్ర కజగం
iii) ఆలిండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం
iv) దేశీయ ముర్‌పొక్కు ద్రవిడ మున్నేట్ర కజగం
జాబితా - II
a) సి.ఎన్. అన్నాదురై
b) ఎం.జి. రామచంద్రన్
c) బాల్‌థాకరే d) విజయ్‌కాంత్
1) i-b, ii-a, iii-c, iv-d
2) i-c, ii-b, iii-a, iv-d
3) i-c, ii-a, iii-b, iv-d
4) i-d, ii-a, iii-b, iv-c

29. ప్రాంతీయ పార్టీలు, వాటిని ఏర్పాటు చేసిన సంవత్సరాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
జాబితా - I
i) ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్
ii) అసోం గణ పరిషత్
iii) తెలంగాణ రాష్ట్ర సమితి
iv) తెలుగుదేశం పార్టీ
జాబితా - II
a) 2001 b) 1985
c) 1998 d) 1982
1) i-b, ii-a, iii-c, iv-d
2) i-c, ii-b, iii-a, iv-d
3) i-b, ii-c, iii-a, iv-d
4) i-d, ii-c, iii-a, iv-b

30. షెడ్యూల్ 12లో పేర్కొన్న అంశాలు ఎన్ని?
1) 19 2) 18 3) 29 4) 28

31. అధికరణ 136 ప్రకారం సుప్రీంకోర్టుకు ఉన్న అధికారం?
1) సివిల్ జూరిస్‌డిక్షన్
2) అప్పిలేట్ జూరిస్‌డిక్షన్
3) స్పెషల్ లీవ్ పిటిషన్
4) ట్రాన్స్‌ఫర్డ్ జూరిస్‌డిక్షన్

32. ఏ రాజ్యాంగ సవరణ ప్రకారం 2020 వరకు రిజర్వేషన్లు పొడిగించారు?
1) 77 2) 98 3) 95 4) 84

33. కింది వాటిలో రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు హక్కు లేనివారు?
1) లోక్‌సభ సభ్యులు 2) రాజ్యసభ సభ్యులు
3) ఢిల్లీ, పుదుచ్చేరి శాసన సభల సభ్యులు
4) రాష్ట్ర శాసన మండలి సభ్యులు


34. స్వతంత్ర భారత తొలి ఆర్థిక మంత్రి?
1) ఆర్.కె. షణ్ముగం చెట్టి
2) జాన్ మత్తాయ్ 3) సి.డి. దేశ్‌ముఖ్
4) టి.టి. కృష్ణమాచారి

35. వివిధ జాతీయ పార్టీలు, అవి ఏర్పాటైన సంవత్సరాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
జాబితా - I
i) బహుజన్ సమాజ్ పార్టీ
ii) నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ
iii) కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా
iv) భారతీయ జనతా పార్టీ
జాబితా - II
a) 1925 b) 1980
c) 1999 d) 1984
1) i-b, ii-a, iii-c, iv-d
2) i-a, ii-b, iii-c, iv-d
3) i-b, ii-c, iii-a, iv-d
4) i-d, ii-c, iii-a, iv-b

సమాధానాలు

1) 4	2) 4	3) 4	4) 2	5) 1
6) 3	7) 3	8) 1	9) 3	10) 4
11) 3	12) 1	13) 3	14) 2	15) 1
16) 1	17) 2	18) 4	19) 2	20) 1
21) 2	22) 3	23) 1	24) 2	25) 1
26) 3	27) 2	28) 3	29) 2	30) 2
31) 3	32) 3	33) 4	34) 1	35) 4

Who among them is taller...



Directions(Q.1-4): **Five friends Lokesh, Manoj, Gopal, Raveesh and Rohit have agreed to work together on a part-time job offered by a local restaurant. The restaurant opens 5 days a week and this group have following schedules when they can work.**

- Neeraj and Raveesh can work on Monday, Tuesday and Wednesday
- Raveesh and Rohit can work on Monday, Wednesday and Thursday
- Rohit and Lokesh can work on Monday, Friday and Thursday
- Lokesh and Manoj can work on Friday, Tuesday and Thursday.
- Neeraj and Manoj can work on Friday, Tuesday and Wednesday.

Based on the above passage, answer the following questions.

1. **Which one of the five friends cannot work on Thursday?**
a) Neeraj b) Raveesh
c) Rohit d) Lokesh
e) Manoj
2. **Which is the one who cannot work on Tuesday?**
a) Neeraj b) Raveesh
c) Rohit d) Lokesh
e) Manoj
3. **Name the person who cannot work on Friday?**
a) Neeraj b) Rohit
c) Manoj d) Raveesh
e) Lokesh
4. **Name the person who cannot work on Monday?**
a) Rohit b) Manoj
c) Raveesh d) Lokesh
e) Neeraj

Answers(1-4): To answer this kind of questions, tabulating the given information is very useful.

- People working on monday- Neeraj, Raveesh, Rohit and Lokesh.
- People working on Tuesday- Neeraj, Raveesh, Lokesh and Manoj
- People working on Wednesday - Neeraj, Raveesh, Rohit and Manoj
- People working on Thursday - Raveesh, Rohit, Lokesh and Manoj
- People working on Friday - Rohit, Lokesh, Manoj and Neeraj

1. **Ans:** a.
From the above table, it is clear that Neeraj Cannot work on Thursday.
2. **Ans:** c.
Rohit Cannot work on Tuesday.
3. **Ans:** d.
Raveesh Cannot work on Friday.
4. **Ans:** b.
Manoj cannot work on Monday.

Directions(Q.5-7): **Four couples are invited to a dinner party. They will be seated at a circular table. Follo- wing are the seating conditions.**

- Geeta refuses to sit next to Ali
- Lata wants to sit in between Tilak and Hari
- Champa refuses to sit next to Farooq
- Niti is seated on Ali's right hand side
- Farooq and Tilak are seated exactly opposite to each other
- The seating arrangement is such that one women is always between two men.

5. **Which of the following is the only possible seating arrange- ment to suit the above condi- tions?**
a) Niti is to the right of Tilak
b) Lata is in between Geeta and Farooq
c) Champa is opposite to Geeta
d) Farooq is adjacent to Champa
e) Ali is to the right of Geeta
6. **Which of the following combi- nations is not as per the instru- cted sitting arrangement?**
a) Geeta, Farooq, Lata
b) Ali, Champa, Tilak
c) Hari, Lata, Tilak
d) Farooq, Niti, Ali
e) Hari, Geeta, Farooq
7. **Which of the following state- ments are correct?**
I. Ali is on Champa's right
II. Lata is on Tilak's left
III. Farooq is between Niti and Geeta
1) I 2) II 3) III 4)

Answers(5-7):
Male members:
Ali, Tilak, Hari and Farooq
Female members:
Geeta, Lata, Champa and Niti.
From the given data the seating arrangement of the 4 couples is as follows.



5. **Ans:** c.
From the above arrangement, it is clear that Champa and Geeta are exactly opposite.
6. **Ans:** a.
Geeta, Farooq, Lata are not seated in this order.
7. **Ans:** e.
From the above arrangement, it is clear that Ali is on Champa's right, Lata is on Tilak's left and Farooq is between Niti and Geeta.

Directions(Q.8-12): **Read the following information carefully and answer the questions.**

- Six friends P,Q,R,S,T and U are members of a club and play a different game of Football, Cricket, Tennis, Basket ball, Badminton and Volleyball.
- 'T' who is taller than 'P' and 'S' plays Tennis.
- The tallest among them plays Basketball
- The shortest among them plays Volleyball
- 'Q'&'S' neither plays Volleyball nor Basketball
- 'R' plays Volleyball
- 'T' is between Q who plays Football and 'P' in order of height

8. **What does 'S' play?**
a) Football
b) Either cricket or Badminton
c) Cricket d) Badminton
e) None of these
9. **Who among them is taller than 'R' but shorter than P?**
a) T b)Data inadequate
c) Q d) U
e) None of these
10. **Which of the following state- ments is not true?**
a) 'T' is taller than 'R'
b) 'U' is taller than 'Q'
c) 'P' is shorter than 'R'
d) 'Q' is taller than 'S'
e) 'S' is taller than 'P'
11. **Who among the following plays Basketball?**
a) S b) U c) Q d) K
e) None of these
12. **Who will be at the third place if they are arranged in descen- ding order of their height?**
a) T b) Q
c) P d) S
e) None of these

Answers(8-12): From the given information, it is clear that 'R' plays Volleyball, 'T' plays Tennis and 'Q' plays Football. 'S' plays either Cricket or Badminton.
Order of Heights
Q>T>P and T>P&S
⇒ Q>T>P> S>P
(∴R is the shortest)
The tallest person shall plays Basketball, so it is only 'U' who can play Basketball. Hence 'P' also plays either Cricket or Badminton. Tabulating the above information...

Name	Game	Rank in Height
U	Basketball	1
Q	Football	2
T	Tennis	3
P }	Cricket & }	4
S }	Badminton }	5
R	Volley ball	6

8. **Ans:** b.
'S' plays either cricket or Badminton
9. **Ans:** e.
'S' is taller than 'R' but shorter than 'P'
10. **Ans:** c.
From the above table, it is clear that 'P' is taller than 'R'
11. **Ans:** b.
'U' Plays Basketball.
12. **Ans:** a.
From the table, it is clear that 'T' is third from top if they are arranged in descending order.

Directions(Q.13): **Persons X,Y,Z and Q live in red, green, yellow and blue coloured houses not necessarily in the same order. 'Z' lives in a yellow house. The green house is adjacent to the blue house. 'X' does not live adjacent to 'Z'. The yellow house is in between the green and red houses. The colour of the house X lives in is _______**
a) blue b) green
c) red d) can't be determined

Ans: a.
From the given information, Z lives in a yellow house, Which is in between green and red houses. and also 'X' is not adjacent to 'Z'. Therefore 'X' lives in blue house.

Directions(Q.14): Five persons with names P, M, U, T and 'X' live separately in A palace, a hut, a fort, a house, a hotel. Each one likes two different colours from among the Blue, Black, Red, Yellow, Green. 'U' likes red and blue. 'T' likes black. The person living in a palace does not like black or blue. 'P' likes blue and red. 'M' likes yellow. 'X' lives in a hotel.

14. **'M' lives in a ——?**
a) hut b) fort
c) palace d) house

Ans: c.
Given information can be tabulated as follows.

Person:	U	T	P	M	X
Colours:	Red/ Blue	Black	Blue/ Red	Yellow	–

It is given that the person living in palace does not like black or blue. so U, T and P cannot live in palace. Also it is given that 'X' lives in a hotel. Therefore the only person left over is 'M' and he lives in palace..